


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 | సంచిక: 209

SUNDAY Special | ఆదివారం 20-10-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



న్యూజిలాండ్ లక్ష్యం 107

బెంగళూరు టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 462 పరుగులకు ఆలౌటైన భారత్ న్యూజిలాండ్‌కు 107 పరుగుల విజయ లక్ష్యాన్ని నిర్దేశించింది. సర్ఫరాజ్ ఖాన్ 150 పరుగులు చేయగా, రిషభ్ పంత్ 99 పరుగులు సాధించాడు. - వివరాలు 12లో



కాంగ్రెస్, జేఎంఎంలకు 70 సీట్లు

జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో 81 సీట్లకుగాను 70 సీట్లలో ఇండియా కూటమి సీట్ల సర్దుబాటు ఖరారైందని సీఎం సోరెన్ ప్రకటించారు. మిగతా సీట్లలో ఆర్‌జేడీ, లెఫ్ట్ బరిలో ఉంటాయన్నారు. - వివరాలు 6లో

న్యూస్‌రీల్

ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్‌గా విజయా కిశోర్ రహాట్కర్



జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) నూతన చైర్‌పర్సన్‌గా విజయా కిశోర్ రహాట్కర్, కమిషన్ సభ్యురాలిగా డాక్టర్ అర్చనా మజుందార్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం శనివారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

- వివరాలు 6లో ▶

వాటర్ క్యాన్‌లు, సైకిళ్లపై జీఎస్టీ తగ్గింపు



ప్యాక్ చేసిన 20 లీటర్ల వాటర్ క్యాన్‌లతోపాటు సైకిళ్లు, నోటుపుస్తకాలపై జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని రేట్ల హేతుబద్ధీకరణపై ఏర్పాటైన మంత్రుల బృందం నిర్ణయించింది. అలాగే ఖరీదైన చేతి గడియారాలు, బూట్లపై పన్ను పెంచాలని బృందం నిర్ణయించినట్లు ఓ ఉన్నతాధికారి వెల్లడించారు.

- వివరాలు 6లో ▶

టార్గెట్ బెంజమిన్ నెతన్యాహూ!



ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ లక్ష్యంగా డ్రోన్ల దాడికి హమాస్ ప్రయత్నించింది. నెతన్యాహూ ప్రైవేట్ గృహాన్ని లక్ష్యంగా చేసుకొని శనివారం లెబనాన్ నుంచి డ్రోన్లు దూసుకొచ్చాయని.. వాటిని కూల్చేశామని ఇజ్రాయెల్ ప్రభుత్వం వెల్లడించింది.

- వివరాలు 6లో ▶

జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా తీర్మానానికి ఎల్జీ ఓకే

జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతానికి రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలన్న డిమాండ్‌తో సీఎం ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని కేబినెట్ చేసిన తీర్మానానికి లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) మనోజ్ సిన్హా ఆమోదముద్ర వేశారు.

- వివరాలు 6లో ▶

ఇదండీ సంగతి



ష్! కనీసం రూ. 5 వేలు అనాల్సింది.. పార్టీ పరిస్థితి మరీ దీనంగా ఉందనుకుంటారేమో!

ముట్టడి.. ఉద్రిక్తం!

వేలాదిగా సచివాలయం వద్దకు చేరుకున్న గ్రూప్–1 అభ్యర్థులు

- వారికి బీజేపీ, బీఆర్‌ఎస్, విద్యార్థి సంఘాల నేతల మద్దతు
- సర్కారు తీరుకు నిరసనగా తొలుత అశోక్‌నగర్ వద్ద ధర్నా..
- అనంతరం భారీ ర్యాలీగా సచివాలయానికి.. ఎక్కడికక్కడ అడ్డుకునేందుకు పోలీసుల ప్రయత్నం
- దాటుకుని సచివాలయానికి చేరుకున్న గ్రూప్–1 అభ్యర్థులు
- గేటు వద్ద బైఠాయించి ఆందోళన.. రెండు గంటలపాటు ఉద్రిక్తత
- ముఖ్యమంత్రి రేవంత్‌కు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు..
- పరీక్షల రీషెడ్యూల్‌కు, జీవో 29 రద్దు కోసం డిమాండ్
- రేపటి నుంచే మెయిన్స్ పరీక్షలు.. ఏర్పాట్లు పూర్తి చేసిన టీజీపీఎస్సీ



శనివారం సచివాలయం ముందు బైఠాయించిన అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలను రీషెడ్యూల్ చేయాలని, జీవో 29ను వెంటనే రద్దు చేయాలనే డిమాండ్లతో అభ్యర్థులు శనివారం చేపట్టిన సచివాలయం ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వేల మంది అభ్యర్థులు, వారికి మద్దతుగా వచ్చిన వారు.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సచివాలయం వైపు దూసుకువచ్చారు. పోలీసులు వారిని నిలువరించేందుకు ప్రయత్నించడంతో.. ఇరువర్గాల మధ్య తీవ్ర తోపులాట జరిగింది. పెద్ద సంఖ్యలో ఉన్న అభ్యర్థులు, నిరుద్యోగులు ముందుకు దూసుకెళ్లి, సచివాలయం గేటు వద్ద బైఠాయించారు. ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు మరిన్ని బలగాలను రంగంలోకి దింపి.. ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు.

మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా..

గ్రూప్–1 మెయిన్స్ రీషెడ్యూల్, జీవో 29 రద్దు డిమాండ్లతో అభ్యర్థులు నాలుగైదు రోజులుగా ఆందోళనలు చేస్తుండటం తెలిసిందే. ప్రతీరోజు అశోక్‌నగర్ చౌరస్తాలో ధర్నాలు, రాస్తారోకోలతో నిరసన

మిగతా 10వ పేజీలో ▶



అపోహలొద్దు.. పరీక్ష రాయండి

- గ్రూప్–1 అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచన
- జీవో 29 విషయంలో ప్రభుత్వ నిర్ణయాన్ని కోర్టులు సైతం సమర్థించాయి..ప్రతిపక్షాల ట్రాప్‌లో పడి బంగారం లాంటి అవకాశం వదులుకోవద్దు
- పదేళ్లు గ్రూప్–1 వేయలేదు.. ఇప్పుడు రాజకీయాలకు మిమ్మల్ని వాడుతున్నారు..
- ఆందోళన చేస్తున్న విద్యార్థులపై కేసులు, లాఠీచార్జీలు వద్దని పోలీసులకు సూచన

సాక్షి, హైదరాబాద్: "గ్రూప్–1 విషయంలో అపోహలను నమ్మొద్దు. జీవో 55 ప్రకారం భర్తీ చేస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు నష్టపోతారు. అందరికీ న్యాయం జరగాలనే జీవో 29ను తీసుకొచ్చాం. గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాల్లో 1:50 ప్రకారం మెరిట్ ఆధారంగా మెయిన్స్‌కు సెలెక్ట్ చేశాం. ప్రతిపక్షాల ట్రాప్‌లో పడొద్దు. అభ్యర్థులంతా మెయిన్స్ పరీక్షకు హాజరుకావాలి. లేకపోతే బంగారం లాంటి అవకాశం కోల్పోతారు" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో శనివారం నిర్వహించిన పోలీస్ డ్యూటీ మీట్–2024 ముగింపు కార్యక్రమంలో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డ్యూటీ మీట్ విజేతలకు ట్రోఫీలను బహూకరించారు. అనంతరం రేవంత్ మాట్లాడారు. జీవో 29 ప్రకారమే ప్రభుత్వం గ్రూప్–1 నోటిఫికేషన్ జారీ చేసిందని, మధ్యలో నిబంధనలు మారిస్తే పరీక్షలను కోర్టు రద్దు చేయొచ్చన్నారు. తాము పరీక్ష నిర్వహిస్తున్న విధానాన్ని కోర్టులు సమర్థించాయని గుర్తుచేశారు.

రాజకీయ లబ్ధి కోసమే..: గ్రూప్–1 విషయంలో కొన్ని రాజకీయ పార్టీలు వారి లబ్ధి కోసం వితండవాదం చేస్తున్నాయని సీఎం రేవంత్ ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో యువతను ఉసిగొల్పి ప్రాణాలు బలిగొన్నారని, వారు

మిగతా 10వ పేజీలో ▶

గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు యథాతథం!

- టీపీసీసీ చీఫ్ చొరవతో మంత్రుల భేటీ
- రిజర్వేషన్లకు భంగం కలగలేదని నిర్ధారించిన అధికారులు.. నేడు అధికారికంగా ప్రకటన చేయనున్న ప్రభుత్వం

10లో



రిజర్వేషన్ల రద్దుకు కుట్ర

- దానికి సంకేతమే కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో 29
- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపణ
- గ్రూప్–1 అభ్యర్థులు, నిరుద్యోగులతో సర్కారు చర్చించాలని సూచన

10లో

◀ ఆందోళనలో పాల్గొన్న బండి సంజయ్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఇంత నిరంకుశ, నిర్బంధ పాలనా?

- గ్రూప్–1 అభ్యర్థుల పట్ల ప్రభుత్వ తీరు దారుణం
- మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్
- జీవో 29 వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల వారికి అన్యాయం



10లో

ఖరీఫ్ సీజన్ రైతు భరోసా లేదు

మంత్రివర్గ ఉపసంఘం నివేదిక తర్వాత రబీ నుంచి అమలు: మంత్రి తుమ్మల



- ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ముగిసి పంట దిగుబడులు కూడా వచ్చేశాయి.. డిసెంబర్‌లోగా మరో 3 లక్షల మందికి రూ.2500 కోట్ల రుణ మాఫీ.. రెండు లక్షలకు పైగా రుణాలు తీసుకున్న వారికీ మాఫీ చేస్తాం
- త్వరలో పంటల బీమా ప్రీమియాన్ని రైతుల తరఫున రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రకటన

5లో

విద్యా కమిషన్‌కు సలహా కమిటీ

- ఆరుగురిని నియమించిన ప్రభుత్వం
- రాష్ట్రంలో విద్యావ్యవస్థ బలోపేతానికి సూచనలు ఇవ్వనున్న కమిటీ



హరగోపాల్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యా కమిషన్‌కు ఆరుగురితో సలహా కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు ఇచ్చింది. ప్రొఫెసర్ హరగోపాల్, కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్లు కె.మురళీ మోహన్, కె.వెంకట నారాయణ, శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, ఎంవీఎఫ్ ఫౌండేషన్ కన్వీనర్ ఆర్.వెంకటరెడ్డి, యూనిసెఫ్ విద్యా నిపుణుడు కె.ఎం.శేషగిరి ఈ కమిటీలో ఉన్నారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యారంగ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇటీవల కమిషన్ సభ్యులను కూడా నియమించింది. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మరింత ఉన్నతస్థాయికి చేర్చడానికి వీలుగా ఈ సలహా కమిటీ కమిషన్‌కు సూచనలు చేస్తుంది.

రాష్ట్ర కోడ్ మార్చేస్తున్నారు!



కొందరు వాహనదారుల అత్యుత్సాహం

- టీఎస్‌ను టీజీగా మార్చేస్తున్న వైనం.. రెండు వాహనాలకు 'ఒకే నంబర్' ప్రమాదం

సాక్షి, హైదరాబాద్: ఒకే నంబర్‌తో రెండు, మూడు వాహనాలుంటే ఎలా ఉంటుంది? ఏదైనా నేరాలు, అక్రమాలకు పాల్పడే ఉద్దేశంతో కొంత మంది ఇలా చేస్తుంటారు. కానీ కొందరు వాహనదారుల అత్యుత్సాహం, అవగాహన లేమితో ఇప్పుడు భవిష్యత్తులో ఒకే నంబర్ రెండు వాహనాలకు కనిపించే పరిస్థితి ఎదురుకాబోతోంది. దీంతో ఒక వాహనానికి సంబంధించిన వారు ఏదైనా నేరం చేస్తే దానివల్ల అదే నంబర్ ఉన్న రెండో వాహన యజమాని ఇబ్బంది పడే అవకాశం ఉందని అధికారులంటున్నారు.

ఇదీ సంగతి..: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత వాహనాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి స్టేట్ కోడ్ ఏపీ నుంచి టీఎస్‌కు మారింది. దాదాపు పదేళ్లపాటు అదే కొనసాగింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీన్ని మార్చింది. టీఎస్‌కు బదులు టీజీని అమల్లోకి తెచ్చింది. అయితే పాత వాహనాలకు టీఎస్ కోడ్ యథాతథంగా కొనసాగుతుందని స్పష్టం చేసింది. కానీ కొందరు వాహనదారుల అత్యుత్సాహంతో ఇది సమస్యగా మారనుంది. తెలంగాణ ఉద్యమ సమయంలో తమ వాహనాలకు టీజీ కోడ్ ఉండాలని బలంగా కోరుకున్న

మిగతా 5వ పేజీలో ▶



సికింద్రాబాద్‌లో టెన్షన్.. టెన్షన్

- 'ముత్యాలమ్మ' ఘటనకు నిరసనగా ర్యాలీ
- పోలీసులపైకి రాళ్లు, చెప్పులు విసిరిన ఆందోళనకారులు.. పోలీసుల లాఠీచార్జి.. పలువురికి గాయాలు

◀ శనివారం కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ దేవాలయం వద్ద ఆందోళనకారులు

2లో

టీ-హబ్.. మై బేబీ!

హైదరాబాద్‌ను స్టార్టప్‌ల కేరాఫ్ అడ్రస్ చేశాం

టీ-హబ్, టీ-వర్క్స్, ఇమేజ్ టవర్స్‌తో అతిపెద్ద ఇంక్యుబేటర్

ఇస్పాకాన్-2024 సదస్సులో మాజీ మంత్రి కేటీఆర్



శనివారం సీసీఎంబీలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న మాజీమంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: టీ-హబ్ తన మానస పుత్రిక అని, హైదరాబాద్ నగరాన్ని స్టార్టప్ సంస్థలకు కేరాఫ్ అడ్రస్‌గా తీర్చిదిద్దామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్‌క్లూజివ్ గ్రోత్ అనే మూడు సూత్రాలతో నగరంలో స్టార్టప్ వ్యవస్థను గత ప్రభుత్వంలో అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సీసీఎంబీలో జరిగిన ఇస్పాకాన్-2024 సదస్సుకు కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలంగాణలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు కల్పించాలంటే స్టార్టప్ సంస్థలను ప్రోత్సహించటమే సరైన మార్గమని తాము భావించామని చెప్పారు. యంగ్ టాలెంట్‌కు సరైన ఆర్థిక వనరులను కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్న నమ్మకంతో టీ-హబ్‌ను ఏర్పాటు చేశామని, టీ-హబ్, టీ-వర్క్స్, ఇమేజ్ టవర్స్ పేరుతో దేశంలోనే అతి పెద్ద ఇంక్యుబేటర్ సెంటర్‌గా తీర్చిదిద్దామన్నారు. 2 వేల స్టార్టప్ కంపెనీల సామర్థ్యంతో ప్రారంభమైన టీ-హబ్ విజయవంతం కావడంతో టీ-వర్క్స్, ఇమేజ్ టవర్స్‌ను అభివృద్ధి చేశామని వివరించారు.

ఆ రోజు మర్చిపోలేను..

టీ-హబ్‌ను రతన్ టాటాతో మాత్రమే ప్రారంభింపచేయాలని అనుకున్నామని, అయితే ఆయనకు వీలుపడదని చెప్పడంతో మూడు నెలలపాటు ఆయన కోసం ప్రారంభాన్ని వాయిదా వేశామని కేటీఆర్ గుర్తుచేసుకున్నారు. రతన్ టాటా టీ-హబ్‌ను ఆధునిక భారత ముఖచిత్రం అంటూ ప్రశంసించడం తన జీవితంలో మర్చిపోలేని రోజని చెప్పారు. హైదరాబాద్‌లో ఉన్న మొత్తం స్టార్టప్ కంపెనీలు ఏటా 3.5 బిలియన్ డాలర్ల టర్నోవర్ సాధిస్తున్నాయని చెప్పారు. టైర్-2, టైర్-3 నగరాలకు కూడా ఈ ఎకో సిస్టమ్ విస్తరించాల్సిన అవసరముందని కేటీఆర్ అన్నారు.

26కి రాష్ట్ర మంత్రివర్గ భేటీ వాయిదా

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈ నెల 23న జరగాల్సిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం 26వ తేదీకి వాయిదా పడింది. మధ్యాహ్నం 4 గంటలకు రాష్ట్ర సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుపై అధ్యయనంలో భాగంగా రాష్ట్ర రెవెన్యూ, సమాచార, ప్రజాసంబధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దక్షిణ కొరియా రాజధాని సియోల్ పర్యటనకు వెళ్లారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సైతం జార్ఖండ్ పర్యటనలో ఉన్న నేపథ్యంలో మంత్రివర్గ సమావేశాన్ని ప్రభుత్వం వాయిదా వేసింది. 26న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీకి విధివిధానాల ఆమోదం, సమీకృత వసతి గృహ పాఠశాలల భవనాల నిర్మాణం, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ డీఏల మంజూరు, గ్రూప్-1 పరీక్షలు తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది.

కమలంలో సంస్థాగత ఎన్నికల హడావుడి షురూ

119 సీట్లలో సభ్యత్వ నమోదు పూర్తిచేయాలని బన్సల్ ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: వచ్చేనెల 1 నుంచి సంస్థాగత ఎన్నికలకు సంబంధించిన సభ్యత్వ నమోదు రికార్డులు రాసి పరిశీలన చేపట్టాలని పార్టీ నేతలను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి సునీల్ బన్సల్ ఆదేశించారు. ఈ ప్రకియలో భాగంగా సభ్యులు, క్రియాశీల సభ్యుల నమోదును పరిశీలించాక బూత్ కమిటీల ఎన్నికతో రాష్ట్రంలో పార్టీ పరంగా ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నెల 24 దాకా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తిచేసి క్రియాశీల సభ్యత్వాల పరిశీలన పూర్తి చేశాక జాతీయనాయకత్వం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయనుంది. రాష్ట్రంలో సభ్యత్వ నమోదులో నిమగ్నమైన 119 మంది ముఖ్యమైన నాయకులు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా 26, 27, 28 తేదీల్లో అక్కడే గడిపి ఈ కార్యక్రమాన్ని పూర్తిచేయాలని బన్సల్ సూచించారు. రాష్ట్ర కమిటీని, అధ్యక్షుడి ఎన్నిక పూర్తయ్యాక, రాష్ట్ర కమిటీలన్నీ కలిసి జాతీయ కమిటీని, అధ్యక్షుడిని ఎన్నుకోవడంతో సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. శనివారం బీజేపీ కార్యాలయంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీ ఎం.రఘునందన్‌రావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇక మీ ఫామ్‌హౌస్‌ల వద్దకు వస్తా!

- ఫామ్‌హౌస్‌లను కాపాడుకునేందుకే మూసీ ప్రస్తావన తెస్తున్నారు
- కేటీఆర్, హరీశ్‌ల సంగతి తేలుస్తా: సీఎం రేవంత్‌రెడ్డి
- చెరువులు, కుంటలను కబ్జా చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదు
- చార్మినార్ వద్ద సద్భావన కార్యక్రమంలో ప్రసంగం



సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

చార్మినార్ (హైదరాబాద్): ఫామ్‌హౌస్‌లను కాపాడుకోవడం కోసమే మూసీ ప్రస్తావన తెచ్చి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. చెరువులు, కుంటలు, నాలాలను కబ్జా చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలేది లేదని స్పష్టంచేశారు. మూసీ నదిలో దుర్భర జీవనం గడుపుతున్న నిరుపేదలను కాపాడుతూ మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ పనులను చేపట్టామన్నారు. రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర సంస్మరణ కమిటీ అధ్యక్షుడు, బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ ఆధ్వర్యంలో శనివారం చార్మినార్ వద్ద నిర్వహించిన సద్భావన దినోత్సవ కార్యక్రమంలో రేవంత్ మాట్లాడారు. చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారు, జీవో 111ను ఉల్లంఘించిన వారు మాత్రమే హైడ్రాను చూసి భయపడుతున్నారన్నారు. అనుమతులున్న వారిని హైడ్రా ఏమీ చేయదన్నారు. మూసీ వద్దకు రావాలని సవాల్ విసిరిన వారి కోసమే తాను మూసీ (చార్మినార్) వద్దకే వచ్చానని.. ఇక మీ ఫామ్‌హౌస్‌ల వద్దకు వస్తానని బీఆర్ఎస్ నేతలపై ధ్వజమెత్తారు. కబ్జాదారులను అరికట్టడానికి హైడ్రా అంకుశం తరహాలో పని చేస్తుందన్నారు. గాంధీ కుటుంబం ఉంటేనే అన్ని వర్గాల పేదలకు అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలు అందుతాయని ప్రజలు భావించినందునే ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చారన్నారు. కొంతమంది సన్నాసులు కుటుంబ పాలన అంటున్నారని.. మోతీలాల్ నెహ్రూ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలు దేశాన్ని అభివృద్ధి పథంలో నడపడంలో ముందుండడమే కాకుండా అన్నివర్గాల ప్రజలకు మేలు చేశారని చెప్పారు. కేసీఆర్ కుటుంబపాలనలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని.. వారి కుటుంబం దోపిడీ మాత్రమే చేసిందని ఎద్దేవాచేశారు.

అడ్డం వస్తే.. బుల్డోజర్ సిద్ధంగా ఉంది...

తాము పేదలను ఆదుకుంటుంటే బీఆర్ఎస్ నాయకులు అడ్డుకుంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎవరైనా అడ్డం వస్తే తొలగించడానికి ఒక బుల్డోజర్ సిద్ధంగా ఉంచానన్నారు. 'దొంగ నాటకాలాడుతున్న బావామరుదుల డ్రామాలన్నీ చూస్తున్నా.. చెప్పులు మోసేటోళ్లు మాట్లాడుతున్నారు.. మీ సంగతి నాకు తెలియదా.. మీలాగ దొంగతనాలు చేయలేదు.. చేతులు కట్టుకుని నా ముందు నిలబడిన రోజులు మర్చిపోయారా' అంటూ వ్యాఖ్యానించారు. పేదల పట్ల ప్రేమ ఉంటే... కేటీఆర్, హరీశ్‌రావుల ఫామ్‌హౌస్‌లను వారే స్వయంగా కూలగొట్టుకుని పేదల వద్దకు రావాలని.. మీవి అక్రమ కట్టడాలు కావా? అని పేర్కొన్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్, హైడ్రాను అడ్డుకోవడం ద్వారా రాష్ట్ర ఆర్థిక మూలాలను దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. అనంతరం రేవంత్ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ కలిసి మాజీ మంత్రి జె.గీతారెడ్డికి సద్భావనా అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్ అలీ, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, మాజీ ఎంపీ వి.హనుమంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మీ పాలనలో మూసీని ఎందుకు శుద్ధి చేయలేదు?

కేటీఆర్‌ను నిలదీసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- మూడు జిల్లాల్లో కోటి మంది మూసీ కాలుష్యంతో బాధపడుతున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ చామల

సాక్షి, హైదరాబాద్: తొమ్మిదిన్నరేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. మూసీని ఎందుకు శుద్ధి చేయలేదో ప్రజలకు తెలియజేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన సచివాలయంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతో కలసి మీడియాతో మాట్లాడారు. మూడు జిల్లాల ప్రజల కష్టాలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం మూసీ పునరుజ్జీవానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందన్నారు. మూసీ అభివృద్ధికి రూ.25 వేల కోట్లు ఖర్చు చేస్తే సరిపోతుందని బీఆర్ఎస్ నేత కేటీఆర్ చెబుతున్నారని, మరి ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు చేయలేదని నిలదీశారు. కేటీఆర్, హరీశ్‌రావు.. ఇద్దరి నోటికి అదుపు లేకుండా ఉందని, అధికారం పోయినా అహంకారం మాత్రం తగ్గలేదని అన్నారు. ఎన్నికల్లో చిత్తుగా ఓడినప్పటికీ ఇంకా అధికారంలో ఉన్నట్లు ఊహించు కుంటున్నారని ఎద్దేవా చేశారు. మూసీ పరీవాహక ప్రాంతంలోని ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ప్రధానంగా ఉమ్మడి రంగారెడ్డి, నల్లగొండ, హైదరాబాద్ జిల్లాల ప్రజలు దాదాపు కోటి మందిపైన కాలుష్య ప్రభావం పడుతోందని అన్నారు. మూసీ నది, ఎస్టీపీలు ఏర్పాటు చేస్తే బాగుపడేది కాదన్నారు. ఇందులో విషపూరిత లవణాలను కూడా తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మూసీ ప్రాజెక్టు పేరిట రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారంటూ పిచ్చి కూతలు కూస్తే జనాలు తంతారని, చాదర్‌ఘాట్, మలక్‌పేట్ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ఏముందో తనకు అర్థం కాలేవడం లేదన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నల్లగొండ జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారని, మూసీ ప్రాజెక్టుకు అడ్డు పడితే జిల్లా ప్రజలు ఉద్యమిస్తారని హెచ్చరించారు. కేసీఆర్ మోసాలకు ఇప్పటికే నల్లగొండ నరకయాతన పడుతోందని, ఇప్పుడు ఆయన కొడుకు కూడా తయారయ్యారని ఆగ్రహించారు. కాగా, కేటీఆర్, హరీశ్‌రావు అమెరికాకు వెళ్లి ప్రభాకర్ రావును ఇండియాకు రాకుండా ఎందుకు అడ్డుపడుతున్నారో ప్రజలకు చెప్పాలన్నారు.

మూసీ అభివృద్ధికి కాదు.. మీ దోపిడీకి వ్యతిరేకం

సుందరీకరణ, హైడ్రా పేరుతో బెదిరిస్తున్నారు: కేటీఆర్

- మూసీ పక్కన మూడు నెలలు కాదు.. మూడేళ్లు ఉంటా..
- నాగోలు ఎస్టీపీని పరిశీలించిన కేటీఆర్



మూసీలోని మురికి నీరు ఎస్టీపీలో ఎలా శుభ్రం అయిందో చూపిస్తున్న కేటీఆర్. చిత్రంలో సబిత

నాగోలు (హైదరాబాద్): మూసీ పునరుజ్జీవం కోసం రూ.26 వేల కోట్లు మించని వ్యయాన్ని లక్షన్నర కోట్లు కావాలని చెబుతుంటే ఎలా అంగీకరిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. తాము మూసీ అభివృద్ధికి వ్యతిరేకం కాదని, మీరు చేసే దోపిడీకి వ్యతిరేకమని అన్నారు. శనివారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఆయన నాగోల్ ఎస్టీపీని పరిశీలించారు. దేశంలోనే అతిపెద్ద మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని (ఎస్టీపీ) నాగోల్‌లో 320 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నిర్మించామని, ఇక్కడ శుద్ధి చేసిన నీళ్లు నల్లగొండ జిల్లాకు పోతాయన్నారు. ఈ ఎస్టీపీలను సక్రమంగా నడుపుకుంటే చాలన్నారు. మూసీని మురికి కూపంగా మార్చింది కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలేనని ఆరోపించారు. దక్షిణాసియాలోనే వంద శాతం మురుగు శుద్ధి కోసం రూ.3,800 కోట్లతో ఎస్టీపీల నిర్మాణం ప్రారంభించామని చెప్పారు. నగరంలోని 54 నాలాల నుంచి మూసీలోకి మురికి నీరు వస్తోందని చెప్పారు.

మూసీకి రెండువైపులా రిటైనింగ్ వాల్ కట్టండి

బీఆర్ఎస్ హయాంలో మూసీపై 15 చోట్ల బ్రిడ్జిలను నిర్మించాలని ప్రణాళికలు రూపొందించామని కేటీఆర్ వెల్లడించారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా మూసీపై రూ.10 వేల కోట్లతో భారీ స్కై ఓవర్ నిర్మించాలనుకున్నామన్నారు. హైడ్రా పేరుతో బిల్డర్లను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. మూసీ పక్కన తాను మూడు నెలలు కాదు మూడేళ్లు ఉంటానని చెప్పారు. మూసీ తనకు చిన్నప్పటి నుంచి తెలుసని తెలిపారు. మూసీకి రెండువైపులా రిటై నింగ్ వాల్ కట్టాలని సూచించారు. మూసీ పేరుతో జరుగుతున్న లూటీకి చరమగీతం పాడాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాద వ్, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బంగారి లక్ష్మా రెడ్డి, వివేకానంద్‌గౌడ్, మాధవరం కృష్ణారావు, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి పాల్గొన్నారు.

చిల్లర రాజకీయాలు చేస్తే ప్రజలే బుద్ధి చెప్తారు: సీతక్క

సాక్షి, హైదరాబాద్: మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టులో ప్రతిపక్షంగా సలహాలు సూచనలిస్తే స్వీకరిస్తామని..అలా కాకుండా తప్పుడు ఆరోపణలతో చిల్లర మల్లర రాజకీయాలు చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారని మంత్రి సీతక్క హెచ్చరించారు. మూసీ నది పునరుజ్జీవంపై మాజీ మంత్రి కేటీఆర్ చేస్తున్న ఆరోపణలకు అర్థం లేదని వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టును మొదట్లో వ్యతిరేకించిన కేటీఆర్.. ప్రజాగ్రహానికి తలొగ్గి తాము వ్యతిరేకం కాదని ఇప్పుడు యూటర్న్ డ్రామాలు ఆడుతున్నారని శనివారం ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు.

సాక్షి ఎడిటర్‌పై కేసును ఉపసంహరించుకోవాలి


బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగం గౌడ్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: సాక్షి దినపత్రిక ఎడిటర్ వర్ధెల్లి మురళిపై ఏపీ ప్రభుత్వం అక్రమంగా కేసు బనాయించడాన్ని బీసీ సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండిస్తోందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. ఇటీవల విజయవాడ వరద సహాయక చర్యల్లో జరిగిన అవినీతిని ఎండగట్టినందుకు సాక్షి దినపత్రిక ఎడిటర్‌పై కేసు నమోదు చేయడం విచిత్రంగా ఉందన్నారు. ఆ వార్తా కథనంపై ఏపీ ప్రభుత్వానికి ఏమైనా అభ్యంతరాలు ఉంటే వివరణ ఇవ్వాలని లేదా వివరణ కోరవచ్చని.. అంతే తప్ప..పోలీస్ కేసు పెట్టడం, వేధించడం సరికాదన్నారు. ఈ కేసును వెంటనే విరమించుకోవాలని లింగం గౌడ్ డిమాండ్ చేశారు.

సీఎం అక్కర్లేదు.. మీ అవినీతిని నేను నిరూపిస్తా!

మీడియా సమక్షంలో బహిరంగ చర్చకు సిద్ధం

- హరీశ్‌రావుకు మంత్రి జూపల్లి సవాల్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాకముందు, తెలంగాణ వచ్చిన తరువాత ఎవరి ఆదాయం ఎంతో.. ఎవరెంత దోచుకున్నారో ఎల్‌బీ స్టేడియం వేదికగా మీడియా సమక్షంలో చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, మాజీ మంత్రి హరీశ్‌రావు సీఎం ఇంటికి రానవసరం లేదని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం ఆయన షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, అధికార ప్రతినిధి భవానిరెడ్డి తదితరులతో కలిసి గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు విసిరిన సవాల్‌కు సమాధానం చెప్పేందుకు సీఎం రావలసిన అవసరం లేదని, తానే వస్తానని అన్నారు. కేసీఆర్ కుటుంబం పదేళ్లు సాగించిన అక్రమాలపై తన దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయని, అవినీతి, అక్రమాలు, దోపిడీని మొత్తం రుజువు చేస్తానని అన్నారు. రేవంత్‌రెడ్డి ఢిల్లీకి కప్పం కడుతున్నాడని అంటున్న వాళ్లు.. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఇతర రాష్ట్రాలకు ఇచ్చిన డబ్బులు ఎక్కడినుంచి వచ్చాయో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ లో రూ.లక్షా యాభై వేల కోట్ల దోపిడీ జరిగిందని ప్రజలను కేటీఆర్, హరీశ్‌రావు తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. తెలంగాణను మొత్తం దోచుకున్నదే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు అని, వాళ్లే ఇప్పుడు తాము నీతిమంతులమని మాట్లాడటం సిగ్గుచేటని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2016లో మూసీ ఒడ్డు నుంచి 50 మీటర్లు బఫర్ జోన్ అని జీవో నెంబర్ 7 ఇచ్చిందని, 50 మీటర్ల బఫర్ జోన్‌లో నా ఇల్లు కూడా పోతుందని జూపల్లి వెల్లడించారు.

నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

అర్హులైన పేదలందరికీ ఇళ్లు

- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీలో మంత్రి పొంగులేటి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో పొన్నం, రాజాసింగ్

సాక్షి, హైదరాబాద్: రాబోయే నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే తమ ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో గోషామహల్ నియోజకవర్గానికి చెందిన లబ్ధి దారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీల వంటి తేడా లేకుండా అర్హులైన పేదవారందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎలాంటి భేషజాలకు పోకుండా కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన వాటాలు, నిధులు అడిగి తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం పేదవాడి గురించి ఆలోచన చేయలేదని విమర్శించారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా, ప్రతిపక్షాలు కాళ్లలో కట్టెలు పెడుతూ అడ్డుకోవాలని ప్రయత్నించినా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆపేది లేదని స్పష్టం చేశారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయ లేనిది, తమ ప్రభుత్వం 10 నెలల్లో చేసి చూపిస్తుంటే ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నాయని మండిపడ్డారు.

బీఆర్ఎస్ ఓర్వలేకపోతోంది..

మూసీ పరీవాహక ప్రాంత వాసులకు ఒక మంచి జీవితాన్ని ఇవ్వాలన్న ఉద్దేశంతో తమ ప్రభుత్వం వారికి ఇండ్లు, ఉద్యోగం, ఉపాధి, కల్పిస్తుంటే బీఆర్ఎస్ ఓర్చుకోలేకపోతోందని మంత్రి పొంగులేని విమర్శించారు. ప్రభుత్వం ఏదో తప్పు చేస్తున్నట్లుగా ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలు తమ జీవిత కాలమంతా అదే మురికికుప్పలో బతకాలని బీఆర్ఎస్ కోరుకుంటోందా? అని మంత్రి ప్రశ్నించారు. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏ కార్యక్రమం చేసినా ఇబ్బంది పెట్టే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. మూసీ పునరుజ్జీవంపై అనేక అభాండాలు వేస్తున్నారని, అక్కడున్న పేదవారిని అక్కడే వదిలేస్తారా అని ప్రశ్నించారు. మూసీ రివర్‌ఫ్రంట్ ఏర్పాటు చేసింది మీరు కాదా? అని నిలదీశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాజా సింగ్, శ్రీ గణేశ్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, రహమత్ బేగ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

మరో ప్రేమోన్మాది పైశాచికం

తనను ప్రేమించాలని ఇంటర్ విద్యార్థినికి వేధింపులు

- తిరస్కరించడంతో పెట్రోలు పోసి నిప్పంటించిన కిరాతకుడు
- ప్రాణాపాయ స్థితిలో బాధితురాలు
- వైఎస్సార్ జిల్లా గోపవరం మండలంలో ఘటన



కాలిన గాయాలతో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

గోపవరం / బద్వేలు అర్బన్ / సాక్షి, అమరావతి / కడప ఎడ్యుకేషన్: కర్నూలు జిల్లా అస్పరి మండలంలో ఇంటర్ విద్యార్థినిని శుక్రవారం ఓ ప్రేమోన్మాది హత్య చేసిన ఘటన జరిగి 24గంటలు కూడా కాకుండానే వైఎస్సార్ జిల్లా గోపవరం మండలంలో మరో ప్రేమోన్మాది చెలరేగిపోయాడు. ఇంటర్ విద్యార్థినిపై శనివారం పెట్రోలు పోసి నిప్పంటించి హత్యాయత్నం చేయడం కలకలం రేపుతోంది. బద్వేలు పట్టణానికి చెందిన దంపతులకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. బాధితురాలి తండ్రి రైస్‌మిల్లులో కూలీ. తన కుమార్తె (16)ను పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదివిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన విఘ్నేష్ అనే వివాహితుడు కొన్నినెలలుగా ఆ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. తనతో మాట్లాడాలని, తనతో బయటికి రావాలని వెంటపడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం విద్యార్థినికి ఫోన్‌చేసి తనతోపాటు బయటికి రావాలని, లేకుంటే ఆత్మహత్య చేసుకుని చనిపోతానని బెదిరించినట్లు సమాచారం. దీంతో చేసేది లేక ఆ బాలిక నెల్లూరు రోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోకి రాగా, అప్పటికే అక్కడున్న విఘ్నేష్ ఆమెను గోపవరం మండలంలో ఓ పరిశ్రమకు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ.. తనను ఎందుకు ఇబ్బంది పెడుతున్నావని, ఇలాగైతే తాను ఇంట్లో పెద్దలకు చెబుతానని బాలిక హెచ్చరించడంతో కోపోద్రిక్తుడైన విఘ్నేష్ ఆమెపై అత్యాచారానికి పాల్పడి ఆ తర్వాత తనతో పాటు తెచ్చుకున్న పెట్రోల్‌ను పోసి ఆమెకు నిప్పంటించి పరారయ్యాడు. మంటలు చెలరేగడంతో బాలిక కేకలు వేసుకుంటూ అటవీ ప్రాంతం నుంచి రోడ్డు సమీపంలోకి పరుగులు తీసింది. స్థానికులు, మేకల కాపరులు ఇది గమనించి వెంటనే బద్వేలు రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. వారు విద్యార్థినిని బద్వేలు ప్రభుత్వాసుపత్రికి.. అక్కడ నుంచి కడప రిమ్స్‌కు తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా విఘ్నేష్ ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని బాధితురాలి తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. గతంలోనే ఈ విషయం తమ దృష్టికి వస్తే అతణ్ణి మందలించామని, అయినా మార్పురాలేదన్నారు.

సికింద్రాబాద్‌లో టెన్షన్.. టెన్షన్

'ముత్యాలమ్మ' ఘటనకు నిరసనగా ర్యాలీ



ఆందోళనకారులపై లాఠీచార్జి చేస్తున్న పోలీసులు

రాంగోపాల్‌పేట్: కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ ధ్వంసాన్ని నిరసిస్తూ శనివారం పలు హిందూ సంఘాలు ఇచ్చిన సికింద్రాబాద్ బంద్ పిలుపు ఉద్రిక్తతకు దారితీసింది. ఆందోళనకారులు రెచ్చిపోయి పోలీసులపైకి చెప్పులు, రాళ్లు, కుర్చీలు విసిరారు. దీంతో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. ఈ ఘటనలో నలుగురు యువకులకు తలలు పగిలి గాయాలు కాగా ఓ యువకుడి చేయి విరిగింది. అలాగే ఆందోళనకారులు విసిరిన రాళ్లతో కొంత మంది పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ నెల 14న కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయంలో ఓ వ్యక్తి అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. దీన్ని నిరసిస్తూ శనివారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయం వద్ద నుంచి వేలాది మంది హిందువులు ర్యాలీగా బయలుదేరారు. ఎంపీ ఈటల రాజేందర్ ఆందోళనకారులతో కలిసి మహంకాళి దేవాలయం వద్ద బైఠాయించి హనుమాన్ చాలీసా చదివి ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీలో ఆందోళనకా రులు నినాదాలతో హోరెత్తించారు. కొంతమంది మోండా మార్కెట్ వైపు, మరికొంత మంది కవాడిగూడ వైపు ర్యాలీగా వెళ్లారు. మోండా, ఆల్ఫా హోటల్ మీదుగా ముత్యాలమ్మ దేవాలయం వద్దకు ఆందోళన కారులు చేరుకున్నారు. వేలాదిమంది ర్యాలీలో పాల్గొనడంతో టెన్షన్ వాతావరణం నెలకొంది. దేవాలయం పక్కనే మరో వర్గానికి చెందిన ప్రార్థన మందిరం కూడా ఉంది. ఆందోళనకారులు ఆ వైపు వెళ్లేందుకు వస్తుండటంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ఆందోళనకారులు రెచ్చిపోయి చెప్పులు, రాళ్లు, వాటర్ బాటిళ్లు విసరడంతో పోలీసులు లాఠీలకు పనిచెప్పాల్సి వచ్చింది.

ఆలయాల రక్షణలో కాంగ్రెస్ విఫలం: ఛుగ్

సాక్షి, న్యూఢిల్లీ: హిందూ దేవాలయాలను రక్షించడంలో, భక్తుల మనోభావాలను గౌరవించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్ మండిపడ్డారు. శనివారం సికింద్రాబాద్‌లోని శ్రీ ముత్యాలమ్మ దేవి ఆలయం వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై లాఠీచార్జి చేయడాన్ని ఖండించారు.

కేంద్ర మంత్రుల పరామర్శ

కంటోన్మెంట్: లాఠీచార్జిలో గాయపడిన పికెట్‌కు చెందిన గుడిపల్లి వెంకట్‌ను కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించేందుకు వెంటనే కిమ్స్ ఆసుపత్రికి తరలించాలని స్థానిక బీజేపీ నేతలకు సూచించారు.

దక్షిణాన గోల్ఫ్ సిటీ

10 వేల మందికి ఉపాధి: మంత్రి శ్రీధర్‌బాబు



మంత్రి శ్రీధర్‌బాబుతో పీజీఏ, స్టోన్ క్రాఫ్ట్ సంస్థల ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెషనల్ గోల్ఫర్స్ అసోసియేషన్ ఆఫ్ అమెరికా (పీజీఏ), స్థానిక భాగ స్వామి స్టోన్ క్రాఫ్ట్ తో కలిసి సిటీ దక్షిణాన విస్తారమైన గోల్ఫ్ సిటీని నిర్మించేందుకు ముందుకు వచ్చిందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం సహకరిస్తే గోల్ఫ్ కోర్సులు, నివాస సముదాయాలు, హోటళ్లు, వినోద పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి పీజీఏ, స్టోన్ క్రాఫ్ట్ సంస్థలు సంసిద్ధత వ్యక్తం చేశాయని తెలిపారు. పీజీఏ ప్రస్తుతం ముంబైలో షాపూర్జీ పల్లోంజి సంస్థతో కలిసి గోల్ఫ్ సిటీ నిర్మాణం చేపడుతోందని, ఇక్కడ స్టోన్ క్రాఫ్ట్ భాగస్వామ్యంతో భారీ పెట్టుబడులు పెట్టడానికి అంగీకరించిందని వివరించారు. గోల్ఫ్ సిటీ నిర్మాణం పూర్తయితే వచ్చే పదేళ్లలో పదివేల మందికి ఉపాధి దొరుకు తుందని శ్రీధర్ బాబు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి మానస పుత్రిక ఫోర్త్ సిటీలో ఎటువంటి కాలుష్యం వెలువడని నెట్-జీరో సిటీని నిర్మిస్తుందని పేర్కొన్నారు. అమెరికా టెక్సస్ రాష్ట్రంలోని ఫ్రిస్కో ప్రధాన కేంద్రంగా ఉన్న పీజీఏ ప్రతినిధి బృందం శనివారం సచివాలయంలో మంత్రితో భేటీ అయింది. నిర్మాణాలకు మూడింతలు ప్రకృతి వనాలను పెంచడం ద్వారా ఆహ్లాదకర నివాస ప్రదేశాన్ని ఏర్పాటు చేస్తామని ఈ సంస్థలు తమ ప్రెజెంటేషన్‌లో వెల్లడించినట్లు శ్రీధర్ బాబు చెప్పారు. పీజీఏ కన్సార్టియం 200 ఎకరాల్లో '18 హోల్' ప్రామాణిక గోల్ఫ్ కోర్సును ఏర్పాటు చేస్తుంది. మియావాకి పద్ధతిలో అడవిని పెంచడం ద్వారా సహజ సిద్ధమైన డెక్కన్ శిలలకు, స్థానిక నీటి వనరులకు ఒక అలంకారప్రాయమవుతుందన్నారు. భేటీలో స్టోన్ క్రాఫ్ట్ సీఈ వో కీర్తి చిలుకూరి, అలోక్ తివారి, పీజీఏ ప్రతినిధులు టిమ్ లాబ్, అలెక్స్ హే, డేవిడ్ బ్లమ్ పాల్గొన్నారు.


SUJATA®
TRUST THE EXPERT
దీనికంటె Better
మిక్సర్ గ్రైండర్ లభించదు!
900 WATT
90 MINUTE NON STOP
DYNAMIX
SUJATA
Online Reviews
900 WATTS Most Powerful motor
30 sec. grinding
22000 RPM Retains Original Flavour
NON STOP 90 mins. Running
Juice till the last drop
Double ball bearings
SUPERMIX
MULTIMIX
POWERMATIC PLUS
SCAN FOR DETAILS

బ్రతికి నాయందు విశ్వాసము ముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం,
తిథి: బ.తదియ ఉ.10.44 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** కృత్తిక ప.1.14 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** తె.4.34 నుండి 6.02 వరకు (తెల్లవారితే సోమవారం), **దుర్ముహూర్తం:** సా.4.03 నుండి 4.51 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.56 నుండి 12.06 వరకు.

సూర్యోదయం : 5.57
సూర్యాస్తమయం : 5.34
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

మా మకుటం... సత్యమేవ జయతే!

జనతంత్రం



వర్ధెల్లి మురళి

మీరు గుడ్లురిమితే గుండెలు జారిపోవడానికి ఇక్కడ భీరువులెవరూ లేరు. మీరంతటి వీర వరేణ్యులు కూడా కారు! మీరు క్ష్మాక్రజేస్తే కాలి బూడిదయ్యే కొంగలేమీ ఇక్కడ లేవు. తమరు తపోధనులైన కౌశికులు ఎంతమాత్రం కారు. మీ అధికారం సర్వంసహాధికారం కాదు. మీరు థామస్ హాబ్స్ ప్రతిపాదించిన 'లెవయథాన్' వంటివారు కారు. భారత రాజ్యాంగం ప్రసాదించిన పరిమితులతో కూడిన అధికారం మాత్రమే మీ చేతిలో ఉన్నది. అదే రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కులు మాకు అండగా ఉన్నవి. ఆ హక్కుల్ని రక్షించడానికి న్యాయస్థానాలు దన్నుగా ఉన్నవి.

రెండు వారాల కిందనే సర్వోన్నత న్యాయస్థానం ఏం చెప్పిందో ఒకసారి గమనించండి. అచ్చం మీ సర్కారుకు మల్లేనే యూపీలోని యోగీబాబా సర్కార్ కూడా ఓ జర్నలిస్టుపై పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టించింది. కేసు సుప్రీంకోర్టు తలుపు తట్టింది. జస్టిస్ హృషీకేశ్ రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం చేసిన వ్యాఖ్యానమేమిటో మళ్లీ ఒకసారి పరిశీలించండి. "ప్రజల భావ ప్రకటనా స్వాతంత్ర్యాన్ని ప్రజాస్వామ్య దేశాలు గౌరవించాలి. భారత రాజ్యాంగంలోని 19 (1) (ఏ) అధికరణం పాత్రికేయుల హక్కులకు రక్షణ కల్పిస్తున్నది. పాత్రికేయుడు రాసిన వార్తా కథనం విమర్శనాత్మకంగా ఉన్నదనే నెపంతో అతడిపై క్రిమినల్ కేసులు పెట్టడానికి వీల్లేదు."

సర్వోన్నత న్యాయస్థానం ఇంత స్పష్టంగా తేటతెల్లం చేసిన అంశంపై ఏపీ ప్రభుత్వ యంత్రాంగం కళ్లు మూసుకొని వ్యవహరిస్తున్నది. విజయవాడలో వరద సహాయక చర్యల్లో జరిగిన అవకతవకలను 'సాక్షి' పత్రిక ఎత్తిచూపింది. బాధ్యత గల ఫోర్త్ ఎస్టేట్‌గా అది దాని విద్యుక్త ధర్మం. 'ముంపులోనూ మేసేశారు' అనే శీర్షికతో ఏలినవారి ఆగ్రహానికి గురైన కథనాన్ని ప్రచురించాము. దానికి కట్టుబడి ఉన్నాము. మీ ప్రభుత్వ అధికార నివేదికల ఆధారంగానే మేమా కథనాన్ని రాశాము. మేము స్వయంగా వండి వార్చిన కథనం కాదు. వరద సహాయ కార్యక్రమాల సమీక్ష పేరుతో ముఖ్యమంత్రి నిర్వహించిన సమావేశం సందర్భంగా రెవెన్యూ శాఖ ఇచ్చిన ప్రెజెంటేషన్‌లో పేర్కొన్న విషయాల్నే 'సాక్షి' ఉటంకించింది.

కోటిమంది భోజనాల కోసం 368 కోట్లు ఖర్చు చేశామనీ, అగ్గిపెట్టెలు, కొవ్వొత్తులు వగైరాలకు 23 కోట్లు ఖర్చయ్యాయనీ, వాటర్ బాటిల్స్‌కు 26 కోట్లు వెచ్చించామనీ, మొత్తం 534 కోట్లు పునరావాస సహాయ శిబిరం కోసం ఖర్చయినట్టు ఆ ప్రెజెంటేషన్‌లో ఉన్నది. ఈ లెక్కల్లోని అనౌచిత్యాన్ని ప్రజలు ప్రశ్నించారు. ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. సీపీఎం నేత బాబూరావు ప్రజల సమక్షంలోనే ప్రభుత్వాన్ని నిలదీసిన వీడియో విస్తృతంగా సర్క్యులేషన్‌లో ఉన్నది. సరిగ్గా ఆ గణాంకాలనే పేర్కొంటూ, అవే ప్రశ్నల్ని 'సాక్షి' కూడా వేసింది.

రెవెన్యూ శాఖ అధికారులు ప్రజంటేషన్ ఇచ్చినప్పుడు ఇవే అంకెల్ని చూసిన పెద్దలకు కోపం రాలేదు. జనంలో చర్చ జరుగుతున్నప్పుడు కూడా అంత కోపం రాలేదు. కానీ, 'సాక్షి'లో కథనం రాగానే సుర్రున ప్రకోపించింది. ఆ కథనాన్ని ఖండఖండాలుగా ఖండించే బాధ్యతను ఇద్దరు మంత్రులకు అప్పగించారు. ఆ కార్యనిర్వహణ వారి వశం కాలేదు. వెంటనే కూటమిలోని ఒకటో నెంబరు పత్రిక రంగంలోకి దిగింది. అబ్బెబ్బే... సహాయ పునరావాస కార్యక్రమాలకు 139 కోట్లు మాత్రమే ఖర్చయింది. 534 కోట్లు అనే మాట అబద్ధమని ఆ పత్రిక తేల్చేసింది. అదే నిజమైతే కేంద్ర పరిశీలక బృందానికి రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన నివేదికలో రిలీఫ్ క్యాంప్ ఖర్చు పేరుతో 534 కోట్లు ఎందుకు చూపెట్టారు? సదరు పత్రిక ఈ నివేదికను చూడలేదా? ప్రజల కళ్లకు గంతలు కట్టడమనేది వారికి పెన్నుతో పెట్టిన విద్యగా చాలాసార్లు నిరూపణ అయింది.

ఏ కొద్దిమందికో పులిహోర పొట్లాలు పంచి, కోటిమందికి పైగా పంచినట్టు లెక్క చూపడమేమిటి? ఆ పులిహోరకు ఒక్కో ప్లేటుకు 370 రూపాయల ఖర్చేమిటి? ఇటువంటి దగుల్బాజీ లెక్కలు చూసిన జనంలో ప్రభుత్వ ప్రతిష్ఠ బాగా పలుచబారింది. ఈ ప్రభుత్వ వ్యతిరేక వరదను ప్రతిపక్షంపైకి



రెండు వారాల కిందనే సర్వోన్నత న్యాయస్థానం ఏం చెప్పిందో ఒకసారి గమనించండి. అచ్చం మీ సర్కారుకు మల్లేనే యూపీలోని యోగీబాబా సర్కార్ కూడా ఓ జర్నలిస్టుపై పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టించింది. కేసు సుప్రీంకోర్టు తలుపు తట్టింది. జస్టిస్ హృషీకేశ్ రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం చేసిన వ్యాఖ్యానమేమిటో మళ్లీ ఒకసారి పరిశీలించండి. "ప్రజల భావ ప్రకటనా స్వాతంత్ర్యాన్ని ప్రజాస్వామ్య దేశాలు గౌరవించాలి. భారత రాజ్యాంగంలోని 19 (1) (ఏ) అధికరణం పాత్రికేయుల హక్కులకు రక్షణ కల్పిస్తున్నది. పాత్రికేయుడు రాసిన వార్తా కథనం విమర్శనాత్మకంగా ఉన్నదనే నెపంతో అతడిపై క్రిమినల్ కేసులు పెట్టడానికి వీల్లేదు."
సర్వోన్నత న్యాయస్థానం ఇంత స్పష్టంగా తేటతెల్లం చేసిన అంశంపై ఏపీ ప్రభుత్వ యంత్రాంగం కళ్లు మూసుకొని వ్యవహరిస్తున్నది. విజయవాడలో వరద సహాయక చర్యల్లో జరిగిన అవకతవకలను 'సాక్షి' పత్రిక ఎత్తిచూపింది. బాధ్యత గల ఫోర్త్ ఎస్టేట్‌గా అది దాని విద్యుక్త ధర్మం. 'ముంపులోనూ మేసేశారు' అనే శీర్షికతో ఏలినవారి ఆగ్రహానికి గురైన కథనాన్ని ప్రచురించాము. దానికి కట్టుబడి ఉన్నాము. మీ ప్రభుత్వ అధికార నివేదికల ఆధారంగానే మేమా కథనాన్ని రాశాము. మేము స్వయంగా వండి వార్చిన కథనం కాదు. వరద సహాయ కార్యక్రమాల సమీక్ష పేరుతో ముఖ్యమంత్రి నిర్వహించిన సమావేశం సందర్భంగా రెవెన్యూ శాఖ ఇచ్చిన ప్రజంటేషన్‌లో పేర్కొన్న విషయాల్నే 'సాక్షి' ఉటంకించింది.

మళ్లించాలనే ఉద్దేశంతోనే తిరుపతి లడ్డూ వివాదాన్ని ముఖ్యమంత్రి తెరపైకి తెచ్చారనే అభిప్రాయం రాజకీయ పరిశీలకుల్లో అప్పుడే పొడసూపింది. కానీ, ఈ డైవర్షన్ స్కీమ్ ఫలితమివ్వకపోగా సర్కారుపైకే ఎదురు తిరిగింది.

ఐదేళ్లు పరిపాలించడం కోసం గద్దెనెక్కిన ప్రభుత్వం ఐదు మాసాలు కూడా నిండకముందే ఒక 'విఫల ప్రభుత్వం'గా ముద్ర వేయించుకోవడం ఒక అరుదైన సందర్భం. ఇటువంటి అప్రతిష్ఠను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూటగట్టుకున్నది. ఏ గడ్డి కరిచైనా అధికారంలోకి రావాలనే సంకల్పంతోనే ఎన్డీఏ కూటమి అలవికాని హామీలను ఇచ్చిందనే అభిప్రాయం ఆ రోజుల్లోనే రాజకీయ వర్గాల్లో వ్యక్తమైంది. అందువల్లనే మేనిఫెస్టో విడుదల రోజున బీజేపీ ప్రతినిధి దాని ప్రతిని పట్టుకోవడానికి నిరాకరించారనే వార్తలు వచ్చాయి. అటువంటి అంచనాలకు తగినట్టుగానే ఈ నాలుగు నెలల పైచిలుకు కాలాన్ని కూటమి సర్కార్ నెట్టుకొచ్చింది.

మేనిఫెస్టోలో హైలైట్‌గా వారు చెప్పుకున్న 'సూపర్ సిక్స్'లో ఒక్క పథకం జోలికి ప్రభుత్వం వెళ్లలేకపోయింది. ఖజానాపై పెద్దగా భారం పడని ఉచిత గ్యాస్ సిలిండర్ల (ఏడాదికి మూడు) పంపిణీని ఈ దీపావళి నుంచి ప్రారంభించబోతున్నట్టు ప్రకటించారు. మిగిలిన ఐదు పథకాల అమలు సంగతి దేవుడెరుగు. ఫలానా రోజు నుంచి వాటిని ప్రారంభిస్తామనే ఒక కనీస షెడ్యూల్‌ను కూడా ప్రభుత్వం విడుదల చేయలేకపోయింది.

బుడమేరు వరదల సందర్భంగా ప్రభుత్వ నిష్క్రియాపరత్వం కొట్టొచ్చినట్టు కనబడింది. ముందుచూపు లేకపోవడం, వ్యూహరాహిత్యం వల్ల నలభై నిండు ప్రాణాలను బలిపెట్టవలసి వచ్చింది. మూడు లక్షలమంది తమ సర్వస్వాన్ని కోల్పోయారు. తమ యావజ్జీవిత ఆర్జితాన్ని గంగపాలు చేసుకోవలసి వచ్చింది. వారి జీవిత చక్రాన్ని వెనక్కు తిప్పడం సాధ్యమయ్యే పనేనా? ముందుగా హెచ్చరికలు జారీ చేసి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వారి విలువైన సామగ్రిని భద్రపరచుకునేందుకు దోహదపడి వుంటే ఇంత దుఃస్థితి ఏర్పడేది కాదు. అందుకే దీన్ని 'విఫల ప్రభుత్వం' అంటున్నారు. రెగ్యులర్ బడ్జెట్‌ను కూడా ప్రవేశపెట్టలేక ఇంత కాలం నెట్టుకొచ్చిన ఏకైక ప్రభుత్వం కూడా ఈ దేశంలో ఏపీ కూటమి ప్రభుత్వమే!

నాలుగున్నర నెలల కాలంలో 32 వేల కోట్లు అప్పు తెచ్చినందుకు, ప్రపంచ బ్యాంకు వాళ్లు నేడో రేపో విడుదల చేస్తారని చకోర పక్షుల్లా 15 వేల కోట్ల అప్పు కోసం ఎదురు చూస్తున్నందుకు 'అప్పుల సర్కార్' అని కూడా అనవచ్చు. ఇసుక రీచుల్లో, మద్యం షాపుల వేలాల్లో, ఉద్యోగుల బదిలీల్లో లంచాల దుర్గంధాన్ని వెదజల్లుతున్నందుకు 'అవినీతి సర్కార్'గా పరిగణించాలి. తమ సంఖ్యా బలంపై ఆధారపడిన ప్రభుత్వమే కేంద్రంలో ఉన్నా, ఆ సర్కార్‌లో తమకూ భాగమున్నా సొంత రాష్ట్రానికి కించిత్ మేలును కూడా చేసుకోలేకపోయినందుకు 'అసమర్థ ప్రభుత్వం'గా భావించాలి.

సాధారణంగా కొత్త ప్రభుత్వాలపై ఇంత త్వరగా జనంలో వ్యతిరేకత వ్యక్తం కాదు. ఏపీ పరిణామం మాత్రం అసాధారణమైనదే. ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత బహిరంగంగానే కనిపిస్తున్నది. కొత్త సర్కార్ తన హామీలు అమలు చేయకపోగా, జగన్ సర్కార్ అందిస్తున్న పథకాలను చేజార్చుకొని మోసపోయామన్న ఆవేదన ప్రజల్లో కనిపిస్తున్నది. హామీలు, స్కీముల సంగతి పక్కన పెట్టినా సాధారణ పరిపాలన, శాంతిభద్రతలు కూడా దిగజారాయి. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిన విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను కొత్త ప్రభుత్వం గాలికొదిలేసింది. గ్రామీణ ఆరోగ్యం పడకేసింది. ప్రభుత్వ స్కూళ్ల నుంచి మళ్లీ ప్రైవేట్ బడులకు విద్యార్థుల వలస మొదలైంది. ఐదేళ్ల తర్వాత ఎరువుల కోసం, విత్తనాల కోసం రైతులు క్యూలైన్లలో నిలబడవలసి రావడాన్ని చూస్తున్నాము. ఇటువంటి అనేక కారణాలు ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తున్నాయి.
క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవాలన్నీ బయటికొస్తే అసంతృప్తి మరింత పరివ్యాప్తమవుతుంది. అందుకే మాట వినని మీడియాను దండోపాయంతో దారిలోకి తెచ్చుకోవాలని భావిస్తున్నట్టుంది. ఆ ఉపాయంతోనే 'సాక్షి' మీద విజయవాడ పోలీస్ స్టేషన్‌లో ఒక అక్రమ కేసును బనాయించారు. మీడియాలో వచ్చిన వార్తలపై అభ్యంతరాలు ఉండటంలో తప్పులేదు. దాని మీద వివరణ ఇవ్వవచ్చు. దాన్ని ప్రచురించకపోతే అప్పుడు న్యాయస్థానానికి వెళ్లడం సదరు వ్యక్తులు లేదా వ్యవస్థలు చేయవలసిన పని. కానీ ఏకాయెకిన పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ చేయడం భావ వ్యక్తీకరణ హక్కుపై జరిగిన దాడిగానే పరిగణిస్తారు. రోజులు గడుస్తున్నకొద్దీ పరిణతి సాధించవలసిన ప్రజాస్వామ్యంలో ఇటువంటి దండనాథులు తలెత్తడం ఒక విషాదం.

సాధారణంగా కొత్త ప్రభుత్వాలపై ఇంత త్వరగా జనంలో వ్యతిరేకత వ్యక్తం కాదు. ఏపీ పరిణామం మాత్రం అసాధారణమైనదే. ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత బహిరంగంగా కనిపిస్తున్నది. కొత్త సర్కార్ తన హామీలు అమలు చేయకపోగా, జగన్ సర్కార్ అందిస్తున్న పథకాలను చేజార్చుకొని మోసపోయామన్న ఆవేదన ప్రజల్లో కనిపిస్తున్నది. హామీలు, స్కీముల సంగతి పక్కనబెట్టినా సాధారణ పరిపాలన, శాంతి భద్రతలు కూడా దిగజారాయి. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిన విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను కొత్త ప్రభుత్వం గాలికొదిలేసింది. గ్రామీణ ఆరోగ్యం పడకేసింది. ప్రభుత్వ స్కూళ్ల నుంచి మళ్లీ ప్రైవేట్ బడులకు విద్యార్థుల వలస మొదలైంది. ఐదేళ్ల తర్వాత ఎరువుల కోసం, విత్తనాల కోసం రైతులు క్యూలైన్లలో నిలబడవలసి రావడాన్ని చూస్తున్నాము. ఇటువంటి అనేక కారణాలు ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తున్నాయి.

క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవాలన్నీ బయటికొస్తే అసంతృప్తి మరింత పరివ్యాప్తమవుతుంది. అందుకే మాట వినని మీడియాను దండోపాయంతో దారిలోకి తెచ్చుకోవాలని భావిస్తున్నట్టుంది. ఆ ఉపాయంతోనే 'సాక్షి' మీద విజయవాడ పోలీస్ స్టేషన్‌లో ఒక అక్రమ కేసును బనాయించారు. మీడియాలో వచ్చిన వార్తలపై అభ్యంతరాలు ఉండటంలో తప్పులేదు. దాని మీద వివరణ ఇవ్వవచ్చు. దాన్ని ప్రచురించకపోతే అప్పుడు న్యాయస్థానానికి వెళ్లడం సదరు వ్యక్తులు లేదా వ్యవస్థలు చేయవలసిన పని. కానీ ఏకాయెకిన పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ చేయడం భావ వ్యక్తీకరణ హక్కుపై జరిగిన దాడిగానే పరిగణిస్తారు. రోజులు గడుస్తున్నకొద్దీ పరిణతి సాధించవలసిన ప్రజాస్వామ్యంలో ఇటువంటి దండనాథులు తలెత్తడం ఒక విషాదం.

"నీ అభిప్రాయంతో నేను ఏకీభవించకపోవచ్చు. కానీ, నీ అభిప్రాయం వెల్లడించే హక్కు కోసం నా ప్రాణాలైనా ఇస్తా" అనేది మూడు శతాబ్దాల కిందటి ఫ్రెంచ్ ప్రజాస్వామిక నినాదం. ఇంత చరిత్ర ఉన్నది కనుకనే ప్రజాస్వామిక 'హక్కు'ను ఏ పాలకుడూ చిరకాలం అణచిపెట్టి ఉంచలేడు. "కుటిలాత్ముల కూటమికొక త్రుటికాలపు విజయమొస్తే, విశ్వసృష్టి పరిణామం విచ్ఛిన్నం అవుతుందా?" అన్నారు గుంటూరు శేషేంద్రశర్మ. ఏమీ కాదు! ఈ దాదాగిరి త్రుటికాలమే. అక్రమ కేసులకు భయ పడేది లేదు. ప్రజల పక్షాన నిలబడకుండా కాడి వదిలేసేదీ లేదు. నిశ్చయంగా, నిర్భయంగా జనం గుండె గొంతుకై 'సాక్షి' ప్రతిధ్వనిస్తుంది. 'సాక్షి' పత్రిక మీద కనిపించే మకుటమే 'సత్యమేవ జయతే'!

vardhelli1959@gmail.com

ఎస్. జైశంకర్ (ఫారిన్ మినిస్టర్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

రావల్పిండి లోని నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌లో నేను విమానం దిగినప్పుడు... ఇండియా నుండి ఇండియాకు వెళ్లినట్లుందే కానీ, పాకిస్తాన్ అనే ఒక పొరుగు దేశంలోకి అడుగుపెట్టినట్లుగా నాకేమీ అనిపించలేదు!

పీల్చే గాలిలో తేడా లేనప్పుడు, నడిచే నేలలో తేడా లేనప్పుడు అవి రెండు దేశాలు ఎలా అవుతాయి?

భారత రాయబారిగా, ఫారిన్ సెక్రెటరీగా, మంత్రిగా ఎన్ని దేశాలలో దిగినా ఏనాడూ నాకు ఇండియా నుంచి వెళ్లి ఇండియాలో ల్యాండ్ అయిన భావన కలగలేదు.

దౌత్యాలు దేశాలను ఒకటి చేయగలవు. ఒకే దేశంగా చేయలేవు. ద్వేషాలూ అంతే. దూరాలను పెంచగలవే కానీ, మనసుల్లో మునుపున్న దగ్గరితనాన్ని ఎన్ని యుద్ధాలతోనూ పోగొట్టలేవు.

"వెల్‌కం మిస్టర్ జైశంకర్..." అంటూ స్వాగతం పలికారు ఇలియాస్ మెహ్మూద్ నిజామీ. పాక్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని దక్షిణాసియా వ్యవహారాల విభాగానికి ఆయన డైరెక్టర్ జనరల్.

ఆత్మీయంగా చేయందించాను.

"మీ ఆగమనం కోసం మా ప్రధాని



షెహ్‌బాజ్ షరీఫ్, మా ఫారిన్ మినిస్టర్ ఇషాక్ దార్ ఎదురు చూస్తున్నారు..." అని, సన్నటి నవ్వుతో తన పరిమిత పాత్రపోషణను ముగించారు నిజామీ.

సమ్మిట్‌లు జరుగుతున్నప్పుడు అతిథులుగా వచ్చేవారి కోసం ఆతిథ్యం ఇస్తున్నవారు ఎదురు చూడటం, ఎదురు వెళ్లటం మామూలే. కానీ భారత్–పాక్‌ల విషయంలో అది మామూలు విషయం కాదు. మనోహర దృశ్యకావ్యం.

ఆ మధ్యాహ్నం షాంఘై సహకార దేశాల డెలిగేట్స్‌కు ఏర్పాటైన డిన్నర్ రిసెప్షన్‌లో పాక్ ప్రధాని, నేను తొలిసారి చేయీ చేయీ కలిపి కనిపించినప్పుడు పాక్ మీడియా "మాషాల్లా" అని కేరింతలు కొట్టింది!

డిన్నర్‌లో ఇషాక్ దార్ నా పక్కనే కూర్చున్నారు. ఆయన నా వైపు చూస్తూ స్నేహపూర్వకంగా నవ్వినప్పుడు... భారత్–పాక్‌ల మధ్య భారీ మంచుఖండంలా ఘనీభవించి ఉన్న అపార్థాలను, అపనమ్మకాలను కరిగించే ఒక ప్రయత్నాన్ని పొగలు కక్కుతూ ఉన్న ఏ స్టార్టర్‌తో ప్రారంభించాలో తెలియక సతమతం అవుతున్నట్లుగా నాకు అనిపించింది.

"భారత్–పాక్ రుచుల్లో పెద్దగా తేడా ఏం ఉండదు కదా ఇషాక్‌జీ..." అన్నాను నవ్వుతూ.

"అవునవును జైశంకర్‌జీ. రుచుల్లోనే కాదు, అభిరుచుల్లో కూడా" అన్నారు ఇషాక్.

ఆయన పక్కనే ఇంటీరియర్ మినిస్టర్ మొహ్సిన్ నఖ్వీ కూర్చొని ఉన్నారు.

"మనం మనం ఒక్కటి' అనే ఐక్యత... కీమా బాల్స్‌తోనూ, క్రికెట్ బంతులతోనూ వస్తుందని నమ్ముతాను నేను..." అన్నారు నఖ్వీ. పాక్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ కూడా ఆయన.

"నిజమే నఖ్వీజీ..." అన్నాను నవ్వుతూ.

మర్నాడు ఉదయం, భారత హై కమిషన్ క్యాంపస్‌లో మార్నింగ్ వాక్ చేస్తున్నప్పుడు కూడా ఢిల్లీలోని తుగ్లక్ రోడ్డులో నడుస్తున్నట్లుగా ఒక మంచి ఫీల్ నన్నొచ్చి తాకింది.

నాతో పాటు ఇండియన్ హై కమిషన్ టీమ్ వాక్ చేస్తోంది. ఒక చోట ఆగి, నా సందర్శనకు జ్ఞాపకంగా తెల్ల మద్ది మొక్కను నాటాను. తెల్ల మద్ది ఏపుగా 80 అడుగుల వరకు పెరుగుతుంది. సరిహద్దులను దాటి సువాసనల్ని వెదజల్లుతుంది.

ఆ సాయంత్రం... "కలుద్దాం షెహ్‌బాజ్‌జీ" అని పాక్ ప్రధాని దగ్గర, "క్రికెట్ ఆడదాం నఖ్వీజీ" అని పాక్ ఇంటీరియర్ మినిస్టర్ దగ్గర, "ఐస్‌ను బ్రేక్ చేద్దాం ఇషాక్‌జీ" అని ఫారిన్ మినిస్టర్ దగ్గర సెలవు తీసుకున్నాను.

వచ్చే నెలలోనే అజర్‌బైజాన్‌లో కాప్–29 సదస్సు. పాక్ ప్రధాని షెహ్‌బాజ్, భారత ప్రధాని మోదీ ముఖాముఖి ఎదురు పడే అవకాశాలు ఉన్నాయి. ఒకటైతే నమ్మకంగా చెప్పగలను. స్నేహహస్తాన్ని చాచే ఏ సందర్భాన్నీ భారత్ అస్సలు వృథా కానివ్వదు.

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ప్రజలు – పోలీసుల బంధం బలపడాలి

1959 అక్టోబర్ 21వ తేదీన భారత–చైనా సరిహద్దులోని ఆక్సాయిచిన్ ప్రాంతంలో పదిమంది కేంద్ర పోలీసు రిజర్వు దళానికి చెందిన జవానులు విధినిర్వహణలో వీర మరణం పొందారు. దేశానికి స్వాతంత్ర్యం లభించిన అనంతరం పోలీసులు దేశం కోసం ప్రాణాలు అర్పించిన మొట్టమొదటి సంఘటన అది. ఈ సంఘటనను స్మరిస్తూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న 'పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని' పాటిస్తున్నాం.

ఈనాడు అనేక కారణాల వల్ల శాంతి భద్రతలకు భంగం కలుగుతోంది. సమ్మెలు, ఆందోళనలు, ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదం, మత సంఘర్షణలు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తాయి. ప్రభుత్వం తరఫున శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన గురుతరమైన బాధ్యత పోలీసు శాఖపై ఉంది. బలవంతుల నుండి బలహీనులకు పోలీసులు రక్షణ కల్పించాలి. ప్రజల ధన మాన ప్రాణాలను పరిరక్షించాలి. భారతదేశం వంటి ప్రజాస్వామ్య దేశంలో శాంతి భద్రతలకు అవసరమైన చర్యలు గైకొనేటప్పుడు రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన ప్రాథమిక హక్కులకు భంగం కలుగకుండా వ్యవహరించాలి. మిగతా ప్రభుత్వ శాఖలకూ పోలీసు శాఖకూ మధ్య పనితీరులో చాలా భేదం ఉంది. పోలీసులు అవసరమైతే అవిశ్రాంతంగా శాంతి భద్రతల కోసం 24 గంటలూ పనిచేయాలి. పండుగలు వచ్చినప్పుడు అందరూ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. కానీ, పోలీసులు చాలా సందర్భాలలో కుటుంబ సభ్యులతో గడపలేని పరిస్థితి! సమయానికి ఆహారం, నిద్ర లేని కారణంగా వారి ఆరోగ్యంపై దాని దుష్ప్రభావం పడుతుంది.

1861 కంటే ముందు మన దేశంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక పోలీసు విభాగం లేదు. సైనికులే శాంతి భద్రతలను పరిరక్షించేవారు. సిపాయిల తిరుగుబాటు అనంతరం 1861 పోలీసు యాక్టు ప్రకారం శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసు విభాగాన్ని ఆంగ్లేయ పాలకులు ఏర్పాటు చేశారు. 1902లో ఈ చట్టానికి కొన్ని సవరణలు చేశారు. ఆంగ్లేయ పాలకులు స్వతంత్ర సముపార్జన కోసం పోరాడుతున్న భారతీయులను అణచి వేయడం కోసం, భారతీయుల హక్కులను హరించడం కోసం పోలీసు వ్యవస్థను ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యానంతరం శాంతి భద్రతల అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వ జాబితాలో చేర్చడం వలన పోలీసు శాఖ రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో పనిచేస్తుంది.




పోలీసుల పనితీరుపై ఈ నాటికీ ప్రజలకు సదభిప్రాయం లేదు. పోలీసులకు కూడా తాము ప్రజల కోసం నిరంతరం కష్టపడినా ప్రజల నుండి రావలసిన సహకారం, ఆదరణ లభించడం లేదన్న అభిప్రాయముంది. పోలీసు ప్రజాసంబంధాలు బాగుపడాలంటే ప్రజల నుండి ఫిర్యాదులు వచ్చినప్పుడు సరియైన సమయంలో సరియైన రీతిలో స్పందించాలి. కొన్ని సందర్భాలలో ఫిర్యాదుదారులు చేసిన ఫిర్యాదుల పరిష్కారం పోలీసుల పరిధిలో ఉండక పోవచ్చు. అటువంటప్పుడు వారు ఏం చేయాలో ఎవరిని సంప్రదించాలో వివరించాలి. పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా ప్రజలను పోలీసులు పోలీస్ స్టేషన్‌కు ఆహ్వానించాలి.

ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారణ సందర్భంగా 2006 సెప్టెంబర్ 22న సుప్రీం కోర్టు పోలీసుల పనితీరుకు సంబంధించి కొన్ని మార్గదర్శక సూత్రాలను సూచించింది. అందులో ముఖ్యమైనవి: 1) కేంద్ర ప్రభుత్వం జాతీయ భద్రతా మండలిని ఏర్పాటు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రస్థాయి భద్రతా మండలిని ఏర్పాటు చేయాలి. భద్రతా మండలి శాంతి భద్రతలకు సంబంధించిన అంశాలను సమీక్షించి అవసరమైన చర్యలు గైకొనాలి. 2) ప్రతి రాష్ట్ర ప్రభుత్వం ఒక పోలీసు వ్యవస్థాపక బోర్డును ఏర్పాటు చేయాలి. 3) ప్రతి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర/జిల్లా స్థాయిలో పోలీసు ఫిర్యాదుల అథారిటీని ఏర్పాటు చేయాలి. రాష్ట్ర స్థాయి ఫిర్యాదుల అథారిటీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్, ఆ పై స్థాయి అధికారులపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించాలి. 4) డీజీపీ నియామకం కోసం ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులతో కేంద్ర ప్రభుత్వం ఒక జాబితాను రూపొందించాలి. అందులో నుండి ఒకరిని వారి యోగ్యత ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం డీజీపీగా నియమించాలి. ఈ రకంగా నియమించబడ్డ వారు వారి పదవీ విరమణతో సంబంధం లేకుండా రెండు సంవత్సరాలు ఆ పదవిలో కొనసాగాలి. 5) పోలీసు వ్యవస్థలో కార్యాచరణ విధులు నిర్వహించే ఐజీపీ, డీఐజీ, ఎస్పీల పదవీ కాలం కనీసం రెండు సంవత్సరాలు ఉండాలి. 6) పోలీసు శాఖలో శాంతి భద్రతల విధులను, విచారణ (ఇన్వెస్టిగేషన్) విధులను వేరు చేయాలి. పోలీసు వ్యవస్థ సమర్థంగా పని చేయాలంటే ఈ మార్గదర్శకాలను అమలుచేయాలి.

– డా. పి. మోహన్‌రావు
విశ్రాంత ప్రొఫెసర్, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ | హైదరాబాద్
(రేపు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం)

పొగరెక్కిన జెండా!

సందర్భం




తనికెళ్ల భరణి

గుంటూరు శేషేంద్ర శర్మ తెలుగు జాతికి ప్రాతఃస్మరణీయులు. 'రామాయణ, భారత, భాగవతాలను కూలంకషంగా ఆపోశన పట్టిన వాళ్ళు యావత్ భారత దేశంలో ఇద్దరో ముగ్గురో ఉంటే అందులో నిస్సందేహంగా గుంటూరు శేషేంద్ర శర్మ గారొకరు...' అని కవిసమ్రాట్ విశ్వనాథ అంతటి వారు అన్నారంటే అంతకన్నా వేరే కితాబు ఎందుకు?

'గతంలో కవి అంటే కృష్ణశాస్త్రి'... సాహిత్యం విషయంలోనే కాదు, ఆ గిరజాల జుట్టు... ఆ పట్టు లాల్చీ, మెళ్ళో మఫ్లరు... అంటూ ఎంతో మంది ఆనాటి కవులు కృష్ణశాస్త్రిని అనుకరించేవారు. అందంలో శేషేంద్ర శర్మ అంటే స్ఫురద్రూపి. ఆజానుబాహుడు. చక్కటి కొనదేలిన ముక్కు, మెరిసే కళ్ళు, కమ్మటి కంఠం, చక్కటి ఉచ్చారణ; పట్టు లాల్చీ, పట్టు పంచెలో పోత పోసిన విగ్రహంలా ఉండేవారు! ఎంత అందమైన కవో, అంత అజరామరమైన కవిత్వం!! సంస్కృత, ఆంధ్రాంగ్లాలను పుక్కిట పట్టిన శేషేంద్ర సాహిత్యంలో కొల్లలకొద్దీ కొటేషన్లు! సాటికవీ, మహాకవి శ్రీశ్రీ...

'శేషేన్ నీ కవిత చూసేన్
అది పద్యమా
ఫ్రెంచి మద్యమా'

అని మెచ్చుకున్నారు. అన్నట్టు శేషేంద్ర కవిత్వం ఎన్నో భాషల్లోకి అనువదించబడింది. పాకిస్తాన్‌లో కూడా ఆయనకు అభిమానులుండేవారు.



గుంటూరు శేషేంద్ర శర్మ

ఒకటి మాత్రం కచ్చితంగా చెప్పగలను. తెలుగు సాహిత్యంలో... సాటికవులు సైతం ఈర్ష్యపడే కవి శేషేంద్ర. అలాగే... పైరవీలు చేతగాని పైలాపచ్చీసు మనిషి గనక... ఆయనకు రావాల్సినంత పేరు రాలేదు!

కానీ... భారతదేశంలోనే సాహిత్య పరంగా రెండో నోబుల్ ప్రైజుకి 'నా దేశం ... నా ప్రజలు' నామినేట్ కావడం తెలుగు వారందరికీ గర్వకారణం. ఆ సందర్భంగా ఆయన్ని ఫోన్లో అభినందిస్తే... నవ్వి ఊరుకున్నారు మహాకవి.

ఆయన అస్తమించిన రోజు నేను వెళ్ళి నివాళులు అర్పించాను. నిద్దరోతున్న బుద్ధునిలా ఉన్నాడాయన!

వ్యాసకర్త రచయిత, సినీ నటుడు
(నేడు గుంటూరు శేషేంద్ర శర్మ జయంతి)

వర్షానికి ధాన్యం కొట్టుకుపోయి..



శాలిగౌరారం: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వర్షం వల్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం రాశులు తడిసిపోయాయి. మండలంలో మొత్తం 17 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఆయా చోట్ల ఆరబోసిన ధాన్యం పూర్తిగా తడిసి పోయింది. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్ ఆవరణలో ధాన్యం కొట్టుకుపోయింది. నీటిలో ఉన్న ధాన్యం రాశులను బయటకు తరలించేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు. వర్షం వల్ల పలు గ్రామాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి చేలు నేలవాలాయి.

అను'కూలి'ంచని సాగు



ఆత్మకూరు(ఎం): పత్తి రైతును కూలీల కొరత వేధిస్తోంది. రోజూ రూ.500 వరకు చెల్లించినా కూలీలు దొరకడం కష్టంగా ఉంది. చేసేది లేక చేతికొచ్చిన పంటను చేనుపైనే వదిలేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన రైతు సప్పిడి శంకర్‌రెడ్డి పది ఎకరాల భూమి కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. రూ.2.2 లక్షలు పెట్టుబడి పెట్టాడు. మొదటి విడతలో 27 క్వింటాళ్ల దిగుబడి రాగా క్వింటా రూ.6వేల చొప్పున విక్రయించాడు. రెండో దశ పత్తి చేతికొచ్చిన తరుణంలో కూలీల కొరత ఏర్పడింది. ఇరవై రోజులుగా తిరుగుతున్నా కూలీలు దొరక్కపోవడంతో పంటను చేనుపైనే వదిలేశాడు. ఇంకా 20 క్వింటాళ్ల పత్తి చేనుపై ఉందని, ఒక వేళ కూలీలు దొరికినా ఐదు రోజులకు రూ.80 వేల వరకు ఖర్చు వచ్చే అవకాశం ఉందన్నాడు. కూలీలు దొరికితే తీపిస్తా.. లేకపోతే వదిలేస్తానని శంకర్‌రెడ్డి వాపోయాడు.

కొమురమ్మకు స్పీకర్ రూ. లక్ష సాయం

సాక్షి, హైదరాబాద్: బలగం సినిమా ఫేమ్ కొమురమ్మకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య స్మారక అవార్డు సభలో.. కొముర మ్మ, మొగిలయ్యల ఆర్థిక పరిస్థితికి చలించిన స్పీకర్.. తన జీతం నుండి రూ.లక్ష ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు శనివారం మినిస్టర్ క్వార్టర్స్‌లోని తన అధికార నివాసంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో దరుడు పొన్నం రవిచంద్రతో కలిసి కొముర మ్మకు రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కొమురమ్మ తనకి పింఛను ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది. సంబంధిత మంత్రి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడి పింఛను ఇప్పించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

శిరోముండనం ఘటనలో కొత్త కోణం

- ఒక యువకుడి ఆత్మహత్యాయత్నం

లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలలో ముగ్గురు యువకులకు శిరోముండనం చేసిన ఘటనలో కొత్త కోణం వెలుగు చూసింది. ఈ నెల 13న స్థానికంగా ఉన్న ఒక పెట్రోల్‌బంక్ నిర్వాహకులపై యువకులు దాడికి పాల్పడ గా.. బాధితుల ఫిర్యాదు మేరకు మర్నాడు పోలీసులు సదరు యువకులను స్టేషన్‌కు పిలిపించి శిరోముండనం చేయించారని సమాచారం. వారిని 3రోజులపాటు స్టేషన్‌లో ఉంచి పనులు చేయించినట్లు తెలిసింది. దీంతో వారిలో ఒక యువకుడు మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేయడం చర్చనీయాంశమైంది. ఈ ఘటనలో రాజకీయ జోక్యం చోటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. కాగా, బాధిత యువకుడి కుటుంబీకులు గంటకో మాట మారుస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసు ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయంటున్నారు. కాగా, ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తున్నట్లు అచ్చంపేట సీఐ రవీందర్ తెలిపారు.

ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు: గువ్వల

సాక్షి, హైదరాబాద్: అధికార పార్టీకి వ్యతి రేకంగా ఉన్న వారిపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు విమర్శించారు. బీఆర్‌ఎస్ మాజీఎమ్మెల్యేలతో ఫొటోలు దిగినవారిపై పోలీసులు కేసు నమో దు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో మాజీఎమ్మె ల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, అభిలాష్ రావుతో కలసి గువ్వల బాలరాజు శనివారం మీడియా తో మాట్లాడారు. అచ్చంపేట నియోజకవర్గం లింగాల మండలంలో ఇంటర్ చదువుతున్న ముగ్గురు యువకులకు పోలీసులు శిరోముండనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్ పంపు వద్ద జరిగిన ఈ ఘటనను చిన్నదిగా చేసి చూపేందుకు అధికార పార్టీ ప్రయత్నిస్తోందని, ఈ అంశాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. యువకులకు శిరోముండనం ఘటనలో స్థానిక ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని మాజీఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

కొత్తగా 'లైన్' చార్జీలు!

ముసాయిదా నిబంధనలను ప్రకటించిన ఈఆర్సీ

సాక్షి, హైదరాబాద్: కొత్త విద్యుత్ కనెక్షన్ల జారీ, అదనపు లోడ్ సామర్థ్యం మంజూరికి ఇకపై సర్వీసు లైన్ చార్జీల పేరుతో కొత్త చార్జీలను వసూలు చేయనున్నారు. కనెక్షన్ లోడ్ సామర్థ్యం ఆధారంగా ప్రతి కిలోవాట్‌కి ఈ చార్జీ లను చెల్లించాల్సి ఉంటుంది. కోరిన వారికి కొత్త విద్యుత్ కనెక్షన్ జారీ విద్యు త్ పంపిణీ సంస్థ (డిస్కం)ల బాధ్యత కాగా, అందుకు అవసరమైన విద్యుత్ లైన్ లేదా ప్లాంట్ ఏర్పాటుకు చేసే వ్యయాన్ని తిరిగి రాబట్టుకునేందుకు ఈ లైన్ చార్జీలను వసూలు చేయనున్నారు. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) ఈ మేరకు ముసాయిదా నిబంధనలను ప్రకటించి ఈ నె ల 24లోగా సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరింది. లోడ్ సామర్థ్యం, కనెక్ష న్ కేటగిరీ, కనెక్షన్ జారీకి డిస్కంలు చేసే సగటు వ్యయం ఆధారంగా కొత్త కనెక్షన్ల చార్జీలను నిర్ణయించాలని రాష్ట్రాల ఈఆర్సీలకు గతంలో కేంద్రం సూచన చేసింది. ఈ మేరకు ఎలక్ట్రిసిటీ (రైట్స్ ఆఫ్ కన్జ్యూమర్స్) రూల్స్ 2020ను ప్రకటించింది. ప్రతి కనెక్షన్ కోసం సైట్‌ను సందర్శించి డిమాండ్ చార్జీలను అంచనా వేయడానికి బదులుగా ఈ పద్ధతిని పాటించాలని కోరింది. కేంద్రం సూచనల మేరకు లైన్ చార్జీల వసూళ్లకు అనుమతించాలని డి స్కంలు విజ్ఞప్తి చేయగా, ఈఆర్సీ ఈ మేరకు ముసాయిదాను ప్రకటించింది. కనెక్షన్ లోడ్ సామర్థ్యంలోని ప్రతి కిలోవాట్ లోడ్‌కి కొంత మొత్తం చొప్పున ఈ చార్జీలను విధిస్తారు. కొత్త కనెక్షన్ జారీకి ప్రత్యేకంగా విద్యుత్ లైన్ వే యాల్సిన అవసరం ఉన్నా, లేకున్నా ఈ కింద పేర్కొన్న మేరకు సర్వీసు లైన్ చార్జీలను వసూలు చేయాలని ఈఆర్సీ ప్రతిపాదించింది. అభ్యంతరాలు, సలహాలు తీసుకున్న తర్వాత ఈఆర్సీ తుది ఆదేశాలు జారీ చేయనుంది.

ప్రస్తుత చార్జీలకు అదనంగా కొత్త చార్జీలు

కొత్త విద్యుత్ కనెక్షన్ కోసం భూగర్భ కేబుల్ లైన్ వేయాల్సిన అవసరం వస్తే పైన పేర్కొన్న సంబంధిత కేటగిరీ చార్జీలతో పోలిస్తే దరఖాస్తుదారుల నుంచి 2.5 రెట్ల రుసుమును అధికంగా వసూలు చేస్తారు. కొత్త కనెక్షన్ల జారీకి ఇప్పటికే వసూలు చేస్తున్న దరఖాస్తు ఫీజు, సెక్యూరిటీ డిపాజిట్, డెవలప్‌మెంట్ చార్జీలకు అదనంగా ఈ సర్వీసు లైన్‌చార్జీలను వసూలు చేయనున్నారు. హెచ్‌టీ విద్యుత్ కనెక్షన్ కోసం కొత్త లైన్లను వేయాల్సి వస్తే అందుకు కానున్న వ్యయాన్ని డిస్కంలు అంచనా వేసి దరఖాస్తుదారుల నుంచి వసూలు చేయాలని ఈఆర్సీ సూచించింది.

ఇతర అన్ని కేటగిరీలకు (ఎల్టీ-పరిశ్రమల కేటగిరీ కాకుండా)

కనెక్షన్ లోడ్	సర్వీసు లైన్ చార్జీలు (ప్రతి కిలోవాట్‌కి)
1 కేడబ్ల్యూ వరకు	నిల్
1 కేడబ్ల్యూకి పైన, 3 కేడబ్ల్యూ వరకు	ప్రతి కేడబ్ల్యూకి రూ. 105
3 కేడబ్ల్యూకిపైన, 5 కేడబ్ల్యూ వరకు	రూ.315+ 3 కేడబ్ల్యూకి పైన ప్రతి కేడబ్ల్యూకి రూ.158
5 కేడబ్ల్యూపైన, 15 కేడబ్ల్యూ వరకు	రూ.631+ 5 కేడబ్ల్యూకి పైన ప్రతి కేడబ్ల్యూకి రూ.210
15 కేడబ్ల్యూపైన, 75 కేడబ్ల్యూ వరకు	రూ.2731+15 కేడబ్ల్యూకి పైన ప్రతి కేడబ్ల్యూకి రూ.263

ఎల్టీ-గృహ కేటగిరీ

కనెక్షన్ లోడ్	సర్వీసు లైన్ చార్జీలు (ప్రతి కిలోవాట్/కేడబ్ల్యూకి)
1 కేడబ్ల్యూ వరకు	నిల్
1 కేడబ్ల్యూకి పైన -3 కేడబ్ల్యూ వరకు	ప్రతి కేడబ్ల్యూకి రూ. 100
3 కేడబ్ల్యూకిపైన -5 కేడబ్ల్యూ వరకు	రూ.300+ 3 కేడబ్ల్యూకి పైన ప్రతి కేడబ్ల్యూకి రూ.150
5 కేడబ్ల్యూపైన -15 కేడబ్ల్యూ వరకు	రూ.600+ 5 కేడబ్ల్యూకి పైన ప్రతి కేడబ్ల్యూకి రూ.200
15 కేడబ్ల్యూపైన- 56 కేడబ్ల్యూ వరకు	రూ.2600+ 15 కేడబ్ల్యూకి పైన ప్రతి కేడబ్ల్యూకి రూ.250

గృహేతర/వాణిజ్య కేటగిరీ

కనెక్షన్ లోడ్	సర్వీసు లైన్ చార్జీలు (ప్రతి కిలోవాట్‌కి)
1 కేడబ్ల్యూ వరకు	నిల్
1 కేడబ్ల్యూకి పైన, 3 కేడబ్ల్యూ వరకు	ప్రతి కేడబ్ల్యూకి రూ. 110
3 కేడబ్ల్యూకిపైన, 5 కేడబ్ల్యూ వరకు	రూ.330+ 3 కేడబ్ల్యూకి పైన ప్రతి కేడబ్ల్యూకి రూ.165
5 కేడబ్ల్యూపైన, 15 కేడబ్ల్యూ వరకు	రూ.660+ 5 కేడబ్ల్యూకి పైన ప్రతి కేడబ్ల్యూకి రూ.220
15 కేడబ్ల్యూపైన, 75 కేడబ్ల్యూ వరకు	రూ.2860+ 15 కేడబ్ల్యూకి పైన ప్రతి కేడబ్ల్యూకి రూ.275

ప్రాణం తీసిన పంట రక్షణ తీగ

- విద్యుదాఘాతంతో రైతు మృతి


యాదయ్య

వెల్దుర్తి(తూప్రాన్): పంటలను వన్యప్రాణుల నుంచి కాపాడుకోవడానికి అమర్చిన విద్యుత్ తీగ కాళ్లకు తగిలి విద్యుదాఘాతానికి గురైన ఒక రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలో జరిగిన ఈ సంఘటనపై ఎస్‌ఐ రాజు కథనం ప్రకారం.. యశ్వంతరావ్‌పేట గ్రామానికి చెందిన రైతు గుండెని యాదయ్య (46) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వరి పంటకు అడవి పందుల బెడద ఎక్కువ ఉండటంతో.. రక్షణ కోసం చుట్టూ విద్యుత్ తీగలను ఏర్పాటు చేశాడు. శుక్రవారం రాత్రి భోజనం ముగించుకొని పంట కాపలాకు వెళ్లిన వ్యక్తి.. శనివారం ఉదయం పొలం గట్టుపై పడి ఉండటాన్ని చుట్టుపక్కల రైతులు చూశారు. విద్యుత్ సరఫరా నిలిపివేసి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. అనారోగ్యంతో తల్లి బూదమ్మ మృతి చెందిన పక్షం రోజుల వ్యవధిలోనే కుమారుడు యాదయ్య మృతి చెందాడు. ఘటనా స్థలంలో ఏఎస్‌ఐ సదాత్‌మియా పంచనామా నిర్వహించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్రంలో లక్ష టన్నుల మొక్కజొన్న కొనుగోలు

- మార్క్‌ఫెడ్ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో లక్ష టన్నుల మొక్కజొన్న కొనుగోలుకు నాఫెడ్ అంగీకరించిందని మార్క్‌ఫెడ్ ఎండీ వి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుత వానాకాలంలో 5.46 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంట దిగుబడి అంచనా కాగా.. 9.63 లక్షల మెట్రిక్ టన్నులు మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదనంగా వచ్చిన దిగుబడిని మద్దతు ధరకు కొనడానికి రాష్ట్ర ప్రభుత్వం కూడా సిద్ధంగా ఉందని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 100 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు నాఫెడ్ తరపున కొనుగోలు చేయడానికి అన్ని చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. మద్దతు ధరకు అనుగుణంగా మొదట నాఫెడ్ తరపున జగిత్యాల, నిర్మల్ జిల్లాలతో సహా 12 కేంద్రాలను శనివారం ఏర్పాటు చేశామని తెలిపారు. కేంద్రం నిర్ణయించిన మొక్కజొన్న మద్దతు ధర క్వింటాకు రూ.2,225 ఉంటే.. మార్కెట్లో సగటు ధర కొన్ని ప్రాంతాలలో రూ.2,172గా ఉందని వెల్లడించారు.

ఖరీఫ్ సీజన్ రైతు భరోసా లేదు!

- మంత్రివర్గ ఉపసంఘం నివేదిక తర్వాత రబీ నుంచి అమలు చేస్తాం: మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: ఖరీఫ్ సీజన్ రైతు భరోసా ఇవ్వలేమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ముగిసిందని, పంట దిగుబడులు కూడా వచ్చేశాయన్నారు. రైతు భరోసా పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వం ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిందని, ఆ కమిటీ త్వరలో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుందన్నారు. కమిటీ నివేదికకు అనుగుణంగా పథకాన్ని అమలు చేస్తామన్నారు. రబీ సీజన్ నుంచి రైతుభరోసా పంపిణీ చేసే అవకాశం ఉన్నట్లు వివరించారు. శనివారం రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితో కలిసి తుమ్మల మీడియాతో మాట్లాడారు. సాగు చేసే రైతులకే రైతు భరోసా అమలు చేస్తామని, మంత్రివర్గ ఉపసంఘం నివేదిక ప్రభుత్వానికి అందిన తర్వాత డిసెంబర్ నుంచి ఈ పథకం అమలవుతుందన్నారు. గత ప్రభుత్వం పంటలు సాగు చేయని భూములకు రైతుబంధు కింద డబ్బులు ఇచ్చిందని, దాదాపు రూ.25 వేల కోట్లు ఇలాంటి భూములకు ఇచ్చినట్లు తుమ్మల వ్యాఖ్యానించారు.

చిన్న పొరపాట్లతో మాఫీ కాలేదు

దేశంలో ఏ రాష్ట్రం కూడా రైతురుణ మాఫీ చేయలేదని, తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏకంగా రూ.18 వేల కోట్లు రుణమాఫీ చేసిందని మంత్రి తుమ్మల చెప్పారు. సాంకేతిక కారణాలు, చిన్నపాటి పొరపాట్లతో దాదాపు 3 లక్షల మందికి మాఫీ కాలేదన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే నిర్వహించారని, వారికి డిసెంబర్‌లోగా రూ.2,500 కోట్ల మేర రుణమాఫీ చేయనున్నట్లు వివరించారు. రూ.2 లక్షలకు మించి రుణాలు తీసుకున్న వారికీ మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో భాగంగా రూ.2 లక్షలకు మించి ఉన్న బకాయిని చెల్లించిన రైతులకు మాఫీ చేసేందుకు విడతల వారీగా ప్రభుత్వం చర్యలు తీసుకోనుందన్నారు. రాష్ట్రంలో పంట బీమా అమలు లేదని, త్వరలో ప్రతి రైతుకూ ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించనుందని తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి

- పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన బంధువులు


శ్రీనివాస్ (ఫైల్)

పాలకుర్తి టౌన్/ఎంజీఎం: జనగామ జిల్లా పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు లకావత్ శ్రీను (25) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి బంధువులు పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తన భార్య కాపురానికి రావడం లేదని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపిస్తూ పాలకుర్తి మండలం కొండాపురం శివారు మేకల తండాకు చెందిన లకావత్ శ్రీను శుక్రవారం పాలకుర్తి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న విషయం తెలిసిందే. 75 శాతం గాయాలు కావడంతో అతన్ని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం ఉదయం చనిపోయాడు. విషయం తెలియడంతో పోలీస్ అధికారులు ముందస్తు జాగ్రత్తగా పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసుల నిర్లక్ష్యంవల్లే శ్రీను మృతిచెందాడని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన గిరిజనులు, మృతుడి కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు భారీగా తరలివచ్చి పాలకుర్తి పోలీస్‌స్టేషన్ ముట్టడికి యత్నించారు. దీంతో పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. శ్రీనివాస్ మృతికి కారణమైన ఎస్సై, సీఐలను సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. ధర్నాకు సీపీఎం, ప్రజాసంఘాలు, బహుజన కులాల ఐక్యవేదిక నాయకులు మద్దతు తెలిపారు. జనగామ డీసీపీ రాజామహేంద్రనాయక్, ఏసీపీ పార్థసారథి బాధిత కుటుంబాలతో మాట్లాడినా వారు శాంతించలేదు. దీంతో కలెక్టర్‌తో మాట్లాడించి మృతుడి కుటుంబానికి ప్రభుత్వంనుంచి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ మీడియాతో మాట్లాడుతూ, శ్రీనివాస్‌పై దాడి చేసిన హుస్సేన్, మంగ్లి, వినోద్, మహేష్, చిక్లిలను అరెస్టు చేసినట్లు తెలిపారు. కాగా, అంతకుముందు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో ఉన్న శ్రీను మృతదేహాన్ని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వేర్వేరుగా సందర్శించారు.

రాష్ట్ర కోడ్ మార్చేస్తున్నారు!

▶ మొదటి పేజీ తరువాయి

కొందరు... ఇప్పుడు టీజీ కోడ్ అమల్లోకి రావడాన్ని స్వాగతిస్తూ తమ పాత వాహనాల నంబర్ ప్లేట్లపై టీఎస్ అక్షరాలను తొలగించి టీజీ అని పెట్టుకుంటున్నారు.

సమస్య ఏమిటి?

టీజీ కోడ్ కొత్తగా రావడంతో రవాణా శాఖ అధికారులు కొత్త వాహనాలకు రిజిస్ట్రేషన్ నంబర్లను మళ్లీ 'ఎ' ఆల్ఫాబెట్ నుంచి కేటాయిస్తున్నారు. రాష్ట్రం ఆవిర్భవించిన సమయంలో టీఎస్ కోడ్‌ను ప్రారంభించినప్పుడు 'ఇ' సిరీస్‌తో మొదలుపెట్టారు. ఇప్పుడు త్వరలోనే టీజీ కోడ్‌లో కూడా 'ఇ' సిరీస్ మొదలైంది. దానికి 0001 నుంచి నంబరింగ్ మొదలవుతుంది. క్రమంగా గతంలో టీఎస్ కింద కేటాయించిన నంబరే ఇప్పుడు టీజీ సిరీస్‌లో కూడా అలాట్ అవుతుంది. స్టేట్ కోడ్ (టీఎస్, టీజీ) మాత్రమే తేడా ఉంటుంది. అయితే టీఎస్ నంబర్ ప్లేట్ ఉన్న వాహనదారుడు సొంతంగా టీజీ ఏర్పాటు చేసుకుంటే... అధికారికంగా టీజీ కోడ్‌తో అదే నంబర్ ఉన్న వాహనంతో దాని నంబర్ క్లాష్ అవుతుంది. ఉదా: టీఎస్ఏ 0001 నంబర్‌తో ఉన్న పాత వాహనదారుడు దాన్ని టీజీగా మారిస్తే.. ఇప్పుడు టీజీ ఏ 0001 అని ఏదైనా కొత్త వాహనానికి నంబర్ అలాట్ అయితే రెండు వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్లు ఒకటిగా మారి సమస్య ఏర్పడుతుందన్నమాట. రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు, నేరాలు జరిగినప్పుడు ఇలా నంబర్లు క్లాష్ అయితే కేసు దర్యాప్తులో చిక్కులు ఏర్పడతాయి. దీంతోపాటు అధికారికంగా సరైన నంబర్ కలిగి ఉన్న వాహనదారుడు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందన్నమాట.

అలా మార్చడం నేరం

టీజీ కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కొందరు టీఎస్ కోడ్ వాహనదారులు వచ్చి తమ వాహనాలకు టీజీ కోడ్ అలాట్ చేయాలని కోరుతున్నారు. కానీ అది సాధ్యం కాదని... టీజీ సిరీస్ అమల్లోకి వచ్చిన తర్వాత కొన్న వాహనాలకు మాత్రమే టీజీ కోడ్ వర్తిస్తుందని చెప్తున్నాం. ఎవరైనా సొంతంగా నంబర్ ప్లేట్‌పై స్టేట్ కోడ్ మారిస్తే దాన్ని ట్యాంపరింగ్‌గానే భావించి నేరంగా పరిగణించాల్సి ఉంటుంది. అలాంటి వారిపై చర్యలు కూడా ఉంటాయి. వాహనదారులు ఇది తెలుసుకోవాలి.

– రమేశ్, జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్

టార్గెట్ నెతన్యాహూ!

ఇజ్రాయెల్ ప్రధాని ఇంటిని ఢీకొన్న డ్రోన్

- లెబనాన్ నుంచి దూసుకొచ్చిన వైనం
- పలు డ్రోన్లను కూల్చేసిన ఇజ్రాయెల్ సైన్యం
- శకలాలు తాకి ఒకరి మృతి, పలువురికి గాయాలు
- ఇవేవీ నన్నాపలేవు, యుద్ధాన్ని గెలిచి తీరతాం
- వీడియో సందేశంలో నెతన్యాహూ

జెరూసలేం: ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ లక్ష్యంగా డ్రోన్ల దాడి జరగడం తీవ్ర కలకలం రేపింది. మధ్యధర సముద్ర తీర ప్రాంతంలోని కెసారియా పట్టణంలో ఉన్న నెతన్యాహూ ఇంటిని లక్ష్యంగా చేసుకొని శనివారం ఉదయం లెబనాన్ భూభాగం నుంచి డ్రోన్లు దూసుకొచ్చినట్టు ఇజ్రాయెల్ వెల్లడించింది. వాటిని తమ సైన్యం కూల్చేసినట్లు ప్రకటించింది. ఆ సమయంలో నెతన్యాహూ, ఆయన భార్య ఇంట్లో లేరని పేర్కొంది. లెబనాన్ సరిహద్దు నుంచి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న నెతన్యాహూ నివాసంపైకి డ్రోన్లు దూసుకొస్తుండగా ఇజ్రాయెల్‌లో సైరన్లు మోగాయి. దాంతో ప్రజలు అప్రమత్తమయ్యారు. పదుల సంఖ్యలో డ్రోన్లను కూల్చేసినట్టు సైన్యం తెలియజేసింది. డ్రోన్ల శకలాలు తగిలి 50 ఏళ్ల వ్యక్తి మరణించాడని, 13 మంది గాయపడ్డారని ఇజ్రాయెల్ మెడికల్ సర్వీసు అధికారులు చెప్పారు. అయితే ఇజ్రాయెల్ రాడార్ వ్యవస్థకు అందకుండా అతి తక్కువ ఎత్తులో వచ్చిన ఒక డ్రోన్ నెతన్యాహూ నివాసాన్ని ఢీకొన్నట్టు తెలుస్తోంది. ఆ క్రమంలో అది ఇజ్రాయెల్ హెలికాప్టర్‌కు అతి సమీపం నుంచి దూసుకెళ్లింది. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఇజ్రాయెల్ దాడుల్లో ఇటీవల హెజ్‌బొల్లా, హమాస్ అధినేతలు మరణించడం తెలిసిందే. ఇందుకు ప్రతీకారంగా మిలిటెంట్లు నెతన్యాహూను లక్ష్యం చేసుకొని డ్రోన్ దాడులకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది.

మాది ఉనికి పోరు: నెతన్యాహు

హమాస్‌తో యుద్ధాన్ని గెలిచి తీరతామని నెతన్యాహూ ప్రకటించారు. తన నివాసంపై దాడి అనంతరం ఆయన ఒక వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇజ్రాయెలీలను ఉద్దేశించి ఇంగ్లిష్, హీబ్రూ భాషల్లో మాట్లాడారు. ''ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా హమాస్‌ను తుడిచిపెట్టకుండా నన్ను ఆపలేరు'' అని తన నివాసంపై దాడులనుద్దేశించి స్పష్టం చేశారు. లక్ష్యసాధనలో ఇజ్రాయెల్ సైనిక దళాలు అద్భుత ప్రగతి కనబరుస్తున్నాయంటూ ప్రస్తుతించారు. వారిని చూసి గర్విస్తున్నట్టు చెప్పారు. ''మా వాళ్లను కిరాతకంగా పొట్టన పెట్టుకోవడం, మా మహిళలపై అత్యాచారాలకు పాల్పడటం, మా చిన్నారులను సజీవంగా బుగ్గి చేయడం వంటి దారుణ అకృత్యాల్లో యాహ్యా సిన్వర్ (హమాస్ చీఫ్)ది కీలకపాత్ర. రెండ్రోజుల క్రితమే అతన్ని మట్టుబెట్టాం. మాది ఉనికి పోరాటం. దీన్ని తుదకంటా కొనసాగిస్తాం. ఇరాన్ దన్నుతో చెలరేగుతున్న ఇతర ఉగ్ర సంస్థలపైనా రాజీలేని పోరు సాగిస్తాం'' అని ప్రకటించారు.

హెజ్‌బొల్లా అగ్రనేత హతం

హెజ్‌బొల్లా మరో అగ్రనేతను కోల్పోయింది. సంస్థ డిప్యూటీ కమాండర్ నాసర్ రషీద్‌ను హతమార్చినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. దక్షిణ లెబనాన్‌లోని బింట్ బెయిల్ పట్టణంలో శనివారం జరిపిన బాంబు దాడుల్లో అతను మరణించినట్టు వెల్లడించింది.



ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ




డ్రోన్ దాడి జరిగిన ఆయన నివాసం

సిన్వర్ లేకపోయినా హమాస్ సజీవం

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ స్పష్టీకరణ

టెహ్రాన్: హమాస్ అధినేత యాహ్యా సిన్వర్ ప్రాణత్యాగం ప్రశంసనీయమని ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ పేర్కొన్నారు. సిన్వర్ భౌతికంగా లేకపోయినా హమాస్ ఎప్పటికీ ఉంటుందని తేల్చిచెప్పారు. పాలస్తీనా ప్రజల కోసం ఆ సంస్థ పోరాటం సాగిస్తూనే ఉంటుందని తెలిపారు. గాజాలో ఇజ్రాయెల్ దాడుల్లో బుధవారం సిన్వర్ మరణించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై ఖమేనీ తాజాగా స్పందించారు. ఒక ప్రకటన విడుదల చేశారు. సిన్వర్‌ను కోల్పోవడం హమాస్‌కు కొంత నష్టమే అయినప్పటికీ ఆ సంస్థ మనుగడకు ముప్పేమీ లేదని వెల్లడించారు. హమాస్ సజీవంగా ఉందని, ఇకపైనా ఉంటుందన్నారు. పోరాటంలో సిన్వర్ ఒక ధ్రువ తార అని ఖమేనీ కొనియాడారు. క్రూరమైన శత్రువుపై అలుపెరుగని పోరాటం సాగించారని, అంకితభావంతో పని చేశారని చెప్పారు. పలు సందర్భాల్లో శత్రువుకు గుణపాఠం చెప్పారని వివరించారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై చేసిన దాడి ద్వారా సిన్వర్ చరిత్ర సృష్టించారని, ఘనమైన వారసత్వాన్ని వదిలివెళ్లారని ఉద్ఘాటించారు.



కాంగ్రెస్, జేఎంఎంలకు 70 సీట్లు

- కూటమి సీట్ల సర్దుబాటు ఖరారైందన్న సీఎం సోరెన్
- తమను సంప్రదించలేదన్న ఆర్జేడీ



రాంచీ: జార్ఖండ్ అసెంబ్లీకి త్వరలో జరిగే ఎన్నికల్లో ఇండియా కూటమి పక్షాలు కలిసికట్టుగా పోటీ చేస్తాయని రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రకటించారు. అసెంబ్లీలోని మొత్తం 81 స్థానాలకు గాను కాంగ్రెస్, జేఎంఎం(జార్ఖండ్ ముక్తిమోర్చా)లు కలిసి 70 సీట్లకు పోటీ చేస్తాయన్నారు. మిగతా 11 స్థానాల్లో ఆర్జేడీ, వామపక్షాల అభ్యర్థులు బరిలో ఉంటారని వివరించారు. ఆర్జేడీ, వామపక్షాల మధ్య సీట్ల పంపకానికి సంబంధించి చర్చలు నడుస్తున్నాయని తెలిపారు. కూటమి అభ్యర్థుల పేర్లను కూడా త్వరలోనే ప్రకటించనున్నట్లు చెప్పారు. ఇలా ఉండగా, సీట్ల సర్దుబాటు పూర్తయిందంటూ సీఎం హేమంత్ చేసిన ప్రకటనపై మిత్రపక్షం ఆర్జేడీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అది తమను సంప్రదించకుండా ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయమని ఆరోపించారు. ఇతర అవకాశాలను తాము అన్వేషిస్తున్నామని స్పష్టం చేసింది. గత ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేసిన ఏడింటికిగాను ఐదు చోట్ల రెండో స్థానంలో నిలిచారని గుర్తు చేసింది. జార్ఖండ్ అసెంబ్లీకి నవంబర్ 13, 20వ తేదీల్లో రెండు విడతలుగా పోలింగ్ జరగనుండటం తెలిసిందే. బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ పక్షాల మధ్య సీట్ల పంపిణీ శుక్రవారమే ఖరారైంది.

శివసేన(యూబీటీ), ఎన్సీపీ(ఎస్పీ) చర్చలు కొలిక్కి: రౌత్



ముంబై: త్వరలో మహారాష్ట్ర అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలకు గాను తమ శివసేన(యూబీటీ), ఎన్సీపీ(ఎస్పీ)ల మధ్య సీట్ల సర్దుబాటుపై చర్చలు ముగిశాయని ఆ పార్టీ నేత సంజయ్ రౌత్ చెప్పారు. రెండు పార్టీలు సమస్యల్ని పరిష్కరించుకోవాలన్న సంకల్పంతో ఉన్నాయని ప్రకటించారు. చర్చలను రెండు పార్టీల అధ్యక్షులు శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే స్వయంగా పర్యవేక్షించారని చెప్పారు. ప్రస్తుతం జాతీయ రాజకీయాలను ప్రాంతీయ పార్టీలే శాసిస్తున్నాయని, రాష్ట్రాల్లో సంబంధిత ప్రాంతీయ పార్టీలకే ప్రాధాన్యం దక్కాలని సంజయ్ రౌత్ పేర్కొన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ, జేడీయూలు కీలకంగా ఉన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఇండియా కూటమిలో కూడా ప్రాంతీయ పార్టీలే ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ)లోని మరో కీలక పక్షం కాంగ్రెస్ గురించి రౌత్ ఈ సందర్భంగా ఎలాంటి ప్రస్తావన తేలేదు. శుక్రవారం రౌత్ కాంగ్రెస్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మహారాష్ట్ర కాంగ్రెస్ నేతలు సరైన నిర్ణయాలు తీసుకోలేకపోవడం వల్లే ఎంవీఏలో సీట్ల సర్దుబాటు ప్రక్రియ ఆలస్యమవుతోందంటూ వ్యాఖ్యానించారు. ఉద్ధవ్ ఠాక్రే సైతం కాంగ్రెస్ ధోరణిపై అసహనం వ్యక్తం చేయడం గమనార్హం.

ప్రియాంక ప్రత్యర్థి నవ్య

- వయనాడ్‌లో బీజేపీ తరఫున బరిలోకి
- సీపీఐ నుంచి సీనియర్ నేత మొకేరీ
- ఆసక్తి రేకెత్తిస్తున్న ముక్కోణపు పోరు



న్యూఢిల్లీ/తిరువనంతపురం: కేరళలోని ప్రతిష్టాత్మక వయనాడ్ లోక్‌సభ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిపై సస్పెన్స్ వీడింది. ప్రముఖ సినీ నటి ఖుష్బూతో పాటు పలు పేర్లు తెరపైకి వచ్చినా అనూహ్యంగా నవ్యా హరిదాస్ అనే యువ నాయకురాలిని పార్టీ అధిష్టానం శనివారం ఖరారు చేసింది. వయనాడ్ నుంచి కాంగ్రెస్ తరఫున పార్టీ అగ్ర నేత ప్రియాంకా గాంధీ బరిలో ఉన్న విషయం తెలిసిందే. ఆమె ఎన్నికల్లో పోటీ చేయడం ఇదే తొలిసారి. దాంతో వయనాడ్ ఉప ఎన్నికను కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సీపీఐ ఇప్పటికే సీనియర్ నాయకుడు సత్యన్ మొకేరీని ఇక్కడ బరిలోకి దించింది. తాజాగా నవ్య రాకతో పోరు మరింత ఆసక్తికరంగా మారింది. 39 ఏళ్ల నవ్య రాజకీయాలకు కొత్తేమీ కాదు. మెకానికల్ ఇంజనీరింగ్ చదివిన ఆమె కొంతకాలం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేశారు. రెండు సార్లు కోజికోడ్ కార్పొరేషన్ కౌన్సిలర్‌గా ఉన్నారు. ప్రస్తుతం కేరళ బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో రెండుచోట్ల నెగ్గిన కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ యూపీలోని రాయ్‌బరేలీని అట్టిపెట్టుకుని వయనాడ్ స్థానానికి రాజీనామా చేయడం తెలిసిందే. దాంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. వయనాడ్‌లో నవంబర్ 13న పోలింగ్ జరగనుంది. అసోం, బిహార్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లోని 24 అసెంబ్లీ ఉప ఎన్నికలకు అభ్యర్థుల పేర్లను కూడా బీజేపీ శనివారం విడుదల చేసింది. కేరళలోని పాలక్కడ్ అసెంబ్లీ స్థానం అభ్యర్థిగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.కృష్ణకుమార్, చెలక్కర స్థానానికి కె. బాలకృష్ణన్ పేర్లను ప్రకటించింది. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ సౌత్ అసెంబ్లీ స్థానానికి మాజీ ఎంపీ సునీల్ సోనీని ఖరారు చేసింది.

వాటర్ క్యాన్, సైకిళ్లపై తగ్గింపు

షూ, వాచీలపై పెంపు

జీఎస్టీ రేట్లను సవరించాలని నిర్ణయించిన మంత్రుల బృందం



న్యూఢిల్లీ: 20 లీటర్ల వాటర్ క్యాన్, సైకిళ్లు, నోటు పుస్తకాల ధరలు తగ్గే వీలుంది. వస్తుసేవల పన్నుల(జీఎస్టీ) రేట్ల హేతుబద్ధీకరణపై ఏర్పాటైన మంత్రుల బృందం(జీఓఎం) శనివారం పలు నిర్ణయాలు తీసుకుంది. ప్యాక్‌చేసిన 20 లీటర్ల నీళ్ల క్యాన్, సైకిళ్లు, రాసుకునే నోటుపుస్తకాలపై జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించాలని జీఓఎం నిర్ణయించింది. ఖరీదైన చేతి గడియారాలు, షూలపై పన్నులను పెంచాలని మంత్రుల బృందం నిర్ణయించిందని ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. కొన్ని వస్తువులపై పన్నులు పెంచడం ద్వారా రూ.22,000 కోట్ల ఆదాయం సమకూరవచ్చని బిహార్ ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి నేతృత్వంలో ఏర్పాటైన మంత్రుల బృందం అంచనావేసింది. ఈ సిఫార్సులను జీఎస్టీ మంత్రిమండలి ఆమోదిస్తే సవరణల అమల్లోకి రానున్నాయి. ప్యాక్‌చేసిన 20 లీటర్ల నీళ్ల బాటిల్‌పై ప్రస్తుతం 18 శాతం జీఎస్టీ వసూలుచేస్తుండగా త్వరలో అది 5 శాతానికి దిగిరానుంది. రూ.10వేలలోపు ధర ఉన్న సైకిళ్లపై ప్రస్తుతం 12 శాతం జీఎస్టీ ఉండగా దానిని 5 శాతానికి తగ్గిస్తారు. నోటు పుస్తకాలపైనా 5 శాతం జీఎస్టీనే వసూలుచేయనున్నారు. కొన్నింటి ధరలు పెరిగే వీలుంది. హెయిర్ డ్రయర్లు, హెయిర్ కర్లర్లు, బ్యూటీ/మేకప్ సామగ్రిపై ప్రస్తుతం అమలవుతున్న 18 శాతం జీఎస్టీని 28 శాతానికి పెంచనున్నారు. మంత్రుల బృందంలో ఉత్తరప్రదేశ్ ఆర్థికమంత్రి సురేశ్ ఖన్నా, రాజస్తాన్ ఆరోగ్య మంత్రి గజేంద్ర సింగ్, కర్ణాటక రెవెన్యూ మంత్రి కృష్ణ గౌడ, కేరళ ఆర్థిక మంత్రి కేఎన్ బాలగోపాల్ సభ్యులుగా ఉన్నారు. 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతం శ్లాబులతో జీఎస్టీని అమలుచేస్తున్నారు. నిత్యావసరాల సరకులపై తక్కువ పన్నులను, అత్యంత విలాసవంత వస్తువులపై 28 శాతం జీఎస్టీని వసూలుచేస్తుండటం తెల్సిందే. వినియోగదారులు, మార్కెట్‌వర్గాల నుంచి వస్తున్న అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుంటూ ఎప్పటికప్పుడు ఆయా వస్తువులను ప్రభుత్వం వేర్వేరు శ్లాబుల్లోకి మారుస్తోంది.

గుజరాత్ బీజేపీ ఎమ్మెల్యేపై రేప్ కేసు



గాంధీనగర్: గుజరాత్ హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు శనివారం బీజేపీ ఎమ్మెల్యేపై అత్యాచారం కేసు నమోదు చేశారు. ప్రంతిజ్ నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ మంత్రి గజేంద్రసిన్హ్ పర్మార్ 2020 జూలై 30న గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్‌కు తనను పిలిపించుకున్నారని, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి లోబర్చుకున్నారని దళిత బాధితురాలు ఆరోపించింది. ఆ తర్వాత తన ఫోన్‌కాల్స్‌కు ఆయన స్పందించలేదని తెలిపింది. ఓసారి మాత్రం తమ మధ్య సంబంధం విషయం ఎవరికైనా చెబితే కిడ్నాప్ చేసి, చిత్రహింసలు పెడతానంటూ కులం పేరుతో దూషించారని పేర్కొంది. ఈ మేరకు ఆమె అందజేసిన ఫిర్యాదును పోలీసులు పట్టించుకోలేదు. దీంతో, బాధితురాలు 2021లో హైకోర్టును ఆశ్రయించింది. విచారణ చేపట్టిన న్యాయస్థానం పోలీసుల తీరును ప్రశ్నించింది. ఎమ్మెల్యేపై వెంటనే అత్యాచారం కేసు నమోదు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు గాంధీనగర్ సెక్టార్-21 పోలీస్‌స్టేషన్ పోలీసులు అత్యాచారం, పోక్సో తదితర కేసులు పెట్టారు.

ప్రజా న్యాయస్థానం సుప్రీంకోర్టు

ప్రజల కోర్టుగా దాని పాత్రను ఎప్పటికీ పరిరక్షించాలి

- పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు పోషించే పాత్రను సుప్రీంకోర్టు పోషించకూడదు
- సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ స్పష్టీకరణ

పనాజీ: పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు పోషించే పాత్రను సుప్రీంకోర్టు పోషించకూడదని అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అన్నారు. ప్రజల కోర్టుగా సుప్రీంకోర్టు పాత్రను ఎప్పటికీ పరిరక్షించాలని చెప్పారు. భవిష్యత్తులోనూ ప్రజల న్యాయస్థానంగానే పని చేయాలని పేర్కొన్నారు. ప్రజల కోర్టు అంటే దాని అర్థం పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు పోషించే పాత్ర కాదని ఉద్ఘాటించారు. గోవాలో శనివారం సుప్రీంకోర్టు అడ్వొకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్(ఎస్సీఏఓఆర్ఏ) సదస్సులో జస్టిస్ చంద్రచూడ్ ప్రసంగించారు. సుప్రీంకోర్టు నుంచి న్యాయం పొందే విషయంలో గత 75 ఏళ్లలో ఒక స్పష్టమైన విధానం అభివృద్ధి చేసుకున్నామని, అది దారితప్పకుండా జాగ్రత్తపడాలని చెప్పారు. సమాజంలో సంపద పెరుగుతోందని, ఇలాంటి పరిస్థితుల్లో ధనవంతులకే న్యాయం దక్కుతుందన్న అభిప్రాయం ప్రజల్లో ఉందని పేర్కొన్నారు. అందులో ఎలాంటి నిజం లేదని, సుప్రీంకోర్టు అంటే ముమ్మాటికీ ప్రజల కోర్టు అని స్పష్టంచేశారు. సుప్రీంకోర్టును చూసే దృక్కోణం విషయంలో జనం మధ్య విభజన కనిపిస్తోందన్నారు. అనుకూలమైన తీర్పు వస్తే సుప్రీంకోర్టు చాలా గొప్పదని ప్రశంసించడం ప్రతికూలమైన తీర్పు వస్తే దూషించడం పరిపాటిగా మారిందన్నారు. కేవలం తీర్పుల ఆధారంగా సుప్రీంకోర్టు పనితీరు, అది పోషించే పాత్రను నిర్ణయించడం సరికాదన్నారు. కేసులో మెరిట్‌ను బట్టే న్యాయమూర్తులు తీర్పు ఇస్తుంటారని, ఇందులో వారి సొంత అభిప్రాయానికి స్థానం ఉండదని గుర్తుచేశారు. జడ్జిలు స్వతంత్రంగా వ్యవహరిస్తుంటారని చెప్పారు.

ప్రజల ఇళ్లలోకి సుప్రీంకోర్టు

న్యాయ వ్యవస్థలోఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని జస్టిస్ చంద్రచూడ్ వెల్లడించారు కేసుల ఈ-ఫైలింగ్, కేసు రికార్డుల డిజిటలైజేషన్, కోర్టు వ్యవహారం ప్రత్యక్ష ప్రసారం వంటివి తీసుకొచ్చామని గుర్తుచేశారు. ప్రత్యక్ష ప్రసారం అనేది ఒక విప్లవాత్మకమైన మార్పు అని తెలిపారు. ఇప్పుడు కోర్టురూమ్ అనేది కొందరు లాయర్లు, జడ్జిలకు మాత్రమే పరిమితం కాదని, అది ప్రజలకు ఒక్క క్లిక్‌తో అందుబాటులోకి వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు నేరుగా ప్రజల ఇళ్లల్లోకి చేరిందన్నారు.

కోర్టుల్లో గౌరవప్రదమైన భాష వాడుదాం

మనుషులను కించపర్చే భాషకు కోర్టు ప్రాంగణాల్లో స్థానం లేదని జస్టిస్ చంద్రచూడ్ స్పష్టం చేశారు. ప్రధానంగా మహిళల పట్ల అభ్యంతర వ్యాఖ్యలు, దిగజారుడు భాషను సహించే ప్రసక్తే లేదని అన్నారు. మహిళలతోపాటు సమాజంలోని అణగారిన వర్గాలపై ఇష్టానుసారంగా నోరుపారేసుకోవడం కొందరికి అలవాటని చెప్పారు. అభ్యంతరకర భాష పట్ల మహిళా న్యాయవాదుల నుంచి తమకు ఫిర్యాదులు వస్తుంటాయని తెలిపారు. న్యాయ వ్యవస్థలోనూ ఇలాంటి జాడ్యం ఉందని, ఈ పరిస్థితి మారాలని తేల్చిచెప్పారు. న్యాయస్థానాల్లో ఉపయోగించే భాష పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.



శనివారం పనాజీలో ఎస్సీఏఓఆర్ఏ సదస్సులో మాట్లాడుతున్న సీజేఐ

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

వాతావరణ మార్పుల దుష్పరిణామాల పట్ల జస్టిస్ చంద్రచూడ్ ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ మార్పుల కారణంగా సమాజంలో అట్టడుగు వర్గాలే ఎక్కువగా నష్టపోతున్నాయని చెప్పారు. రైతులు, మత్స్యకారులు, పేదలకు తీవ్ర నష్టం జరుగుతోందని అన్నారు. గోవా గవర్నర్ పి.ఎస్.శ్రీధరన్ పిళ్లై రాసిన 'భారతదేశ సంప్రదాయ వృక్షాలు' అనే పుస్తకాన్ని జస్టిస్ చంద్రచూడ్ శనివారం ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని స్పష్టంచేశారు.

శివుడిపై అభ్యంతరకర వ్యాఖ్యలు.. ఎమ్మెల్యేపై కేసు



బాబు జండెల్

ఇండోర్: ఆదిదేవుడు శివుడిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై మధ్యప్రదేశ్ పోలీసులు కాంగ్రెస్ ఎమ్మెల్యే బాబు జండెల్‌పై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే బాబు జండెల్ శివుడిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసి, హిందువుల మనోభావాలను దెబ్బతీశారంటూ శుక్రవారం రాత్రి విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) లీగల్ సెల్ నేత, న్యాయవాది అనిల్ నాయుడు టుకోగంజ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు డీసీపీ హన్స్‌రాజ్ సింగ్ చెప్పారు. శివుడిపై అమర్యాదకర వ్యాఖ్యలు చేసిన ఆరోపణలపై ఎమ్మెల్యే జండెల్‌పై ఇప్పటికే ఇండోర్‌లో కేసు నమోదైందన్నారు. అయితే, తాను ఎటువంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని ఎమ్మెల్యే జండెల్ స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఆ వీడియో మార్ఫింగ్ చేసిందని చెబుతున్నారు.

ఏపీఏబీసీ ప్రెసిడెంట్‌గా హొర్ముజ్ మసానీ



న్యూఢిల్లీ: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ-ఇండియా) జనరల్ సెక్రెటరీ హొర్ముజ్ మసానీ వరుసగా ఐదోసారి ఏషియా పసిఫిక్ ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్టిఫికేషన్ (ఏపీఏబీసీ) అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్టిఫికేషన్ (ఐఎఫ్ఏబీసీ) సర్వసభ్య సమావేశంలో ఆయనను ఈ మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఆనరరీ ట్రెజరర్ హోదాలో ఐఎఫ్ఏబీసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు మెంబర్‌గా కూడా మసానీ వరుసగా తొమ్మిదోసారి ఎన్నికయ్యారు. ఆయన 1998 నుంచి ఏబీసీ సెక్రెటరీ జనరల్‌గా వ్యవహరిస్తున్నారు. 2008 నుంచి ఐఎఫ్ఏబీసీలో ఏబీసీ-ఇండియాకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.


సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ప్రభుత్వాధికారులకు మోదీ సూచన

న్యూఢిల్లీ: ఆధునిక సాంకేతికను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని, పౌర కేంద్రీకృత విధానాలను అనుసరించాలని ప్రధాని మోదీ అధికారులను కోరారు. ఇందుకు మిషన్ కర్మయోగి ఎంతో సహాయకారిగా ఉంటుందని చెప్పారు. కొత్తకొత్త ఆలోచనల కోసం స్టార్టప్‌లు, పరిశోధన విభాగాలు, యువత నుంచి సలహాలను స్వీకరించాలని సూచించారు. శనివారం ప్రధాని మోదీ డాక్టర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో నేషనల్ లెర్నింగ్ వీక్(కర్మయోగి సప్తాహ్)ను ప్రారంభించి, అధికారులనుద్దేశించి మాట్లాడారు. కృత్రిమ మేధ(ఏఐ)తో ఇన్ఫర్మేషన్ ప్రాసెసింగ్ మరింత సులువుగా మారుతుందంటూ ఆయన..పౌరులకు సమాచారం అందించడంతోపాటు ప్రభుత్వ కార్యకలాపాలన్నింటిపై నిఘాకు ఏఐతో వీలు కలుగుతుందన్నారు. అధికారులు వినూత్న ఆలోచనలు కలిగి ఉండాలన్నారు. పథకాలు, కార్యక్రమాల అమలుపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునే యంత్రాంగం అన్ని స్థాయిల్లోనూ ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ తెలిపారు. ఉద్యోగుల సామర్థ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా 2020లో మిషన్ కర్మయోగి కార్యక్రమాన్ని కేంద్రం ప్రారంభించింది.

నారీ శక్తి ఆశీర్వాదమే స్ఫూర్తి

మహిళల ఆశీర్వచనాలే తనకు దేశాన్ని అభివృద్ధి దిశలో నడిపేందుకు ప్రేరణను అందిస్తాయని మోదీ పేర్కొన్నారు. 'మోదీకి కృతజ్ఞతగా అందజేయా'లంటూ ఓ గిరిజన మహిళ పట్టుబట్టి మరీ తనకు రూ.100 ఇచ్చారంటూ బీజేపీ ఉపాధ్యక్షుడు బైజయంత్ జయ్ పాండా శనివారం 'ఎక్స్'లో షేర్ చేసిన ఫొటోలపై ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదు సందర్భంగా చోటుచేసుకున్న ఘటనపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ''ఇది నా హృదయాన్ని కదిలించింది. నన్ను సదా ఆశీర్వదించే నారీ శక్తికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. వారి ఆశీస్సులే నాకు నిత్యం ప్రేరణగా నిలుస్తాయి'' అని ఆయన పేర్కొన్నారు.



నేడు వారణాసికి ప్రధాని మోదీ

ప్రధాని ఆదివారం వారణాసిలో పర్యటించనున్నారు. శంకర నేత్రాలయం సహా రూ.6,600 కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులను ఈ సందర్భంగా ప్రారంభిస్తారు.

గాజాపై భీకర దాడి... 50 మంది దుర్మరణం

ఖాన్ యూనిస్: గాజాలో ఇజ్రాయెల్ దాడుల్లో సామాన్యుల మరణాలు కొనసాగుతునే ఉన్నాయి. బందీలుగా ఉన్న ఇజ్రాయెలీల విడుదలకు హమాస్ ససేమిరా అనడం తెలిసిందే. దాంతో శుక్రవారం అర్ధరాత్రి, శనివారం ఉత్తర గాజాలోని పలు ఆసుపత్రులపై ఇజ్రాయెల్ భీకర దాడులకు పాల్పడింది. వీటిలో 50 మందికిపైగా మరణించారు. 80 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో చాలామంది మహిళలు, చిన్నారులేనని స్థానిక అధికారులు తెలిపారు. బేట్ లాహియాలోని ఇండొనేసియన్ ఆస్పత్రిపై ఇజ్రాయెల్ దళాలు విచక్షణారహితంగా కాల్పులకు పాల్పడ్డట్టు పాలస్తీనా వర్గాలు పేర్కొన్నాయి.

ఇజ్రాయెల్ దాడుల ధాటికి జాబాలియాలోని అల్ అద్వా ఆస్పత్రిలో పై అంతస్తులన్నీ దెబ్బ తిన్నాయి. దాని పరిసరాల్లోని పలు నివాస ప్రాంతాలపై జరిగిన బాంబు దాడుల్లోనే కనీసం 30 మందికి పైగా మరణించినట్టు సమాచారం. సెంట్రల్ గాజాలోని జవైదా పట్టణంలో ఓ ఇంటిపై జరిగిన దాడికి 10 మంది బలయ్యారు. మఘాజీ శరణార్థి శిబిరంపై జరిగిన మరో దాడిలో ఒకే కుటుంబానికి చెందిన 11 మంది మృత్యువాత పడ్డారు. దాడుల ధాటికి ఉత్తర గాజాలో ఇంటర్నెట్ నెట్‌వర్కులు పూర్తిగా దెబ్బ తిన్నాయి. ఏడాదికిపైగా సాగుతున్న గాజా యుద్ధంలో ఇప్పటికే 42,500 మందికి పైగా మృత్యువాతపడ్డారు. వీరిలో సగానికిపైగా మహిళలు, చిన్నారులే.

నిరసన దీక్షను విరమించండి

- వైద్యులకు సీఎం మమత వినతి
- ఆరోగ్య శాఖ కార్యదర్శిని తొలగించేది లేదని స్పష్టీకరణ



కోల్‌కతా: ఆర్జీ కర్ ఆస్పత్రిలో హత్యాచారానికి గురైన ట్రెయినీ వైద్యురాలికి న్యాయం చేయాలంటూ ఆమరణ దీక్ష చేపట్టిన వైద్యులతో సీఎం మమతా బెనర్జీ శనివారం ఫోన్‌లో మాట్లాడారు. డిమాండ్లలో చాలా వరకు పరిష్కరించినందున దీక్ష విరమించాలని వారిని కోరారు. అదే సమయంలో, డాక్టర్లు డిమాండ్ చేస్తున్న విధంగా ఆరోగ్య శాఖ కార్యదర్శిని మాత్రం తొలగించబోమని స్పష్టం చేశారు. ఇప్పటికే పలువురిని తొలగించామంటూ ఆమె..ఫలానా అధికారిని తొలగించాలని మీరెలా అడుగుతారు? మమ్మల్ని మీరెలా ఆదేశిస్తారు? అని ప్రశ్నించారు. నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. అయితే, దీనివల్ల ప్రజా సేవలకు అంతరాయం కలగరాదని, వెంటనే దీక్ష విరమించాలని కోరారు. డిమాండ్లపై చర్చించేందుకు సోమవారం తనను సెక్రటేరియట్‌కు వచ్చి కలుసుకోవాలని కోరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్ శనివారం కోల్‌కతాలోని ఎస్ప్లనేడ్‌లో దీక్షా శిబిరం వద్దకు వచ్చి చర్చలు జరిపారు. జూనియర్ వైద్యులు రెండు వారాలుగా నిరశన సాగిస్తున్నారు. ఆరోగ్యం విషమించడంతో దీక్షలో పాల్గొన్న ఆరుగురు వైద్యులు ఆస్పత్రుల్లో చేరారు. వైద్యుల డిమాండ్లను పరిష్కరించకుంటే ఈ నెల 22న రాష్ట్ర వ్యాప్త సమ్మె చేపడతామని రాష్ట్ర వైద్యుల సంఘాలు ఇప్పటికే ప్రకటించాయి. మంగళవారం దేశవ్యాప్త నిరసన చేపట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఎన్సీడబ్ల్యూ చైర్‌పర్సన్‌గా విజయా కిశోర్



సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ మహిళా కమిషన్(ఎన్సీడబ్ల్యూ) నూతన చైర్‌పర్సన్‌గా విజయ కిశోర్ రహాట్కర్ నియమితులయ్యారు. అదేవిధంగా, కమిషన్ సభ్యురాలిగా డాక్టర్ అర్చనా మజుందార్ నియమితులయ్యారు. కేంద్ర ప్రభుత్వం శనివారం ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రహాట్కర్ మూడేళ్ల పాటు, లేదా 65 ఏళ్లు వచ్చే వరకు పదవిలో కొనసాగుతారని తెలిపింది. మజుందార్ మూడేళ్ల పాటు కొనసాగుతారని వివరించింది. తక్షణం ఈ నియామకాలు అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెందిన రహాట్కర్ 1995లో బీజేపీలో చేరారు. 2007-2010 మధ్య ఛత్రపతి సంభాజీనగర్ (ఔరంగాబాద్) మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా ఉన్నారు. నేషనల్ మేయర్స్ కౌన్సిల్‌కు ఉపాధ్యక్షురాలిగా వ్యవహరించారు. బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యదర్శిగా 2010-2014 మధ్య పనిచేశారు. 2016-21 సంవత్సరాల్లో మహారాష్ట్ర మహిళా కమిషన్‌కు చైర్‌పర్సన్‌గా ఉన్నారు.

జమ్మూకశ్మీర్ రాష్ట్రహోదా తీర్మానానికి ఎల్జీ ఓకే

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతానికి రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలంటూ ఒమర్ అబ్దుల్లా కేబినెట్ చేసిన తీర్మానానికి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆమోదముద్రవేశారు. గురువారం సమావేశమై కేబినెట్ ఆమోదించిన తీర్మానానికి ఎల్జీ ఆమోదం తెలిపినట్లు అధికారిక వర్గాలు శనివారం వెల్లడించాయి. జమ్మూకశ్మీర్ ప్రజల గుర్తింపు, రాజ్యాంగబద్ధ హక్కులను తిరిగి పొందేందుకు పాత గాయాలను మాన్పే పూర్తిరాష్ట్ర హోదా పొందే ప్రక్రియలో ఈ తీర్మానం తొలి అడుగు అని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. జమ్మూకశ్మీరీల ప్రత్యేక గుర్తింపే నూతన ప్రభుత్వం అనుసరించనున్న విధాన నిర్ణయాలకు భూమిక అని ఆయన అన్నారు. నవంబర్ నాలుగోతేదీన అసెంబ్లీ సమావేశాలు జరపనున్నారు. రాష్ట్ర పునరుద్ధరణకు సంబంధించిన విషయాలపై ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులతో చర్చించేందుకు సీఎం ఒమర్ త్వరలో ఢిల్లీకి వెళ్లనున్నారు. అయితే రద్దయిన 370 ఆర్టికల్‌ను తిరిగి తీసుకొచ్చే విషయంలో ఎలాంటి తీర్మానాలు జరగకపోవడాన్ని విపక్షాలు తీవ్రంగా తప్పుబట్టాయి. కొలువుతీరిన కొద్దిరోజులకే ఒమర్ సర్కార్ అప్పుడే కేంద్రప్రభుత్వానికి లొంగిపోయిందని ఆగ్రహం వ్యక్తంచేశాయి.

మందుపాతర పేలి ఇద్దరు జవాన్లు మృత్యువాత

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఇద్దరు జవాన్లు మృత్యువాతపడగా మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఓర్చా, మొహండి, ఇరక్‌బట్టీ బేస్ క్యాంపులకు చెందిన ఐటీబీపీ, బీఎస్ఎఫ్, డీఆర్జీ బలగాలు కోడ్లియార్ సమీపాన అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి 11.30 గంటలప్పుడు మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి నలుగురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఐటీబీపీ 53వ బెటాలియన్‌కు చెందిన అమర్ పన్వర్(36), కె.రాజేశ్ అసువులు బాశారు. వీరిలో అమర్‌ది మహారాష్ట్రలోని సతారా జిల్లా కాగా, రాజేశ్‌ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వైఎస్సార్ కడప జిల్లా. చికిత్స పొందుతున్న మరో ఇద్దరి ఆరోగ్యం నిలకడగా ఉందని ఉన్నతాధికారులు వెల్లడించారు.

సాక్షి
కరీంనగర్
ఆదివారం । 20 । అక్టోబర్ । 2024

నేడు ఎల్‌ఎండీ గేట్ల ఎత్తివేత

తిమ్మాపూర్(మానకొండూర్): ఎల్‌ఎండీ(దిగువ మానేరు జలాశయం)కి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి మిడ్‌మానేరు ద్వారా ఇన్‌ఫ్లో వస్తుండటంతో ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది. ఉన్నతాధికారుల సూచనల మేరకు ఎల్‌ఎండీ నుంచి దిగువకు 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్లు ఈఈ నాగభూషణం శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటలకు వరద గేట్లు ఎత్తుతామన్నారు. మత్స్యకారులు, గొర్రె కాపరులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 24.034 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 23.903 టీఎంసీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టులోకి 4,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని, మిడ్‌మానేరు నుంచి 4,300 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కులు వస్తున్నట్లు తెలిపారు.


నిండుకుండలా ఎల్‌ఎండీ

న్యూస్‌రీల్

బాధ్యతలు తీసుకున్న 'శాతవాహన' వీసీ


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మొక్క అందిస్తున్న వీసీ ఉమేశ్‌కుమార్

కరీంనగర్ సిటీ: శాతవాహన యూనివర్సిటీగా వీసీగా ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్ శనివారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో వర్సిటీ ఇన్‌చార్జి వీసీ సురేందర్ కుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు ఆయనను అభినందించారు. ఈ నెల 21న వీసీ కరీంనగర్‌లోని యూనివర్సిటీకి వస్తారని స్థానిక అధికారులు తెలిపారు.

మంత్రి 'పొన్నం'ను కలిసిన వీసీ

శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేశ్‌కుమార్ శనివారం రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్‌లోని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు మొక్క అందించారు. ఈ సందర్భంగా వీసీని మంత్రి సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

విద్యా కమిషన్ సలహాదారుగా ప్రొఫెసర్ సుజాత

కరీంనగర్ సిటీ: తెలంగాణ విద్యా కమిషన్ సలహాదారుగా శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సుజాత నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వర్సిటీ అధికారులు, లెక్చరర్లు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

'గంగుల'ను విమర్శించే స్థాయి సుడా చైర్మన్‌కు లేదు


మాట్లాడుతున్న కార్పొరేటర్లు రమణారావు, మాధవి, శ్రీనివాస్ తదితరులు

కరీంనగర్ కార్పొరేషన్: ఏ ఎన్నికల్లోనైనా ఓటమెరుగని నేత గంగుల కమలాకర్ అని బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు వాల రమణారావు, గందె మాధవి, కంసాల శ్రీనివాస్ అన్నారు. ఆయనను విమర్శించే స్థాయి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి లేదని పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఎమ్మెల్యే గంగుల నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా పోటీ చేస్తే డిపాజిట్ దక్కని నరేందర్ రెడ్డి ఎమ్మెల్యేను విమర్శించడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. ప్రజలు తిరస్కరిస్తే, వాళ్ల, వీళ్ల కాళ్లు పట్టుకొని సుడా చైర్మన్ పదవి తెచ్చుకున్నారని ఆరోపించారు. పదేపదే నగర పాలక సంస్థలో అవినీతి, అక్రమాలు జరిగాయంటున్నారని, అధికారంలో ఉన్నది వారి ప్రభుత్వమేనని, విచారణ జరిపించుకోవచ్చని హితవు పలికారు. గత ప్రభుత్వ హయాంలో మంత్రిగా గంగుల కమలాకర్ నగర రూపురేఖలు మార్చారని తెలిపారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చి ఉంటే మానేరు రివర్ ఫ్రంట్‌లో ఇప్పటికే బోట్లు తిరిగేవన్నారు. చేతనైతే నిధులు తెచ్చి, పెండింగ్ పనులు పూర్తి చేయాలని సవాల్ విసిరారు. కార్పొరేటర్లు, నాయకులు జంగిలి సాగర్, పుట్ట నరేందర్, దిండిగాల మహేశ్, జంగిలి ఐలేందర్ యాదవ్, ఎదుల్ల రాజశేఖర్, కోల సంపత్, తుల బాలయ్య, నందెల్లి రమ, గందె మహేశ్ పాల్గొన్నారు.

సిటీలో పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి(కరీంనగర్): విద్యుత్ మరమ్మతుల తోపాటు తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏడీఈ శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ టవర్ సర్కిల్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ టవర్, గంజ్, డాక్టర్స్ స్ట్రీట్, డీఎఫ్‌వో, వరలక్ష్మి ఫీడర్ల పరిధిలోని డాక్టర్స్ స్ట్రీట్, శ్రీనగర్, సివిల్ ఆస్పత్రి వెనక భాగం, గాంధీరోడ్, బాలికల జూనియర్ కళాశాల రోడ్, అహ్మద్‌పుర, రూరల్ పోలీస్‌స్టేషన్, బోయవాడ, గంజ్, టవర్‌సర్కిల్, సిఖ్‌వాడీ, కమాన్, సీపీ ఆఫీస్ రోడ్, లక్ష్మీనగర్, కమాన్ నుంచి హౌసింగ్‌బోర్డు కాలనీ రోడ్, ఈఎస్ గార్డెన్, ఆంధ్రాబ్యాంక్, హెచ్‌పీ గ్యాస్ గోదాం, రెడ్డి ఫంక్షన్ హాల్ వెనకభాగం, మెహర్‌నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 33/11 కేవీ భగత్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని భగత్‌నగర్, ముకరంపుర, విఘ్నేశ్వరకాలనీ, వేంకటేశ్వర కాలనీ, ఎన్‌జీఎస్ కాలనీ, ఎర్రగుట్టపల్లి, కట్టరాంపూర్, అంబేడ్కర్ స్టేడియం, కలెక్టరేట్ కాంప్లెక్స్, బస్టాండ్, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, ఎల్ఐసీ ఆఫీస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ లావణ్య పేర్కొన్నారు.

అమ్మో.. న్యూడ్ కాల్స్

- ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యేకు షాకిచ్చిన మహిళ
- నగ్నంగా వీడియో కాల్ చేయడంతో పోలీసులకు ఫిర్యాదు
- వీఐపీలు, మహిళలే టార్గెట్‌గా సైబర్ అరాచకాలు
- యూపీ, రాజస్థాన్, కాంబోడియా నుంచి ఆపరేట్
- ఏఐ సాంకేతికతతో చాటింగ్, వీడియో కాల్స్
- అపరిచిత కాల్స్ లిఫ్ట్ చేయొద్దంటున్న పోలీసులు

ఉమ్మడి జిల్లాలో కేసుల వివరాలు

రామగుండం కమిషనరేట్	179
కరీంనగర్ కమిషనరేట్	62
రాజన్నసిరిసిల్ల	58
జగిత్యాల	74



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యేను వీడియో కాల్ కంగారు పెట్టించింది. హైదరాబాద్ వరకు పరుగులు తీయించింది. అసలేం జరిగిందంటే.. ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి గుర్తు తెలియని నంబర్ నుంచి ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేకు వీడియో కాల్ వచ్చింది. తన నియోజకవర్గం వారే అయి ఉంటారని ఆయన లిఫ్ట్ చేశారు. అంతే.. అవతలివైపు ఓ మహిళ నగ్నంగా ఉండి, మాట్లాడటం మొదలుపెట్టింది. ఒకటి రెండు సెకండ్లపాటు ఎమ్మెల్యేకు ఏం జరుగుతుందో అర్థం కాలేదు. వెంటనే, అప్రమత్తమై సదరు కాల్ డిస్‌కనెక్ట్ చేశారు. మరునాడు ఉదయం హుటాహుటిన హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు, నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌తోపాటు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీ సీఎస్‌బీ)కు కూడా ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలో ప్రత్యర్థులతో తనకు కొనసాగుతున్న రాజకీయ పోరు నేపథ్యంలో ఈ పని చేయించింది వారేనని ఆయన అనుమానిస్తున్నారు. పోలీసులు మాత్రం ఈ కాల్స్ వెనక ఎలాంటి రాజకీయ కుట్ర లేదని భావిస్తున్నట్లు సమాచారం. ఇది ప్రొఫెషనల్ సైబర్ నేరగాళ్లు చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. ఎమ్మెల్యేకు వీడియో కాల్ వచ్చిన నంబర్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. సదరు వీడియో కాల్ యూపీ నుంచి వచ్చినట్లు తెలిసింది.

లిఫ్ట్ చేస్తే ఏమవుతుంది?

కరోనా తర్వాత సెల్‌ఫోన్, డేటా వినియోగం పెరిగింది. దీన్ని ఆసరాగా తీసుకొని, వీఐపీలు, డాక్టర్లు, పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు, మహిళలు, యువతులు లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు చెలరేగుతున్నారు. అందమైన అమ్మాయిల డీపీలు పెట్టి, వాట్సాప్‌లో తొలుత చాటింగ్ చేసి, తర్వాత వీడియో కాల్స్ చేస్తున్నారు. వాటిని రికార్డ్ చేసి, అనంతరం డబ్బులివ్వాలని బ్లాక్ మెయిలింగ్‌కు దిగుతున్నారు. ఇందుకోసం రాత్రి సమయాన్ని ఎంచుకుంటున్నారు. ఆ సమయంలో మద్యం సేవించి ఉంటారు కాబట్టి సులువుగా తప్పు చేస్తారన్నది వీరి వ్యూహంగా తెలుస్తోంది.

నేరగాళ్లకు సమాచారం ఇచ్చేది మీరే..

ఎక్కడో యూపీ, నోయిడా, కాంబోడియా, థాయ్‌లాండ్ దేశాల్లో కూర్చొని, నేరాలకు పాల్పడేవారికి మీ డేటా ఎలా వెళ్లిందనేగా మీ అనుమానం? వారికి ఆ డేటా అందజేసేది మీరే.. ప్రతీ చిన్న వ్యవహారాన్ని ఫొటోలు తీసి, పెడుతుంటారు. మీ ఫోన్ నంబర్, కుటుంబసభ్యుల వివరాలు, పెళ్లిరోజు, పుట్టిన రోజు తదితరాలన్నీ.. మీ ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియా ఖాతాల ద్వారా తెలుసుకుంటారు. అందుకే, వీలైనంత వరకు ప్రైవసీ ఉండేలా సెట్టింగ్స్ మార్చుకోండి.

మాట్లాడేది మని'షి' కాదు..

వాస్తవానికి ఇలాంటి ఘటనల్లో నగ్నంగా కనిపించేది, మాట్లాడేది యువతులు, మహిళలు కాదు.. అసలు మనిషే కాదు. అదంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)లో సృష్టించిన సాఫ్ట్‌వేర్. ఇది నేరగాళ్లు చెప్పినట్లే నడుచుకుంటుంది. ఈ సాఫ్ట్‌వేర్ చాటింగ్‌కు, వీడియో కాల్స్‌కు ఎలా స్పందించాలో ముందే అల్గారిథమ్‌లో పొందుపరుస్తారు. అలా ఎదుటివారికి ఎలాంటి అనుమానం రాదు. ఇది తెలియక అవతలవైపు నిజంగా.. మనిషే ఉందన్న భ్రమలో చాలామంది వారు చెప్పినట్లు చేసి, కష్టాలు కొనితెచ్చుకుంటారు.

కాల్ వస్తే ఏం చేయాలి?


అపరిచిత వీడియో కాల్స్ వస్తే.. ఫ్రంట్ కెమెరాపై చూపుడు వేలు పెట్టి, లిఫ్ట్ చేయాలి. అవతలివైపు ఉన్నది మీకు తెలిసినవారు అయితేనే.. కాల్ కొనసాగించాలి. అనుమానాస్పద వ్యక్తులు అని అనుమానం వస్తే.. వెంటనే కట్ చేయాలి. వాస్తవానికి మీరేం చేయకపోయినా వీడియో కాల్స్ మాట్లాడితే చాలు.. మీ ఫేస్‌ను క్యాప్చర్ చేసి, డీప్ ఫేక్ టెక్నాలజీ ద్వారా తిరిగి మీకే పంపి, డబ్బులు డిమాండ్ చేస్తారు.

అవగాహన కల్పిస్తున్నాం



ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో సైబర్ వారియర్లు ఉంటారు. ఎన్ని రకాల నేరాలు జరుగుతున్నాయో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఏమరుపాటుగా ఉండి, చాలామంది బ్లాక్ మెయిల్‌కు గురై, లక్షల్లో డబ్బులు పోగొట్టుకుంటున్నారు. ఇలాంటి నేరాలు జరిగిన వెంటనే నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్(1930) లేదా సమీపంలోని సైబర్ క్రైం సెల్‌లో ఫిర్యాదు చేయాలి.
– వెంకటరమణ, ఏసీపీ, రామగుండం

పట్టించుకుంటే.. పర్యాటకమే


ఎలగందుల ఖిల్లా

చరిత్ర గతించినా.. నాటి చారిత్రక వైభవానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు కట్టడాలు. ఎలగందుల ఖిల్లా, రామునిగుండాల, కోటిలింగాల, ఎల్లంపల్లి ప్రాజెక్టు, కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి ఆలయం, రాయికల్ చెన్నకేశవనాథ స్వామి ఆలయం, అనంతగిరి అన్నపూర్ణ ప్రాజెక్టు, మధ్యమానేరులోని దత్తాత్రేయస్వామి ఆలయం.. ఇలా ఎన్నో ఉన్నాయి. నిర్మాణం, చరిత్రలో వేటికవే ప్రత్యేకం. అయితే, ప్రభుత్వాలు మారుతున్నా.. అవి అభివృద్ధికి నోచుకోవడం లేదు. అరకొర నిధుల విడుదలతో అసంపూర్తి నిర్మాణాలు, అసౌకర్యాలు, రవాణా సదుపాయం లేకపోవడం వంటివే పర్యాటకులు, భక్తులకు స్వాగతం పలుకుతున్నాయి. పాలకులు పట్టించుకొని, సౌకర్యాలు కల్పిస్తే ప్రతీ ప్రాంతం పర్యాటకంగా విరాజిల్లుతుంది. పర్యాటకుల తాకిడి పెరిగి, ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

– వివరాలు 8లో..


రాయికల్ చెన్నకేశవనాథ త్రికూటాలయం

చదువుతోనే బాలికల అభివృద్ధి


మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి, పక్కన అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తదితరులు

- అంతరిక్షంలోకి వెళ్తున్న రోజుల్లోనూ భ్రూణహత్యలు బాధాకరం
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ కల్చరల్: మహిళలు అంతరిక్షంలోకి వెళ్తున్నారని గర్వంగా చెప్పుకుంటున్న ఈ రోజుల్లో కూడా భ్రూణహత్యలు జరగడం బాధాకరమని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11న నిర్వహించాల్సిన అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని దసరా సెలవుల అనంతరం శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతీ రంగంలో మహిళలున్నారని, అయినా వారిపట్ల చిన్నచూపు తగ్గడం లేదన్నారు. బాలికలకు భయాన్ని నూరిపోస్తున్నారని తెలిపారు. జీవితంలో ధైర్యంగా ముందుకు సాగాలని, చదువొక్కటే వారి అభివృద్ధికి మార్గమని పేర్కొన్నారు. బాలికలు ఒకరికొకరు సహాయం చేసుకోవాలని సూచించారు. బాలుడికి ఇచ్చే ప్రోత్సాహాన్ని, అవకాశాన్ని బాలికకు కూడా ఇవ్వాలని తల్లిదండ్రులను కోరారు. తల్లికి మించిన దైవం లేదని ఏ సమస్య వచ్చినా ఆమెకు చెప్పాలని, తల్లి మాటలు వినాలని విద్యార్థినులకు సూచించారు. బాలికా సంరక్షణ చట్టాలపై ఏసీపీ మాధవి అవగాహన కల్పించారు. అనంతరం బాలికల సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా, జిమ్నాస్టిక్స్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, జిల్లా వైద్యాధికారి సుజాత, షీటీం ఇన్‌స్పెక్టర్ శ్రీలత, సీడబ్ల్యూసీ సభ్యురాలు రాధ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు 'యజ్ఞవరాహస్వామి' ముస్తాబు


ముస్తాబైన ఆలయం

కరీంనగర్ కల్చరల్: యజ్ఞవరాహస్వామి 38వ వార్షిక బ్రహ్మోత్సవాలకు జిల్లా కేంద్రంలోని స్వామివారి ఆలయం ముస్తాబైంది. ఆదివారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు సర్వవైదిక సంస్థానం ట్రస్టు ఆధ్వర్యంలో తిరుమలలో మాదిరిగా ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం పుణ్యాహవచనం, నూతన కల్యాణ మండప వాస్తు హోమం, సాయంత్రం అంకురార్పణ, 21న ఉదయం ధ్వజారోహణం, చతుర్దశ కలశ స్నపనం, సాయంత్రం ఎదుర్కోలు, అగ్నిప్రతిష్ఠ హిరణ్యాక్ష సంహార లీల, రాత్రి శేషవాహనం, 22న ఉదయం మోహినీ ఉత్సవం, స్వామివారి కల్యాణం, 23న ఉదయం హనుమద్వాహనం, సాయంత్రం డోలోత్సవం, రాత్రి ముత్యాల పందిరి వాహనం, 24న ఉదయం సూర్యప్రభవాహనం, పూలంగిసేవ, అష్టదళ పాదపద్మారాధన, అన్నకూటోత్సవం, సాయంత్రం మహాశాంతి హోమం, రాత్రి సహస్ర దీపాలంకరణ సేవ, గజవాహనం, 25న ఉదయం రథ, చూర్ణోత్సవ, వసంతోత్సవాలు, చక్రస్నానం, సాయంత్రం ధ్వజారోహణం, పూర్ణాహుతి, శ్రీపుష్పయాగం జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

23న జాబ్ మేళా

విద్యానగర్(కరీంనగర్): నిరుద్యోగ యువతకు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 23న కరీంనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ హైదరాబాద్‌లో ట్రైనీ ఫార్మసిస్టు, ఫార్మసీ అసిస్టెంట్, రిటైల్ ట్రైనీ, పేటీఎంలో సేల్స్ ఆఫీసర్ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. అర్హత గల అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. వివరాలకు 82476 56356, 95424 47544 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కరెంటు ఉండగానే మరమ్మతులు

- హౌసింగ్‌బోర్డు కాలనీ సబ్‌స్టేషన్‌లో పైలట్ ప్రాజెక్టు విజయవంతం


సబ్‌స్టేషన్‌లో మరమ్మతులను పర్యవేక్షిస్తున్న ఎస్ఈ గంగాధర్, డీఈ రాజం

కొత్తపల్లి(కరీంనగర్): విద్యుత్ వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా విద్యుత్ శాఖ మరో ముందడుగు వేసింది. సాధారణంగా సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేపట్టే సమయంలో కరెంటు సరఫరా నిలిపివేస్తారు. కానీ, లైన్ క్లియర్(ఎల్‌సీ) తీసుకోకుండానే కరీంనగర్‌లోని హౌసింగ్‌బోర్డు కాలనీ సబ్‌స్టేషన్‌లో శనివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మరమ్మతులు చేపట్టే పైలట్ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేశారు. ఈ పనులను టీజీఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ గంగాధర్, డీఈ రాజం పర్యవేక్షించారు. ఈ విధానాన్నే సర్కిల్ పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్లలో అమలు చేస్తామని పేర్కొన్నారు. టౌన్-1 ఏడీఈ శ్రీనివాస్‌గౌడ్, టౌన్-8 ఏఈ ఫసీ అహ్మద్, ఏఈ(టెక్నికల్) శ్రీనివాస్, ఎస్ఎల్ఐ మహేందర్‌రావు, ఎల్ఐ ఇంద్రసేనారెడ్డి, లైన్‌మెన్లు ప్రకాశ్, రవీందర్, టీఆర్ఈ వింగ్, ప్రొటెక్షన్ వింగ్, టౌన్-8 సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమ ఉధృతికే మొగ్గు!

- పీఆర్సీ, డీఏల విషయంలో కాలయాపనపై ఉద్యోగుల ఆగ్రహం
- రేపటితో ముగియనున్న ప్రభుత్వానికిచ్చిన గడువు
- నేడు టీఎన్జీవో భవన్‌లో ఉద్యోగ సంఘాల సమావేశం


సమావేశమైన ఎంప్లాయీస్ జేఏసీ నేతలు (ఫైల్)

కరీంనగర్ అర్బన్: ప్రభుత్వంపై పోరుబాటకు సిద్ధమవుతున్నారు ఉద్యోగులు. ఏళ్లుగా పెండింగ్ ఉన్న డీఏలు, పీఆర్సీపై కొన్నేళ్లుగా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాలయాపన జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సమస్యలపై నాన్చివేత ధోరణిని అవలంబిస్తోందని ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీఏను ఇస్తే కానుక అంటూ ప్రకటించడం హాస్యాస్పదమని, తమకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కేనని, కానుకెలా అవుతుందన్నది వారి వాదన. ప్రధాన డిమాండ్లలో 5 డీఏలు, పీఆర్సీ ఉన్నాయి. ఈ నెల 21వ తేదీతో ప్రభుత్వానికి ఎంప్లాయీస్ జేఏసీ ఇచ్చిన గడువు ముగుస్తోంది. ఈ క్రమంలో ఆదివారం కరీంనగర్‌లోని టీఎన్జీవో భవన్‌లో అన్ని ఉద్యోగ సంఘాలు జేఏసీ జిల్లా చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశమవుతున్నాయి. భవిష్యత్తు కార్యాచరణను రూపొందించనుండగా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని భావిస్తున్నాయి.

ఐదేళ్లు గడిచినా..

ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాలంటూ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ ఇప్పటికే పలు కార్యక్రమాలు నిర్వహించింది. రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతుండగా కరెంటు బిల్లులు, ఇంటి అద్దె, డీజిల్, పెట్రోల్ ధరలు పెరిగిపోతున్నాయి అయితే, ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం(డీఏ) 6 నెలలకోసారి పెరిగిన ధరలకనుగుణంగా ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటివరకు 5 డీఏలు పెండింగ్‌లో ఉండగా, ఐదేళ్లకోసారి ఇచ్చే పీఆర్సీ ఊసేలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగుల కాంట్రిబ్యూషన్‌తో కూడిన ఎంప్లాయ్ హెల్త్ స్కీం అమలు చేయాలని గత పీఆర్సీ కమిటీ సూచించింది. ఐదేళ్లు గడిచాక మళ్లీ కమిటీ వేసి, ఏడాదైనా ఎంప్లాయీస్ హెల్త్ స్కీం మాటే మాట్లాడటం లేదని వాపోతున్నారు. ఉద్యోగుల లీవ్ సాలరీ, జీపీఎఫ్, హౌస్ బిల్డింగ్ లోన్లు, రిటైరైనవారి రిటైర్మెంట్ బెనిఫిట్స్ రెండేళ్లుగా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇవన్నీ తమకు రాజ్యాంగబద్ధంగా రావాల్సినవేనని, ఉద్యోగులకు దసరా కానుక, దీపావళి కానుక అంటూ ప్రభుత్వం ప్రకటించడం, ఇంత భారం, అంత భారమంటూ పత్రికలు రాయడం సహేతుకం కాదంటున్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరించాల్సి ఉండగా సీపీఎస్ ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ ఏడాదిగా జమ కావడం లేదని, ఈ-కుబేర్ కాకుండా ట్రెజరీ ద్వారా బిల్లులు చెల్లించాలని అంటున్నారు.

సేవలకు ఇదేనా ప్రతిఫలం?


ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా వ్యవహరిస్తున్నామని ఉద్యోగులు అంటున్నారు. విపత్కర పరిస్థితుల్లో అందరం ఒక్కరోజు వేతనం ఇస్తున్నామని, జిల్లాల విభజన క్రమంలో హెచ్ఆర్ఏ పెంచకున్నా, ఉద్యోగ ఖాళీలతో డబుల్ రోల్ పోషిచామని చెబుతున్నారు. గతంలో తమపై భౌతిక దాడులు జరిగినా విధి నిర్వహణ మరువలేదని, కరోనా సమయంలోనూ పని చేశామని, తమ సేవలకు ఇదేనా ప్రతిఫలమని ప్రశ్నిస్తున్నారు. తాము ఏ రాజకీయ పక్షానికి అనుకూలం కాదని, తమ కష్టాలు, కన్నీళ్లు ఎవరు తుడుస్తారో వారిని కడుపులో పెట్టుకుంటామని పేర్కొంటున్నారు.

నాన్చివేత ధోరణి సరికాదు



ఉమ్మడి రాష్ట్రంలో పోరాటమే. స్వరాష్ట్రంలోనూ పోరాటమేనా? తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యోగులకు బాసటగా ఉంటామన్న వారే ఇప్పుడు నాన్చివేత ధోరణి అవలంబించడం సరికాదు. మేము గొంతెమ్మ కోరికలు కోరడం లేదు. మాకు రావాల్సినవి ఇవ్వాలంటే ఎందుకింత నిర్లక్ష్యం చేస్తున్నారో చెప్పాలి.
– దారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా చైర్మన్

ఉద్యోగులకు తీరని అన్యాయం



ఎప్పుడో పీఆర్సీ ఇవ్వాల్సి ఉండగా కాలయాపన చేస్తున్నారు. ఉద్యోగుల ఓపికను పరీక్షించడం ప్రభుత్వానికి తగదు. ఉద్యోగులను బిడ్డల్లా చూసుకోవాల్సిందిపోయి తీరని అన్యాయం చేస్తున్నారు. డీఏల ప్రకారం మా వేతనాలు పెరగాలి. కానీ, డీఏలే ఇవ్వడం లేదు. ఇలాగైతే మాకు పోరుబాటే శరణ్యం.
– సంగెం లక్ష్మణరావు, టీఎన్జీవోల సంఘం జిల్లా కార్యదర్శి

క్లుప్తంగా

మాట నిలబెట్టుకున్న కేంద్ర మంత్రి



ఆలయ పరిసరాల్లోని నీటిలో బోటు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు బ్యాక్ వాటర్‌లో బోయినిపల్లి మండలం వరదవెల్లి గుట్టపై గల దత్తాత్రేయస్వామి ఆలయానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ బోటు సమకూరుస్తానన్న హామీని నిలబెట్టుకున్నారు. శనివారం బోటును వరదవెల్లిలో ఆలయ పరిసరాలకు తీసుకువచ్చారు. గతేడాది డిసెంబర్‌లో దత్తాత్రేయస్వామి ఆలయంలో జరిగిన ఉత్సవాలకు ఎంపీ హోదాలో బండి సంజయ్‌కు మార్ వచ్చారు. మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్ ఉండడంతో ఆలయానికి వెళ్లేందుకు ఇబ్బంది అవుతుందని ఎంపీకి భక్తులు వివరించగా, బోటు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జరిగిన ఎంపీ ఎన్నికల్లో విజయం సాధించడంతో పాటు మంత్రి అయ్యారు. ఈ క్రమంలో బోటు సౌకర్యం కోసం సుమారు రూ.10.60 లక్షలు కేటాయించగా హైదరాబాద్‌లో తయారు చేయించారు. బోటు నిర్మాణం పూర్తి కావడంతో ఆలయానికి తీసుకువచ్చారు. శనివారం నీటిలో ట్రయల్‌రన్‌తో గుట్ట పైకి భక్తులు వెళ్లి పూజలు చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ విష్ణువర్ధన్, భక్తులు ఉన్నారు. కాగా త్వరలో బోటు ప్రారంభించేందుకు కేంద్ర మంత్రి వస్తారని స్థానిక నాయకులు పేర్కొన్నారు.

అలరించిన మెరిమెంట్ షో



డ్యాన్సు చేస్తున్న విద్యార్థులు

కరీంనగర్‌రూరల్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడంలో ఎల్లప్పుడూ ముందుండే బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం రాత్రి నిర్వహించిన మెరిమెంట్ షో ఆకట్టుకుంది. బొమ్మకల్‌లోని స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లోని అంతర్గత శక్తులను వెలికితీసేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి. ఆటపాటలతో ఉర్రూతలూగించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు సైతం జోడి సమయం, భోజన పోటీలు నిర్వహించారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ప్రిన్స్‌పాల్ బబితావిశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

అడ్వెంచర్ క్యాంపునకు ఎంపిక

కరీంనగర్‌సిటీ: హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో ఈనెల 22 నుంచి 31 వరకు అటల్ బిహారి వాజ్‌పేయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటనీరింగ్ అండ్ ఎలైట్ స్పోర్ట్స్ నిర్వహించే అడ్వెంచర్ క్యాంపునకు శాతవాహన యూనివర్సిటీ జాతీయ సేవా పథకం విభాగానికి చెందిన 10 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఎంపికైనట్లు ప్రోగ్రాం అధికారి పడాల తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన వలంటీర్లను యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ మనోహర్ అభినందించారు.

పట్టించుకుంటే.. పర్యాటకమే

- అభివృద్ధికి నోచుకోని, ఆదరణ కరువైన కట్టడాలెన్నో..
- పేరుగాంచిన ఆలయాల వద్ద సౌకర్యాలలేమి
- కొన్నిచోట్లకు రవాణా సౌకర్యమూ లేదు
- పర్యాటకులు, భక్తుల ఇబ్బందులు
- ప్రభుత్వం చొరవ చూపితే ఉమ్మడి జిల్లాకు పర్యాటక శోభ

'ఎలగందుల'.. కళావిహీనమైన వేళ



చిరిగిపోయిన సౌండ్ అండ్ లైట్ షో స్క్రీన్

కొత్తపల్లి(కరీంనగర్): గత కాలపు చరిత్రకు సజీవ సాక్ష్యంగా ఎలగందుల ఖిల్లా నిలుస్తోంది. కాకతీయులు, కుతుబ్‌షాహీల శిల్పకళా వైభవానికి ఇక్కడి కట్టడాలు ప్రతీక. ఈ ఖిల్లా 200 అడుగుల ఎత్తు, 2.5 మైళ్ల విస్తీర్ణంలో మానేరు నదిని ఆనుకొని, విస్తరించింది. కాకతీయులు, బహమనీలు, కుతుబ్‌షాహీలు, మొగులులు, అసఫ్‌జాహీలు ఈ కోట కేంద్రంగా పరిపాలన సాగించారు. బహుధాన్యపురంగా పిలవబడే నేటి ఎలగందుల నాడు చెన్నూరు, జగిత్యాల, జమ్మికుంట, లక్షెట్టిపేట, సిద్దిపేట, మహదేవపూర్, సిరిసిల్ల, సుల్తానాబాద్, కరీంనగర్ తాలుకాలతో జిల్లా కేంద్రంగా విరాజిల్లింది. ఖిల్లాలో నిర్మితమైన నీలకంఠ స్వామి, లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలు, మసీదు హిందూముస్లింల ఐక్యతకు చిహ్నంగా నిలుస్తున్నాయి. ప్రభుత్వాలు అరకొర నిధులు కేటాయిస్తుండటంతో ఈ ఖిల్లా ప్రస్తుతం అభివృద్ధికి నోచుకోక, ఆదరణ కరువై కళావిహీనంగా మారింది. పర్యాటకులను ఆకర్షించేందుకు, ఎలగందుల గత వైభవాన్ని కళ్లకు కట్టినట్లు రూపొందించిన 40 నిమిషాల సినిమా ప్రదర్శించేందుకు రూ.3.13 కోట్లతో సౌండ్ అండ్ లైట్ షో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది మూలన పడింది. ఇక్కడికి రావాలనుకునేవారికి సరైన రవాణా సౌకర్యం లేదు. ఖిల్లా పిచ్చిమొక్కలు, గడ్డితో నిండిపోయింది. సర్కారు దృష్టిసారిస్తే పర్యాటకులతో సందడిగా మారుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

'రామునిగుండాల'కు.. అటవీ భూములే అడ్డంకి



రామునిగుండాల

రామగుండం: పట్టణ పరిధిలోని రామునిగుండాలలో రామలక్ష్మణులు సంచరించిన ఆనవాళ్లు ఉన్నాయి. ఈ కొండపై 108 గుండాలున్నాయి. గుట్టపై 200 ఫీట్ల లోతు, 50 ఫీట్ల వెడల్పుతో ఓ లోయ ఉంది. లోయకు పైభాగాన ఉన్న బావిలో సీతాదేవి స్నానమాచరించిందని ప్రతీతి. రాముడు ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు పాద ముద్రికల స్థానంలో ఏర్పడిన గుంతలు గుండాలుగా మారి, రామగుండంగా పేరు వచ్చిందంటారు. ఈ గుండాలన్నింటిలో అన్ని కాలాల్లో నీరు సమృద్ధిగా ఉండటం విశేషం. లోయ మధ్యలో సొరంగ మార్గం ఉంది. దీన్ని యమకోణం అంటారు. ఇక్కడ నిత్యం నీరు ప్రవహిస్తుంటుంది. ఇందులో స్నానం చేస్తే యమలోక బాధలుండవని భక్తుల నమ్మకం. 2007లో మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ రామునిగుండాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఇస్కాన్ సంస్థను సంప్రదించారు. రూ.200 కోట్లతో హైదరాబాద్‌లోని బిర్లా మందిర్ మాదిరిగా దేవాలయం నిర్మించాలనుకున్నారు. కానీ, అటవీ భూములు అడ్డంకిగా మారడంతో ఇస్కాన్ సంస్థ విముఖత చూపింది. దీంతో పర్యాటకం మరుగున పడినట్లయింది. ప్రభుత్వంతోపాటు ఫారెస్టు అధికారులు సహకరిస్తే బాగుంటుందని పట్టణ ప్రజలు అంటున్నారు. రామగుండాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అరకొర వసతుల నాంపల్లి గుట్ట



నాంపల్లి గుట్టపై కాళీయమర్దనం

వేములవాడ అర్బన్: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన నాంపల్లి గుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. రాజన్నను దర్శించుకున్న చాలామంది ఇక్కడి స్వామివారికి పూజలు చేస్తారు. గుట్టపై పచ్చని చెట్ల మధ్య కాళీయమర్దనం ఆకట్టుకుంటుంది. గుట్ట పైనుంచి చూస్తే ఎడమవైపు వేములవాడ రాజన్న ఆలయం, మూలవాగు తీరం, కుడివైపు నిండుకుండను తలపించే మిడ్‌మానేరు ప్రాజెక్టు కనువిందు చేస్తాయి. ప్రభుత్వాలు మారినా లక్ష్మీనరసింహస్వామి ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఏడాదికి కోటికి పైగా ఆదాయం వస్తున్నా అరకొర వసతుల మధ్య భక్తులు ఇబ్బంది పడుతున్నారు. చెట్ల కింద వంటలు చేసుకున్నా.. తినాలంటే కోతుల బెడద ఉందని అంటున్నారు. ప్రభుత్వం వసతులు కల్పించాలని కోరుతున్నారు. గత ప్రభుత్వంలో ఆలయ అభివృద్ధికి అధికారులు ప్రతిపాదనలు పంపించినా పనులు మాత్రం ప్రారంభించలేదు.

నిలిచిన కోటిలింగాల-ఎల్లంపల్లి బోటింగ్



ఎల్లంపల్లి ప్రాజెక్టు



కోటిలింగాలలో నిరూపయోగంగా బోటు (ఫైల్)

రామగుండం: గత ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం టూరిస్ట్ సర్క్యూట్ అభివృద్ధికి రూ.750 కోట్లు కేటాయించి, అందులో ఎల్లంపల్లి ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేసి, బోటింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వెలటూర్ మండలంలోని కోటిలింగాల నుంచి ఎల్లంపల్లి వరకు(20 కిలోమీటర్లు) గోదావరి నీటిలో బోటింగ్‌ను ప్రారంభించారు. కానీ, సాంకేతిక కారణాలతో అది నిలిచిపోయింది. బోటింగ్ కోసం కొనుగోలు చేసిన పులోమావి బోట్-30 సీట్లు, శాతకర్ణి-50 సీట్లు, స్పీడ్ బోట్-5 సీట్లు కోటిలింగాల దేవాలయ ప్రాంగణంలోని గోదావరి నీటిలో పార్కింగ్ చేసి, ఉంటారు. బోట్లు నిరుపయోగంగా మారడంతో పర్యాటకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం దృష్టిసారించి, ఎల్లంపల్లి వద్ద ఉద్యానవనాలు, పూలు, పండ్ల తోటలు పెంపకానికి, స్నాక్స్ స్టాల్స్ ఏర్పాటు, తాగునీటి వసతి, గోదావరి అందాలను కూర్చొని తిలకించేందుకు ప్లాట్‌ఫామ్స్ ఏర్పాటుకు కృషి చేస్తే పండుగలు, వీకెండ్, సెలవు రోజుల్లో పర్యాటకుల తాకిడి పెరిగి, ఆదాయం సమకూరుతుందని పలువురు అంటున్నారు.

మధ్యమానేరులో దత్తాత్రేయస్వామి



వరదవెల్లి దత్తాత్రేయస్వామి ఆలయం

బోయినపల్లి(చొప్పదండి): మధ్యమానేరు బ్యాక్ వాటర్‌లో బోయినపల్లి మండలం వరదవెల్లి గుట్టపై స్వయంభూగా వెలిశారు గురుదత్తాత్రేయస్వామి. ఇక్కడి ఆలయ పరిసరాల్లో పచ్చదనం పరుచుకుంది. గుట్టపై గ్రామస్తులు దత్త మందిరం నిర్మించారు. ఇక్కడ ఒకేసారి 300 జంటలు సామూహిక దత్తసత్య వ్రతాలు చేసే వీలుంది. 20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ గుట్టపై ఏటా డిసెంబర్‌లో దత్త జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. చుట్టూ నీరే ఉండటంతో అక్కడికి వెళ్లడం కష్టం. ఉత్సవాల సమయంలో అధికారులు రెండు బోట్లు సమకూరుస్తారు. బోట్లలో వెళ్లినవారు గుట్టపైకి చేరాలంటే 100 వరకు మెట్లు ఉన్నాయి. మిగతా రోజుల్లో భక్తులు వెళ్లాలనుకున్నా వెళ్లలేరు. వంతెన నిర్మించి, ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు. గతేడాది దత్త జయంతి ఉత్సవాలకు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తదితరులు బోటులో వచ్చి, స్వామివారికి పూజలు చేశారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు వంతెన నిర్మాణం కోసం సర్వే చేయాలని మిడ్‌మానేరు ఇంజినీరింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. సర్వే చేసి, డిజైన్ కోసం సీఈ సీడీవో కార్యాలయానికి పంపినట్లు అధికారులు తెలిపారు.


'కొత్తగట్టు'లో.. అసంపూర్తి పనులు



మత్స్యగిరీంద్రస్వామి ఆలయం

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి ఆలయం కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి పక్కనే ఉంటుంది. ఇక్కడి గుట్టపై మత్స్యగిరీంద్రస్వామివారు వెలిశారు. 2002కు ముందు బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు దర్శించుకునే వారు. గుట్టపైకి అప్పటి రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి ఘాట్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. దీంతో పనులు పూర్తయి, వాహనాలు గుట్టపైకి వెళ్తున్నాయి. భక్తుల సహకారంతో ఆంజనేయస్వామి, పోచమ్మ ఆలయాలు నిర్మించారు. ప్రాకారం, కల్యాణం మండపం, రాజగోపురం నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉంది. ఏటా బ్రహ్మోత్సవాకు రూ.10 లక్షలకు పైనే ఆదాయం వస్తోంది. వేములవాడ, కొండగట్టు, ధర్మపురి ఆలయాలకు ఈ దారిలో వెళ్లేవారు మత్స్యగిరీంద్ర స్వామివారిని దర్శించుకుంటున్నారు. కరీంనగర్ పట్టణం నుంచి 30 కి.మీ. దూరంలో ఉన్న విష్ణుమూర్తి అవతారమైన మత్స్యగిరీంద్రస్వామి ఆలయం తెలంగాణలో ఏకైక దేవాలయం కావడం విశేషం. అసంపూర్తి పనులు పూర్తి చేసి, ఆలయాన్ని అభివృద్ధి చేస్తే పర్యాటక శోభ సంతరించుకుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అన్నపూర్ణ ప్రాజెక్టుకు అన్ని అర్హతలు



అనంతగిరి అన్నపూర్ణ ప్రాజెక్టు

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని అనంతగిరి అన్నపూర్ణ ప్రాజెక్టుకు టూరిస్ట్ స్పాట్‌గా మార్చేందుకు అన్ని అర్హతలున్నాయి. ఈ జలాశయం నీటి సామర్థ్యం 3.5 టీఎంసీలు. దీని చుట్టూ కొండలున్నాయి. ప్రాజెక్టు పక్కనే ఉన్న పట్నంగుట్ట ఎంతో ప్రసిద్ధి. గుట్టపై రాజులు పరిపాలించిన ఆనవాళ్లు ఉన్నాయి. రాతి దర్వాజాలు, పెద్ద బావి, రెండు కుంటలు కూడా ఉన్నాయి. ఇక్కడి ధోనిలో ఎండాకాలంలోనూ నీరు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. జలాశయం పక్కన 92 మీటర్ల లోతు, 56 మీటర్ల వైశాల్యం గల సర్జిపూల్ ఉంది. గ్రామంలోని ముత్యాల పోచమ్మ ఆలయానికి ప్రతీ బుధ, గురు, ఆదివారాల్లో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఇక్కడ పర్యటించిన సందర్భంగా అనంతగిరి ప్రాజెక్టును టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

త్రికూటాలయం.. నిధులు జాప్యం



చెన్నకేశవనాథ ఆలయంలో పంచముఖ లింగం

రాయికల్(జగిత్యాల): పట్టణంలోని చెన్నకేశవనాథ త్రికూటాలయాన్ని కాకతీయ రాజుల కాలంలో నిర్మించారు. దేశంలోనే రెండో పంచముఖ లింగం ఇక్కడ ఉంది. ఈ ఆలయ అభివృద్ధికి గత ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసింది. కానీ, నిధుల విడుదలలో తీవ్ర జాప్యంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. కేవలం రూ.30 లక్షలు విడుదలవడంతో ఆలయ ఆవరణలో కల్యాణ మండపం, షెడ్డు నిర్మాణం పూర్తయ్యాయి. సీసీరోడ్లు, కాంపౌండ్ వాల్, ఆఫీస్ రూంలు, బాత్‌రూం పనులు చేపట్టాల్సి ఉంది. మిగతా నిధులు విడుదలయ్యేందుకు, నిర్మాణాలు పూర్తి చేసేందుకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చొరవ చూపాలని ఆలయ కమిటీ చైర్మన్ తుమ్మల సదాశివరెడ్డి కోరుతున్నారు. ఈ అంశాన్ని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని, పర్యాటకంగానూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు తెలిపారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి



గెలుపొందిన కరీంనగర్ బాలికల జట్టు

సుల్తానాబాద్(పెద్దపల్లి): చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే ఉన్నత విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు పుష్కలంగా ఉంటాయని డీవైఎస్‌వో సురేశ్, ఎస్సై శ్రవణ్‌కుమార్ అన్నారు. శనివారం సుల్తానాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అండర్-17 ఎస్జీఎఫ్ పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల బాలబాలికల వాలీబాల్ పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. పోటీల్లో బాలుర విభాగంలో రాజన్న సిరిసిల్ల జట్టు ప్రథమ, జగిత్యాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో కరీంనగర్ ప్రథమ, రాజన్న సిరిసిల్ల ద్వితీయ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన జట్లకు బహుమతులను ప్రదానం చేశారు. స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, సాయిరి మహేందర్, భాస్కర్, లక్ష్మణ్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, వేల్పుల సురేందర్, దాసరి రమేశ్, ప్రసాద్, అమిరిశెట్టి తిరుపతి, బైరి రవీందర్‌గౌడ్, అంతటి శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో తలపడుతున్న కరీంనగర్, సిరిసిల్ల జట్లు

జోయాలుక్కాస్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్



నగలను సందర్శిస్తున్న చైర్‌పర్సన్, మహిళలు

జగిత్యాల: జగిత్యాల విరూపాక్షి గార్డెన్స్‌లో శనివారం జోయాలుక్కాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ మేళాను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయి జూయెల్లరీ జిల్లా కేంద్రంలో దొరుకుతుందని.. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మూడురోజుల పాటు ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్, తెలంగాణ రీజినల్ మేనేజర్ రతీశ్ తదితరులు పాల్గొన్నారు.

'కల్లోలిత' చట్టానికి 46 ఏళ్లు!

- ఉద్యమాల ఖిల్లా.. సిరిసిల్ల..
- రైతుకూలీ సంఘం పోరాటాలు
- పోలీసులకు విశేష అధికారాలు

సిరిసిల్ల: ఉమ్మడి రాష్ట్రంలో తొలిసారి సిరిసిల్ల, జగిత్యాల ప్రాంతాలను 1978 అక్టోబరు 20న కల్లోలిత ప్రాంతాలుగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. పోలీసులకు రాజ్యాంగంలో లేని విశేష అధికారాలు కట్టబెట్టి ప్రజా ఉద్యమాలను అణచివేసేందుకు ఆ చట్టాలను తెచ్చింది. ఈ చట్టాలను పోలీసులు అలుసుగా తీసుకుని ప్రజలపై ఉక్కుపాదం మోపుతూ వందలాది మందిని జైలుకు పంపించారు. సరిగ్గా నేటికి 46 ఏళ్ల క్రితం కల్లోలిత ప్రాంత చట్టాలు అమలులోకి వచ్చాయి. నాటి ప్రజా ఉద్యమాలు, పాలకుల తీరుతెన్నులపై ప్రత్యేక కథనం.



సాయుధ పోలీసు బలగాల కవాతు(ఫైల్)



సాయుధ నక్సలైట్లకు శిక్షణ (ఫైల్)

వెట్టిచాకిరీ విముక్తి పోరాటం

సిరిసిల్ల, జగిత్యాల ప్రాంతాల్లో భూస్వామ్య వ్యవస్థ ఉండేది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూములు, చెలకలు అన్నీ ఇద్దరుముగ్గురు దేశాయిలు, దేశ్‌ముఖ్‌లు, భూస్వాముల ఆధీనంలో ఉండేవి. ఆ భూముల్లో ఊరంతా వ్యవసాయ పనులు (కూలీ) చేయాల్సి ఉండేది. అది కూడా దొర ఎంత ఇస్తే అంత తీసుకుంటూ పొద్దంతా వెట్టిచాకిరీ చేయాల్సి వచ్చేది. ఆంధ్రప్రదేశ్‌లో కొండపల్లి సీతారామయ్య, చంద్ర పుల్లారెడ్డి, తరిమెల నాగిరెడ్డి నాయకత్వంలో రైతు కూలీ సంఘం నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ దశలో రాజన్నసిరిసిల్ల జిల్లాలోని వేములవాడకు చెందిన కూర రాజన్న ఉస్మానియా యూనివర్సిటీలో బీఈ చదువుతూ గోల్డ్‌మెడల్ సాధించాడు. సమాజంలోని అసమానతలపై జార్జిరెడ్డితో కలిసి తిరుగుబాటు జెండా ఎగురవేశారు. 'విద్యార్థులారా.. పల్లెలకు తరలండి' అనే నినాదంతో రాజన్న అతడి స్నేహితులు సిరిసిల్ల ప్రాంతంలోని కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చేరారు. ఇదే జిల్లాలోని చందుర్తి మండలం తిమ్మాపూర్‌కు చెందిన జేవీ చలపతిరావు సైతం ప్రజాఉద్యమంలో భాగంగా ప్రజలను చైతన్యవంతులను చేశారు. భూస్వామ్య వ్యతిరేక పోరాటం సాగిస్తూ వెట్టిచాకిరీ విముక్తి కోసం ఉద్యమాలు నిర్మించారు.

దున్నేవాడిదే భూమి నినాదంతో..

నిమ్మపల్లిలో భూస్వామికి వ్యతిరేకంగా రైతుకూలీ సంఘం మొదలైంది. కానీ అప్పటికే భూస్వామి వద్ద బలమైన ప్రైవేటు సైన్యం ఉండేది. సదరు భూస్వామి వద్ద ఎవరూ వెట్టిచాకిరీ చేయొద్దు అని రైతుకూలీ సంఘం పిలుపునివ్వడంతో దొరభూములు పడావులు పడ్డాయి. భూస్వామికి చెందిన భూముల్లో ఎర్రజెండాలు పాతి, ఎక్కడికక్కడ కూలీలు సాగుచేశారు. దీంతో ఆగ్రహించిన దొర అప్పట్లోనే ట్రాక్టర్ కొనుగోలు చేసి భూమిని సాగు చేశాడు. ఆ భూములు తమవని, భూసంస్కరణల్లో భాగంగా తమకు ఇచ్చారని రైతుకూలీలు తిరుగుబాటు చేశారు. ఈక్రమంలో భూస్వామి ట్రాక్టర్‌తో తొక్కించడంతో ఓ కూలీ పొలంలోనే మృత్యువాత పడ్డాడు. దీంతో ప్రజాగ్రహానికి దొర ఊరు వీడాల్సి వచ్చింది. నిమ్మపల్లిలో పోలీస్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఇక్కడి రైతు కూలీల పోరాట స్ఫూర్తి జిల్లా అంతటా పాకింది. చెక్కపల్లి, తిమ్మాపూర్, కొదురుపాక ఇలా దున్నేవాడిదే భూమి నినాదం విస్తరించింది. ఈ ప్రజాఉద్యమానికి కూర రాజన్న, జేవీ చలపతిరావు నాయకత్వం వహించారు.

జగిత్యాల జైత్రయాత్ర

1978 సెప్టెంబరు 9న జగిత్యాలలో నిర్వహించిన రైతుకూలీ సంఘం సమావేశం ఉప్పెనలా మారింది. ఎలాంటి సమాచార వ్యవస్థ లేని ఆ రోజుల్లో 10వేల మంది రైతు కూలీలు జగిత్యాల వీధుల్లో కవాతు నిర్వహించారు. నాటి సభలో ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి, మల్లోజుల కోటేశ్వర్‌రావు, నల్లా ఆదిరెడ్డి, గద్దర్, వరవరరావు ప్రసంగించారు. జగిత్యాల జైత్రయాత్ర విప్లవోద్యమానికి స్ఫూర్తిగా నిలిచింది. భూస్వాములు, దేశాయిలు, దేశ్‌ముఖ్‌లు, రెడ్డిదొరలు ఊరు వీడాల్సిన పరిస్థితులు వచ్చాయి.

కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటన

జగిత్యాల, సిరిసిల్ల ప్రాంతాల్లో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులు, ఊరు వీడిన దొరలు హైదరాబాద్, కరీంనగర్‌కు మకాం మార్చారు. ఈ నేపథ్యంలో ఇక్కడి వాస్తవ పరిస్థితులను గమనించిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించారు. దీంతో ఐపీసీ సెక్షన్-7తో పోలీసులకు విశేష అధికారాలు కట్టబెడుతూ ఆదేశాలు జారీ అయ్యాయి. అప్పటికే బోయినపల్లిలో ఓ భూస్వామి మెడలో చెప్పుల దండవేసి రైతు కూలీ సంఘం ఊరేగించింది. భూస్వాముల గడీలకు తాళాలు పడ్డాయి. నాటి పరిస్థితులతో సాయుధ నక్సలైట్ ఉద్యమాలకు బాటలుపడ్డాయి. ఇన్‌ఫార్మర్ల పేరిట హత్యలు, ఎన్‌కౌంటర్ల పేరిట కాల్పులు, నిత్య నిర్బంధం, అణచివేతలు, పోలీసు కేసులు, సామూహిక సరెండర్లు, నిమజ్జనాలతో నక్సలైట్ ఉద్యమాలు బలహీనపడ్డాయి. కాలక్రమంలో కల్లోలిత ప్రాంత చట్టాలను రద్దు చేశారు. 2006 నాటికి సిరిసిల్ల, జగిత్యాల ప్రాంతంలో కల్లోల పరిస్థితులు కనుమరుగయ్యాయి.

కల్లోలిత ప్రాంతాల ప్రకటన భూస్వామ్య అనుకూలం



46 ఏళ్ల క్రితం ప్రజలను ప్రాథమికంగా చైతన్యవంతులను చేస్తున్న దశ అది. భూస్వాములకు అనుకూలంగా ప్రభుత్వం సిరిసిల్ల, జగిత్యాల ప్రాంతాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించింది. అది ఈ రెండు ప్రాంతాలకే పరిమితం చేయకుండా, తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాలకు విస్తరించారు. పోలీసులు నన్ను అక్రమంగా అరెస్ట్ చేసి సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఉంచితే, వేలాది మంది ప్రజలు స్టేషన్ పైనే దాడి చేశారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆవునూర్‌కు చెందిన పేద రైతు జక్కుల ఎల్లన్న మరణించాడు. ఎన్ని నిర్బంధాలు వచ్చినా బలమైన ప్రజాఉద్యమాన్ని నిర్మించి పీడిత ప్రజలకు విముక్తి కల్పించాం.

– జేవీ చలపతిరావు, సీపీఐ(ఎంఎల్) జనశక్తి ఉద్యమకారుడు

పౌర హక్కులను కాలరాశారు



పేద ప్రజలను భూస్వాములు వేధిస్తుంటే ప్రభుత్వాలు వారికే మద్దతు పలికాయి. రైతుకూలీ సంఘంగా ఏర్పడి తిరుగుబాటు చేస్తే పోలీసు నిర్బంధాన్ని ప్రయోగించారు. దొరలు, భూస్వాములకు అండగా నిలిచారు. ప్రజలు మాత్రం సంఘటితమై పోరాటం చేశారు. పౌరహక్కుల నేతలు వాస్తవాలను తెలుసుకునేందుకు, నిజనిర్ధారణకు వస్తే ఎల్లారెడ్డిపేట మండలంలోని ఓ పల్లెలో భూస్వామి తన అనుచరులతో వారిని బందెల దొడ్డిలో బంధించాడు. పోలీసులు వచ్చి వారిని విడిపించారు. అప్పట్లో వారి ఆగడాలు దారుణంగా ఉండేవి. ప్రజా ఉద్యమాలదే అంతిమ విజయమని సిరిసిల్ల పోరాటం రుజువు చేసింది.

– కూర రాజన్న, సీపీఐ(ఎంఎల్) జనశక్తి వ్యవస్థాపకుడు

యోగాతో మనస్సుకు ఆహ్లాదం


పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ఎడవెల్లి విజయేందర్‌రెడ్డి

కరీంనగర్‌కల్చరల్: యోగా మనస్సును ఆహ్లాద పరుస్తుందని, సమాజంలో అందరూ భాగస్వాములై యోగాన్ని అభ్యాసం చేయాలని సినారె పురస్కార కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎడవెల్లి విజయేందర్‌రెడ్డి అన్నారు. శనివారం సమైక్య సాహితీ ఆధ్వర్యంలో యోగా సంపత్‌కుమార్ రూపొందించిన 'విశ్వ మంగల యోగా, ఒంటికి యోగా మంచిదేగా' పుస్తకాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఒక కరాటే మాస్టర్ నుంచి యోగాపై అనేక ప్రస్థానాల ద్వారా తన పుస్తకాలను తీసుకరావడం చాలా గొప్ప విషయమన్నారు. ఆహారాన్ని జాగ్రత్తగా తీసుకుంటే చక్కటి ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమైక్య సాహితీ అధ్యక్ష, కార్యదర్శులు మాడిశెట్టి గోపాల్, కేఎస్ అనంతాచార్య, రామకృష్ణ, నాగేంద్రశర్మ, ప్రమోద్, గుండు రమణయ్య, తదతరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోండి



మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

కరీంనగర్‌కల్చరల్: విద్య అంటే చదువు ఒక్కటే కాదు.. సర్వతో ముఖాభివృద్ధి కొరకు ఒక కళను తప్పనిసరిగా నేర్చుకోవాలని, విద్యార్థులు జీవన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సమగ్ర శిక్ష క్వాలిటీ కో ఆర్డినేటర్ కర్ర అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం ఫిలింభవన్‌లో రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థ ఆదేశాల మేరకు రోల్ ప్లే పోటీలు నిర్వహించారు. చదువుతో పాటు కళల్లో కూడా విద్యార్థులు భాగస్వామ్యం కావాలని అన్నారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి కేజీబీవీ తిమ్మాపూర్, రెండో బహుమతి టీజీఎంఎస్ ముల్కనూర్, తృతీయ బహుమతి కేజీబీవీ రామడుగు గెలుపొందారు. కేజీబీవీ తిమ్మాపూర్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలను ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో సైన్స్ అధికారి చాడ జయపాల్ రెడ్డి, జడ్జీలుగా సరిత, మారం స్వదేశీ కుమార్, కేఎస్.అనంతాచార్య, తదితరులు పాల్గొన్నారు.


నగరంలోని 26వ డివిజన్ పరిధి కిసాన్‌నగర్, అశోక్‌నగర్‌ల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. రోడ్లు, వీధుల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. ఇండ్లల్లో నుంచి బయటకు రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. కుక్కల బెడదను అధికారులు నియంత్రించాలి.
– రాకేశ్, 26వ డివిజన్, కరీంనగర్

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీనివాస్, పశువైద్యాధికారి, 89854 23100

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 94400 77555

క్లుప్తంగా

'పొన్నం'కు అభినందన



కరీంనగర్: కొత్తపల్లి–హుస్నాబాద్ నాలుగు లైన్ల రోడ్ల విస్తరణకు రూ.77.20 కోట్లు నిధులు మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శనివారం హైదరాబాద్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి కలిసి సత్కరించి అభినందించారు. నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని మంత్రిని కోరారు. సీపీఐ సిద్దిపేట సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మంద పవన్, నాయకులు గుంటి వేణు పాల్గొన్నారు.

చెక్కులు అందజేత


చెక్కులు అందిస్తున్న అడిషనల్ డీసీపీ

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్‌లో పనిచేస్తూ అనారోగ్య కారణాలతో మృతిచెందిన పోలీసుల కుటుంబ సభ్యులకు శనివారం అడిషినల్ డీసీపీ ఎ.లక్ష్మీనారాయణ చెక్కులు అందజేశారు. కె.లింగారెడ్డి సీసీఆర్‌బీలో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతిచెందగా రూ.16 లక్షలు, ఏఆర్ విభాగంలో పనిచేసే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ అనారోగ్యంతో మరణించగా రూ.8 లక్షలు, ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తూ గుండెపోటుతో చనిపోయిన కుమారస్వామి కుటుంబ సభ్యులకు రూ.8 లక్షలు భద్రతా విభాగం నుంచి మంజూరయ్యాయి. సదరు మొత్తాన్ని చెక్కుల రూపంలో వారి కుటుంబ సభ్యులకు అందించారు. సీపీవో జూనియర్ అసిస్టెంట్ కళ్యాణి, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



కరీంనగర్‌కల్చరల్: బలగం సినిమా ఫేమ్ కొమురమ్మకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ రూ.లక్ష ఆర్థికసాయం చేశారు. శనివారం మినిస్టర్ క్వార్టర్స్‌లోని తన నివాసంలో పొన్నం రవిచంద్రతో కలిసి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా తనకు పెన్షన్ ఇప్పించాలని కొమురమ్మ కోరగా సంబంధిత మంత్రి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడి ఇప్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఉపాధిహామీ గ్రామసభలు



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బహదూర్‌ఖాన్‌పేట, ఫకీర్‌పేట, ఇరుకుల్ల, మందులపల్లి గ్రామాల్లో శనివారం ఉపాధిహామీ పనులను గుర్తించడంపై గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో చేపట్టబోయే పనులపై చర్చించి తీర్మానం చేశారు. ఈ గ్రామసభల్లో మాజీ సర్పంచ్ కటకం నందయ్య, ప్రత్యేక అధికారులు నళినీకాంత్, వైశాలితో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధికూలీలు పాల్గొన్నారు.

జగపతిరావుకు నివాళి

కరీంనగర్ కార్పొరేషన్: సీనియర్ కాంగ్రెస్ నేత, దివంగత వెలిచాల జగపతిరావు వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన నివాసంలో పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కొడూరి సత్యనారాయణగౌడ్, ఆరెపల్లి మోహన్, నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి, వహాజొద్దీన్, తిరుపతిగౌడ్, వైద్యుల అంజన్‌కుమార్, కార్పొరేటర్లు సరిళ్ల ప్రసాద్, చాడగొండ బుచ్చిరెడ్డి, నేతికుంట యాదయ్య, కోటగిరి భూమాగౌడ్, నాయకులు కాశెట్టి శ్రీనివాస్, గంట శ్రీనివాస్, ఆకుల ప్రకాశ్, ఆకుల నర్సయ్య, పిట్టల శ్రీనివాస్, మెండి చంద్రశేఖర్, అర్ష మల్లేశం, నడిపెల్లి అశోక్‌రావు, తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాల మార్పులో మతలబేమిటో..!

- ప్యాక్స్ నుంచి ఐకేపీకి ధాన్యం కొనుగోలు కేంద్రాలు మార్పు?
- ఇదెక్కడి అన్యాయమంటున్న ప్యాక్స్ నేతలు

కరీంనగర్ అర్బన్: సహకార సంఘాల బలోపేతానికి చర్యలు చేపట్టాల్సిన యంత్రాంగం రిక్తహస్తం చూపుతుండటం అనుమానాలకు తావిస్తోంది. ఏళ్లగా ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్యాక్స్ కేంద్రాలను కాదని ఐకేపీకి కట్టబెట్టేందుకు దాదాపు రంగం సిద్ధమైనట్లు సమాచారం. అసలే పరిస్థితి అంతంత మాత్రమే ఉన్న ప్రాథమిక సహకార సంఘాలకు ఆదాయ వనరుతో పాటు రైతులకు సేవ చేసే పరిస్థితిని దూరం చేస్తుండటం విడ్డూరం. కొన్నేళ్లుగా వానాకాలం, యాసంగి సీజన్లలో ప్యాక్స్, ఐకేపీ, డీసీఎంఎస్‌ల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. అయితే పలువురు అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ కొనుగోలు కేంద్రాలను ఇష్టారీతిగా మార్చుతున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్యాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొన్నింటిని ఐకేపీకి మార్చడం గమనార్హం. ఎలాంటి ఆరోపణలు లేకున్నా, అవకతవకలు జరగకపోయినా వేరే వారికి ఎలా అప్పగిస్తారన్న వాదనలు వినిపిస్తున్నాయి. మానకొండూరు నియోజకవర్గంలో రంగపేట, పోచంపల్లి, కల్లెడ, లింగాపూర్, పచ్చునూరు, ఊటూరు గ్రామాల్లో ప్యాక్స్ ధాన్యం కొనుగోలు చేసేది. కానీ ఈ సారి ఐకేపీకి అప్పగించారని విశ్వసనీయ సమాచారం. సదరు ప్రాంతాల్లో ప్యాక్స్ రైతులకు ఎప్పటికప్పుడు సేవలందించగా ధాన్యాన్ని త్వరితగతిన మిల్లర్లకు రవాణా చేసింది. సౌకర్యాల కల్పనతో పాటు రైతుల ఖాతాకు నగదు జమ చేయడంలోనూ సత్వర సేవలందించగా తాజాగా కొనుగోలుకు దూరం పెట్టడం విమర్శలకు తావిస్తోంది. ఏళ్లగా ధాన్యం కొనుగోలు చేస్తున్న తమను కాదని ఐకేపీకి ఇవ్వడమేంటని ప్యాక్స్ నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పునరాలోచించి ప్యాక్స్‌కే కొనుగోలు కేంద్రాలు అప్పగించేలా చూడాలని వారు కోరుతున్నారు.

నిధులు విడుదల చేసి పనులు పూర్తిచేయాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో పెండింగ్‌లో ఉన్న సమీకృత మార్కెట్, అమృత వర్షిణి నిర్మాణాలకు నిధులు విడుదల చేసి, పనులు త్వరగా పూర్తిచేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కోరారు. శనివారం కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రగతి, ముఖ్యమంత్రి హామీ పథకం నిధులతో నగరంలో సమీకృత మార్కెట్ నిర్మాణాలు చేపట్టామని, ప్రభుత్వం మారడంతో నిధుల లేమితో పనులు నిలిచిపోయినట్లు తెలిపారు. ఎస్ఆర్ఆర్ కళాశాల ఆవరణలో ఆధునిక కళాభవనం అమృతవర్షిణి నిర్మాణం చేపట్టినట్లు గుర్తుచేశారు. నిధులు లేక ఈ నిర్మాణం కూడా నిలిచిపోయిందన్నారు. అవసరమైన నిధులు వెంటనే విడుదల చేసి, పనులు పూర్తిచేయాలని ఆయన కోరారు. కొత్తపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 272 ప్రభుత్వ భూమిలో మూడు దశాబ్దాల క్రితం ఎస్సీ, బీసీ నిరుపేద కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇచ్చారని, ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జంగిలి సాగర్, దిండిగాల మహేశ్, జెడ్పీ కో ఆప్షన్ మాజీ సభ్యుడు జమీలొద్దీన్, తుల బాలయ్య, నక్క కృష్ణ, కోల సంపత్, దావ కమల మనోహర్, కర్ర సూర్యశేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో పతకాలు


విద్యార్థినులను అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం

కొత్తపల్లి: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో స్పోర్ట్స్ ఫర్ ఆల్(ఎస్ఎఫ్ఏ) ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఆర్చరీ(బాలికల విభాగం) పోటీల్లో పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రజత, కాంస్య పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హన్మంతరావు తెలిపారు. అండర్–15 బాలికల విభాగంలో హరిణి (9వ తరగతి) రజత పతకం, అండర్–13 బాలికల విభాగంలో హర్షిత కాంస్య పతకం సాధించిందన్నారు. రాష్ట్రస్థాయి ఆర్చరీలో పతకాలు సాధించిన విద్యార్థినులను పాఠశాల చైర్మన్ ఇ.ప్రసాదరావు అభినందించగా డైరెక్టర్లు ప్రసూన, అనుకర్ రావు, రశ్మిత, వీయూఎం.ప్రసాద్, వినోద్ రావు, రమణ, హన్మంతరావు, ప్రోగ్రాం హెడ్ గోపికృష్ణ, సమన్వయ కర్తలు రబీంద్ర పాత్రో, భవాని, సరిత, వ్యాయామ ఉపాధ్యాయులు గోలి సుధాకర్, రాజు పాల్గొన్నారు.

యూనివర్సిటీ విద్యార్థుల పాదయాత్ర


పాదయాత్రగా వెళ్తున్న విద్యార్థి జేఏసీ నాయకులు

కరీంనగర్: ఎమ్మెల్సీగా సర్దార్ రవీందర్‌సింగ్ గెలువాలని శాతవాహన వర్సిటీ స్టూడెంట్ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల్ల చైతన్య ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి కొండగట్టు అంజనేయస్వామి ఆలయం వరకు పాదయాత్ర చేపట్టారు. యాత్రను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్, తెలంగాణ ఉద్యమకారుడు కెమసారం తిరుపతి, సర్దార్ సోహన్‌సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ, రవీందర్‌సింగ్ గెలుపుకోసం తెలంగాణలోని నాలుగు యూనివర్సిటీల విద్యార్థులు కొండగట్టుకు పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. గతంలో కరీంనగర్ మేయర్‌గా నగర అభివృద్ధితో పాటు ఒక్క రూపాయికే అంత్యక్రియలు, ఒక్క రూపాయికే ఇంటింటికీ నల్లా.. వివిధ పథకాల సృష్టికర్తగా పేరు తెచ్చుకున్నారని, ప్రస్తుతం ఎమ్మెల్సీగా గెలిపిస్తే పట్టభద్రులకు ఒక్క రూపాయితో హెల్త్ ఇన్సూరెన్స్ అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తవుటు మురళి, గొట్టం మహేశ్, పొన్నం అనిల్ గౌడ్, కొత్తకొండ శ్రావణ్, రాము, యూనివర్సిటీల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

బ్లడ్ స్టోరేజీ

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజీ సెంటర్‌లో శనివారం వరకు ఏ పాజిటివ్ 10, బీ పాజిటివ్ 20, ఓ పాజిటివ్ 21, ఏబీ పాజిటివ్ 01, బీ నెగెటివ్ 02, ఓ నెగెటివ్ 01 యూనిట్ల రక్తం అందుబాటులో ఉందని రెడ్‌క్రాస్ సెక్రటరీ ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి తెలిపారు. అత్యవసరంగా రక్తం కావాల్సిన వారు ఫోన్: 95025 02942 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న నాగమణి

కరీంనగర్‌టౌన్: సమాజంలో సగభాగం ఉన్న మహిళలకు సమాన హక్కులు కల్పించాలని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి అన్నారు. శనివారం కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో పాండ్రల్ల దేవేంద్ర అధ్యక్షతన జరిగిన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కరీంనగర్ నగర సదస్సులో మాట్లాడారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఆరు హామీలు ఇచ్చి అందులో మూడు అమలు చేయడం అభినందనీయమన్నారు. మిగతా హామీలు కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళలపై వేధింపులు, అఘాయిత్యాలు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నగర కమిటీని ఏర్పాటు చేశారు. నగర అధ్యక్షురాలిగా సాలాంకి శారద, ప్రధాన కార్యదర్శిగా చేని రోజారాణి, ఉపాధ్యక్షురాలుగా గాజుల హరిత, జేరిపోతుల రిచా, సహాయ కార్యదర్శిగా దరిపెల్లి సంపూర్ణ, కన్నవేణి అరుణ, కల్లేపల్లి నందిని, కమిటీ సభ్యులుగా దూలం స్వరూప, నక్క స్వప్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నియామకం

రెడ్డి సంఘాల ఐక్యవేదిక యువజన విభాగం జిల్లా కమిటీ

విద్యానగర్: తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్యవేదిక కరీంనగర్ జిల్లా యువజన విభాగం నూతన కమిటీని యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎలిమినేటి సుమన్‌రెడ్డి శనివారం కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రకటించారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా గంకిడి శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కంది శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కర్ర అశోక్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ప్రశాంత్‌రెడ్డిలను నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతిరెడ్డి, రెడ్డి సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర సహాధ్యక్షుడు రాఘవరెడ్డి, మహిళా అధ్యక్షురాలు స్వప్నరెడ్డి, రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

- కేబుల్ మరమ్మతులో జాప్యం
- అవస్థలు పడుతున్న వినియోగదారులు


తెగిన విద్యుత్ వైరు

కరీంనగర్‌రూరల్: విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో నాలుగు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తెగిపోయిన విద్యుత్ కేబుల్ వైరును మరమ్మతు చేయడంలో జాప్యం చేస్తుండటంతో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక అవస్థలు పడుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ మండలం బొమ్మకల్ సబ్‌స్టేషన్ నుంచి రాజీవ్ రహదారిలో అండర్ గ్రౌండ్ కేబుల్ ద్వారా దుర్శేడ్, గోపాల్‌పూర్, నల్లగుంటపల్లి, చేగుర్తి గ్రామాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అయితే గురువారం రైల్వే కేబుల్ మరమ్మతు కోసం గుంటూరుపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద గుంతలు తవ్వుతుండగా విద్యుత్ కేబుల్ తెగింది. దీంతో అధికారులు ప్రత్యామ్నాయంగా మొగ్దుంపూర్ సబ్‌స్టేషన్ నుంచి వ్యవసాయ ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అయితే పలువురు రైతులు పొలాలకు నీళ్లుపెట్టేందుకు మోటార్లు ఉపయోగిస్తుండటంతో ఓవర్‌లోడ్‌తో ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరాలో పలుమార్లు అంతరాయం ఏర్పడుతోంది. లోవోల్టేజీతో టీవీలు, ఫ్రిజ్‌లు, బోరు మోటార్లు కాలిపోతున్నాయని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కేబుల్ మరమ్మతు చేసేందుకు మూడు రోజులు పడుతుందంటూ విద్యుత్ అధికారులు చెప్పడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. దుర్శేడ్, చేగుర్తి, గోపాల్‌పూర్ గ్రామాల్లో గతేడాది నుంచి లైన్‌మెన్లు లేకపోవడంతో విద్యుత్ సరఫరాలో ఏర్పడే సమస్యలు పరిష్కరించడంలో జాప్యమేర్పడుతుందని తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్ సమస్యలను అధికారులు పరిష్కరించాలని కోరారు. కాగా తెగిపోయిన విద్యుత్ కేబుల్‌ను మరమ్మతు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని విద్యుత్ శాఖ రూరల్ ఏడీఈ రఘు తెలిపారు. ఆదివారం ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించనున్నట్లు వివరించారు.

బండి సంజయ్ అరెస్ట్ అప్రజాస్వామికం

కరీంనగర్‌టౌన్: నిరుద్యోగులకు సంఘీభావంగా గ్రూపు–1 అభ్యర్థులకు మద్దతు తెలిపిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని అక్రమంగా అరెస్టు చేయడం, రాష్ట్ర ప్రభుత్వ చేతగాని తనానికి నిదర్శనమని బీజేపీ సీనియర్ నాయకులు కొట్టె మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు నిరుద్యోగుల పాలిట శాపంగా మారాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న అవగాహన రాహిత్యంతో వివిధ వర్గాల ప్రజలు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేస్తున్నారని తెలిపారు. నిరుద్యోగుల పక్షాన మాట్లాడే అర్హత మాజీ మంత్రి కేటీఆర్‌కు లేదన్నారు. అధికారంలో ఉన్నామని భ్రమలో అహంకారంతో మాట్లాడుతున్న కేటీఆర్ జీవో నం.29 ద్వారా నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతుందనే విషయం గ్రహించలేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. జీవో నంబర్ 29ని రద్దు చేయాలనే డిమాండ్ న్యాయబద్ధమేనని అన్నారు. ఉద్యోగాల ఉపాధి కల్పనలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, గ్రూప్–1 బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

పట్టభద్రుల భవిష్యత్ కోసం ప్రణాళికలు


ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులతో నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి: పట్టభద్రుల ఉజ్వల భవిష్యత్ కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి ఉద్యోగ కల్పనే ధ్యేయంగా పనిచేస్తానని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని పలు పాఠశాలలు, కళాశాలలను శనివారం సందర్శించి మాట్లాడారు. త్వరలో జరుగనున్న పట్టభద్రుల శాసనసభ శాసనమండలి ఎన్నికల్లో ప్రతీఒక్క అర్హత గల పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకొని సామాజిక వాతావరణాన్ని నెలకొల్పి అభివృద్ధికి అండగా నిలవాలని కోరారు. ప్రస్తుత సమాజంలో పట్టభద్రులకు ఉద్యోగాల కల్పన విషయంలో ఆలస్యం జరిగిన వారికి అన్ని రకాలుగా చేయూతనిస్తానని, వారి ఉద్యోగ కల్పనకు ప్రయత్నిస్తానన్నారు. వచ్చే జూన్ మాసంలో ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ నియోజకవర్గాల్లో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అల్ఫోర్స్ విద్యాసంస్థల తరఫున ఉచిత కోచింగ్ శిక్షణ కేంద్రాలు ప్రారంభిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పలు విద్యాసంస్థల యజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడుతా


మాట్లాడుతున్న రవీందర్‌సింగ్

తిమ్మాపూర్: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని, పల్లెలు, పట్టణాల అభివద్ధికి నిదులు తెస్తానని కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్‌సింగ్ అన్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మన్నెంపల్లి, పర్లపల్లి, మానకొండూర్ మండలం దేవంపల్లిలోని గురుకుల పాఠశాలలో శనివారం ప్రచారం నిర్వహించారు. తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలంటూ విద్యావంతులను కోరారు. తాను మేయర్‌గా కరీంనగర్‌ను ఎంతో అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. పొన్నం అనిల్‌గౌడ్, కెంసారం తిరుపతి, ముప్పిడి సంపత్‌రెడ్డి, చిందం చంద్రమౌళి, సుద్దాల రాజేశ్, నార్ల అశోక్, వేణుకుమార్ తదితరులున్నారు.

జాతీయ సాహస శిబిరానికి 'అల్ఫోర్స్' విద్యార్థిని



హర్షితను అభినందిస్తున్న రవీందర్‌రెడ్డి

కొత్తపల్లి: హిమాచల్ ప్రదేశ్‌లోని అటల్ బిహారీవాజ్‌పేయ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటేన్ రింగ్ అండ్ అలెడ్ స్పోర్ట్స్ నార్కండ కేంద్రంలో జరిగే జాతీయ సాహస శిబిరానికి కరీంనగర్ సూర్యనగర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ కె.హర్షిత ఎంపికైనట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి తెలిపారు. ఆ విద్యార్థిని అభినందించిన ఆయన మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసానికి ఎన్ఎస్ఎస్ దోహదపడుతుందని, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవా దృక్పథం అలవడుతుందన్నారు. రాబోవు కాలంలో హర్షితను ఆదర్శంగా తీసుకొని విద్యార్థినులు ముందుకు సాగాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ గోలి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు బి.అనిల్, ఎన్.రజిత, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై విచారణ


బొమ్మకల్‌లో ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీవో

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో శనివారం అక్రమ నిర్మాణాలపై పంచాయతీ అధికారులు విచారణ నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించారని, పంచాయతీ అనుమతి లేకుండా భవనాలు నిర్మిస్తున్నారని సామాజిక కార్యకర్త దొమ్మాటి బాబు ఇటీవల కలెక్టర్ పమేలా సత్పతికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి హిదైతుల్లాతో కలిసి ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి విచారణ చేపట్టారు. అక్రమంగా నిర్మించిన ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామని ఎంపీవో తెలిపారు.

గ్రూప్‌-1 పరీక్షలు యథాతథం!

- టీపీసీసీ అధ్యక్షుడి చొరవతో మంత్రుల సమావేశం
- రిజర్వేషన్లకు భంగం కలగలేదని నిర్ధారించిన అధికారులు
- నేడు అధికారికంగా ప్రకటన చేయనున్న ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్‌: గ్రూప్‌-1 మెయిన్స్‌ పరీక్షలు నిర్దేశించిన షెడ్యూల్‌ ప్రకారం జరిగే అవకాశాలే కనిపిస్తున్నాయి. అభ్యర్థుల ఎంపికకు పాటించిన విధానంతో రిజర్వుడ్‌ కేటగిరీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, అందువల్ల పరీక్షలను వాయిదా వేయాలని పలువురు అభ్యర్థులు ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పలువురు అభ్యర్థులు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌ కుమార్‌ గౌడ్‌ను కలిసి తమ సమస్యలను ప్రస్తావించారు. ఈ క్రమంలో చొరవ తీసుకున్న మహేశ్‌ కుమార్‌ గౌడ్‌ శనివారం సాయంత్రం మినిస్టర్స్‌ క్వార్టర్స్‌లోని పొన్నం ప్రభాకర్‌ నివాసంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్‌, కొండా సురేఖతోపాటు టీజీపీఎస్సీ అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గ్రూప్‌-1 అభ్యర్థులు లేవనెత్తిన అభ్యంతరాలు, సమస్యలను మహేశ్‌ గౌడ్‌ ప్రస్తావించారు. ప్రధానంగా జీఓ 29పై అభ్యర్థుల్లో భిన్నాభిప్రాయాలు, అనుమానాలున్నాయన్నారు. ఈ క్రమంలో దీనిపై కోర్టు ఉత్తర్వులు, న్యాయపరమైన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ పరీక్షలో ఏ విద్యార్థికీ అన్యాయం జరగొద్దని, రిజర్వేషన్ల పరంగా ఎలాంటి నష్టం కలగకుండా అన్ని వర్గాలకు న్యాయం జరగాలని మంత్రులు స్పష్టం చేశారు. మంత్రులు లేవనెత్తిన ప్రశ్నలకు అధికారులు సాంకేతికపరమైన వివరణలు ఇచ్చారు. అనంతరం పరీక్షల నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది లేదనే అంచనాకు వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో పరీక్షలు యథాతథంగా జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై ఆదివారం ప్రభుత్వం ప్రకటన చేయనున్నట్లు సమాచారం.

ముట్టడి.. ఉద్రిక్తం!

▶ మొదటి పేజీ తరువాయి

తెలుపుతున్నారు. ప్రభుత్వం స్పందించకపోవడం, పరీక్షలు సమీపించడంతో.. సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. శనివారం మధ్యాహ్నం వరకు అశోక్‌నగర్‌లోనే ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన అభ్యర్థులు.. ఆ తర్వాత ఒక్కసారిగా సచివాలయం ముట్టడికి బయలుదేరారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌, శ్రీనివాస్‌గౌడ్‌, దాసోజు శ్రవణ్‌, ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ తదితరులతోపాటు ఆయా పార్టీలు, విద్యార్థి సంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అభ్యర్థులకు మద్దతుగా ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్నారు.


గ్రూప్‌-1 అభ్యర్థులకు మద్దతుగా జరిగిన ఆందోళనలో బీఆర్‌ఎస్‌ నేతలు దాసోజు శ్రవణ్‌ తదితరులు

పోలీసులు ముందే మోహరించినా..

సచివాలయం ముట్టడికి బయలుదేరిన గ్రూప్‌-1 అభ్యర్థులను అడ్డుకునేందుకు పోలీసులు ముందుగానే మోహరించారు. అశోక్‌నగర్‌ నుంచి అభ్యర్థులు ర్యాలీగా బయలుదేరగా.. అడుగడుగునా చుట్టుముట్టి అడ్డుకునే ప్రయత్నం చేశారు. కానీ అభ్యర్థులు, వారికి మద్దతుగా వచ్చినవారు భారీ సంఖ్యలో ఉండటంతో.. పోలీసుల ప్రయత్నం విఫలమైంది. చాలా మంది అభ్యర్థులు సచివాలయం గేటు వద్దకు చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. సీఎం రేవంత్‌ డౌన్‌డౌన్‌, వి వాంట్‌ జస్టిస్‌ అంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వం జీవో 29 తెచ్చి రిజర్వేషన్లు అమలు కాకుండా అన్యాయం చేస్తోందని


బీఆర్‌ఎస్‌, బీజేపీ శ్రేణుల మధ్య వాగ్వాదం


శనివారం సచివాలయానికి ర్యాలీగా వెళ్తున్న గ్రూప్‌-1 అభ్యర్థులు

ఆరోపించారు. పరిస్థితి అదుపు తప్పుతోందని గ్రహించిన పోలీసులు.. అభ్యర్థులను అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. బైఠాయించినవారిని బలవంతంగా లాక్కెళ్లి వ్యాన్లలోకి ఎక్కించారు. తక్కువ సంఖ్యలో వ్యాన్లు ఉండటంతో అభ్యర్థులను తరలించడం పోలీసులకు కష్టతరమైంది. మరోవైపు అభ్యర్థులకు మద్దతుగా బీజేపీ, బీఆర్‌ఎస్‌ పార్టీలతోపాటు విద్యార్థి సంఘాల కార్యకర్తలు కూడా పెద్ద సంఖ్యలో రావడంతో.. రెండున్నర గంటల పాటు ఆందోళన కొనసాగింది. బీఆర్‌ఎస్‌ నేతలు ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌, శ్రీనివాస్‌గౌడ్‌లను పోలీసులు వ్యాన్‌ ఎక్కించి బండ్లగూడకు తరలించారు. ఆందోళనకారులు అడ్డుకోవడానికి ప్రయత్నించడంతో పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట జరిగింది. దీనితో సచివాలయం పరిసర ప్రాంతాలు ఉద్రిక్తంగా మారాయి.

రేపటి నుంచే మెయిన్స్‌.. పకడ్బందీగా ఏర్పాట్లు

ఈ నెల 21 నుంచి 27 వరకు జరిగే గ్రూప్‌-1 మెయిన్స్‌ పరీక్షల నిర్వహణ కోసం తెలంగాణ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తును.. విస్తృతస్థాయిలో సీనియర్‌ అధికారులతో పర్యవేక్షణ ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. జిల్లా కలెక్టర్లు, పోలీస్‌ కమిషనర్లు పరీక్షల నిర్వహణను, బందోబస్తును పర్యవేక్షించాలని ఆదేశించింది. ప్రతి పరీక్ష హాల్‌, చీఫ్‌ సూపరింటెండెంట్‌ రూమ్‌, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో పరీక్ష తీరును పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ కార్యాలయం నుంచి కంట్రోల్‌ రూమ్‌ ద్వారా పర్యవేక్షించనున్నారు. ఇక సహాయకుల (స్క్రైబ్‌) సాయంతో పరీక్ష రాయనున్న దివ్యాంగులకు ప్రత్యేకంగా ఒక గంట అదనంగా సమయం కేటాయిస్తున్నట్టు కమిషన్‌ ప్రకటించింది. స్క్రైబ్‌ల సాయంతో పరీక్షలు రాసేవారికి ప్రత్యేకంగా 4 కేంద్రాల్లో ఏర్పాట్లు చేసినట్టు తెలిపింది.

బీఆర్‌ఎస్‌, బీజేపీ పోటాపోటీ..

గ్రూప్‌-1 అభ్యర్థుల ఆందోళనకు కేంద్ర మంత్రి బండి సంజయ్‌ మద్దతు పలికారు. అశోక్‌నగర్‌ చౌరస్తాలో నిరసనలో, సచివాలయం ముట్టడికి చేపట్టిన ర్యాలీలో పాల్గొన్నారు. మరోవైపు బీఆర్‌ఎస్‌ నేతలు శ్రీనివాస్‌గౌడ్‌, ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌, దాసోజు శ్రవణ్‌, ముఠాగోపాల్‌ తదితరులు కూడా ముట్టడిలో పాల్గొని మద్దతు ప్రకటించారు. అశోక్‌నగర్‌ చౌరస్తా నుంచి ర్యాలీ లోయర్‌ ట్యాంక్‌ బండ్‌ కట్టమైసమ్మ ఆలయం వద్దకు చేరుకున్న సమయంలో బీఆర్‌ఎస్‌ నేతలు అందులో కలిశారు. ఈ సమయంలో అప్పటికే ర్యాలీలో ఉన్న బీజేపీ నేతలు వారిని అడ్డుకుని.. 'బీఆర్‌ఎస్‌ నేతలు గోబ్యాక్‌' అంటూ నినాదాలు చేశారు. ఈ సమయంలో బీఆర్‌ఎస్‌, బీజేపీ నేతల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. బీఆర్‌ఎస్‌ నేతలు లోయర్‌ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్‌ విగ్రహం వద్ద బైఠాయించి బీజేపీ నేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సమయంలో పోలీసులు జోక్యం చేసుకుని ఇరుపార్టీల నేతలను అదుపులోకి తీసుకున్నారు. బండి సంజయ్‌ను బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి తరలించారు. బీజేవైఎం అధ్యక్షుడు మహేందర్‌, మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి తదితరులను అదుపులోకి తీసుకున్నారు. బీఆర్‌ఎస్‌ నేతలు ప్రవీణ్‌కుమార్‌, శ్రీనివాస్‌గౌడ్‌ తదితరులను బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

గ్రూప్‌-1పై అభ్యర్థుల డిమాండ్లు ఇవీ..

- రెండేళ్ల క్రితం ఇచ్చిన గ్రూప్‌-1 నోటిఫికేషన్‌లో మెయిన్స్‌ పరీక్షలకు అభ్యర్థుల ఎంపికను జీఓ 55 ద్వారా చేపడతామని కమిషన్‌ ప్రకటించింది. కానీ ఈ ఏడాది జారీ చేసిన నోటిఫికేషన్‌లో జీఓ 29 ద్వారా ఎంపిక చేస్తామని కమిషన్‌ పేర్కొంది. ఈ జీఓ 29 ద్వారా రిజర్వేషన్‌ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, తక్షణమే ఈ జీవోను రద్దు చేయాలని అభ్యర్థులు డిమాండ్‌ చేస్తున్నారు.
- గ్రూప్‌-1 ఉద్యోగాల అర్హత పరీక్షలకు అభ్యర్థులంతా తెలుగు అకాడమీ పుస్తకాల ఆధారంగా సన్నద్ధమయ్యారు. అయితే ప్రశ్నపత్రాల రూపకల్పనలో తెలుగు అకాడమీ పుస్తకాలకు బదులు ఇతర సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకోవడం సరికాదని స్పష్టం చేస్తున్నారు.
- గ్రూప్‌-1 ఉద్యోగ నోటిఫికేషన్‌లో ఎస్టీ రిజర్వేషన్లను తొలుత 6శాతంగా, ఆ తర్వాత 10శాతంగా పేర్కొనడాన్ని ఆక్షేపిస్తున్నారు.
- పరీక్షల సన్నద్ధతకు సమయం కావాలని, పరీక్షలను రీషెడ్యూల్‌ చేయాలని కొందరు అభ్యర్థులు కోరుతున్నారు.
- గ్రూప్‌-1 ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్‌, పరీక్షలపై కోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో.. తీర్పులు వచ్చే వరకు పరీక్షలు నిర్వహించొద్దని మరికొందరు డిమాండ్‌ చేస్తున్నారు.

ఏమిటీ జీవో 55.. జీవో 29?

జీవో 55 ప్రకారం..

గ్రూప్‌-1 మెయిన్స్‌ పరీక్షలకు అభ్యర్థుల ఎంపికను.. మల్టీజోన్‌ వారీగా ఉన్న పోస్టులకు రూల్‌ ఆఫ్‌ రిజర్వేషన్‌ను అనుసరిస్తూ కమ్యూనిటీ, జెండర్‌, ఈడబ్ల్యూఎస్‌, దివ్యాంగులు, స్పోర్ట్స్‌ తదితర కేటగిరీల్లో 1:50 నిష్పత్తిలో గుర్తించాలి. ఈ లెక్కన గతంలో 503 పోస్టులకుగాను 1:50 నిష్పత్తిలో ఎంపిక చేపట్టారు. మొత్తం 25,150 మంది అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉండగా.. దివ్యాంగుల కేటగిరీలో రెండు పోస్టులకు అభ్యర్థులు లేకపోవడంతో 25,050 మందిని మాత్రమే ఎంపిక చేశారు.

జీవో 29 ప్రకారం..

రిజర్వేషన్‌ ప్రకారం కాకుండా.. నేరుగా మల్టీజోన్‌ పోస్టుల సంఖ్యకు 50 రెట్ల మంది అభ్యర్థుల ఎంపిక చేపడతారు. ఇలా 50 రెట్ల మందిని ఎంపిక చేసినప్పుడు.. రిజర్వుడ్‌ కేటగిరీల్లో అభ్యర్థుల సంఖ్య 1:50 నిష్పత్తి కంటే తక్కువగా ఉంటే, తర్వాతి మెరిట్‌ వారిని కూడా అదనంగా తీసుకుంటారు. తెలంగాణ స్టేట్‌ సబార్డినేట్‌ సర్వీస్‌ నిబంధనల్లోని రూల్‌ 22, 22ఏ ఆధారంగా వీరి ఎంపిక చేస్తారు. ఈ మేరకు జీవో 55లోని అంశం 'బి'లో మార్పులు చేసి.. జీవో 29 ఇచ్చారు.

వివాదం ఏమిటి?



ప్రస్తుతం గ్రూప్‌-1 కేటగిరీలో మొత్తం 563 పోస్టులు ఉన్నాయి. జీవో 55కు అనుగుణంగా 1:50 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపిక చేపడితే 28,150 మందికి మాత్రమే మెయిన్స్‌కు అవకాశం కల్పించాలి. కానీ ఇప్పుడు జీవో 29 ప్రకారం ఎంపిక చేపట్టారు. అంటే నేరుగా మెరిట్‌ లిస్టులోని 28,150 మందిని ఎంపిక చేశారు. వీరిని ఓపెన్‌ కాంపిటీషన్‌, రిజర్వుడ్‌ కేటగిరీలు విభజించారు. ఇందులో రిజర్వుడ్‌ కేటగిరీల్లో 1:50 నిష్పత్తి కంటే తక్కువగా ఉండటంతో.. కింది మెరిట్‌ ఆధారంగా అదనంగా అభ్యర్థులను ఎంపిక చేశారు. అంటే 28,150 మందికి మరో 3,233 మంది అదనంగా.. 31,383 మంది అభ్యర్థులను కమిషన్‌ మెయిన్స్‌ పరీక్షలకు ఎంపిక చేసింది. 1:50 నిష్పత్తి కంటే అభ్యర్థుల సంఖ్య పెరగడం, అందులో రిజర్వుడ్‌ కేటగిరీలవారు చాలినంత మంది లేకపోవడమంటే.. ఓపెన్‌ కేటగిరీ అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో ఉన్నట్టేనని, ఇది రిజర్వేషన్లకు దెబ్బ అని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అపోహలు వద్దు.. పరీక్ష రాయండి

▶ మొదటి పేజీ తరువాయి

మాత్రం రాజకీయంగా లబ్ధిపొంది ఉన్నత పదవులు చేపట్టారని బీఆర్‌ఎస్‌ నాయకులను ఉద్దేశించి విమర్శించారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు కనీసం అపాయింట్‌మెంట్‌ ఇవ్వనివారు.. ఇప్పుడు పిలిపించుకుని మాట్లాడుతున్నారని, ఆందోళనలు చేయిస్తున్నారని, నిరుద్యోగులు వారి ఉచ్చులో పడొద్దని సూచించారు. ఇక ఆందోళనలో పాల్గొంటున్న నిరుద్యోగులపై ఎలాంటి కేసులు పెట్టొద్దని పోలీసులను సీఎం ఆదేశించారు. నిరుద్యోగులపై లాఠీచార్జీలు, కేసులు పెట్టకుండా మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు.


డ్యూటీ మీట్‌లో సీఐడీ జాగిలంతో కరచాలనం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో రవిగుప్తా, స్వాతి లక్రా

అంతర్జాతీయ స్థాయిలో యంగ్‌ ఇండియా పోలీస్‌ స్కూల్‌..

పోలీస్‌ సిబ్బంది పిల్లల కోసం ఏర్పాటు చేయనున్న యంగ్‌ ఇండియా పోలీస్‌ స్కూల్‌ వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి వస్తుందని సీఎం రేవంత్‌ తెలిపారు. గ్రేహౌండ్స్‌కు చెందిన 50 ఎకరాల స్థలంలో దానిని ఏర్పాటు చేస్తామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో విద్యా బోధన ఉంటుందని.. ప్రాథమిక విద్య నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్‌, మెడికల్‌ వరకు పోలీస్‌ పిల్లలకు చదువు అందిస్తామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో మొదటి పోలీస్‌ డ్యూటీ మీట్‌ను సిబ్బందిలో స్ఫూర్తినిచ్చేలా నిర్వహించారని ఉన్నతాధికారులను అభినందించారు. తెలంగాణ సాధన కోసం కానిస్టేబుల్‌ కిష్టయ్య చేసిన త్యాగం 4 కోట్ల మంది మరువలేనిదన్నారు. తెలంగాణ పోలీసులు దేశానికి ఆదర్శవంతంగా ఉండాలని సూచించారు. పోలీసుల పనితీరుతోనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని, చిన్న పొరపాటు జరిగినా ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుందని చెప్పారు. సైబర్‌ నేరాలు, డ్రగ్స్‌ కేసులలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని, దోషులు ఎంతటి వారైనా విడిచిపెట్టొద్దని ఆదేశించారు. కాగా.. త్వరలోనే పోలీస్‌ స్పోర్ట్స్‌ మీట్‌ కూడా నిర్వహిస్తామని డీజీపీ జితేందర్‌ వెల్లడించారు. డ్యూటీ మీట్‌ ముగింపులో భాగంగా నిర్వహించిన డ్రోన్‌ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

రిజర్వేషన్ల రద్దుకే ఈ కుట్ర

- దానికి సంకేతమే జీవో 29: కేంద్రమంత్రి బండి సంజయ్‌
- గ్రూప్‌-1 అభ్యర్థులు, నిరుద్యోగులతో ప్రభుత్వం చర్చించాలి
- తన జోలికొస్తే నీ బండారం అంతా బయటపెడతా అంటూ కేటీఆర్‌కు హెచ్చరికలు


గ్రూప్‌-1 అభ్యర్థులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్‌

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణలో రిజర్వేషన్లను రద్దు చేసే కుట్ర జరుగుతోందని, దానికి సంకేతమే జీవో 29 అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ ఆరోపించారు. రిజర్వేషన్ల ఎత్తివేతకు కాంగ్రెస్‌ ప్రభుత్వం సిద్ధం కావడంలో భాగంగానే గ్రూప్‌-1 పరీక్షల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను వర్తింపజేయకుండా జీవో 29 తెచ్చిందన్నారు. డిసెంబర్‌ 9న కాంగ్రెస్‌ అగ్రనేత సోనియా గాంధీ జన్మదినమని, అది నిరుద్యోగులకు బలిదినం కాబోతోందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. రిజర్వేషన్లపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్‌ చేశారు. బండి సంజయ్‌ శనివారం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇప్పటికైనా దిగి రావాలని, గ్రూప్‌-1 అభ్యర్థులు, నిరుద్యోగులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

కిషన్‌రెడ్డి సూచన మేరకే వెళ్లాం..

'బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌ రెడ్డి సూచన మేరకు గ్రూప్‌-1 అభ్యర్థుల ఆందోళనకు మద్దతిచ్చేందుకు అశోక్‌ నగర్‌ వెళ్లాం. అక్కడ నిరుద్యోగుల ఘోషను ప్రపంచానికి విన్పించినం. మోదీ అగ్రవర్ణాలు సహా అన్ని సామాజికవర్గాలకు రిజర్వేషన్లు కల్పిస్తే కాంగ్రెస్‌ మాత్రం రిజర్వేషన్లను తీసేయాలని కుట్ర చేయడం దుర్మార్గం'అని బండి సంజయ్‌ అన్నారు. ఇంత జరుగుతున్నా సీఎం ఎందుకు స్పందించడం లేదు? ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్‌ చేశారు. 'గతంలో రాహుల్‌ గాంధీ అశోక్‌ నగర్‌ వచ్చి నిరుద్యోగులతో తియ్యగా మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ను తిట్టి వెళ్లారు. కానీ అధికారంలోకి వచ్చాక రిజర్వేషన్ల రద్దుకు కుట్ర చేస్తున్నారు'అని సంజయ్‌ ధ్వజమెత్తారు.

మా ర్యాలీలో విధ్వంసానికి బీఆర్‌ఎస్‌ కుట్ర

బీజేపీపట్ల నిరుద్యోగులు చూపుతున్న స్పందనను చూసి ఓర్వలేక... బీఆర్‌ఎస్‌ నేతలు తమ ర్యాలీలో చొరబడి విధ్వంసం చేసేందుకు కుట్ర చేశారని సంజయ్‌ ఆరోపించారు. 'కేటీఆర్‌.. నేను పోరాడుతుంటే నాపై వ్యక్తిగత దూషణలు చేస్తావా? నీ డ్రగ్స్‌, చీకటి లీలలు తెలియదని అనుకుంటున్నవా? నా జోలికొస్తే నీ బండారమంతా బయటపెడతా'అని వ్యాఖ్యానించారు. 'నేను హిందీ పేపర్‌ లీక్‌ చేసినట్లు, నువ్వు డ్రగ్స్‌ తీసుకోలేదని దేవుడి ముందు నీ ఫ్యామిలీతో కలిసి ప్రమాణం చేసే దమ్ముందా'అని సవాల్‌ విసిరారు. 'కాంగ్రెస్‌తో మీ కుమ్మక్కు రాజకీయాలు ఎవరికి తెల్వదు. మీ ఫామ్‌హౌస్‌ను సీఎం ఎందుకు కూల్చడం లేదు? నువ్వు డ్రగ్స్‌ తీసుకునే కేసు ఏమైంది? ఫోన్‌ ట్యాపింగ్‌లో మీ అయ్య ఉన్నాడని నిందితులు వాంగ్మూలం ఇచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదు? 'నిరుద్యోగులు అల్లాడుతుంటే అశోక్‌ నగర్‌కు వెళ్తానని మాట ఇచ్చి తప్పావు.. నువ్వు పొరపాటున అక్కడకు వెళితే రాళ్లతో తరిమికొడతారనే భయంతో తోకముడిచావు'అని అన్నారు. తనను అరెస్ట్‌ చేశారని వచ్చిన వార్తల్లో నిజం లేదని, తనను అరెస్ట్‌ చేసే దమ్ము ఎవరికి ఉందని ఓ ప్రశ్నకు సంజయ్‌ బదులిచ్చారు.

ఇంత నిరంకుశ, నిర్బంధ పాలనా?



మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్‌

- గ్రూప్‌-1 అభ్యర్థుల పట్ల ప్రభుత్వ తీరు దారుణం: మాజీ మంత్రి కేటీఆర్‌ ఫైర్‌
- జీవో 29 వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌ వర్గాల వారికి అన్యాయం
- బండి సంజయ్‌ను ముందుపెట్టి గ్రూప్‌-1 అభ్యర్థుల గొంతునొక్కే ప్రయత్నమని మండిపాటు

లాలాపేట (హైదరాబాద్‌): ''గ్రూప్‌-1 మెయిన్స్‌ పరీక్షలను ఒక నెలో, రెండు నెలలో, సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకునేవరకో వాయిదా వేస్తే మీ కొంపలేమీ మునిగిపోవు. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్‌-1 అభ్యర్థులను పిలిచి వారి సహేతుకమైన కారణాలను అడిగి తెలుసుకోవాలి..''అని మాజీ మంత్రి కేటీఆర్‌ డిమాండ్‌ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను, నిరుద్యోగులను పశువుల్లా చూస్తుండటం చాలా దారుణమని మండిపడ్డారు. బీఆర్‌ఎస్‌ నాయకుల గొంతు నొక్కుతూ, కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను మాత్రం రాచమర్యాదలతో అశోక్‌ నగర్‌కు వెళ్లనిచ్చారని.. సీఎం రేవంత్‌, బండి సంజయ్‌ దోస్తులేనని స్పష్టమవుతోందని పేర్కొన్నారు. శనివారం తార్నాకలోని ఐఐసీటీ ఆడిటోరియంలో జరిగిన ఓ కార్యక్రమంలో కేటీఆర్‌ మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''జీవో నంబర్‌ 29 వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌ వర్గాలకు చెందిన అభ్యర్థులు భారీగా నష్టపోతున్నారు. కేసీఆర్‌ హయాంలో తీసుకువచ్చిన 95శాతం లోకల్‌ రిజర్వేషన్‌ను తుంగలో తొక్కుతున్నారు. తెలుగు అకాడమీ పుస్తకాలను కాకుండా వికీపీడియాను ప్రామాణికంగా తీసుకోవాలనే అర్థం లేని వాదనలు చేస్తున్న ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూ.. అభ్యర్థులు 4 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. వారిపట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు శోచనీయం. వారిలో కాబోయే డీఎస్పీలు, ఆర్డీవోలు, మున్సిపల్‌ కమిషనర్లు ఉన్నారు. అలాంటి వారిని పశువుల్లాగా ప్రభుత్వం చూస్తుండటం దారుణం. అభ్యర్థులతో ముఖ్యమంత్రిగానీ, చీఫ్‌ సెక్రెటరీ, పబ్లిక్‌ సర్వీసు కమిషన్‌ చైర్మన్‌గానీ ఎవరైనా చర్చలకు పిలిచి మాట్లాడాలి.

ఏమిటీ నిరంకుశ, నిర్బంధ పాలన?

గతంలో రాహుల్‌ గాంధీ, రేవంత్‌రెడ్డిలో అశోక్‌నగర్‌కు వెళ్లి ప్రభుత్వం ఏర్పాటైన తొలి సంవత్సరంలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని పొంకనాలు కొట్టారు. నేడు కనీసం అభ్యర్థుల మాటలను ఆలకించని పరిస్థితి ఉంది. తెలంగాణ భవిష్యత్‌కు సారథులుగా వ్యవహరించే గ్రూప్‌-1 అభ్యర్థులనే ప్రభుత్వం ఇలా చూస్తుంటే.. మిగతా యువత పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవాలి. గ్రూప్‌-1 అభ్యర్థుల తరఫున సుప్రీంకోర్టులో పిటిషన్‌ వేశాం. సోమవారం వాదనలు జరగనున్నాయి. గతంలో మధ్యప్రదేశ్‌ ప్రభుత్వం కూడా మొండిగా గ్రూప్‌-1 పరీక్ష నిర్వహించింది. కోర్టు తీర్పుతో మళ్లీ నిర్వహించాల్సి వచ్చిందని ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలి. తమది ప్రజాపాలన అని, తమ ద్వారాలు తెరిచే ఉన్నాయంటూ ఫోజులు కొట్టిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఎందుకింత నిరంకుశ, నిర్బంధ పరిస్థితులు తీసుకువచ్చారు?'' అని కేటీఆర్‌ ప్రశ్నించారు.

బండి సంజయ్‌కు గ్రూప్‌-1 పరీక్ష గురించే అర్థంకాదు..

రాష్ట్ర ప్రభుత్వం శిఖండి రాజకీయాల్లో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను ముందుపెట్టి గ్రూప్‌-1 అభ్యర్థుల గొంతునొక్కే ప్రయత్నం చేస్తోంది. బండి సంజయ్‌ ఏమన్నా చదువుకున్నారా.. పరీక్ష రాసింది ఉందా? గ్రూప్‌-1 పరీక్షపై ఆయనకు చెప్పినా అర్థంకాదు, పేపర్‌ లీకులు మాత్రం చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం బండి సంజయ్‌ వంటి వారితో కాదు. ఓ 10 మంది గ్రూప్‌-1 అభ్యర్థులతో మాట్లాడాలి.

రైతు బంధు ఏదీ?

రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక రైతులకు ఎలాంటి భరోసా లేకుండా పోయింది. ఇప్పటికీ రైతు బంధు ఇవ్వలేదు. బీఆర్‌ఎస్‌ అంటే భారత రాష్ట్ర సమితి మాత్రమే కాదు భారత రైతు సమితి. తప్పకుండా రైతుల తరఫున పోరాడుతాం...

విద్యార్థుల జీవితాలతో రాజకీయాలా?




సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో పది నెలల్లోనే ప్రజాస్వామ్య స్ఫూర్తి నశించిందని, విద్యార్థుల జీవితాలతో రేవంత్‌రెడ్డి రాజకీయాలు చేస్తున్నారని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌ గౌడ్‌ విమర్శించారు. జీవో 29పై గ్రూపు-1 అభ్యర్థులు రెండు నెలలుగా ఉద్యమిస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. ఆయన తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్‌ నేతలు తుంగబాలు, కిశోర్‌ గౌడ్‌, విజయ్‌కుమార్‌తో కలిసి శనివారం విలేకరులతో మాట్లాడారు. కంచెల పాలన లేదంటూనే.. విద్యార్థినులపై కూడా పాశవికంగా దాడి చేస్తూ ప్రభుత్వం నిర్బంధం కొనసాగిస్తోందన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌ రాజకీయ దళారిగా.. రేవంత్‌కు సహాయ మంత్రిగా మారారని బీఆర్‌ఎస్‌ నేత ఆంజనేయులు గౌడ్‌ ఎద్దేవా చేశారు.

ఇంటర్‌ ప్రైవేట్‌ విద్యార్థులకు హాజరు మినహాయింపు

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో 2025 మార్చిలో జరగనున్న ఇంటర్మీడియెట్‌ వార్షిక పరీక్షలు రాయాలనుకునే ప్రైవేటు విద్యార్థులకు హాజరు మినహాయింపు సదుపాయం కల్పిస్తున్నట్లు ఇంటర్మీడియెట్‌ బోర్డు తెలిపింది. హాజరు మినహాయింపు కోరుకునే అభ్యర్థులు నవంబర్‌ 20వ తేదీలోగా రూ.500 ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఇంటర్‌ బోర్డు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది.

జీవో 29తో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం

- సీఎం రేవంత్‌ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారు: హరీశ్‌రావు
- యూపీఎస్సీలో అమలు చేస్తున్నప్పుడు.. టీజీపీఎస్సీలో ఎందుకు చేయరు?
- నిరుద్యోగుల ఆర్తనాదాలతో అశోక్‌నగర్‌ మార్మోగుతోంది
- కోదండరాం ఎందుకు మౌనంగా ఉంటున్నారని నిలదీత


విలేకరులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: కాంగ్రెస్‌ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 29 వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, ఈబీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు టాప్‌ మార్కులు వచ్చినా జనరల్‌గా కాకుండా, రిజర్వేషన్‌గా పరిగణించడం వల్ల మరో రిజర్వ్‌డ్‌ అభ్యర్థికి అవకాశం లేకుండా పోతోందని స్పష్టం చేశారు. యూపీఎస్సీ అమలు చేస్తున్నా.. ఆ విధానాన్ని టీజీపీఎస్సీ ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. కేసీఆర్‌ సీఎంగా ఉన్నప్పుడు జీవో 55 ప్రకారం అన్నివర్గాల నిరుద్యోగులు, విద్యార్థులకు న్యాయం చేశారని పేర్కొన్నారు. శనివారం సిద్దిపేటలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''రాహుల్‌ గాంధీ రాజ్యాంగ పరిరక్షణ కోసం రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని సదస్సులు నిర్వహిస్తుంటే.. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆ వర్గానికి ప్రతినిధిగా ఉండి మౌనం వహిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఇదే అంశాన్ని అడిగితే భట్టి విక్రమార్క పరిశీలిస్తామన్నారు. దళితులు, గిరిజనులు, బీసీలు, మైనార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు రేవంత్‌రెడ్డిని నిలదీసి బలహీన వర్గాల హక్కులను కాపాడాలి. విద్యార్థులు, నిరుద్యోగుల ఆర్తనాదాలతో అశోక్‌నగర్‌ ప్రాంతం మార్మోగుతోంది. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని, రిజర్వేషన్లు అమలు చేయాలని విద్యార్థులు రోడ్డెక్కితే వారిని కొడుతున్నారు. ఆడపిల్లల్ని కూడా అర్ధరాత్రి పోలీసు స్టేషన్లలో పెడుతున్నారు. వారేమైనా టెర్రరిస్టులు, హంతకులు, గూండాలా? లాఠీలు, ఇనుప కంచెలను రేవంత్‌రెడ్డి నమ్ముకున్నారు. అవి అణచేయవు. ఉద్యమం మరింత ఉధృతం అవుతుంది. సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే సెక్యూరిటీ లేకుండా అశోక్‌నగర్‌కు వెళ్లాలి.

కోదండరాం స్పందించడం లేదేం?

కాంగ్రెస్‌ హైదరాబాద్‌ యూత్‌ డిక్లరేషన్‌లో ప్రకటించినవి ఒక్కటైనా అమలు చేశారా? అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. పది నెలలు గడిచినా ఒక్క నోటిఫికేషన్‌ లేదు. కేసీఆర్‌ ప్రభుత్వమే ప్రక్రియ అంతా పూర్తిచేసిన ఉద్యోగాలకు కాగితాలు పంచి.. 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకుంటున్నారు. కోదండరాం ఎందుకు మౌనంగా ఉంటున్నారు? నిరుద్యోగుల ఎజెండా.. నా ఎజెండా అన్నారు. ఎమ్మెల్సీ అయ్యాక గొంతు మూగబోయింది. కోదండరాం, రియాజ్‌, నవీన్‌, ఆకునూరి మురళిలకు ఉద్యోగాలు వచ్చాయి. నిరుద్యోగులకు రాలేదు.

కాంగ్రెస్‌ బీజేపీ చీకటి ఒప్పందం బట్టబయలు

గ్రూప్‌-1 అభ్యర్థుల నిరసన సాక్షిగా కాంగ్రెస్‌, బీజేపీల మధ్య ఉన్న చీకటి ఒప్పందం మరోమారు బట్టబయలైంది. కేంద్ర మంత్రి బండి సంజయ్‌ నిరసన తెలుపుతుంటే అడ్డుకోని కాంగ్రెస్‌ ప్రభుత్వం.. బీఆర్‌ఎస్‌ నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గం. జీవో 29 రద్దు చేసి గ్రూప్స్‌ అభ్యర్థులకు న్యాయం చేయాలని జూలై 29న నేను అసెంబ్లీలో మాట్లాడినప్పుడే ప్రభుత్వం మొండిపట్టు వీడి ఉంటే ఇప్పుడు విద్యార్థులు, అభ్యర్థుల మీద లాఠీలు విరిగేవి కాదు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దు. రాజకీయాలు పక్కనబెట్టి విద్యార్థుల సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలి..''అని హరీశ్‌రావు డిమాండ్‌ చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు

- గ్రూప్‌-1కు పటిష్ట బందోబస్తు: డీజీపీ జితేందర్‌
- ముత్యాలమ్మ గుడి విషయంలోనూ చట్టపరంగా చర్యలు
- మావోయిస్టు సుజాత మా అదుపులో లేదు



సాక్షి, హైదరాబాద్‌: గ్రూప్‌-1 పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు డీజీపీ జితేందర్‌ తెలిపారు. కోర్టు తీర్పును అనుసరించే పరీక్షలు నిర్వహిస్తున్నామని, సాధారణ ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఆందోళనలు చేయడం సరికాదని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం నిర్వహించనున్న పోలీస్‌ అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకుని శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సోమవారం ప్రారంభంకానున్న గ్రూప్‌-1 పరీక్షల కోసం పటిష్టమైన బందోబస్తు చేస్తున్నామని, పరీక్ష కేంద్రాల వద్ద ఎవరైనా ఆందోళనలు చేసినా, అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సికింద్రాబాద్‌ ముత్యాలమ్మ గుడి విగ్రహం ధ్వంసం కేసులో సమగ్ర విచారణ జరుపుతున్నామని చెప్పారు. మావోయిస్టు నేత సుజాత తమ అదుపులో లేదని స్పష్టం చేశారు. అనారోగ్య కారణాల రీత్యా ఆమె సరెండర్‌ కోసం ప్రయత్నిస్తున్నట్లు తమకు సమాచారం ఉందని తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌ నుంచి రాష్ట్ర సరిహద్దులోకి ప్రవేశిస్తున్న మావోయిస్టులను సమర్థవంతంగా అడ్డుకుంటున్నట్లు ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

ఈ నెల 31 వరకు ఫ్లాగ్‌ డే

గోషామహల్‌ పోలీస్‌ స్టేడియంలో సంస్మరణ దినం నిర్వహిస్తున్నట్లు డీజీపీ జితేందర్‌ తెలిపారు. ఈ ఏడాది రాష్ట్ర గ్రేహౌండ్స్‌ పోలీస్‌ కానిస్టేబుల్‌ సహా దేశవ్యాప్తంగా 240 మంది పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. అమర పోలీసుల సంస్మరణలో భాగంగా ఈ నెల 31 వరకు ఫ్లాగ్‌ డే నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్థానిక రోడ్లకు పోలీస్‌ అమరుల పేర్లు పెట్టేలా స్థానిక సంస్థలకు ప్రతిపాదించాలన్నారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
ఆదివారం ॥ 20-10-2024

ఈస్ట్‌మన్ కలర్



మాటల మట్టివాసనేది?

‘మీ అభిమాన థియేటర్ శ్రీ సాయిమహల్లో... రేపటి నుంచి... ఉదయం పదకొండు గంటల మార్నింగ్ షోతో... నాణ్యమైన నాలుగు ఆటలుగా ప్రదర్శింపబడు... గొప్ప సాంఘిక స్టంట్ ఈస్ట్‌మన్ కలర్ తెలుగు చిత్రం... హేమాహేమీలు. సూపర్‌స్టార్ క్రిష్ణా...’

ఇటు అటు పోస్టర్లు అంటించిన గూడు రిక్షా... పెడల్‌ని మెల్లగా తొక్కే కుర్రాడు... లోపల గళ్లలుంగీ, పొడవు చేతుల చొక్కాలో అనౌన్సరు. పక్కనే రికార్డు ప్లేయరు, యాంప్లిఫయరు, గూడుపైన హారను.

బండి మనిల్లున్న వీధిలో నుంచి పోవచ్చు. లేదంటే దూరంగా వీధుల్లో నుంచి వెళ్లిపోవచ్చు. పోలేరమ్మబండ దగ్గర కాసేపు గస తీర్చుకుందామని బండి ఆపితే ఉచితంగా నాలుగు పాటలు ఇంట్లో దూరుతాయి. ‘మావిళ్ల తోపు కాడ పండిస్తే మరుమల్లె తోట కాడ పువ్విస్తే’.... ఐదు నిమిషాలు వెతికితే పక్క సందులో దొరికే ఆడపిల్లను ఆర్భాటంగా వెతికి పట్టాలని అమ్మలక్కలు పావలో అర్ధో ఇచ్చి అనౌన్స్‌మెంట్ చేయమంటే మళ్లీ అదే స్థయిలు...

‘పుర్రప్రజలకు గమనిక. ఎర్రటి గౌను, మట్టి గాజులు, వెండి పట్టీలు, రెండు జడలు వేసుకున్న ఆరేళ్ల పాప’...

‘బావిలో దిగుతామమ్మ... బావిలో దిగుతాం’ అని బక్కపలుచని సాహెబు మధ్యాహ్నం పూట తిరిగేవాడు. పలానా వస్తువు గేలాలతో వచ్చేదయితే గేలంతో తీసేవాడు. దిగి తీయాల్సుంటే దిగి తీసేవాడు. ఒకింటి వాళ్లు పిలిస్తే వీధిలోని అన్ని ఇళ్ల వాళ్లు ఆ బావి దగ్గరే. సాహెబు ఈతకు వీలుగా నౌటాకు కండ లేకుండా ఒంటిని చూసుకునేవాడు. ఊపిరి పీల్చి అడుక్కు వెళ్లినప్పుడల్లా మళ్లీ తేలేదాకా ఎక్కడ లేని థ్రిల్లు.

సాయంత్రమైతే చిన్న పట్టణంలో బలహీనంగా వీధి దీపాలు వెలిగేవి. ట్రంకురోడ్డు మీద వచ్చేపోయే లారీల లైట్లు దిగ్గుమనేవి. కూరగాయల మార్కెట్టు దగ్గర ఉన్నట్టుండి ఒక అంచున రోడ్డు శుభ్రంగా ఊడ్చి మొండి అరటి గెలలతో సరిహద్దు ఏర్పరిచి ఉండేది. దగ్గరికెళ్లి చూస్తే కిరోసిన్ పోసి పెద్దవొత్తితో వెలిగించిన దీపం. దాని వెలుతురులో రంగు రంగుల చాక్‌పీస్‌తో గీసిన ఏసుక్రీస్తు రూపం. కొందరు ఆగి చూసి వెళ్లేవారు. కొందరు ఐదు, పది పైసలు విసిరేవారు. బొమ్మ వేసిన చిత్రకారుడు ఎప్పుడూ తమిళుడే. మాసిన గడ్డంతో దూరంగా పడుకుని ఉండేవాడు. ఆంజనేయ స్వామిని గీసినా అంతే చిల్లర దక్కేది.

ఏక్‌తారా మీద హిందీ పాటను పాడి పనుల మీద దిగిన పల్లె జనాలను ఆకర్షించేవాడు మోళీ సాహెబు. సహాయకుడు డోలక్‌ను తెగ బాదేవాడు. మట్టిలో దించిన కమ్మీకి కట్టేసిన ముంగీసొకటి ఆగక తిరుగుతూ ఉండేది. బుట్టలో నాగుపాము చడీ చప్పుడు లేక పడుకుని ఉండేది. మరికాసేపటిలో పాము ముంగిసకు ఫైటింగ్ అనేవాడు మోళీ సాహెబు. ఎన్నేళ్లు గడిచినా ఒక్కసారి కూడా ఫైటింగ్ పెట్టలేదతడు. జనం బాగా మూగాక, ఆసి స్టెంటు గుండెలు బాదుకుంటూ ఎర్ర సిరా రక్తం కక్కి పడిపోతే, మోళీ కట్టానని కదిలారంటే అలాగే నెత్తురు కక్కుకు చస్తారని జనాన్ని దడిపించేవాడు. ఆనెక తలా ఒకరి ముకాన తాయెత్తులు విసిరి ఎల్లికిలా తిప్పిన కంజిరలో చిల్లర దండుకునేవాడు. మరుసటి రోజు కూడా అదే ఆట. తెలిసి తెలిసి అదే జనం.

వేపచెట్టు నీడలో సినిమా పాటల పుస్తకాలు మాత్రమే అమ్మేవాడు ఒకాయన. కాంబినేషన్ పుస్తకాలు కూడా దొరికేవి.. అడవి రాముడు–గజదొంగ, ప్రేమాభిషేకం–శ్రీవారి ముచ్చట్లు... ఘంటసాల మధురగీతాలు ప్రత్యేకం. పాడటం తెలిసినా తెలియకపోయినా జనం కొనుక్కుని తోచిన రాగంలో చదువుకునేవారు.

జీవితాంతం ‘శొంటి కాఫీ’ అమ్ముతూ బతికినాడు ఒకాయన. తీగల వలలో నిప్పుల కుంపటి, కెటిల్, ఇనప బకెట్టులో నీట మునిగిన గాజుగ్లాసులు. ఉండి ఉండి కర్ర పెండలం గడ్డను మృదంగంలా నిలబెట్టి అమ్మడానికి కూచునేవాడొకడు. పది పైసలకీ, పావలాకీ కోసి పెట్టేవాడు.

ఊళ్లోకి ఎగ్జిబిషన్‌లు వచ్చేవి. వాళ్లకు మాత్రమే చాతనైన కూరగాయలు తరిగే కొత్తరకం మెషీన్లను ఆడవాళ్లకు అంటగట్టేవి. అక్కడే తిరిగే స్టీమర్లను చాలామంది కొని తెచ్చి బకెట్లలో తిప్పడానికి ట్రై చేసేవారు. కూలినాలీ జనం ఇక్కడ మాత్రమే స్కూటర్ మీద దర్జాగా కూచుని ఫొటోలు దిగేవారు. కుర్రాళ్లకు అక్కినేని ‘ఇద్దరు మిత్రుల’ డబుల్ పోజ్ ఉండేది. తాజ్‌మహల్ ఎదుట దిగిన ఫ్యామిలీ ఫొటో ప్రతి ఇంటా వేళ్లాడేది. సర్కస్ వస్తే ఆ సందడే వేరు. బయట కట్టేసిన ఏనుగుల్ని, ఒంటెల్ని చూడొచ్చు. టికెట్ కొనుక్కుని వెళితే పులులు, సింహాలు కూడా చూడొచ్చు. కురచ బట్టలేసుకుని ఫీట్లు చేసే ఆడవాళ్లది ఏ ఊరో ఏ దేశమో. సాయంత్రమైతే సర్కస్‌డేరా ఫోకస్ లైటు పెద్ద వెలుతురుతో చక్కర్లు కొట్టేది. దూరంగా మిద్దెల నుంచి పిల్లలు దాని వైపు అబ్బురంగా చూసేది.

చాలా రోజులు గడిచిపోయాయి. ఇపుడు ఊరు చాలా మారింది. వలస ఖాళీ చేస్తోంది... నింపుతోంది.

కొత్త ముఖాల తాకిడిలో ఎంత వెతికినా ఈ పాతమిత్రులు మాత్రం కానరావడం లేదు.

– ఖదీర్

చర్మ కాంతికి.. ఆరెంజ్

బ్యూటిప్



● ఆలివ్ ఆయిల్ రెండు టేబుల్ స్పూన్లు, రాక్ సాల్ట్ టేబుల్ స్పూన్, ఆరెంజ్ జ్యూస్ టేబుల్ స్పూన్ తీసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని శరీరానికి పట్టించి, మృదువుగా మర్దన చేయాలి. పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. మృతకణాలు తగ్గి, చర్మం మృదువుగా అవుతుంది. ● టేబుల్ స్పూన్ ఆరెంజ్ జ్యూస్‌ను కప్పు పెరుగులో కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి, ఆరిన తర్వాత తర్వాత తడి బట్ట లేదా టిష్యూ పేపర్‌తో తుడిచేయాలి. వారంలో 2-3 సార్లు ఇలా చేస్తుంటే చర్మం మృదువుగా మిలమిలలాడుతుంది. ● టేబుల్ స్పూన్ ఆరెంజ్ జ్యూస్‌లో టీ స్పూన్ తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్‌లా వేసుకొని, అరగంట తర్వాత శుభ్రపరుచుకోవాలి. చర్మం తాజాగా కనిపిస్తుంది.

తల్లి తన ఆకలి గురించి పట్టించుకోదు.
పిల్లల కడుపు నిండిందా లేదా అనేదే ఆమెకు ముఖ్యం.
రైతులు కూడా అమ్మలాంటి వారే.
అందుకే వారిపై దృష్టి పెట్టింది సాయిప్రియాంక.
తాను పండించే పంటల ద్వారా ఎంతోమందికి పోషకాహార శక్తిని అందిస్తున్న రైతు ఆ శక్తికి ఎంత దగ్గరలో ఉన్నాడు?
ఎంత దూరంలో ఉన్నాడు... అనే ఆసక్తితో పరిశోధన బాట పట్టింది.
తన పరిశోధన అంశాలను కొలంబోలో జరిగే అంతర్జాతీయ సదస్సులో వివరించడానికి సిద్ధం అవుతోంది.



ప్రత్యేక గ్రామాల్లో పంటల తీరును పరిశీలిస్తున్న దృశ్యం.



సిరిధాన్యాల సాగు చేస్తున్న గ్రామాల మహిళలతో మాట్లాడుతున్న సాయిప్రియాంక

శోధన

అమ్మలాంటి అన్నదాత కోసం...

సాయిప్రియాంక చదువుకున్నది పట్టణాల్లో అయినా ఆమెకు పల్లెలు అంటేనే ఇష్టం. పల్లెల్లో పచ్చటి పొలాలను చూడడం అంటే ఇష్టం. ఆ ఇష్టమే వ్యవసాయం గురించి తెలుసుకోవాలనే ఆసక్తికి కారణం అయింది. ఆ ఆసక్తే తనను ‘అగ్రికల్చరల్ సైంటిస్ట్’ను చేసింది.



ఇంటర్నేషనల్ ఫుడ్ పాలసీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎఫ్‌పీఆర్‌ఐ) అనేది వాషింగ్టన్ కేంద్రంగా పనిచేస్తున్న అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం. పోషకాహార లోపానికి సంబంధించి పరిశోధన ఆధారిత పరిష్కారాలను అందించే సంస్థ ఇది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఇతర సంస్థలతో కలిసి ఈ సంస్థ ‘డెలివరింగ్ ఫర్ న్యూట్రిషన్ ఇన్ సౌత్ ఏషియా: కనెక్టింగ్ ది డాట్స్ ఎక్రాస్ సిస్టమ్స్’ అనే అంశంపై కొలంబోలో డిసెంబర్ 3,4,5 తేదీలలో అంతర్జాతీయ సదస్సు ఏర్పాటు చేస్తోంది. పోషకాహారం దాని ప్రభావిత అంశాల గురించి చర్చించడానికి ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన నిపుణులు, విధానకర్తలు, పరిశోధకులను ఏకతాటిపై తీసుకువస్తోంది.

మన దేశం నుంచి ఆరుగురు ప్రతినిధులు ఈ ప్రతిష్ఠాత్మకమైన సదస్సులో పాల్గొనబోతున్నారు. వారిలో సాయి ప్రియాంక ఒకరు. తన పరిశోధనకు సంబంధించిన అంశాలను ఈ అంతర్జాతీయ సదస్సులో ప్రియాంక వివరించనుంది.

ప్రత్యేక గ్రామాలు

తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా పస్తాపూర్, అర్జున్ నాయక్ తాండా, బిడకన్నె గ్రామాలకు వ్యవసాయ పరంగా ప్రత్యేకత ఉంది. వీటిని ‘ప్రత్యేక గ్రామాలు’ అనుకోవచ్చు. కొర్రలు, సామలు, ఊదలులాంటి సిరిధాన్యాలతో పాటు సుమారు 20 రకాల ఆకుకూరలు సాగు చేస్తుంటారు అక్కడి రైతులు. రసాయనాలు వినియోగించకుండా సేంద్రియ పంటలను పండిస్తున్నారు. దక్కన్ డవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) లాంటి సంస్థల ప్రోత్సాహంతో ఈ గ్రామాల్లోని రైతులు పౌష్టికాహారాన్ని ఇచ్చే ప్రత్యేక పంటలు సాగు చేస్తున్నారు.

పత్తి, సోయా, చెరుకు లాంటి వాణిజ్య పంటలు సాగు చేసే గ్రామాలతో పోల్చితే ఈ ప్రత్యేక గ్రామాల్లోని ప్రజలకు పౌష్టికాహారం ఏ మేరకు అందుతోందనే అంశంపై ఎంతో మంది రైతులతో మాట్లాడింది సాయిప్రియ.

‘అగ్రి న్యూట్రీ స్మార్ట్ విలేజెస్’ పేరుతో క్షేత్రస్థాయిలో పరిశోధనలు చేస్తోంది. రైస్, పప్పులులాంటి ఒకేరకమైన ఆహారంతో పాటు ఆకు కూరలు, సిరిధాన్యాలు తీసుకోవడం ద్వారా ఆ మూడు గ్రామాల ప్రజలు మెరుగైన పౌష్టికాహారం పొందగలుగుతున్నారని ఆమె పరిశోధనల్లో తేలింది. ఈ గ్రామాలతో పాటు హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్‌లోని గ్రామాల్లో కూడా పరిశోధనలు చేస్తోంది.

> **సంతోషంగా ఉంది**
>
> ‘అగ్రి న్యూట్రీ స్మార్ట్ విలేజ్’ అనే ప్రాజెక్ట్‌పై మూడు ప్రత్యేక గ్రామాల్లో నా పరిశోధనలు కొనసాగుతున్నాయి. ‘గ్లోబల్ హంగర్ ఇండెక్స్’లాంటి వాటి ఆధారంగా ఈ గ్రామాల్లో ఫుడ్ సెక్యూరిటీ ఇండెక్స్‌ను తయారు చేస్తున్నాము. ఇతర గ్రామాలతో పోల్చితే ఈ ప్రత్యేక గ్రామాల్లో కాస్త మెరుగైన పౌష్టికాహారం అందుతోంది. దక్షిణ ఆసియా దేశాలకు చెందిన సుమారు 600 మంది ప్రతినిధులతో కొలంబోలో జరిగే అంతర్జాతీయ సదస్సులో పాల్గొనే అవకాశం లభించినందుకు ఎంతో సంతోషంగా ఉంది.
>
> – సాయి ప్రియాంక, వ్యవసాయ శాస్త్రవేత్త

ఐఏఆర్‌ఐలో పీహెచ్‌డీ

ఖమ్మం పట్టణానికి చెందిన పగడాల సాయి ప్రియాంక పదో తరగతి వరకు ఖమ్మంలో, ఇంటర్ విజయవాడలో చదువుకుంది. తల్లిదండ్రులు రాజరాజేశ్వరి, నర్సింహారావులు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులే. ‘డాక్టర్ కావాల్సిందే’ ‘ఇంజనీర్ కావాల్సిందే’లాంటి సగటు తల్లిదండ్రుల ఆలోచనకు దూరంగా కూతురుకి వ్యవసాయ రంగంపై ఉన్న ఆసక్తిని ప్రోత్సహించారు.

వ్యవసాయ పరిశోధనపై ఎంతో ఆసక్తి ఉన్న సాయి ప్రియాంక అశ్వారావుపేటలో బీఎస్సీ అగ్రికల్చర్, మేఘాలయలోని సెంట్రల్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ పూర్తి చేసింది. ఢిల్లీలోని ఐఏఆర్‌ఐ (ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్)లో పీహెచ్‌డీ చేస్తోంది. ప్రస్తుతం జహీరాబాద్ ‘కృషి విజ్ఞాన కేంద్రం’లో అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సైంటిస్ట్‌గా పనిచేస్తోంది.

‘ఇవి మాత్రమే మనం చేరుకోవాల్సిన గమ్యాలు’ అని యువతరం ఒకే వైపు దృష్టి సారించినప్పుడు ఎన్నో రంగాలు మూగబోతాయి. ఆ రంగాలలో పరిశోధనలు ఉండవు. ప్రగతి ఉండదు. విభిన్న ఆలోచనలు ఉన్న సాయిప్రియాంక లాంటి అమ్మాయిలు తాము కొత్త దారిలో ప్రయాణించడమే కాదు ‘మనం ప్రయాణించడానికి, అన్వేషణ కొనసాగించడానికి ఒకే దారి లేదు. ఎన్నో దారులు ఉన్నాయి’ అనే విషయాన్ని చెప్పకనే చెబుతున్నారు. ఈ కోణంలో సాయిప్రియాంక ‘కృషి’ యువతరంలో ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తుంది.

– పాత బాల ప్రసాద్, సాక్షి, సంగారెడ్డి

హెల్త్



> ప్రపంచవ్యాప్తంగా... ఆమాటకొస్తే భారతీయ మహిళల్లో వచ్చే క్యాన్సర్లలో రొమ్ముక్యాన్సర్ విస్తృతియే చాలా ఎక్కువ. మొత్తం అన్ని రకాల క్యాన్సర్లను పరిగణనలోకి తీసుకుంటే రొమ్ముక్యాన్సర్‌కు గురయ్యేవారు 28 శాతం ఉంటారని అంచనా. తాజా ‘గ్లోబకాన్’ లెక్కల ప్రకారం మన దేశంలో రొమ్ముక్యాన్సర్ల కేసుల సంఖ్య 1,78,361 కాగా దురదృష్టవశాత్తు దాని వల్ల 90,408 మరణాలు సంభవించాయి. అయితే కేవలం రొమ్ముక్యాన్సర్‌పై సరైన అవగాహన లేని కారణం వల్లనే ఈ మరణాలు సంభవిస్తున్నాయంటున్నారు డాక్టర్లు. సాధారణంగా మహిళల్లో 40 - 50 ఏళ్ల వయసప్పుడు వచ్చే ఈ రొమ్ముక్యాన్సర్‌ను తొలి దశల్లోనే గుర్తిస్తే దీని నుంచి పూర్తిగా విముక్తి పొందవచ్చని భరోసా ఇస్తున్నారు. అక్టోబరు నెల రొమ్ముక్యాన్సర్ అవగాహన మాసం సందర్భంగా రొమ్ముక్యాన్సర్‌పై అవగాహన పెంపొందించడం కోసమే ఈ కథనం.

● రొమ్ము క్యాన్సర్...

ముందే గుర్తిద్దాం... గుండె కోత ఉండదు..

మహిళల్లో ఇటీవల రొమ్ము క్యాన్సర్లు పెరగడానికి ఆధునిక జీవనశైలి (లైఫ్ స్టైల్)తో పాటు మరికొన్ని అంశాలూ కారణమవుతున్నాయి. వాటిలో కొన్ని...

రిస్క్‌ఫ్యాక్టరు...

● సాధారణంగా రొమ్ముక్యాన్సర్‌కు కారణమయ్యే రిస్క్‌లో పెరిగే వయసు, దాంతోపాటు కుటుంబంలో రొమ్ముక్యాన్సర్లు ఉండటం, మొదటి నెలసరి చాలా త్వరగా రావడం, మెనోపాజ్ చాలా ఆలస్యం కావడం, జీవితకాలంలో పిల్లలు లేకపోవడం వంటివి. ● చిన్న వయసులోనే రొమ్ముక్యాన్సర్‌కు గురి అయ్యే మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌కు జన్యుపరమైన అంశాలే ప్రధాన కారణం. ఐదు నుంచి పది శాతం కేసుల్లో రొమ్ము క్యాన్సర్ ఉన్న కుటుంబ చరిత్ర ఉన్నవారిలోనే వస్తుండటం గమనార్హం. బీఆర్‌సీఏ1, బీఆర్‌సీఏ 2 వంటి జెనెటిక్ మ్యూటేషన్లు ఉంటే ఆ కుటుంబంలో రొమ్ము క్యాన్సర్ వచ్చే ముప్పు చాలా ఎక్కువ. ఇందులో బీఆర్‌సీఏ 1 జెనెటిక్ మ్యూటేషన్ వల్ల ముప్పు శాతం 72 % కాగా బీఆర్‌సీఏ 2 వల్ల 69% ముప్పు ఉన్నట్లు అధ్యయనాల్లో స్పష్టమైంది. ● ఇక నివారించగలిగే రిస్క్ ఫ్యాక్టర్లలో స్థూలకాయం ● ఆధునిక జీవనశైలిలో భాగంగా కొవ్వు పదార్థాలు, కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం ● మహిళల్లో వచ్చే హార్మోన్ మార్పులు ● ఆలస్యంగా పెళ్లిళ్లు చేసుకోవడం ● తల్లులు తమ బిడ్డలకు రొమ్ము పాలు పట్టకపోవడం. బిడ్డ పుట్టాక తల్లులు కనీసం ఆర్నెల్లు / ఏడాది పాటైన బిడ్డకు రొమ్ము పాలు పట్టించడం మేలు.

లక్షణాలు...

● మహిళలు తమలో అంతకు ముందు కనిపించని గడ్డలు చేతికి లేదా స్పర్శకు తెలుస్తున్నప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకూడదు. అవి హానికలిగించని (బినైన్) గడ్డలా, లేక హానికరమైనవా (మేలిగ్నెంట్) అని తెలుసుకున్న తర్వాతే వాటి గురించి నిశ్చింతగా ఉండాలి.

● రొమ్ములో ఒక గడ్డలా కదులుతూ రొమ్ముపైనున్న చర్మం నుంచి అది స్పర్శకు అందడం ● రొమ్ము చర్మం మందంగా మారడం ● రొమ్ములో సొట్ట పడినట్లుగా ఉండటం ● రొమ్ము ఆకృతిలో మార్పులు ● సమస్య ముదిరిన దశలో రొమ్ము అల్సర్స్.

నిపుల్‌కు సంబంధించినవి: రొమ్ముపై దద్దుర్ల వంటివి రావడం ●నిపుల్ లోపలికి ముడుచుకుపోయినట్లుగా ఉండటం ●రక్తం వంటివి స్రవించడం ● రొమ్ము పరిమాణంలో మార్పులు రావడం, వాటిలో గమనించగలిగే తేడా రావడం

బాహుమూలాల్లో: గడ్డ బాగా పెరిగి చంకలోనూ దాని స్పర్శ తెలవడం ● చేతివాపు (లింఫ్ ఎడిమా)


ఇమ్యూనో థెరపీ, టార్గెట్ థెరపీ: శస్త్రచికిత్సతో పాటు, రేడియేషన్ థెరపీ, హార్మోనల్ థెరపీ, కీమోథెరపీ వంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో బాధితులకు సరిపడే చికిత్సను డాక్టర్లు అందిస్తారు. వ్యాధి తొలిదశలో ఉంటే రొమ్మును రక్షిస్తూ, క్యాన్సర్ ఇతర అవయవాలకు వ్యాపించకుండా ఆపవచ్చు. ఇందుకోసం సర్జరీని మొదటి చికిత్సగా చేస్తారు. ఆ తర్వాత వ్యాప్తిని నివారించేందుకు హార్మోన్ థెరపీ, కీమోథెరపీ, రేడియోథెరపీలను చేస్తారు. రొమ్ము సర్జరీతో క్యాన్సర్ గడ్డను తొలగించడంతో పాటు అక్కడ పడిన సొట్టను పూడ్చుతూ ప్లాస్టిక్ సర్జరీని కలగలిపి శస్త్రచికిత్స చేస్తారు. కాబట్టి ఇప్పుడు రొమ్ముక్యాన్సర్ విషయంలో గతంలోలా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

క్యాన్సర్ ఎక్కువ స్టేజ్‌లో ఉన్నప్పుడు ‘నియో అడ్జువెంట్ థెరపీ’ అని ఇస్తారు. తర్వాతి చికిత్స మరింత ప్రభావవంతంగా ఉండటం కోసం డాక్టర్లు ఈ చికిత్స ఇస్తారు. వ్యాధి తీవ్రతను బట్టి ముందుగా ఆపరేషన్ చేయాలా, లేక కీమోథెరపీ ఇవ్వాలా అన్నది డాక్టర్లు నిర్ధారణ చేస్తారు.

రొమ్ము క్యాన్సర్‌ను మొదటి దశలోనే కనుగొంటే 90% పూర్తిగా నయమయ్యేందుకు అవకాశం ఉంది.

> **చికిత్స...**
>
> ఇప్పుడు క్యాన్సర్ ఉందని తెలిసినా వైద్యపరంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. దీన్ని మొదటి లేదా రెండో దశలో ఉండే పూర్తిగా నయం చేయవచ్చు. మహిళల్లో రొమ్ము క్యాన్సర్ తగ్గదనేది కేవలం అపోహ మాత్రమే.
>
> ఇక తొలి దశల్లో తెలిస్తే రొమ్మును తొలగించాల్సిన అవసరం కూడా ఇప్పుడు లేదు. కేవలం క్యాన్సర్ గడ్డను మాత్రమే విజయవంతంగా తొలగించవచ్చు. అయినా ఇప్పుడు ఉన్న ఆధునిక వైద్య పరిజ్ఞానంతో రొమ్మును తొలగించినా... లేదా రొమ్ములోనే కాస్తంత భాగాన్ని తొలగించినా ఆ ప్రాంతాన్ని భర్తీ చేసే శస్త్రచికిత్సలూ అందుబాటులో ఉన్నాయి.

> **నిర్ధారణ పరీక్ష...**
>
> ● తొలుత స్పర్శ ద్వారా ఏవైనా తేడాలు తెలుసుకోవడం ద్వారా ●మామోగ్రాఫీ అనే స్కాన్ ద్వారా ● ఫైన్ నీడిల్ ఆస్పిరేషన్ సైటాలజీ అనే పరీక్ష ● పూర్తి నిర్ధారణ కోసం వైద్యులు బయాప్సీ (అంటే చిన్న ముక్క తీసి పరీక్షకు పంపి చేసే నిర్ధారణ) ● ఛాతీ ఎక్స్‌రే ● కడుపు స్కానింగ్ ● ఎముకల స్కానింగ్ ● పెట్ స్కాన్.



డా. ఎమ్. బాబయ్య,
సీనియర్ కన్సల్టెంట్
అంకాలజిస్ట్

● బయట తాగినా డేంజర్!

స్మోకింగ్స్.. ఆ గర్భ శత్రువులే!

భర్తకు సిగరెట్ తాగే అలవాటు ఉంటే ప్యాసివ్ స్మోకింగ్ దుష్ప్రభావాలతో ఆ పొగ తాలూకు దుష్ప్రభావాలు దంపతులిద్దరిపైనా ఉంటాయన్న విషయం అనేక పరిశోధనల్లో తేలిందే. అయితే భర్త ఇంటి బయటెక్కడో సిగరెట్ తాగి ఇంటికి వచ్చినా ఆ పొగ దుష్ప్రభావం దంపతులిద్దరితో పాటు భార్య తాలూకు గర్భధారణపై కూడా పడుతుందంటున్నారు పరిశోధకులు.



భర్తకి స్మోకింగ్ అలవాటు ఉన్నప్పుడు అతడి పార్ట్‌నరైన భార్యకు గర్భధారణ బాగా ఆలస్యం కావచ్చు. దీనికి అనేక కారణాలున్నప్పటికీ... ముఖ్యంగా అతడి స్మోకింగ్ వల్ల భార్యలోని హార్మోన్ సైకిళ్లలోని జీవరసాయనాల్లో మార్పు రావచ్చు. ఫలితంగా ఆమెలో అండాల సంఖ్య బాగా తగ్గవచ్చు. ఒకసారి అండాల సంఖ్య తగ్గితే వాటిని తిరిగి పొందడం సాధ్యంకాదు.

మామూలు ఆరోగ్యవంతులైన దంపతులతో పోలిస్తే భర్తకు పొగతాగే అలవాటు ఉంటే... అతడి భార్యకు ప్రెగ్నెన్సీ వచ్చే అవకాశాలు బాగా తగ్గిపోతాయి. అంతేకాదు... గర్భస్రావమయ్యే అవకాశాలూ పెరుగుతాయి. ఒకవేళ గర్భధారణ జరిగాక కూడా బిడ్డ నెలలు నిండకముందే పుట్టే (ప్రీమెచ్యూర్ డెలివరీకి) అవకాశాలూ పెరుగుతాయి. అలా పుట్టే పిల్లల బరువు కూడా చాలా తక్కువగా ఉండే అవకాశముంది. భవిష్యత్తులో వాళ్లకు డయాబెటిస్, గుండెజబ్బులు, స్థూలకాయం వచ్చే అవకాశాలూ ఎక్కువే.



ఇక నేరుగా పొగతాగే పురుషుల విషయానికే వస్తే... ఆ దురలవాటు వల్ల వాళ్ల వీర్యంలోని శుక్రకణాల సంఖ్య, నాణ్యత, కదలిక, చురుకుదనం, వాటి ఆరోగ్యం తగ్గుతాయి. అది నేరుగా వారి సంతాన సాఫల్యంపై ప్రభావం చూపుతుంది.

అందుకే సమయానికి గర్భధారణ, మంచి ఆరోగ్యకరమైన శిశువును కోరుకునే వారు ఈ దురలవాటుకు దూరంగా ఉండటమే మంచిది. పొగతాగే అలవాటుకు దూరంగా ఉండటమన్నది కేవలం సంతాన సాఫల్యం అనే ఒక్క విషయంలోనే కాకుండా పురుషుల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు, భవిష్యత్తులో వారి పిల్లల పూర్తి ఆరోగ్యానికీ అది మేలు చేస్తుంది.

● బీ కేర్ ఫుల్


కిడ్నీలను కిడ్స్‌లా కాపాడుకుందాం

కిడ్నీలు ప్రతి రోజూ దేహంలో 200 లీటర్ల రక్తాన్ని శుభ్రం చేస్తూ... రక్తంలోని మాలిన్యాలనూ, వ్యర్థాలనూ ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉంటాయి. అవి దేహానికి హాని చేసే యూరియా, క్రియాటినిన్ లాంటి జీవరసాయనాలను వడపోసి మూత్రం ద్వారా ఎప్పటికప్పుడు బయటకు పంపేస్తాయి.

అయితే కిడ్నీల పనితీరు దాదాపు 70 – 80 శాతానికి పడిపోయేవరకు బాధితులకు ఆ విషయమే తెలియదు. ఒకసారి కిడ్నీలు గనక చెడిపోతే జీవక్రియల్లో వెలువడే ఎన్నో విషరసాయనాలు దేహంలోనే పేరుకుపోవడం మొదలవుతుంది. అది ప్రాణాలకే ముప్పు తెచ్చిపెట్టే ముప్పుగా పరిణమించే ప్రమాదం ఉంది. అయితే ఈ ముప్పు రెండు రకాలుగా ఉంటుంది. మొదటిది తాత్కాలికమైనది. రెండోది శాశ్వతమైనది.

కిడ్నీ ఫెయిల్యూర్‌ను తెలుసుకోవడం ఎలా?

బాధితుల దేహంలో కిడ్నీలు దెబ్బతిన్నప్పుడు ‘క్రియాటినిన్’ అనే వ్యర్థ రసాయనం రక్తంలో పేరుకుపోతుంది. సీరమ్ క్రియాటినిన్ అనే ఓ చిన్న రక్తపరీక్ష ద్వారా కిడ్నీలు బాగున్నాయా లేదా అన్నది తేలిగ్గా తెలుసుకోవచ్చు. కిడ్నీ జబ్బులను అత్యంత తొలిదశల్లో గుర్తించడానికి ఉపయోగపడే పరీక్ష స్పాట్ యూరిన్ అల్బుమిన్ క్రియాటినిన్ రేషియో పరీక్ష. ఇదొక సరళమైన మూత్ర పరీక్ష. మరీ ముఖ్యంగా షుగర్ ఉన్నవారిలో చాలా త్వరగా ఇది రాబోయే కిడ్నీ జబ్బులను పసిగడుతుంది. కిడ్నీ సమస్య తాత్కాలికమా, శాశ్వతమా అన్నది తెలుసుకోవడం ‘అల్ట్రాసౌండ్ స్కానింగ్’తో సాధ్యమవుతుంది.



కిడ్నీల సైజు మామూలుగానే ఉండి, క్రియాటినిన్ పెరుగుతూపోతే అది తాత్కాలిక సమస్య. మందులతో, జీవనశైలి పద్ధతులతో దాన్ని చక్కదిద్దవచ్చు. ఒకవేళ వాటి సైజు బాగా చిన్నగా మారితే అప్పుడది శాశ్వత సమస్య అయ్యే అవకాశాలు ఎక్కువ. తాత్కాలిక కిడ్నీ సమస్యను ‘అక్యూట్ కిడ్నీ ఇంజురీ’ అనీ, కిడ్నీ పనితీరు వేగంగా తగ్గుతూ పోతుంటే దాన్ని ‘ర్యాపిడ్‌లీ ప్రోగ్రెసివ్ రీనల్ ఫెయిల్యూర్’ (ఆర్‌పీఆర్‌ఎఫ్) అనీ, అదే పూర్తిగా శాశ్వతంగా దెబ్బతింటే దాన్ని ‘క్రానిక్ కిడ్నీ డిసీజ్’ (సీకేడీ) అని అంటారు.

శాశ్వత డయాలసిస్ నివారణ కోసం ఇవీ జాగ్రత్తలు...

డయాబెటిస్ పూర్తి అదుపు అవసరం: జీవితంలో డయాలసిస్ వద్దు అనుకునేవారు డయాబెటిస్‌ను పూర్తి అదుపులో ఉంచుకోవాలి. క్రమం తప్పకుండా మందులు తీసుకుంటూ, తగినంత వ్యాయామం చేయాలి.

బీపీ నియంత్రణ తప్పనిసరి: రక్తపోటు క్రమంగా శాశ్వతంగా కిడ్నీలు దెబ్బతినే క్రానిక్ కిడ్నీ డిసీజ్ వైపునకు తీసుకెళ్లే ప్రమాదముంది. అందుకే హైబీపీ ఉన్నవారు తమ రక్తపోటును అదుపులో ఉంచుకోవాలి.

అనవసరంగా పెయిన్‌కిల్లర్లు / యాంటిబయాటిక్స్ వద్దు

చాలామంది చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు యాంటీ బయాటిక్స్ వాడుతుంటారు. చిన్నపాటి నొప్పి కూడా తట్టుకోలేక నెలల తరబడి పెయిన్‌కిల్లర్స్ తీసుకుంటారు.డాక్టర్ల సూచన లేకుండా పెయిన్‌కిల్లర్లూ, యాంటీ బయాటిక్స్ వంటి ‘ఓవర్ ద కౌంటర్’ మందులు ఎట్టి పరిస్థితుల్లో వాడకూడదు. చిన్నా చితకా నొప్పులకు పారాసెటమాల్ మాత్ర వాడితే సరిపోతుంది.

ఎట్టిపరిస్థితుల్లో నాటు మందులు వద్దు...

కొందరు శాస్త్రీయత లేని వైద్యప్రక్రియలకు / నాటు మందులకు వెళ్తుంటారు. నాటుమందుల్లోని విషాలను వడపోసే క్రమంలో కిడ్నీలు మరింతగా పాడైపోయి, బాధితులను డయాలసిస్ వైపునకు తీసుకెళ్తాయి. కిడ్నీల ఆరోగ్యం బాగుండాలంటే ఎట్టిపరిస్థితుల్లోనూ నాటు మందులు వాడకూడదు.

ఈ జాగ్రత్తలతో శాశ్వత డయాలసిస్‌కు వెళ్లకుండా కిడ్నీల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.



డా. పి.ఎస్. వలి,
సీనియర్ కన్సల్టెంట్
నెఫ్రాలజిస్ట్


లక్ష్యం కివీస్ 107 పరుగులు... భారత్ 10 వికెట్లు!



మూడు రోజులుగా మలుపులతో టెస్టు క్రికెట్ మజాను చూపించిన బెంగళూరు మ్యాచ్ ఆసక్తికర ముగింపునకు చేరింది... తప్పులు సరిదిద్దుకొని రెండో ఇన్నింగ్స్‌లో చెలరేగిన భారత్‌కు తొలి ఇన్నింగ్స్ ప్రదర్శన వెంటాడింది... ఫలితంగా న్యూజిలాండ్ ముందు 107 పరుగుల అతి స్వల్ప లక్ష్యం... కాపాడుకోవాల్సిన పరుగులు తక్కువే కానీ ప్రత్యర్థి బౌలర్లు చెలరేగిన చోట మన బౌలర్లు నిలువరించలేరా, కుప్పకూల్చలేరా... బుమ్రా వేసిన తొలి నాలుగు బంతులు ఇదే నమ్మకాన్ని కలిగించాయి... అయితే చివరి రోజు బౌలింగ్‌తో పాటు వాతావరణం, పిచ్ కూడా మనకు కలిసి రావాలి!

35.1 ఓవర్లలో 177 పరుగులు...సర్ఫరాజ్, పంత్ భాగస్వామ్యం శనివారం భారత అభిమానులను అలరించింది...ఈ జోడీ మెరుపు బ్యాటింగ్‌తో భారీ లక్ష్యాన్ని నిర్దేశించే దిశగా జట్టు సాగుతున్నట్లు అనిపించింది... సర్ఫరాజ్ ఖాన్ కెరీర్‌లో తొలి సెంచరీతో మ్యాచ్‌ను చిరస్మరణీయం చేసుకోగా, శతకం చేజారినా...పంత్ చేసిన 99 పరుగులు ప్రత్యేకంగా నిలిచాయి. అయితే న్యూజిలాండ్ తీసుకున్న కొత్త బంతి భారత్ రాత మార్చింది. 408/3తో పటిష్టంగా కనిపించిన టీమ్ 54 పరుగులకే తర్వాతి 7 వికెట్లు కోల్పోయింది. దాంతో మ్యాచ్ మళ్లీ కివీస్ వైపు మొగ్గింది.

విజయంపై న్యూజిలాండ్ గురి ● పోరాడేందుకు టీమిండియా సిద్ధం
రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 462 ● సర్ఫరాజ్ 150, రిషభ్ పంత్ 99


పంత్

107 గతంలో 107 లేదా అంత కంటే తక్కువ లక్ష్యాన్ని సొంతగడ్డపై భారత్ ఒకే ఒక సారి కాపాడుకుంది. 2004లో స్పిన్‌కు బాగా అనుకూలించిన ముంబై టెస్టులో 107 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 93 పరుగులకే కుప్పకూలింది.

సర్ఫరాజ్

బెంగళూరు: భారత్ గడ్డపై 36 ఏళ్ల తర్వాత టెస్టు మ్యాచ్ నెగ్గేందుకు న్యూజిలాండ్ రంగం సిద్ధం చేసుకుంది. ప్రత్యర్థి ముందు భారత్ కేవలం 107 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 4 బంతులే ఎదుర్కొన్న కివీస్ పరుగులేమీ చేయలేదు. వెలుతురులేమి, ఆపై వాన కారణంగా అంపైర్లు ముందుగానే ఆటను నిలిపివేయాల్సి వచ్చింది. శనివారం 51.1 ఓవర్ల ఆట మాత్రమే సాగింది. అంతకు ముందు భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 99.3 ఓవర్లలో 462 పరుగులకు ఆలౌటైంది. సర్ఫరాజ్ ఖాన్ (195 బంతుల్లో 150; 18 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా...రిషభ్ పంత్ (105 బంతుల్లో 99; 9 ఫోర్లు, 5 సిక్స్‌లు) త్రుటిలో శతకం చేజార్చుకున్నాడు. రూర్కే, హెన్రీ చెరో 3 వికెట్లతో భారత్‌ను దెబ్బ తీశారు.

భారీ భాగస్వామ్యం...
ఓవర్‌నైట్ స్కోరు 231/3 వద్ద సర్ఫరాజ్, పంత్ నాలుగో రోజు ఉదయం జత కలిశారు. అక్కడినుంచి కివీస్ బౌలర్లపై వీరిద్దరి ఆధిపత్యం కొనసాగింది. ఒకరితో మరొకరు పోటీ పడుతూ పరుగులు సాధించగా...కివీస్ బౌలర్లంతా చేతులెత్తేశారు. లేట్ కట్, ర్యాంప్ షాట్లతో సర్ఫరాజ్ పరుగులు రాబట్టగా, స్లాగ్ స్వీప్‌లతో పంత్ విరుచుకుపడ్డాడు. ఒక దశలో 16 బంతుల వ్యవధిలో సర్ఫరాజ్ 5 ఫోర్లు బాదాడు. ఆ తర్వాత సౌతీ బౌలింగ్‌లో డీప్ కవర్ దిశగా కొట్టిన ఫోర్‌తో అతని సెంచరీ పూర్తయింది. ఆ తర్వాత పంత్ తన జోరును ప్రదర్శించారు. సౌతీ ఓవర్లో సిక్స్, ఫోర్ కొట్టిన అతను... పటేల్ ఓవర్లో 2 సిక్స్‌లు, ఫోర్‌తో చెలరేగాడు. ఆ తర్వాత 55 బంతుల్లో అతను హాఫ్ సెంచరీని అందుకున్నాడు. అయితే నిర్ణీత లంచ్ సమయానికి కాస్త ముందే ఆరంభమైన వర్షం...ఆ తర్వాతా కొనసాగడంతో ఆటకు అంతరాయం కలిగింది. ఆ తర్వాత ఆట మొదలయ్యాక వీరిని నిలువరించడంతో కివీస్ బౌలర్ల వల్ల కాలేదు. ఎట్టకేలకు కొత్త బంతి ఆ జట్టుకు కలిసొచ్చింది.

అదే వైఫల్యం...
150 పరుగులు పూర్తి చేసుకున్న వెంటనే సర్ఫరాజ్‌ను అవుట్ చేసి సౌతీ భారత్ పతనానికి శ్రీకారం చుట్టాడు. సౌతీ తర్వాతి ఓవర్లో సిక్స్‌తో పంత్ 96కు చేరుకున్నాడు. అయితే దురదృష్టం అతడిని వెంటాడింది. 99 పరుగుల వద్ద రూర్కే వేసిన బంతిని డ్రైవ్ చేయబోగా...అతని బ్యాట్‌ను తగిలి బంతి స్టంప్స్‌పై పడింది. చిన్నస్వామి స్టేడియంలో నిశ్శబ్దం ఆవరించగా, పంత్ నిరాశగా వెనుదిరిగాడు. ఆ తర్వాత భారత అభిమానులు మరింత నిరాశ చెందే సమయం వచ్చింది. తొలి ఇన్నింగ్స్ లాగే అదే వరుసలో రాహుల్ (12), జడేజా (5), అశ్విన్ (15) విఫలమయ్యారు. ఆ తర్వాత ఒకే ఓవర్లో హెన్రీ రెండు వికెట్లు తీసి భారత్ కథ ముగించాడు.

పంత్ రనౌట్ అయి ఉంటే...
సర్ఫరాజ్, పంత్ భాగస్వామ్యంలో ఒకే ఒక్క సారి కివీస్‌కు మంచి అవకాశం వచ్చింది. పంత్ 6 పరుగుల వద్ద ఉన్నప్పుడు సునాయాసంగా రనౌట్ చేసే అవకాశాన్ని జట్టు చేజార్చుకుంది. హెన్రీ వేసిన బంతిని పంత్ గల్లీ దిశగా ఆడగా సింగిల్ పూర్తి కాగా, రెండో పరుగు కోసం పంత్ బాగా ముందుకొచ్చేశాడు. సర్ఫరాజ్ వారించడంతో అతను వెనక్కి వెళ్లాడు కానీ క్రీజ్‌కు చాలా దూరంగా ఉన్నాడు. అయితే బంతిని అందుకునేందుకు తన స్థానం నుంచి చాలా దూరం జరిగిన కీపర్ బ్లన్‌డెల్ తన వెనక ఉన్న పరిస్థితిని గుర్తించలేకపోయాడు. అతను సరైన చోట ఉంటే పంత్ అక్కడే వెనుదిరిగేవాడు!

స్కోరు వివరాలు:
భారత్ తొలి ఇన్నింగ్స్ 46; న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ 402; భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (స్టంప్డ్) బ్లన్‌డెల్ (బి) పటేల్ 35; రోహిత్ (బి) పటేల్ 52; కోహ్లి (సి) బ్లన్‌డెల్ (బి) ఫిలిప్స్ 70; సర్ఫరాజ్ (సి) పటేల్ (బి) సౌతీ 150; పంత్ (బి) రూర్కే 99; రాహుల్ (సి) బ్లన్‌డెల్ (బి) రూర్కే 12; జడేజా (సి) యంగ్ (బి) రూర్కే 5; అశ్విన్ (ఎల్బీ) (బి) హెన్రీ 15; కుల్దీప్ (నాటౌట్) 6; బుమ్రా (సి) బ్లన్‌డెల్ (బి) హెన్రీ 0; సిరాజ్ (సి) సౌతీ (బి) హెన్రీ 0; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (99.3 ఓవర్లలో ఆలౌట్) 462. వికెట్ల పతనం:** 1-72, 2-95, 3-231, 4-408, 5-433, 6-438, 7-441, 8-458, 9-462, 10-462. **బౌలింగ్:** సౌతీ 15-2-53-1, హెన్రీ 24.3-3-102-3, విలియమ్ రూర్కే 21-4-92-3, ఎజాజ్ పటేల్ 18-3-100-2, ఫిలిప్స్ 15-2-69-1, రచిన్ 6-0-30-0.
న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లాథమ్ (బ్యాటింగ్) 0; కాన్వే (బ్యాటింగ్) 0; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం (0.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 0.**
బౌలింగ్: బుమ్రా 0.4-0-0-0.

7 టెస్టుల్లో పంత్ 90ల్లో అవుట్ కావడం ఇది ఏడో సారి. అతని ఖాతాలో 6 సెంచరీలు ఉన్నాయి.

7 భారత్ తరఫున ఈ టెస్టు రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి అత్యధికంగా ఏడుగురు డకౌట్ అయ్యారు. గతంలో ఇలాంటి ప్రదర్శన 1952లో (ఇంగ్లండ్‌పై) నమోదైంది.


వరల్డ్ కప్ ట్రోఫీతో ఇరు జట్ల కెప్టెన్లు వోల్‌వార్ట్, డివైన్

దక్షిణాఫ్రికా X న్యూజిలాండ్

నేడు మహిళల టి20 వరల్డ్ కప్ ఫైనల్
● తొలి టైటిల్ వేటలో ఇరు జట్లు
● రాత్రి గం.7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

దుబాయ్: ఒక వైపు న్యూజిలాండ్ 14 ఏళ్ల తర్వాత ఫైనల్ చేరి తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది... మరో వైపు దక్షిణాఫ్రికా వరుసగా రెండో సారి తుది పోరుకు అర్హత సాధించి ఈ సారైనా కప్‌ను ఒడిసి పట్టుకోవాలని పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలో మహిళల టి20 వరల్డ్ కప్‌కు రంగం సిద్ధమైంది. నేడు జరిగే పోరులో సఫారీ టీమ్‌తో కివీస్ తలపడనుంది. ఈ వరల్డ్ కప్ లీగ్ దశలో రెండు జట్ల ప్రస్థానం దాదాపు ఒకే తరహాలో సాగింది. ఇరు జట్లు చెరో 3 విజయాలు సాధించి లీగ్ దశలో తమ గ్రూప్‌నుంచి రెండో స్థానంలోనే నిలిచి సెమీస్‌కు అర్హత సాధించాయి. ఆరు సార్లు చాంపియన్ ఆస్ట్రేలియాను ఓడించి దక్షిణాఫ్రికా ముందంజ వేయగా...మరో మాజీ చాంపియన్ వెస్టిండీస్‌పై పైచేయి సాధించి కివీస్ ఫైనల్ చేరింది. సుదీర్ఘ కాలంగా మహిళల క్రికెట్‌లో తిరుగులేని ఆధిపత్యం కనబరుస్తున్న ఆస్ట్రేలియా, తమదైన రీతిలో క్రికెట్‌కు చిరునామాగా ఉన్న ఇంగ్లండ్‌లను దాటి రెండు కొత్త జట్లు ఇప్పుడు ఆటపై కొత్త ముద్ర వేసేందుకు ఈ ఫైనల్ సరైన వేదిక కానుంది. ఎవరు గెలిచినా కొత్త చాంపియన్ అవుతారనే విషయమే మహిళల క్రికెట్‌లో ఆసక్తిని రేపుతోంది. సమ ఉజ్జీల్లాంటి రెండు టీమ్‌ల మధ్య ఫైనల్ ఎంత హోరాహోరీగా సాగుతుందనేది చూడాలి.

ఇరు జట్లనుంచి అగ్రశ్రేణి క్రికెటర్లుగా ఎదిగిన సోఫీ డివైన్, సుజీ బేట్స్, మరిజాన్ కాప్‌లలో ఎవరికి వరల్డ్ కప్ చిరస్మరణీయంగా మారుతుందనేది ఆసక్తికరం. 2010లో ఫైనల్ ఆడిన కివీస్ జట్టులో డివైన్ సభ్యురాలిగా ఉంది. ఆమెతో పాటు అమేలియా కెర్, ప్లిమ్మర్, తహుహు, కార్సన్, రోజ్ మేరీలపై జట్టు విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. దక్షిణాఫ్రికా టీమ్‌లో బేట్స్, కాప్‌లతో పాటు కెప్టెన్ లారా వోల్‌వార్ట్, తజ్‌మీన్, ఎమ్‌లాబా కీలకం కానున్నారు. ఈ మ్యాచ్‌లోకి బరిలోకి దిగడం ద్వారా మహిళల క్రికెట్‌లో అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన మిథాలీ రాజ్ (333) రికార్డును బేట్స్ సవరించనుంది. సెమీస్‌లో అర్ధసెంచరీతో ఆసీస్ పని పట్టిన అనెక్ బాష్ మరో మంచి ఇన్నింగ్స్ ఆడాలని పట్టుదలగా ఉంది. తుది జట్లలో ఎలాంటి మార్పు చేయకుండా సెమీస్ ఆడిన టీమ్‌లనే కొనసాగించే అవకాశం ఉంది. దుబాయ్‌లో వాతావరణం అన్ని రకాలుగా అనుకూలంగా ఉంది. టోర్నీలో ఒక్కసారి కూడా వాన వల్ల మ్యాచ్‌లకు అంతరాయం కలగలేదు. మంచు సమస్య కూడా లేదు కాబట్టి స్పిన్నర్లు మంచి ప్రభావం చూపగలరు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా


సన్నీ డియోల్

పవర్‌ఫుల్ యాక్షన్

బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'జాత్' అనే టైటిల్ ఖరారైంది. ఈ పవర్‌ఫుల్ యాక్షన్ ప్యాక్డ్ మూవీకి గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్నారు. రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్, సయామీ ఖేర్, రెజీనా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకాలపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శనివారం (అక్టోబరు 19) సన్నీ డియోల్ బర్త్ డే. ఈ సందర్భంగా 'జాత్' టైటిల్‌ను ప్రకటించి, ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి సంగీతం: తమన్.


రకుల్‌ప్రీత్ సింగ్

వ్యాయామాలు చేసే సమయంలో కాస్త జాగ్రత్తగా ఉండాలని, లేకపోతే తనలానే ఇబ్బంది పడాల్సి వస్తుందని అంటున్నారు రకుల్‌ప్రీత్ సింగ్. ఇంతకీ విషయం ఏంటంటే... వ్యాయామాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే రకుల్ ఇటీవల హెవీ వర్కౌట్ చేశారు. ఈ కారణంగా ఆమెకు గాయం కావడంతో ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయంపై రకుల్ స్పందించారు. ''నా ఆరోగ్యం గురించి నేనొక అప్‌డేట్ ఇస్తున్నాను. నేనొక పిచ్చి పని చేశాను. నా శరీరం చెప్పే మాటను నేను పట్టించుకోలేదు. హెవీ వర్కౌట్ చేశాను. ఇందుకు ఫలితంగా నేను గాయపడ్డాను. ఆరు రోజులుగా నేను బెడ్‌పై విశ్రాంతి తీసుకుంటున్నాను. పూర్తి స్థాయిలో

నేనో పాఠం నేర్చుకున్నాను

నేను కోలుకోవడానికి మరో వారం రోజులు పడుతుందనిపిస్తోంది. నేను తొందరగానే కోలుకుంటానని అనుకుంటున్నాను. ఎందుకంటే రెస్ట్ తీసుకోవడం అనేది నాకు ఇష్టం ఉండదు. అలాగే నేనొక పాఠం కూడా నేర్చుకున్నాను. మీకు మీ శరీరం ఏదైనా సిగ్నల్ ఇచ్చినప్పుడు పట్టించుకోండి. తేలికగా తీసుకుని బలవంతంగా వర్కౌట్స్ చేయకండి. నాకు తెలిసి నా శరీరం కన్నా నా బ్రెయిన్ స్ట్రాంగ్ అనుకుంటున్నాను. కానీ అన్ని వేళలా ఇది వర్కౌట్ కాదు. ఇక నా మేలును ఆశించి నాకు సందేశాలు పంపుతున్న వారికి థ్యాంక్స్. నేను త్వరలోనే కోలుకుని, మరింత స్ట్రాంగ్‌గా వస్తాను'' అని పేర్కొన్నారు రకుల్ ప్రీత్‌సింగ్. ఇదిలా ఉంటే.. 80 కేజీల బరువు ఎత్తడంవల్లే రకుల్‌కి గాయం అయిందని బాలీవుడ్ టాక్.

ఆ సినిమాలూ ఇండస్ట్రీని నడిపిస్తాయి
- సుధీర్ బాబు


● సింధు, సుధీర్ బాబు, విశ్వప్రసాద్, రిషికేశ్వర్, శివకుమార్, నితిన్ ప్రసన్న

'నరుడి బ్రతుకు నటన' ట్రైలర్ చాలా బాగుంది. శివ, నితిన్ ప్రసన్న ఎంతో ఇంటెన్స్‌గా నటించారు. నా చిత్రంలో ఏదైనా మంచి పాత్రలు ఉంటే వారిని సూచించాలనుకుంటున్నాను. రిషి ఈ మూవీని అద్భుతంగా తీశాడు. పెద్ద సినిమాలే కాదు.. చిన్న చిత్రాలు, మీడియం చిత్రాలూ ఇండస్ట్రీని నడిపిస్తాయి. 'నరుడి బ్రతుకు నటన' చిత్రాన్ని అందరూ చూసి సక్సెస్ చేయాలి'' అని హీరో సుధీర్ బాబు అన్నారు. శివకుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'నరుడి బ్రతుకు నటన'. రిషికేశ్వర్ యోగి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో శ్రుతీ జయన్, ఐశ్వర్యా అనిల్ కుమార్, వైవా రాఘవ్ ఇతర పాత్రలు పోషించారు. టీజీ విశ్వప్రసాద్, సుకుమార్ బోరెడ్డి, డా. సింధు రెడ్డి నిర్మించారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి సుధీర్‌బాబు, దర్శకులు వీర శంకర్, శ్రీరామ్ ఆదిత్య, నటీనటులు వితికా శేరు, వీజే సన్నీ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ వేడుకలో టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ– ''సినిమాపై ప్యాషన్, డబ్బులుంటే సినిమాలు తీయలేం. నేను ప్రారంభంలో కొన్ని చిత్రాలను నిర్మించాను. కానీ, థియేటర్‌లో విడుదల చేయలేకపోయాను. 'నరుడి బ్రతుకు నటన' టీమ్‌ని చూసినప్పుడు నాకు పాత రోజులు గుర్తుకొచ్చాయి. అందుకే వారికి హెల్ప్ చేయాలని ముందుకు వచ్చాను'' అని తెలిపారు. ''యూనివర్సల్ సబ్జెక్టుతో రూపొందిన చిత్రమిది'' అన్నారు రిషికేశ్వర్ యోగి, సింధు రెడ్డి, శివకుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న.

అలాంటి పాత్రలు రెగ్యులర్‌గా రావు
- అజయ్

''విక్రమార్కుడు' సినిమా తర్వాత ఆ స్థాయిలో విలన్ వేషాలు నాకు తక్కువగానే వచ్చి ఉంటాయి. అవి కూడా చాలా వరకు రాజమౌళిగారి సినిమాల్లోనే ఉన్నాయి. టిట్ల ('విక్రమార్కుడు'లో అజయ్ పాత్ర) లాంటి క్యారెక్టర్స్ రెగ్యులర్‌గా రావు. ఇక 'పొట్టేల్' సినిమాలో నేను చేసిన పటేల్ క్యారెక్టర్‌లో చాలా షేడ్స్ ఉన్నాయి. నటుడిగా సంతోషం ఇచ్చిన పాత్ర ఇది'' అని అజయ్ అన్నారు. యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'పొట్టేల్'. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగే నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న రిలీజ్ అవుతోంది. ఈ చిత్రంలో పవర్‌ఫుల్ రోల్ చేసిన అజయ్ మాట్లాడుతూ– ''సాహిత్ చెప్పిన కథ, నా పాత్ర బాగా నచ్చాయి. పటేల్ పాత్రని అద్భుతంగా చేయాలనిపించింది. పాప చదువు కోసం పోరాటం చేసే నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. మూఢ నమ్మకాలు, వాటిని అడ్డం పెట్టుకుని బతికే మనుషులు, మొండితనం, గ్రామదేవతల గురించి ఈ సినిమా ఉంటుంది. ఇందులోని కొన్ని సన్నివేశాలకు ప్రేక్షకులు విజిల్స్ వేస్తారు. డైరెక్టర్స్ కొరటాల శివ, సందీప్ రెడ్డి వంగాగార్లకి ఈ సినిమా చూపించాను... వారికి బాగా నచ్చింది. ఇక హిందీలో అజయ్ దేవగన్‌గారితో 'సింగం ఎగైన్' చేశాను. 'పుష్ప–2 ది రూల్' చేస్తున్నాను. అలాగే తమిళ, మలయాళ సినిమాలు కూడా చేస్తున్నాను'' అన్నారు.



త్వరలోనే ఆ రుణం తీర్చుకుంటాను
- సాయి రాజేష్


● సుజాత, అంజి, అనన్య కృష్ణన్, అనసూయ, సాయి రాజేష్, రాకేష్

''నేను తీసిన 'హృదయ కాలేయం' సినిమా ఆడియో ఫంక్షన్‌కి వచ్చి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా స్కిట్ చేశాడు రాకేష్. ఆ రోజు మాకు సపోర్ట్ చేసిన తనకి కెరీర్‌లో బెస్ట్ క్యారెక్టర్ రాస్తానని మాట ఇచ్చాను. త్వరలోనే ఆ పాత్ర రాసి రుణం తీర్చుకుంటాను. 'కేసీఆర్' సినిమా ట్రైలర్ బావుంది. సినిమా విజయం సాధించి, రాకేష్ మంచి స్థాయికి వెళ్లాలి'' అని డైరెక్టర్ సాయి రాజేష్ అన్నారు. 'జబర్దస్త్' ఫేమ్ రాకింగ్ రాకేష్ హీరోగా నటించిన చిత్రం 'కేశవ చంద్ర రమావత్' (కేసీఆర్). 'గరుడవేగ' అంజి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అనన్య కృష్ణన్ కథానాయికగా నటించారు. రాకింగ్ రాకేష్ నిర్మించిన ఈ మూవీ త్వరలో విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ వేడుకలో రాకింగ్ రాకేష్ మాట్లాడుతూ– ''లంబాడీ వర్గానికి చెందిన ఓ యువకుడి నిజ జీవితం నుంచి స్ఫూర్తి పొందిన చిత్రమిది'' అని తెలిపారు. ''కేసీఆర్'కి నేను దర్శకత్వం వహించడంతో పాటు సినిమాటోగ్రఫీ కూడా అందించాను. రాకేష్ అద్భుతమైన కథ రాశారు'' అని 'గరుడవేగ' అంజి చెప్పారు. నటి అనసూయ మాట్లాడుతూ– ''కొన్ని డబ్బులు సంపాదిస్తే ఇల్లు, కారు కొనుక్కోవాలనుకుంటారు. కానీ, రాకేష్ మాత్రం 'కేసీఆర్'లాంటి ఒక మంచి సినిమా తీశాడు'' అని పేర్కొన్నారు.

సీరియస్ సాహు


● నవీన్ చంద్ర

వరుణ్ తేజ్ హీరోగా నటించిన చిత్రం 'మట్కా'. నోరా ఫతేహి, మీనాక్షీ చౌదరి హీరోయిన్లు. ఈ సినిమాలో నవీన్ చంద్ర కీ రోల్ చేశారు. డా. విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మించిన ఈ చిత్రం నవంబరు 14న రిలీజ్ కానుంది. కాగా ఈ సినిమాలో సాహు పాత్రలో నవీన్ చంద్ర నటించినట్లు వెల్లడించి, స్కూటరుపై కూర్చుని, సీరియస్‌గా చూస్తున్న ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు.

Gold Memories

మనిషి జీవితానికి ప్రతిబింబం సినిమా. ఎన్నో అద్భుతమైన చిత్రాలు మన మదిలో జ్ఞాపకాలుగా ఉన్నాయి. అవి బంగారు జ్ఞాపకాలు. అందుకే 'సాక్షి యూట్యూబ్' ఇక ప్రతివారం ఓ సినిమాతో మీ మనస్సును తట్టే ప్రయత్నం చేస్తుంది 'గోల్డెన్ మెమొరీస్' రూపంలో. ఈ వారం 'గోల్డెన్ మెమొరీస్'లో అలనాటి ఆణిముత్యం 'మాయాబజార్' గురించి తెలుసుకోవాలంటే ఈ క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేస్తే చాలు.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం 'ఖేల్ ఖేల్ మే' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

ఈ ఆట మామూలుగా ఉండదు



'ఖేల్ ఖేల్ మే'... 'పర్‌ఫెక్ట్ స్ట్రేంజర్స్' అనే ఇటలీ సినిమాకి హిందీ రీమేక్ ఇది. ఈ ఇటలీ సినిమా ఇప్పటికే రెండు సార్లు మలయాళంలో మరో పాతిక సార్లు వివిధ దేశాలలో... మొత్తంగా ప్రపంచ దేశాల్లో 27 సార్లు రీమేక్ అయింది. తొలుత ఈ చిత్రాన్ని ఇటలీ దర్శకుడు పావోలో 2016లో తీశారు. ఈ సినిమా ఎన్నో ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో చోటు సంపాదించుకోవడమే కాదు ఎన్నో అవార్డులు రివార్డులతో పాటు విమర్శకుల ప్రశంసలు కూడా సంపాదించుకుంది. ఇక 'ఖేల్ ఖేల్ మే' సినిమా విషయానికి వస్తే... ముదస్సర్ అజీజ్ అనే దర్శకుడు ఈ సినిమాకి దర్శకత్వం వహించారు. అక్షయ్ కుమార్, తాప్సీ, ఫర్దీన్ ఖాన్, ప్రగ్యా జైస్వాల్ వంటి స్టార్స్ ఈ చిత్రంలో నటించారు. కథాపరంగా... 'ఖేల్ ఖేల్ మే' చాలా సింపుల్ మరియు సెన్సిబుల్ లైన్. మూడు జంటలు జైపూర్‌లో ఓ పెళ్ళిలో కలుస్తారు. పెళ్ళి ఉదయం కావడంతో రాత్రంతా నిద్రపోవడమెందుకని సరదాగా అందరూ ఓ ఆట ఆడదామనుకుంటారు. ఆ ఆటే ఈ సినిమా. ఆటేమిటంటే... ఉన్న ఆరుమంది కలిసి వాళ్ళ ఫోన్లు టేబుల్ మీద పెట్టి ఆట అయ్యేంతవరకు ఏ ఫోన్‌లో మెసేజ్ లేక కాల్ వచ్చినా అందరి ముందూ చదవాలి, చూపించాలి. ఇలా ఆట మొదలవగానే ఒక్కొక్కరికి వ్యక్తిగత మెసేజ్, కాల్స్ వస్తుంటాయి. దాంతో వాళ్ళ పార్టనర్స్‌తో వాళ్లకు గొడవలు మొదలవుతాయి. ఈ చిత్రంలో రిషబ్ మాలిక్ పాత్రను అక్షయ కుమార్ హుందాగా పోషించారు. మిగిలిన వారందరూ వారి పాత్రలకు న్యాయం చేశారు. మామూలు సూపర్ యాక్షన్ సస్పెన్స్ థ్రిల్లర్ మించి ఉంటుంది ఈ సినిమా స్క్రీన్‌ప్లే. ఒక్కొక్కరి ఫోన్‌లో వ్యక్తిగత విషయాలు బయటపడుతూ ఉంటే దానికి వాళ్ళ టెన్షన్ ఒక ఎత్తయితే చూసే ప్రేక్షకుడు అంతకు మించి ఫీలవుతాడు. ఏదేమైతేనేం సినిమా మాత్రం మంచి ఎంటర్‌టైనర్. ఆఖరుగా ఒక్క మాట... ఈ సినిమా చూసేంతవరకు అయితే పర్వాలేదు, కానీ ఇంట్లో మాత్రం దీనిని ఆడవద్దని మనవి. ఎందుకంటే ఈ ఆట మామూలుగా ఉండదు.

– ఇంటూరు హరికృష్ణ

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



కుల, కట్నం ప్రసక్తి లేదు/SC మాల/లేటు మ్యారేజ్ /46/ 5'1"/B.Tech, MBA/LLB, Ph.D/40K PM/కొంచెం శారీరక వైకల్యం (కాలు)/ హైదరాబాద్‌లో స్థిరపడిన వరునికి 1st/2nd వధువు కావలెను (డైరెక్ట్) Ph: 7702438915 [H-782785]

క్రిస్టియన్ మాల/కట్నం ప్రసక్తి లేదు/29/ 5'11"/M.Tech, NIT/Govt.స్టీల్ ప్లాంట్ మేనేజర్/1.20 Lakhs. PM అందమైన వరునికి తగిన వధువు కావలెను. Ph: 6309258463 [HA-16404]

రజక/కట్నం ప్రసక్తి లేదు/ B.Tech / C. Govt. బ్యాంక్ మేనేజర్/SBI/90,000/-PM/ 5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-16404]

వడ్డెర/కట్నం ప్రసక్తి లేదు/ B.Tech / C. Govt. బ్యాంక్ మేనేజర్/ఆంధ్రా బ్యాంక్/80,000/- PM/5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-16404]

హిందూ మాదిగ/కట్నం ప్రసక్తి లేదు/ B.Tech / C.Govt. సైంటిస్ట్/ ఇస్రో/ 1,20,000/-PM/6'ఎత్తు/30 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-16404]

వడ్డెర/కట్నం ప్రసక్తి లేదు/ B.Tech / C. Govt. బ్యాంక్ మేనేజర్/ SBI/ 80,000/- PM/5'10'ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph:7075953400 [HA-16404]

యాదవ/కట్నం ప్రసక్తి లేదు/M.Tech IT/ Govt.A.E.E./ఇరిగేషన్ Dept/18 Lakhs. PA/5'8"ఎత్తు /28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9515755529 [HA-16407]

SC మాల & క్రిస్టియన్/కట్నం ప్రసక్తి లేదు/ M.Tech IT/ C.Govt. డిప్యూటీ మేనేజర్/ SBI/85000/-PM/5'9"ఎత్తు/ 28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-16407]

కుల పట్టింపు లేదు/35/5'6"/లేట్ మ్యారేజ్ / Pvt Job గల వరునికి లేటు మ్యారేజ్, విడో, డైవర్సీ (పిల్లలున్నా OK) వధువు కావలెను. 9499947658 [HA-16407]

37 సం॥ గల/బిజినెస్ చేసే వరునికి 1వ లేదా 2వ సంబంధం వధువు కావలెను. పిల్లలు ఉన్నా పర్వాలేదు. కుల ప్రసక్తి లేదు. నో డౌరీ. Ph: 9866724586, 6301943220 [H-783404]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Contact : K.C. Reddy, Hyderabad. Ph : 9849321309 / 9347807015. Please Check my Whatsapp Status. Email: kcreddy43@gmail.com, Facebook.com / Subscribe Telegram Channel- kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/B.Tech/MS/H1 / USA *1998/6'/ 80Cr *1995/5'9"/50Cr *88/ 5'10"/ 100Cr * 90/5'7'/ 50Cr *91/5'11"/200Cr * Cont: K.C. Reddy- Hyd. Ph: 9849321309/9347807015

Reddy/RICH/ Business *B.Tech/MBA/ 1995/5'11"/100Cr *1995/5'10"/300Cr *95/ 6'/150Cr *94/5'10"/100Cr *97/ 5'11"/100Cr * Cont: K.C.Reddy- Hyd- Ph: 9347807015

Reddy/Business *MBA/1995/5'9"/ 500 Cr *94/5'11"/300Cr *95/6'/100Cr *90/ 6'/ 1000Cr *89/5'11"/400Cr *Cont : K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/Divorcee *B.Tech/Business *1981/ 5'8"/500Cr *94/5'11"/300Cr *79/5'9"/300Cr *86/5'11"/70L/yr/15Cr *75/5'11'/1Cr/yr/50Cr *Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/Divorcee/ MS/ H1/USA *1990/ 5'9"/300K/40Cr *92/ 6'/100K/ 30Cr *95/ 5'9"/ 200K/25Cr *86/5'11"/300K/40Cr. * Cont. K.C. Reddy- Hyd-Ph: 9849321309

Reddy / IIT/B.Tech/94/5'11"/1Cr/yr/10 Cr *94/5'9"/1Cr/yr/30Cr *94/5'11"/70L/yr/25 Cr *92/5'7"/50L/yr/25Cr * Cont : K.C. Reddy- Hyd. Ph : 9347807015/ 9849321309

Reddy/IIT/USA/B.Tech/MS/H1/*1996/6"/ 25Cr *95/5'7"/300K/10Cr *1993/5'9"/200K/ 20Cr *1991/5'10"/200K * Cont : K.C. Reddy-Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/MBBS/MD/1993/5'10"/50Cr *1994/5'10"/70Cr *1996/6'/50Cr *1995/ 5'10"/400Cr *1993/5'10"/20Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/USA-doctors *1992/6' *1989/5'9" *92/5'11" *91/5'10" *90/6'/50Cr *83/ 5'6"/ 50Cr *75/6'/600K/ * Cont: K.C. Reddy- Hyd- Ph: 9849321309 / 9347807015

Reddy/B.Tech/MS/H1/USA *1998/6'/ 300 Cr *1997/5'9"/70Cr *94/5'9"/200Cr * 95/5'10"/75Cr *1997/6'/400Cr * Cont: K.C. Reddy-Hyd.Ph: 9347807015/9849321309 [D-556]

వరుడు కావలెను

Reddy/IIT/BITS/2000/5'7"/45L/yr/10Cr *97/5'4"/25L/yr *98/5'3"/70L/yr *94/5'4"/ 150K *96/5'7" 90/5'8"/30Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/Most Beautiful *1995/ 5'5"/100Cr *1994/5'4" /20Cr *94/5'5"/15Cr *2001/5'3" /20Cr *93/5'3"/500Cr * Cont : K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/USA- Citizen *BBA/1994/5'2" *96/5'3"/115K/30Cr *99/ 5'6"/100Cr *Aus-Citizen/97/5'4"/10Cr *2000/ 5'3"/ 30Cr * Cont. K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/Divorcee/MBBS/MD/1994/5'5"/50 Cr *86/5'6"/50Cr *92/5'3"/9Cr *91/5'4"/10Cr *B.Tech/93/5'4"/10Cr *88/5'6"/30Cr * Cont : K.C. Reddy -Hyd-Ph: 9347807015

Reddy/Divorcee*B.Tech/1991/5'4"/10Cr *85/5'5"/400Cr *USA -MS/95/5'5"/10Cr *93/5'7/15Cr *85/5'6"/10Cr *86/5'6"/30Cr *Cont: K.C. Reddy-Hyd.Ph: 9849321309

Reddy/B.Tech/ Most Beautiful / Rich *1999/5'7"/100Cr *95/5'5"/70Cr *97/5'4"/ 150Cr *95/5'8"/100Cr *94/5'3"/400Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/Rich *1996/5'7"/50Cr *99/ 5'8"/25Cr *1998/5'5"/100Cr *95/5'3"/75Cr *90/5'4"/50Cr *93/5'7"/100Cr * Cont : K.C. Reddy-Hyd-Ph: 9849321309/9347807015

Reddy/MBBS/PG *2000/5'6"/100Cr *94/5'6"/100Cr *95/5'5"/100Cr *98/ 5'7"/ 50Cr *97/5'6"/300Cr *93/5'4"/50Cr * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309

Reddy/B.Tech/MS/H1/USA *1997/5'4"/100Cr *96/5'3"/30Cr *97/5'5"/60Cr *98/5'4"/10Cr *99/ 5'6"/100Cr *97/5'5"/10Cr * Cont : K.C. Reddy- Hyd-Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/MS/H1/USA *1996/5'8"/15Cr *96/5'7"/50Cr *96/5'5"/15Cr *96/5'6"/30Cr *96/5'5"/10Cr *88/5'4"/50Cr *86/5'5"/50Cr * Cont : K.C.Reddy-Hyd. Ph: 9849321309

రెడ్డి/5'11"/MS/USA CITIZEN/ 34y/ Well Settled వరునకు అందమైన తగిన వధువు కావలెను (నో బ్రోకర్స్) 9849038209 [H-800516]

Gavara, Caste No Bar, 38y/ Fair / 5'8" / Central Govt., Divorced, 9yr Boy W/Mom. Ph: 8712133567 [HA-05312]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి California, BE, MS, 28, 5' 9", 50 Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 6', Engineer, 300 K, H1, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Sanfrancisco, BE, MS, 29, 6' 1", 200 K, 80 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 11", Sr. Developer, 30 Crores, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Citizen, BS, 28, 5' 6", SWE, 50 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Dallas, BE, MS, 27, 5' 7", Analyst, 90 K, H1, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 2", SWE, 130 K, H1, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 3", Product Manager, 150 K, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



www.avinashreddy.com
అవినాష్ రెడ్డి మ్యారేజెస్
(రెడ్లలకు మాత్రమే)
690, Road No.3, Banjara Hills, (TV 9 : Opp. Colony) Hyderabad
D.V. Koti Reddy
98480 11818, 93933 11818

రెడ్డి BE, MS, 33, 5' 11", SWE, 295 K, H1, USA, Handsome, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MSIT (IIIT), MS, 30, 6' 2", Sr. Engineer, 10 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 33, 5' 8", Analyst, 120 K, 10 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 34, 6' 1", Engineer, 220 K, 40 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 25, 5' 6", SWE, 2 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 6", Developer, 110 K, 5 Crores, H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5' 7", Rich Family, H1, USA, Rich Family, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, MS, 32, 5' 7", Data Manager, 200 K, 5 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

★

జి.డి. గౌడ్ Hight: 5'4" వయస్సు : 41 సంవత్సరాలు. అందమైన వధువు కావలెను. ఫోన్ నంబరు : 9391270328 [H-1177538]

రెడ్డి/విడోవర్/50yrs/5'11"/ పిల్లలు USA లో సెటిల్డ్, భూములు, కోట్లాది స్థిరాస్తులు కలిగినటువంటి, కుల ప్రసక్తి లేని సెటిల్డ్ వధువు కావలెను. సంప్ర : 8639618117 [H-783358]

కాపు Caste / 50 Age / 5'11" Height / Caste No Bar. వెల్ సెటిల్. భాగస్వామి కొరకు. Ph : 9963554089 [HA-05311]

వరుడు కావలెను



రెడ్డి/2nd మ్యారేజ్/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/డిగ్రీ, Age: 30/సొంత బిజినెస్ గల అందమైన వధువుకి వరుడు కావలెను. 1st or 2nd OK/ (ఇల్లరికము సంబంధాలు కలవు) Ph: 9032596676 [HA-16407]

కుల, ఆస్తి పట్టింపు లేదు/జాబ్, వ్యాపారం, ఫ్లాట్స్, 4L/PM 5 కోట్ల ప్రాపర్టీ గల అందమైన సాంప్రదాయ వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. ఇల్లరికం OK. ముఖాముఖి కల్పించబడును. Ph: 7207636129 [H-796696]

రెడ్డి/2nd మ్యారేజ్ (కుల, ఆస్తి) పట్టింపు లేదు, 32Y/ డిగ్రీ (ప్రైవేట్ జాబ్, ల్యాండ్) వధువుకి, వరుడు కావలెను. (ఇల్లరికం OK) అన్ని వయస్సుల వారికి 1st-2nd సంబంధాలు కలవు. Ph: 9573002847 [HA-16407]

కాపు/35y/కుల పట్టింపు లేదు/ఫెయిర్/ Govt. ఎంప్లాయ్/3,00,000/- (PM)/వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ & 3 సొంత ఇల్లులు కలిగిన వధువుకి వరుడు కావలెను. (1st, 2nd మ్యారేజ్ & ఇల్లరికం OK) సంప్ర : 8374802603 [H-796696]

రెండవ పెళ్ళి/విడో/46y/సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్/1 L. PM/Own House/16 ఎ॥ ల్యాండ్స్ కోట్ల ప్రాపర్టీ గల వెల్ సెటిల్ వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. Ph: 9502841979 [H-782785]

చౌదరి/విడో/49y/MBA/Bank Emp/VRS/Family పెన్షనర్/80K PM/ట్రాన్స్‌పోర్ట్ బిజినెస్/Lands 2L. PM/ 20 ఎ॥తోటలు, కోట్ల ప్రాపర్టీ గల వధువుకు ఇల్లరికపు వరుడు కావలెను (పిల్లలున్నా OK) Ph: 7702043224 [H-782785]

కుల ప్రసక్తి లేదు/విడో/50y/విజయవాడ/Hyd లో Own House (Rents) Lands/Well Settled పిల్లలులేని ఏ బాదరబందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 7997175138 [H-782785]

SC మాల/B.Tech/C.Govt.ట్యాక్స్ ఆఫీసర్ /ఇన్‌కమ్‌ట్యాక్స్ Dept/60,000/-PM/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-16404]

క్రిస్టియన్ మాదిగ/B.Tech, IIT/Govt. గెజిటెడ్ ఆఫీసర్/ఇరిగేషన్ Dept/80,000/- PM/5'4" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-16404]

యాదవ/B.Tech/Govt.కస్టమ్స్ ఆఫీసర్ /80,000/-PM / 5'4"ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7075953400 [HA-16404]

మంచి గుణము, ఆస్తి, అందము గల వధువుకి మంచి గుణము గల కరెక్ట్ వరుడు కావలెను. *OC/1997/ 5'4"/ MBA. గోల్డ్ మెడలిస్ట్/30 ఎకరాలు/15 కోట్ల ఆస్తి. అర్జెంట్. వాట్సాప్ : 8187053655, 9492211057 [HA-16404]

క్రిస్టియన్ మాల/24/5'5"/B.Tech/ C. Govt.Asst. మేనేజర్/కెనరా బ్యాంక్/ 60,000/-PM / అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-16404]

SC మాల/24yrs/5'4"/B.Tech/SWE/ 50K.PM/వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ గల వధువుకు వరుడు కావలెను. (SWE, Govt., Doctors) Ph: 7416007604 (వాట్సాప్) [HA-16407]

కాపు/50yrs /Govt. ఎంప్లాయి/ 70,000/-PM/ Own House/ పిల్లలు లేని వధువుకు కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. Ph: 8142579433 [HA-16407]

రెడ్డి/ఆస్తి, కుల పట్టింపు లేదు/24Y/5'3"/ B.Tech/ మంచి స్థిరాస్తి, పేరెంట్స్ లేని వధువుకు వరుడు కావలెను మీ ఫోటో బయోడేటా వాట్సాప్‌లో పంపించండి. Ph: 8142060040 [HA-16407]

రెడ్డి/విడో/కుల, ఆస్తి. ప్రసక్తి లేదు/AGE: 35, B.Com/Pvt Job గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం అయినా OK) All Caste Marriages Available. Ph: 8121347478 [HA-16407]

రెడ్డి/విడో/50Y/ప్రాపర్ Guntur/Hyd/lo furniture show room/సొంత Shops/రెంట్స్ మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (అర్జెంట్) (నో బ్రోకర్స్) (ఇల్లరికం OK) ఫోన్ : 7799083500, 7886660648 [H-796696]

వైశ్య/విడో/5'4"/Govt.Rtd/సొంత ఇల్లు / ఫైనాన్స్ బిజినెస్/1L/PM/పిల్లలు లేరు /ఎవరు లేని వధువుకి వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. 9390083765 [H-783501]

చౌదరి/విడో/50/తెల్లని ఛాయ/ప్రభుత్వ ఉద్యోగం/పంట భూమి/సొంత ఇల్లు గల వధువుకు స్నేహ పూర్వకమైన వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. 9390084390 [H-783501]

రెడ్డి/విడో/50/5'4"/ Fair/VRS/ పెన్షనర్ /సొంత ఇల్లు, పొలాలు ఏ బాదర బందీలేని వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. 9949158135 [H-783501]

వైశ్య/49y/ విడోవర్ / ఇంటర్/సొంత ఇల్లు & బిజినెస్/7 ఎకరాల పొలం గల వధువుకి కుల, ఆస్తి పట్టింపు లేని వరుడు కావలెను. 9705499686 [H-783501]

FC/విడో/ 50/5'4"/ V.Fair / Govt. Teacher / సిటీకి దగ్గరలో 4 ఎకరాల పొలం/సొంత ఇల్లు గల వధువుకి మధ్య తరగతి వరుడు కావలెను. 9182832814 [H-783501]

2వ పెళ్ళి/3,00,000PM/బాగా స్థిరపడిన, కోట్ల ప్రాపర్టీ కలిగిన అందమైన (వధువుకి) అమ్మాయికి, వరుడు కావలెను. ఆస్తి & కులముతో సంబంధం లేదు. గుణవంతుడు కావలెను. పిల్లలు ఉన్నా OK. ఇల్లరికం. Cell: 9381696641 [H-796647]

వేదికలు



కుల పట్టింపు లేని అన్ని కులాల వారికి 1st/2nd /లేట్ /విడో/పెన్షనర్స్/ఒంటరి స్త్రీ/పు.లకు సంబంధాలు కలవు. స్త్రీలకు ఫ్రీ సర్వీస్, పు.లకు సర్వీస్ ఛార్జ్. #Ph: 9581120134 [H-796696]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/ Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd పేళ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690309 [H-783502]

కావ్య మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ లేట్ మ్యారేజెస్, డైవర్స్, విడోస్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులాల వారికి త్వరగా కుదుర్చబడును. (స్త్రీలకు ఫ్రీ) Ph: 7702526428 [H-782785]

మాల మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK. Ph: 7396915712 [HA-16407]

కుల పట్టింపు లేదు 1వ, 2వ, లేట్, విడో, విడోవర్స్, పెన్షనర్స్ (స్త్రీ/పు) వయస్సు 30yrs to 50 yrs ఆపైన వారికి పెళ్లి సంబంధాలు చూడబడును. "prefrence govt ఎంప్లాయిస్" (పోస్ట్ సెటిల్మెంట్) సంప్ర : 8332006483 [H-796696]

Fast Settelement - సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్, అబ్రాడ్, Rich, అన్ని జిల్లాలు, అన్ని ప్రాంతాలు వ్యక్తిగత శ్రద్ధతో చూడబడును. 20 Years Exp. పూర్ణ మాట్రిమోని,తిరుపతి, ✆ 7093722724. [T-2981]

★

కాపు వధూవరుల స్వయంవరం. Free Register 15/Dec/2024 న కమలానగర్ వెల్ఫేర్ ఆఫీస్ ECIL, Hyderabad నందు Ph: 9704656103, 9533608887 Whatsapp [HA-1121]

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Whatsapp) [HA-1088]

సబ్‌కోర్టును ప్రారంభించిన హైకోర్టు జడ్జీలు



సబ్‌కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శ్రీదేవి, జస్టిస్ లక్ష్మణ్

రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు (సబ్ కోర్టు)ను శనివారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జువ్వాది శ్రీదేవి, జస్టిస్ కూనూరు లక్ష్మణ్ ప్రారంభించారు. కోర్టు హాలు, సూపరింటెండెంట్ గదిని ప్రారంభించి పూజలు నిర్వహించారు. రామన్నపేటలో 40 సంవత్సరాల నిరీక్షణ తరువాత సబ్‌కోర్టు మంజూరు కావడంపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు హైకోర్టు న్యాయమూర్తులకు కలెక్టర్, డీసీపీ, వివిధ కోర్టుల జడ్జీలు, న్యాయవాదులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి సంపూర్ణ ఆనంద్, సబ్‌కోర్టు జడ్జి మాధవీలత, స్థానిక కోర్టుల జడ్జీలు ఎ.ప్రదీప్, ఎస్.చందన, కలెక్టర్ హనుమంత్ కె.జండగే, డీసీపీ రాజేశ్‌చంద్ర, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ అబ్దుల్‌మజీద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

జార్ఖండ్ పర్యటనలో ఉపముఖ్యమంత్రి భట్టి


ఆ రాష్ట్ర ముఖ్యనేతలతో సమావేశం



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ సీనియర్ పరిశీలకు డిగా జార్ఖండ్ పర్యటన లో ఉన్న తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్లతో భేటీ అయ్యారు. రాంచీలో శనివారం ఏఐసీసీ సీని యర్ పరిశీలకులు అధీర్ రంజన్‌చౌదరి, తారి ఖ్ అన్వర్‌తోపాటు రాష్ట్ర నాయకులు శుభోద్ ఖాన్గులా, కేశమహతో, గులాంనబీ మీర్, సప్తగిరి ఉల్కా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వచ్చే జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై భట్టి సమాలోచనలు జరిపారు. ప్రస్తుతం జార్ఖండ్ రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ అనిశ్చితి పరిస్థితులను అనుకూలంగా మలుచుకోవాలనే అంశంపై భట్టి దిశానిర్దేశం చేశారు.

ఉద్దేశపూర్వక నిర్లక్ష్యమైతే జైలు తప్పదు

- కో–ఆపరేటివ్ సొసైటీస్ రిజిస్ట్రార్‌పై మరోసారి హైకోర్టు ఆగ్రహం
- 'జూబ్లీహిల్స్ సొసైటీ' అక్రమాలపై విచారణ కమిటీ నివేదికను గడువులోగా పిటిషనర్‌కు ఎందుకివ్వలేదని నిలదీత
- కోర్టు ఆదేశాలంటే లెక్కలేనితనం సరికాదని వ్యాఖ్య.. విచారణ రెండు వారాలకు వాయిదా



సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ మేనేజింగ్ కమిటీ అక్రమాలపై ఏర్పాటైన విచారణ కమిటీ రూపొందించిన నివేదికను రెండు వారాల్లోగా పిటిషనర్‌కు ఇవ్వాలని తాము ఆదేశిస్తే ఐదు నెలలైనా ఇవ్వకపోవడం సహకార శాఖ కమిషనర్ పూర్తి బాధ్యతారాహిత్యమేనని హైకోర్టు మండిపడింది. ధిక్కరణ పిటిషన్ వేసి నోటీసులు జారీ చేశాక నివేదిక ఇస్తారా? అంటూ కో–ఆపరేటివ్ సొసైటీస్ కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్ ఎం.హరితను ప్రశ్నించింది. ఈ వ్యవహారంలో ఇరుపక్షాల వాదనలు వింటామని.. ఒకవేళ ఉద్దేశపూర్వక నిర్లక్ష్యమైతే శిక్ష తప్ప దని కమిషనర్‌ను హెచ్చరించింది. కోర్టు ధిక్కరణ ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే అధికారులు జైలుకు వెళ్లాల్సిందేనని వ్యాఖ్యానించింది. కోర్టులంటే లెక్కలేనితనం సరికాదని.. న్యాయస్థానాల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులకు ఉంటుందని చెబుతూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

ఇదీ నేపథ్యం..

జూబ్లీహిల్స్ కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ మేనేజింగ్ కమిటీ అక్రమాలపై ఏర్పాటైన కమిటీ సమర్పించిన నివేదికను తనకు ఇప్పించాలంటూ సొసైటీ మాజీ కార్యదర్శి మురళీ ముకుంద్ గతంలో హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. మెరిట్స్‌లోకి వెళ్లడం లేదని... 2022 మార్చి 23న విచారణ కమిటీ సమర్పించిన నివేదికను రెండు వారాల్లోగా పిటిషనర్‌కు ఇవ్వాలని ఈ ఏడాది ఏప్రిల్‌లో సహకార కమిషనర్‌ను ఆదేశించింది. అయితే గడువులోగా కమిషనర్ నివేదిక ఇవ్వకపోవడంతో జూన్‌లో మురళీ ముకుంద్ ధిక్కరణ పిటిషన్ వేశారు. దీనిపై గత విచారణకు స్వయంగా హాజరైన కమిషనర్ హరితపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజా విచారణ సందర్భంగా కమిషనర్ స్పందిస్తూ హైకోర్టు ఆదేశాలు మే 6న అందాయని.. అవి పరిశీలన దశలో ఉండగానే లోక్‌సభ ఎన్నికలు వచ్చాయని కౌంటర్‌లో పేర్కొన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా అదనపు బాధ్యతలతో పని ఒత్తిడి వల్ల నివేదిక ఇవ్వడంలో ఆలస్యం జరిగిందని.. నివేదికను సెప్టెంబర్ 11న పిటిషనర్‌కు అందజేశామన్నారు. అయితే ఈ కౌంటర్‌పై అసంతృప్తి వ్యక్తం చేసిన హైకోర్టు.. దానిపై రిప్లై ఇవ్వాలని పిటిషనర్‌ను ఆదేశించింది. ఇరుపక్షాల వాదనలు విన్నాక ఏం చేయాలన్నది నిర్ణయిస్తామంటూ విచారణ నవంబర్ 8కి వాయిదా వేసింది. కోర్టుకు హాజరు నుంచి కమిషనర్‌కు మినహాయింపు ఇచ్చింది.

'కొడంగల్' లిఫ్టుపై మీమాంస

- టెండర్లను ఆమోదించని కమిషన్ ఆఫ్ టెండర్స్
- లక్ష ఎకరాల ఆయకట్టుకు రూ.4,350 కోట్ల వ్యయంతో ప్రాజెక్టు
- రెండు ప్యాకేజీలుగా విభజించి గతనెలలో టెండర్ల ఆహ్వానం



సాక్షి,హైదరాబాద్: నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం టెండర్లకు కమిషనర్ ఆఫ్ టెండర్స్(సీఓటీ) ఆమోదముద్ర లభించలేదు. పలు ఇంజనీరింగ్ శాఖల పనులకు సంబంధించిన టెండర్లపై శనివారం నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ నేతృత్వంలోని సీఓటీ సమావేశమై చర్చించింది. ఈ సమావేశంలో నారాయణపేట–కొడంగల్ టెండర్లపై ప్రధానంగా చర్చ జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌తోపాటు నారాయణపేట నియోజకవర్గంలో లక్ష ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడానికి రూ.4,350కోట్లతో ఈ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది.

టెండర్ల ఆమోదంపై నిర్ణయం తీసుకోని సీఓటీ

ప్రాజెక్టును రెండు ప్యాకేజీలుగా విభజించి గత నెలలో టెండర్లను ఆహ్వానించారు. ప్యాకేజీ–1 కింద రూ.1,134.62 కోట్ల అంచనాలతో టెండర్లను పిలవగా, 3.9% అధిక ధరను కోట్ చేసి రాఘవ–జ్యోతి జాయింట్ వెంచర్ ఎల్–1గా నిలిచింది. 4.85% అధిక ధరను కోట్ చేసి ఎల్–2గా మేఘా ఇంజనీరింగ్ నిలిచింది. రూ.1,126.85 కోట్ల అంచనాలతో రెండో ప్యాకేజీ పనులకు టెండర్లను పిలవగా 3.95% అధిక ధరను కోట్ చేసి ఎల్–1గా మేఘా ఇంజనీరింగ్, 4.8% అధిక ధరను కోట్ చేసిన ఎల్–2గా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ నిలిచాయి. ఈ టెండర్లను సీఓటీ ఆమోదించాల్సి ఉండగా, ఇప్పటికే పలుమార్లు సమావేశమైన సీఓటీ ఏ నిర్ణయం తీసుకోలేకపోయింది.

21న జరిగే సమావేశంలోనైనా...

ప్యాకేజీ–1 టెండర్ల విషయంలో సీఓటీలోని కొందరు చీఫ్ ఇంజనీర్లు కొన్ని అంశాలపై కొర్రీలు వేసినట్లు సమాచారం. ఈ నెల 21న జరగనున్న సీఓటీ సమావేశంలో ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. సూర్యాపేట జిల్లా నాగార్జునసాగర్ ఆయకట్టు స్థిరీకరణకు రూ.360 కోట్లతో చేపట్టిన ఎత్తిపోతల పథకం పనులకు సీఓటీ ఆమోదముద్ర వేసింది. రూ.14 కోట్లతో చేపట్టిన సదర్మట్ బరాజ్ విద్యుదీకరణ పనులకు సైతం అనుమతిచ్చింది.

సుజాత అరెస్టు వార్త బూటకం

- మావోయిస్టు నేత సమత

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు పార్టీ అగ్రనేత, రీజనల్ బ్యూరో సభ్యురాలు సుజాత పోలీసుల అదుపులో ఉన్నారని పాలక వర్గాలు చేస్తున్నదంతా బూటకపు ప్రచారమేనని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) దక్షిణ సబ్ జోనల్ బ్యూరో కార్యదర్శి సమత ప్రకటించా రు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడు దల చేశారు. 2026 మార్చి నాటికి మావోయిస్టు ఉద్యమం లేకుండా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారని, అందులో భాగంగా ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొంటున్న వారిపై దాడులు చేయించడమే కాక అబద్ధాలను కూడా ప్రచారంలోకి తీసుకువస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే సుజాత అరెస్ట్ అయినట్టు బూటకపు ప్రచారం చేయడం ద్వారా ప్రజల్లో భయాందోళనలు రేపాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆ లేఖలో పేర్కొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను ఆపండి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో స్త్రీ, పురుష భేదం లేకుండా దాడులు చేస్తోందని మావోయిస్టు నేత సమత విమర్శించారు. మావోల పేరిట అడవులపై ఆధారపడి జీవించే ఆదివాసీలు, రైతులపై దాడులు చేస్తున్నారన్నారు. వారికి మావోల యూనిఫారాలు తొడిగి మట్టుపెడుతున్నారని ఆరోపించారు. సైనిక ఆపరేషన్‌గా కొనసాగుతున్న కగార్‌ను నిలిపివేసి దండకారణ్యంలో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు.

సీనియర్ ఐఏఎస్ అమయ్‌కుమార్‌కు ఈడీ నోటీసు

- 22 లేదా 23న విచారణకు హాజరు కావాలని సమన్లు
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో భూ కేటాయింపుల వ్యవహారంపై విచారణ

సాక్షి, హైదరాబాద్: సీనియర్ ఐఏఎస్ అధికారి అమయ్ కుమార్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. అమయ్‌కుమార్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో భూముల కేటాయింపులో అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. శాసనసభ ఎన్నికల సమయంలోనూ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, ప్రస్తుత కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఎన్నికల సమయంలోనే అప్పటి రంగారెడ్డి కలెక్టర్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఆరోపణలు చేశారు. బండి సంజయ్ ఏకంగా ఆయనపై కేంద్రానికి ఫిర్యాదు కూడా చేశారు. భూ కేటాయింపుల అంశంలో ఆయన నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని, అందులో పెద్దఎత్తున అవినీతి జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఈడీ అధికారులు ఆయనను ఈనెల 22 లేదా 23వ తేదీన విచారణకు హాజరు కావాలని ఆ నోటీసులో పేర్కొన్నట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఆయనను ఎన్నికల సంఘం విధుల నుంచి తప్పించిన సంగతి విదితమే.

అసలేమిటీ ఆరోపణలు....

మహేశ్వరం మండలం కొంగరకుర్దులోని 55 ఎకరాలకుపైగా వక్ఫ్ భూమితో పాటు మహేశ్వరం, తుమ్మలూరు మధ్యలో ఉన్న 70 ఎకరాల బిలాదాఖ్లా భూములు, శంకర్‌పల్లి మండలం కొండకల్‌లో సర్వే నంబర్ 555లోని 26 ఎకరాల బిలాదాఖ్లా భూములు, గండిపేట ఖానాపూర్‌లోని 150 ఎకరాల బిలాదాఖ్లా భూములు, మియాపూర్ సర్వే నంబర్ 69లోని 27 ఎకరాల ప్రభుత్వ భూమి, గచ్చిబౌలి సర్వే నంబర్ 38 నుంచి 54 వరకు ఉన్న 76 ఎకరాల అర్బన్ సీలింగ్ భూములు, శేరిలింగంపల్లి సర్వే నంబర్ 90 నుంచి 102 వరకు ఉన్న 110 ఎకరాలు, మాదాపూర్‌లోని సర్వే నంబర్ 64, 68లోని 5 ఎకరాలు, కొండాపూర్‌లోని సర్వే నంబర్ 87, 88లోని 10 ఎకరాలు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాదు ఫార్మాసిటీ భూ సేకరణ, అసైన్డ్‌దారులకు నష్టపరిహారం పంపిణీలోనూ భారీగా అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. భూ ఆరోపణలు, ఈడీ నోటీసులపై ఆయన వివరణ కోసం ప్రయత్నించగా.. ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్ రావడం గమనార్హం.

పార్టీ వేడుకలతో సర్కార్‌కు మావోయిస్టుల సవాల్

- వేలాదిగా పాల్గొన్న జనం, వందలాదిగా సాయుధులు!
- సోషల్ మీడియాలో వీడియోలు
- ఆరా తీస్తున్న పోలీసులు



ఆవిర్భావ వేడుకల్లో భారీగా పాల్గొన్న జనం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇటీవల జరిగిన వరుస ఎన్‌కౌంటర్ల కారణంగా మావోయిస్టుల పని అయిపోయిందనే అభిప్రాయం రోజురోజుకూ బలపడుతున్న సమయంలో ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ అడవుల్లో పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించి మావోయిస్టులు మరోసారి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఈ వేడుకల వీడియోలు గురు, శుక్రవారాల్లో ప్రధాన, సోషల్ మీడియాల్లో ప్రత్యక్షమయ్యాయి. బస్తర్ అడవుల్లో గుర్తుతెలియని ప్రాంతంలో జరిగిన ఈ వేడుకల్లో వేలాదిగా ఆదివాసీ ప్రజలు, వందల సంఖ్యలో సాయుధులు పాల్గొన్నట్టుగా స్పష్టమవుతోంది. చనిపోయిన మావోయిస్టులను స్మరిస్తూ.. పాటలు పాడుతూ స్తూపాల దగ్గర కవాతు చేస్తూ మావోయిస్టులు, వారి సానుభూతిపరులు ఈ వీడియోల్లో కనిపించారు. ఆపరేషన్ కగార్ మొదలయ్యాక అబూజ్‌మడ్ అడవుల్లో తుల్‌తులీ ఎన్‌కౌంటర్ తర్వాత మావోయిస్టులకంటూ సురక్షిత ప్రాంతం లేదనే అభిప్రాయం బలంగా ఏర్పడింది. అయితే వేలాది మంది ఒక చోట గుమిగూడి ఆటలు ఆడుతూ.. పాటలు పాడుతూ, డోలు వాయిద్యాలు ఉపయోగిస్తూ వేడుకలు చేసుకోవడం, వేడుకల వీడియోలు బయటకు విడుదల చేయడం చూస్తుంటే ఇప్పటికీ అబూజ్‌మడ్, దండకారణ్యం ప్రాంతంలో మావోయిస్టులకు గట్టి పట్టు ఉందనే అంశం స్పష్టమవుతోంది. అయితే ప్రాంతం, తేదీ తదితర వివరాలు ఈ వీడియోలో స్పష్టంగా లేకపోవడంతో పాత వీడియోనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం పోలీసులు ఈ వీడియోలపై మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు.


శ్రీశైలం డ్యాంలో నాలుగు గేట్లను ఎత్తడంతో కిందకు కృష్ణమ్మ పరుగులు


నాగార్జున సాగర్ డ్యాం నుంచి విడుదలవుతున్న నీరు

శ్రీశైలంలో 4, సాగర్‌లో 16

గేట్లు ఎత్తిన అధికారులు..

నాగార్జునసాగర్, దోమలపెంట: వర్షాలకు శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం పెరిగింది. దీంతో నాలుగు గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 1,11,932 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శనివారం రాత్రి 7 గంటల సమయంలో జూరాల నుంచి స్పిల్‌వే ద్వారా 82,940 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 35,524, సుంకేసుల నుంచి 72,114, హంద్రీ నుంచి 250 మొత్తం 1,90,828 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 36,900 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 31,139 మొత్తం 68,039 క్యూసెక్కుల నీరు అదనంగా సాగర్‌కు విడుదలవుతున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 884.7 అడుగుల వద్ద 213.8824 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పోతిరెడ్డిపాడు ద్వారా 8,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,561, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎగువ నుంచి ప్రవాహం పెరగడంతో శనివారం అధికారులు నాగార్జునసాగర్ ప్రాజెక్టు 16 రేడియల్ క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. 16 గేట్లను ఐదడుగులు పైకి ఎత్తి స్పిల్‌వే మీదుగా 1,29,600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం 590 అడుగుల గరిష్ట నీటిమట్టంతో ఉంది. ప్రస్తుతం సాగర్ జలాశయానికి 1,74,120 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. సాగర్ ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా 29,435 క్యూసెక్కులు, క్రస్ట్‌గేట్ల నుంచి 1,29,600 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు, ఏఎమ్మార్పీ, వరద కాల్వలకు 15,085 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. మొత్తం సాగర్ నుంచి 1,74,120 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.



ఈ పాపను కాపాడరూ..

తొమ్మిదేళ్ల జాగృతికి బ్లడ్ కేన్సర్

ఆపన్నహస్తం కోసం తల్లిదండ్రుల ఎదురుచూపులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఆడుతూ పాడుతూ హాయిగా ఎదగాల్సిన చిన్నారికి అనుకోని ఆపద ఎదురై ప్రాణాలమీదికొచ్చింది. చిన్న వయస్సులోనే బ్లడ్ కేన్సర్‌లో ఒక రకమైన 'ఎక్యూట్ లింపోసైటిక్ ల్యూకేమియా'తో బాధపడుతోంది. ప్రస్తుతం నాగ్‌పూర్ నేషనల్ కేన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వైద్యం ఖరీదు కావడంతో రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. మంచిర్యాల పట్టణానికి చెందిన చిరుద్యోగి గడివార్ గజానన్, రూప దంపతుల సంతానం జాగృతి (9). అద్దె ఇంట్లో జీవనం గడిపే దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన వీరి ఆర్థిక స్తోమత అంతంత మాత్రమే. పెళ్లయిన పదేళ్లకు కూతురు జన్మించింది. నాలుగో తరగతి చదువుతున్న జాగృతికి అకస్మాత్తుగా ఒంటిపై గడ్డలు కనిపించాయి. వైద్య పరీక్షలు చేయడంతో బ్లడ్ కేన్సర్‌గా తేలింది. ఆందోళన చెందిన తల్లిదండ్రులు స్థానికంగా, హైదరాబాద్‌లో పలు ఆసుపత్రులు తిరిగారు. ప్రస్తుతం నాగ్‌పూర్‌లో చికిత్స ఇప్పిస్తున్నారు. ఇప్పటివరకు రూ.9 లక్షలు ఖర్చు కాగా, మరో రూ.6 లక్షలు ఖర్చయ్యే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. మరోవైపు బోన్ మ్యారో మార్పిడి, ప్రత్యేక ఇంజెక్షన్లకోసం మరో రూ.15 లక్షలకుపైగా ఖర్చు చేయాల్సి ఉంది. చికిత్స ఆర్థికంగా భారం కావడంతో డబ్బుల కోసం సాయం అందించాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. దాతలు/సంస్థలు ఎవరైనా స్పందించి, ఆపత్కాలంలో ఉన్న ఆ పాపకు అండగా నిలవాలని కోరుతున్నారు. సాయం చేసేందుకు పాప తండ్రి గజానన్ ఫోన్ పే, గూగుల్ పే నంబరు 7013337192 లేదా అకౌంట్ నంబరు ఎస్‌బీఐ, 20008255533. ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్‌ఎస్‌బీఐఎన్ 0020912. ఏసీసీ, మంచిర్యాల బ్రాంచీకి నేరుగా పంపగలరు.



మూర్ఛకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు

అల్ట్రా సౌండ్ ద్వారా మూర్ఛకు కారణాలపై పరిశోధనలు అమెరికాలో సఫలీకృతం

'సాక్షి'తో అంతర్జాతీయ మూర్ఛ రోగ నిపుణుడు, క్లీవ్‌ల్యాండ్ న్యూరో డైరెక్టర్ ఇమద్

సాక్షి, విశాఖపట్నం: వైద్య రంగాన్ని కలవరపెడుతున్న మూర్ఛ (ఎపిలెప్సీ) రోగానికి శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయని అంతర్జాతీయ మూర్ఛరోగ నిపుణుడు, క్లీవ్‌ల్యాండ్ ఎపిలెప్సీ సెంటర్ న్యూరో డైరెక్టర్ డాక్టర్ ఇమద్ ఎం నజ్మ్ చెప్పారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ (ఐయాన్‌కాన్)–2024 సదస్సులో కీలకోపన్యాసం చేసేందుకు విశాఖ వచ్చిన ఆయన శనివారం 'సాక్షి'తో మాట్లాడారు. కొన్ని దేశాల్లో మూర్ఛ రోగానికి శస్త్రచికిత్సలు చేసినా.. ఫలితాలు మాత్రం రాబట్టుకోలేకపోతున్నామన్నారు. నాడీ సంబంధిత వ్యాధులు పరిష్కరించడంలో ఇంకా వందేళ్లు వెనకబడే ఉన్నామన్నారు. ఎపిలెప్సీపై పరిశోధనలు వేగవంతమవుతున్నాయని తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

శస్త్ర చికిత్సల్లో మూడొంతులు విఫలం

మూర్ఛకు సరైన శస్త్రచికిత్స ఏమీ లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని దేశాల్లో శస్త్ర చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని చెబుతున్నారు. అంటే మెదడులోని టెంపోరల్ లోబ్‌కు సంబంధించిన భాగాన్ని తొలగించడం మూర్ఛకు ఉన్న ఏకైక శస్త్రచికిత్స. అయితే, ఇది అంత విజయవంతం కాదు. ఎందుకంటే ఇప్పటివరకు చేసిన ఈ తరహా చికిత్సల్లో మూడొంతులు విఫలమవుతున్నాయి. కాబట్టి దీనికి శస్త్రచికిత్స లేదనే చెప్పవచ్చు. మందుల ద్వారా కూడా అంత ఫలితాలు రావడం లేదు. మూర్ఛ రోగం వచ్చిన ప్రతి 100 మందిలో 90% మూర్ఛ రోగులు మందులు వాడుతున్నారు. వీరిలో 44% మందికే ఫలితాలు దక్కుతున్నాయి.

అమెరికాలో పరిశోధనలు..

అమెరికాలో ఎపిలెప్సీపై 2007 నుంచి పరిశోధనలు కొనసాగుతున్నాయి. 2007లో లేజర్ థెరపీకి అను మతి లభించింది. 2013లో న్యూరో స్టిమ్యులేషన్, 2018లో డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ (డీబీఎస్), 2019లో హై ఇంటెన్సిటీ ఫోకస్డ్ అల్ట్రాసౌండ్ ద్వారా మూర్ఛకు కారణా లపై పరిశోధనలు చేసేందుకు అనుమతి లభించింది. ఇది విజయవంతమయ్యే దిశగానే పరిశోధనలు ముందుకెళ్తున్నాయి. అయితే.. నాడీ సంబంధిత వ్యాధులను ముందుగానే గుర్తించి, రోగ నిర్ధారణ చేయడమనేది వైద్య ప్రపంచం ముందు పెద్ద సవాల్. హృద్రోగాల్ని ఎలాగైతే ముందుగానే పసిగట్టే వ్యవస్థ వచ్చిందో.. అదేవిధంగా నాడీ వ్యవస్థకు సంబంధించిన వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పరిశోధనలు జరుగుతున్నాయి. 2050 నాటికి న్యూరో సంబంధిత వ్యాధులకు సంపూర్ణ చికిత్స వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని ఆశిస్తున్నాం.

ప్రతి ఆరుగురిలో ఒకరికి నరాల సమస్య

➤ ప్రపంచంలో ప్రతి ఆరుగురిలో ఒకరు నరాలకు సంబంధించిన వ్యాధులతో బాధపడుతుండటం కలవరపెట్టే అంశం. ప్రపంచవ్యాప్తంగా 65 మిలియన్ల మంది మూర్ఛతో జీవిస్తున్నారు. 10 లక్షల మంది మెసియల్ టెంపోరల్ లోబ్ ఎపిలెప్సీతో బాధపడుతున్నారు. మెదడులో వైకల్యాలు అని పిలిచే మూర్ఛ రోగం వైద్య రంగంలో క్లిష్టంగా మారుతోంది. మెదడు అధ్యయనం అంటే.. అది మూర్ఛ కావచ్చు, అల్జీమర్స్ కావచ్చు, స్ట్రోక్ కావచ్చు, పార్కిన్సన్ కావచ్చు. నాడీ సంబంధిత వ్యాధులు ఇటీవల ఎక్కువయ్యాయి. వయసుతో పాటు ఈ వ్యాధులు కూడా పెరుగుతున్నాయి. 75 ఏళ్లు పైబడిన ప్రతి 100 మందిలో 15 మందికి మూర్ఛ రోగం ప్రమాదకరంగా మారే అవకాశాలు పెరుగుతున్నాయి. అందుకే మూర్ఛ వంటి నాడీ సంబంధిత వ్యాధులపై పరిశోధనలు విస్తృతం చేస్తున్నాం.



బైక్‌పై వెళ్తుండగా.. రైలు రావడంతో

బైక్‌ను పట్టాలపైనే వదిలేసి వెళ్లిన వైనం

చాకచక్యంతో వ్యవహరించి రైలును ఆపేసిన లోకోపైలట్

మానవపాడు: బైక్‌తో ఓ వ్యక్తి పట్టాలు దాటుతుండగా...రైలు రావడంతో బైక్‌ను పట్టాలపైనే వదిలి వెళ్లిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో శనివారం చోటుచేసుకుంది. మానవపాడు మండలంలోని పెద్దపోతులపాడు గ్రామానికి చెందిన బోయ వెంకటేశ్ గ్రామశివారు ప్రాంతంలోని వ్యవసాయ పనుల నిమిత్తం పంట పొలాలను చూడటానికి వెళ్లాడు. ఆర్‌యూబీలో నీరు ఎక్కువగా ఉండటం వల్ల(అండర్ రైల్వే బ్రిడ్జిలో) బైక్ వెళ్లడానికి వీలు కాలేదు. దీంతో అవతలివైపు ఉన్న తన పొలం చూసేందుకు బైక్‌తో సహా పట్టాలను దాటేందుకు ప్రయత్నించాడు. అదేసమయంలో రైలు కూత వినిపించింది. సమయం లేకపోవడంతో బైక్‌ను అలాగే పట్టాలపై వదిలేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కర్నూలు నుంచి తుంగభద్ర ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్ పట్టాలపై బైక్ ఉండటాన్ని గమనించి చాకచక్యంతో వెంటనే రైలు వేగాన్ని తగ్గించాడు..దీంతో ఆ రైలు సరిగ్గా బైక్ వద్దకు వచ్చి ఆగిపోయింది. దీంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. రైలు దగ్గరగా వచ్చి ఆగడంతో బైక్ స్వల్పంగా దెబ్బతింది. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

3 కిలోల బంగారంతో మేనేజర్ పరార్

మణప్పురం వికారాబాద్ బ్రాంచ్‌లో ఘటన

పోయిన నగల విలువ రూ.2 కోట్ల పైమాటే

కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు

అనంతగిరి: వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మణప్పురం గోల్డ్ లోన్ సంస్థలో పని చేసే మేనేజర్ సుమారు మూడు కిలోల బంగారు ఆభరణాలతో పరారైన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని మణప్పు ˊం బ్రాంచ్‌లో విశాల్ అనే వ్యక్తి మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇదిలా ఉండగా తన అవసరాల కోసం బంగారం తాకట్టు పెట్టిన ఓ వ్యక్తి ఇటీవల దానిని విడిపించుకునేందుకు బ్రాంచ్ కు వెళ్లాడు. ఆన్‌లైన్ సమస్య ఉందని చెప్పిన సిబ్బంది రెండు, మూడు సార్లు తిప్పి పంపారు. దీంతో అనుమానం వచ్చిన అతను గట్టిగా నిలదీయడంతో అసలు వాస్తవం బయటకు వచ్చింది. సంస్థలోని కొన్ని ఆభరణాలు కనిపించడం లేదని, మేనేజర్ కూడా చెప్పాపెట్టకుండా రెండు రోజులుగా ఆఫీసుకు రావడం లేదని చెప్పారు. ఈ విషయం బయటకు తెలియడంతో సంస్థ ప్రతినిధులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ భీంకుమార్ తెలిపారు. పోయిన ఆభరణాల విలువ రూ.2 కోట్లకు పైనే ఉంటుందని తెలుస్తోంది.

కస్టమర్ల ఆందోళన

మణప్పురం బ్రాంచ్ నుంచి బంగారు ఆభరణాలు పోయా యనే వార్తలు వ్యాప్తి చెందడంతో కస్టమర్లు ఆందోళనకు గురయ్యారు. తమ బంగారం ఉందా..? పోయిందా..? అని తెలుసుకునేందుకు కార్యాలయం వద్దకు చేరుకు న్నారు. రసీదులు చూపిస్తూ వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని పట్టుబట్టారు. మొత్తం 63 మందికి చెందిన ఆభరణాలు కనిపించడంలేదని గుర్తించిన సంస్థ సిబ్బంది, వారి వివరాలతో నోటీసు అతికించారు. కస్టమర్లు ఎవరూ అధైర్య పడొద్దని, తమ వద్ద తాకట్టు పెట్టిన బంగారాన్ని సంస్థ తిరిగి ఇస్తుందని చెప్పారు.

కొత్త చట్టాలపై అవగాహన ఉండాలి

పాత, కొత్త చట్టాలకు ఉన్న తేడాను గుర్తించాలి: జస్టిస్ సుజోయ్‌పాల్



సిటీ కోర్టులు: ప్రతి ఒక్కరికీ కొత్త చట్టాలపై అవగాహన ఉండాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ చెప్పారు. శనివారం నాంపల్లి క్రిమినల్ కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజావర్ధన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ సీవీ శ్రీనాథ్, బార్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథులుగా హాజరైన జస్టిస్ సుజోయ్‌పాల్, తెలంగాణ బార్‌కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, మద్రాస్ హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది చంద్రశేఖర్ చంద్రు న్యాయవాదులకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్), భారతీయ నాగరిక సురక్ష సంహిత (బీఎన్‌ఎస్‌ఎస్), భారతీయ సాక్ష్య అధినియం చట్టాల (బీఎస్‌ఏ)పై అందరూ అవగాహన కల్పించుకోవా ల్సిన అవసరం ఉందన్నారు. కొత్త చట్టాల్లో జరిగిన కొన్ని మార్పులు చాలా ముఖ్యమైనవని, వాటిని ప్రతి ఒక్కరూ పాటించేలా చూడాల న్నారు. ప్రతి ఒక్కరూ పాత, కొత్త చట్టాలకు తేడా తెలుసుకోవాలన్నారు. అనంతరం నాంపల్లి కోర్టు జడ్జీలు, న్యాయవాదులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అంతకుముందు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జస్టిస్ సుజోయ్‌పాల్, నరసింహారెడ్డి, చంద్రశేఖర్ చంద్రులను ఘనంగా సన్మానించారు.

బిడ్డల్ని ప్రభుత్వ బడిలో చేర్పించి..

కొత్త ఉపాధ్యాయిని ఆదర్శం



నల్లగొండ: కొత్తగా ఉద్యోగం సాధించి విధుల్లో చేరిన ఒక ఉపాధ్యాయిని.. తన ఇద్దరు పిల్లలను కూడా అదే పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన నీరజ ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఎస్‌జీటీగా ఉద్యోగం సాధించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పద్మా నగర్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆమెను నియమించారు. ఆమె శనివారం విధుల్లో చేరడంతో పాటు తన ఇద్దరు పిల్లలను కూడా అదే పాఠశాలలో చేర్పించారు. కుమారుడు సాత్విక్ వైభవ్‌ను 3వ తరగతిలో, కుమార్తె ప్రాగ్దిశను 1వ తరగతిలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించాలనే ఉద్దేశంతో తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని నిర్ణయించుకున్నట్లు నీరజ పేర్కొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
ఆదివారం । 20-10-2024

'ఈ ఖరీఫ్ సీజన్‌కు రైతు భరోసా ఇవ్వలేం'..
వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
శనివారం చేసిన ప్రకటన రైతులకు శరాఘాతమైంది.
ఈ వానాకాలం సీజన్‌కు రైతు భరోసా ఇస్తామని
ప్రకటించిన ప్రభుత్వం చివరకు చేతులెత్తేసింది.
– సాక్షి, హైదరాబాద్

- రైతు భరోసాపై చేతులెత్తేసిన ప్రభుత్వం
- వానాకాలం సీజన్‌కు ఇవ్వలేమన్న మంత్రి తుమ్మల
- అన్నదాతలకు శరాఘాతం
- మంత్రివర్గ ఉప సంఘంతోనే కాలయాపన
- అసెంబ్లీలో చర్చ లేదు.. మార్గదర్శకాల ముచ్చటే లేదు
- పెట్టుబడి సాయం చేస్తామని ప్రకటించి చివరికిలా..



ఖరీఫ్ 'భరోసా' బోల్తా

ఆర్భాటంగా కేబినెట్ సబ్ కమిటీ

కాగా, జూలై 2వ తేదీన రైతు భరోసాపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయడం తెలిసిందే. అందులో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబులను సభ్యులుగా నియమించారు. అప్పటినుంచి 15 రోజుల్లోగా మంత్రివర్గ ఉపసంఘం నివేదిక ఇవ్వాలి. ఆ నివేదికపై అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చించి రైతు భరోసాపై నిర్ణయం తీసుకోవలసి ఉంది. అసెంబ్లీ ఆమోదం తర్వాత మార్గదర్శకాలు జారీచేసి రైతులకు పెట్టుబడి సాయం చేస్తామని సర్కారు ప్రకటించింది.

సమావేశాలు పెట్టి.. అభిప్రాయాలు సేకరించి..

జూలై 15వ తేదీన కేబినెట్ సబ్ కమిటీ ఆధ్వర్యంలో వరంగల్‌లో రైతులతో సమావేశం నిర్వహించారు. రైతు భరోసాపై అభిప్రాయాలు తీసుకున్నారు. ఆదిలాబాద్ సహా కొన్ని జిల్లాల్లోనూ అభిప్రాయాలు తీసుకున్నారు.

జూలై 23వ తేదీ నుంచి బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. కానీ అసెంబ్లీ సమావేశాల్లో రైతుభరోసా ఊసే ఎత్తలేదు. దీంతో మార్గదర్శకాలు ఖరారు కాలేదు.

ఈ వానాకాలం ఖరీఫ్ సీజన్‌కు రైతు భరోసా ఇవ్వబోమని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు శనివారం స్పష్టం చేయడంతో రైతులు కంగుతిన్నారు. రైతు భరోసాకు బదులుగా సన్న ధాన్యం పండించిన ప్రతి రైతుకు రూ.500 బోనస్ ఇస్తామని తుమ్మల ప్రకటించారు. పంట వేసిన రైతుకే రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. వ్యవసాయం చేయని వారికి రైతు భరోసా ఇవ్వబోమని తేల్చిచెప్పారు. కాగా, వరదలు, భారీ వర్షాలతో అన్నదాత కుదేలయ్యాడు. మరోవైపు రుణమాఫీ పూర్తిస్థాయిలో జరగకపోవడంతో లక్షలాది మంది రైతులకు బ్యాంకులు కొత్త రుణాలు ఇవ్వలేదు. ఖరీఫ్ ముగిసినా రైతు భరోసా కింద ఆర్థిక సాయం చేస్తారన్న నమ్మకంతో రైతులున్నారు. చివరికి ఇలా జరగడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కీలక పథకానికి తొలి ఆటంకం..

వాస్తవానికి సీజన్‌కు ముందే రైతు భరోసా ఇవ్వాలనేది పథకం ఉద్దేశం. రైతులు విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లు, కూలీల ఖర్చును పెట్టుబడి సాయం ద్వారా అందించాలన్నది దీని లక్ష్యం. 2018 నుంచి ఏటా రెండు సీజన్లలో నిరాటంకంగా కొనసాగిన ఈ పథకం ఈ వానాకాలం సీజన్‌లో మాత్రం తొలిసారిగా నిలిచిపోయింది. ఇప్పటివరకు ఒక్కసారి కూడా పథకం ఆగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత యాసంగిలో రైతుబంధు పథకం కింద పాత పద్ధతిలోనే పెట్టుబడి సాయం చేశారు. కనీసం అలాగైనా ఈ వానాకాలం సీజన్‌కు ఇచ్చినా బాగుండేదని రైతులు అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో రైతు భరోసా మొత్తాన్ని సీజన్‌కు ఎకరానికి రూ.7,500కు పెంచి ఇస్తామని హామీ ఇచ్చింది. ఆ ప్రకారం రెండు సీజన్లకు కలిపి రూ.15 వేలు ఇస్తామని చెప్పింది. ఈ వానాకాలం సీజన్ నుంచే అమలు చేస్తామని పేర్కొంది. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు నిబంధనలు పునఃసమీక్ష తర్వాత అర్హులకు రైతుభరోసా ఇస్తామని ప్రకటించింది.

మార్గదర్శకాలు ఎలా ఉంటాయో..?

ప్రభుత్వం ముఖ్యంగా రైతుభరోసాకు సీలింగ్ విధించాలన్న ఆలోచనలో ఉందని అంటున్నారు. అందరికీ కాకుండా ఐదు లేదా పదెకరాలకు దీనిని పరిమితం చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. సాగు చేసిన రైతులకు మాత్రమే ఇవ్వాలనేది ఉద్దేశం. గత యాసంగి సీజన్‌లో మొత్తం 1.52 కోట్ల ఎకరాలకు చెందిన 68.99 లక్షల మంది రైతులకు రూ.7,625 కోట్లు అందజేశారు. అందులో ఐదెకరాల్లోపు భూమి ఉన్న రైతుల సంఖ్య 62.34 లక్షల మంది కాగా, వారి చేతిలో కోటి ఎకరాల భూమి ఉంది. అంటే మొత్తం రైతుబంధు అందుకున్న వారిలో ఐదెకరాల్లోపు రైతులే 90.36 శాతం ఉండటం గమనార్హం. కాగా ఐదెకరాలకు పరిమితం చేస్తే 90 శాతం మందికి రైతుభరోసా ఇచ్చినట్లు అవుతుందనేది ప్రభుత్వ ఉద్దేశంగా చెబుతున్నారు. ఇక ఎకరాలోపున్న రైతులు 22.55 లక్షల మంది, ఎకరా నుంచి రెండెకరాల వరకున్న రైతులు 16.98 లక్షల మంది, రెండెకరాల నుంచి మూడెకరాల్లోపున్న వారు 10.89 లక్షల మంది, మూడెకరాల నుంచి నాలుగెకరాల్లోపున్న వారు 6.64 లక్షల మంది, నాలుగెకరాల నుంచి ఐదెకరాల్లోపున్న రైతులు 5.26 లక్షల మంది ఉన్నారు. ఇక 5 ఎకరాల నుంచి 10 ఎకరాల వరకు భూమి ఉన్న రైతుల సంఖ్య 5.72 లక్షల మంది కాగా.. వారి చేతిలో 31.04 లక్షల ఎకరాల భూమి ఉంది. పదెకరాల వరకు ఇస్తే, రైతు భరోసాకు వీరు కూడా తోడవుతారు. పీఎం కిసాన్ నిబంధనలను అమలు చేస్తే అనేక మందికి కోత పడుతుంది. భూములున్న ఉద్యోగులు, ఆదాయ పన్ను చెల్లించేవారు.. ఇలా చాలామందికి కోతపడే అవకాశాలున్నాయి. చివరికేం జరుగుతుందో చూడాలి.

ఉద్యాన పంటలను ప్రోత్సహించండి

ఉద్యానవన విశ్వవిద్యాలయం కొత్త వీసీతో మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలో పెరుగుతున్న వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించడంతోపాటు, ఉద్యాన పంటలను భారీగా ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం నూతన వైస్ చాన్స్‌లర్‌గా పదవీ బాధ్యతలు తీసుకున్న డాక్టర్ దండ రాజిరెడ్డి మంత్రి తుమ్మల నాగేశ్వరరావును శనివారం ఆయన చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ...బహుళ పంటల సాగు రైతుల ఆదాయాలు పెంచే ఉత్తమమైన మార్గమని, దీనికి విశ్వవిద్యాలయం వెన్నుదన్నుగా ఉండాలని కోరారు. పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్య పంటలను మల్టీ స్టోర్డ్ పద్ధతిలో సాగు చేసుకునేలా రైతులకు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. వరికి ప్రత్యామ్నాయంగా పామాయిల్, ఇతర తోట పంటలను ప్రోత్సహించాలని, పెట్టిన పెట్టుబడి తక్కువ కాలంలోనే రైతుకు తిరిగి రావాలంటే ఉద్యాన పంటలు మంచి ఆదాయ మార్గమని వెల్లడించారు.

దళిత, గిరిజనులకు న్యాయం చేసిన సీఎం రేవంత్

వీసీల నియామకంపై కాంగ్రెస్ పార్టీలోని దళిత ఎమ్మెల్యేలు

సాక్షి, హైదరాబాద్: ఇచ్చిన మాట నిలుపుకుంటూ దళిత, గిరిజనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తగిన న్యాయం చేశారని కాంగ్రెస్‌పార్టీలోని దళిత ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మందుల సామేల్‌తో కలసి శనివారం సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వైస్ చాన్స్‌లర్ల నియామకాల్లో దళితులకు తగిన ప్రాధాన్యత ఇచ్చిన రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ చరిత్రలో ఇప్పటివరకు ఒక దళితుడు కూడా వీసీ కాలేదని, ఆ కల ఇప్పటికి నెరవేరిందని చెప్పారు. మహిళా యూనివర్సిటీకి గిరిజన మహిళను వీసీగా నియమించారని, అన్ని వర్గాలకు సీఎం రేవంత్ సమన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. మాదిగలకు ఇచ్చిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకున్నారని, మాదిగల తరపున సీఎంకు ధన్యవాదాలు తెలుపుతున్నానని కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. కేటీఆర్ అమెరికాలో చదువుకుని వచ్చానన్న అహంకారంతో రేవంత్‌కు స్పెల్లింగ్ సవాల్ విసురుతున్నారని, కేటీఆర్‌తో ఆ చాలెంజ్‌కు తాను సిద్ధమని చెప్పారు. మందుల సామేల్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ముందు వరుసలో దరువు వేసిన మాదిగలకు గత ప్రభుత్వంలో ప్రాధాన్యం లేదని గుర్తు చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ, బాసర ట్రిపుల్ ఐటీలలో వీసీలుగా మాదిగలను నియమించడం పట్ల సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మస్తుతి పరనిందలా కేటీఆర్ ప్రెజెంటేషన్

టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: మూసీ నది పునరుజ్జీవం అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీ రామారావు చేసిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ అంతా ఆత్మస్తుతి..పరనిందలా ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ విమర్శించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...కేటీఆర్ వాస్తవాలను వక్రీకరించి, అవాస్తవాలను వల్లెవేస్తూ, తెలంగాణ సమాజాన్ని తప్పుదోవ పట్టించాలని కేటీఆర్ ఏకపాత్రాభినయం అట్టర్‌ఫ్లాప్ అయిందని ఎద్దేవా చేశారు. కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్నప్పుడు మూసీ నదిపై సమీక్షలు చేసి, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు ఫిక్స్ చేసి, నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించింది నిజమే కదా? అని నిలదీశారు. అధికారం పోయిన బాధను జీర్ణించుకోలేని కేటీఆర్ ఏదేదో మాట్లాడుతున్నారని, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు ప్రజలు నమ్మబోరని, సరైన సమయంలో బుద్ధి చెబుతారని బండి హెచ్చరించారు.

కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి

సాక్షి, హైదరాబాద్: కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు. రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న కొంతమంది కాంట్రాక్ట్ లెక్చరర్లకు అర్హతలున్నప్పటికీ ఎన్నికల కోడ్, వివిధ కారణాల రీత్యా క్రమబద్ధీకరించలేదని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తక్షణమే వారిని క్రమబద్ధీకరించి ఆదుకోవాలని తమ్మినేని విజ్ఞప్తి చేశారు.

బండి సంజయ్ మద్దతు రేవంత్‌రెడ్డి కుట్రలో భాగమే

మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి




సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి కుట్రలో భాగంగానే గ్రూప్–1 అభ్యర్థుల ఆందోళనకు కేంద్రమంత్రి బండి సంజయ్ మద్దతు ఇచ్చారని, ఆందోళన వద్ద బండి సంజయ్ పెద్ద డ్రామా ఆడారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. శనివారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే ఆళ్ల వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు రాజారాం యాదవ్, బాలరాజ్ యాదవ్, పల్లె రవికుమార్‌తో కలిసి విలేకరు లతో మాట్లాడారు. రేవంత్ పదవి పోతుందని బండి సంజయ్ తెగ బాధపడిపోతున్నారని, మంత్రులే రేవంత్‌ను దించుతారని జాగ్రత్తగా ఉండాలని సంజయ్ సలహా ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. సీఎం అసహనంతో వ్యవహరిస్తున్నారని, కాంగ్రెస్ నేతలతో బుల్డోజర్లు నడిపించి కేటీఆర్, హరీశ్‌రావులను చంపుతా అని రేవంత్ అంటున్నారని, ఇది సీఎం పదవిలో ఉన్న వ్యక్తి మాట్లాడే భాషేనా అని ప్రశ్నించారు. ఈ ఖరీఫ్‌కు రైతు భరోసా లేదని రేవంత్ మాటగా మంత్రి తుమ్మల చెప్పేశారని, రైతుల నోట్లో రేవంత్ మట్టి కొట్టారని ధ్వజమెత్తారు. రైతు భరోసా ఎగ్గొట్టినందుకు నేడు బీఆర్ఎస్ అన్ని మండల కేంద్రాల్లో నిరసనలకు పిలుపు ఇచ్చిందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా ఇచ్చే దాకా బీఆర్ఎస్ వదిలి పెట్టదని వారు హెచ్చరించారు.

కేసీఆర్‌ని కలిసిన ఎమ్మెల్సీ వాణీదేవి

సాక్షి, హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావును శాసనమండలి సభ్యురాలు వాణీదేవి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తన అక్క కూతురు వివాహానికి రావాల్సిందిగా కేసీఆర్‌ను ఆహ్వానిస్తూ వివాహ పత్రికను అందజేశారు. కాగా ఉద్యమగాయని వొల్లాల వాణి తన జన్మదినం సందర్భంగా కేసీఆర్‌ను కలసి ఆశీర్వాదం తీసుకున్నారు. దివంగత ఉద్యమ గాయకుడు, గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేద సాయిచంద్ సతీమణి రజిని కేసీఆర్‌ను ఎర్రవల్లి నివాసంలో కలిశారు. తన కుమారుడు చరీశ్ పుట్టినరోజు సందర్భంగా కేసీఆర్ నుంచి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

కమలం మంత్రుల 'లోకల్ పాలిటిక్స్'!

- మూసీ పరీవాహక ప్రాంతాల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పర్యటన..
- అనాలోచిత నిర్ణయాలపై సీఎంకు హెచ్చరిక
- గ్రూప్–1 పరీక్ష వాయిదా, జీవో 29ను రద్దు చేయాలంటూ కేంద్ర సహాయ మంత్రి బండి మెరుపు నిరసన
- నిరుద్యోగులకు మద్దతుగా చిక్కడపల్లి రోడ్డుపై బైఠాయింపు,
- ఆ తర్వాత ఊరేగింపుగా 'చలో సెక్రటేరియట్'
- మరోసారి లిబర్టీ వద్ద బైఠాయింపు
- మూడుసార్లు అదుపులోకి తీసుకుని విడిచిపెట్టిన పోలీసులు



సాక్షి, హైదరాబాద్: కేంద్ర మంత్రుల 'లోకల్ పాలిటిక్స్' రాష్ట్ర రాజకీయాలకు వేడెక్కిస్తున్నాయి. శనివారం మూసీ పరీవాహక ప్రాంతాల్లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, గ్రూప్–1 అభ్యర్థులు, నిరుద్యోగులకు మద్దతుగా హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ మెరుపు నిరసనలు చేపట్టడంతో.. ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈనెల 23, 24 తేదీల్లో రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో మూసీ పరీవాహక, హైడ్రా ప్రాంతాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయి పర్యటనలు, 24న రాష్ట్రవ్యాప్తంగా వివిధ రకాల ఆందోళనలు చేపట్టడానికి ముందే కేంద్ర మంత్రులు రంగంలోకి దిగారు. దీంతో రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా దీర్ఘ, స్వల్ప, తక్షణ కార్యాచరణ చేపట్టేందుకు, నాయకులు, కార్యకర్తల్లో జోష్ నింపేందుకు ఇవి దోహదపడినట్లుగా పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మాపై బుల్డోజర్లు తెచ్చాక కూల్చండి: కిషన్‌రెడ్డి

మూసీ నది పునరుద్ధరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అనా లోచిత నిర్ణయాలు తీసుకోవద్దని సీఎం రేవంత్‌రెడ్డిని కిషన్ రెడ్డి హెచ్చరించారు. మూసీ ప్రాజెక్ట్‌కు రూ.1.5 లక్షల కోట్లు ఖర్చు చేస్తామంటున్న సీఎం.. ముందుగా పేదల ఇళ్లు కూల్చ కుండా మూసీకి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. తమపై బుల్డోజర్లు తీసుకొచ్చి.. అప్పుడు పేదల ఇళ్లు కూల్చాలని.. వారి ఇళ్లను కూల్చాలనుకునే ముందు తమను జైలులో పెట్టాలని కోరారు.

పాత సంజయ్ గుర్తొచ్చారు



ప్రస్తుత కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్.. ఒక్కసారిగా రాష్ట్రపార్టీ అధ్యక్షునిగా వ్యవహరించిన రోజుల్ని గుర్తుకు తెచ్చారు. ప్రత్యక్షంగా ఆందోళనల్లో పాల్గొనడం, రోడ్ల బైఠాయింపు, ఇతర రూపాల్లో ఉద్యమ కార్యాచరణను గుర్తుకు తెచ్చేలా శనివారం కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటా నికి దిగారు. ప్రస్తుతం తాను హోంశాఖ సహాయమంత్రినన్న విషయాన్ని కూడా పక్కనపెట్టి.. బీజేపీ కార్యాలయంలో తొలుత గ్రూప్–1 అభ్యర్థులు, నిరుద్యోగులతో సమావేశ మయ్యారు. ఆ వెంటనే పోటీ పరీక్షకు సిద్ధమవుతున్న వారికి సంఘీభావం తెలిపేందుకు అశోక్‌నగర్‌కు పయనమయ్యా రు. వెంటనే పార్టీ నాయకులు, శ్రేణులు వెంటరాగా, గ్రూప్–1 బాధితులను కలుసుకున్నారు. నిరుద్యోగులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తేగానే, వారిపై ఇటీవల జరిగిన లాఠీచార్జీకి నిరసనగా అక్కడే రోడ్డుపై బైఠాయించి మెరుపు నిరసన తెలిపారు. తాను కేంద్రమంత్రినైనా.. నిరుద్యోగులకు న్యాయం జరిగేదాకా బీజేపీ కార్యకర్తగా వారికి అండగా ఉంటా నని ప్రకటించారు. జీవో 29ను రద్దు చేయాలని, గ్రూప్–1 పరీక్షను రీషెడ్యూల్ చేయాలన్న అభ్యర్థుల డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. భారీగా పోలీసులు మోహరించడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఆ తర్వాత సంజయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద వదిలివెళ్లారు. అక్కడ కొంత సేపు పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యాక.. గ్రూప్–1 అభ్యర్థుల సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తామంటూ 'చలో సెక్రటేరియట్'కు బయలుదేరారు. ఆయనతో పాటు నిరుద్యోగులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలాదిమంది ర్యాలీగా ముందుకు కదలడంతో పోలీసులు అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేశారు. మధ్యలో చర్చలకు ప్రభుత్వం పిలిచిందనే ప్రచారం జరిగినా.. అది రూఢీ కాలేదని పార్టీ నాయకులు తెలిపారు. ఈ దశలో జీవో 29 రద్దు చేయాల్సిందేనంటూ సంజయ్ ప్లకార్డ్‌ను ప్రదర్శించారు. అక్కడి నుంచి ఆయనను పోలీసు బందోబస్తు మధ్య రామకృష్ణమఠం వైపు తీసుకురాగా.. అక్కడికి దగ్గరలోని ఫ్లైఓవర్ వద్ద రోడ్డుపై సంజయ్ మరోసారి బైఠాయించారు. జీవో 29 రద్దుపై ప్రభుత్వం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అక్కడి నుంచి నిరుద్యోగులతో కలిసి లిబర్టీ చౌరస్తాకు చేరుకున్నారు. అక్కడ ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు సంజయ్‌ను అదుపులోకి తీసుకుని వాహనంలో నాంపల్లిలోని బీజేపీ కార్యాలయం వద్ద వదిలి వెళ్లారు. ఆ తర్వాత ఆయన అక్కడే విలేకరులతో మాట్లాడి.. కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీలపై ఘాటుగా విమర్శలు సంధించారు.

22న 'జీవన సౌలభ్య' పంచాయతీ సమ్మేళనం

సాక్షి, హైదరాబాద్: ఈనెల 22న ఎన్ఐఆర్‌డీలో 'జీవన సౌలభ్యం: క్షేత్ర స్థాయిలో సేవలను మెరుగుపరచడం'అనే అంశంపై పంచాయతీ సమ్మేళనం జరగనుంది. క్షేత్రస్థాయిలో సేవలను మెరుగ్గా అందించటం ద్వారా మెరుగైన జీవన సౌలభ్యాన్ని సాధించే దిశగా ఈ సమ్మేళనం దోహదపడుతుందని అంచనా వేస్తున్నారు. ఇందులో భాగంగా నాలుగు ప్రాంతీయ వర్క్‌షాప్‌లలో ఒకటి హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు. ఈ వర్క్‌షాప్‌లో ఆంధ్రప్రదేశ్, గుజరాత్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మిజోరం, ఒడిశా, తెలంగాణకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారు. క్షేత్రస్థాయిలో సేవలు అందించటంతో ప్రత్యక్ష సంబంధం ఉన్న పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులకు.. సేవలు అందించడంలో అనుభవాలు, సవాళ్లు, అవకాశాలపై చర్చించేందుకు ఈ వేదిక తోడ్పడనుంది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఆ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్, ఎన్ఐఆర్డీ అండ్ పీఆర్ డైరెక్టర్ జనరల్ డా.జి.నరేంద్ర కుమార్, పీఆర్ శాఖ సంయుక్త కార్యదర్శి అలోక్ ప్రేమ్ నగర్, రాష్ట్ర పీఆర్‌ఆర్‌డీ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్ పాల్గొంటారు.

గ్రూప్–1 పరీక్షలు ఆపాలన్నదే ప్రతిపక్షాల లక్ష్యం: ఎంపీ చామల



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 పరీక్షలు ఆపాలనేది ఒక్కటే ప్రతిపక్షాల లక్ష్యమని, తద్వారా ప్రభుత్వంపై బురద జల్లాలనే కుట్రతో ఉన్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌తో కలసి శనివారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ కోర్టులను గౌరవించకుండా రోడ్లమీదికి వచ్చి రచ్చ చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థులు కాని వారితో కేటీఆర్ సుప్రీంకోర్టులో కేసు వేయించి డ్రామాలాడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రవళిక అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న రోజు కేటీఆర్ ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. డీఎస్సీ వాయిదా వేయాలన్నారని, ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుని డీఎస్సీ నిర్వహించి 11,600 ఉపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనైనా, ఇప్పుడైనా బీసీలకు 54% రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. 29 జీవో మీద విద్యార్థులు అపోహలు వీడాలన్నారు. ప్రతిపక్షాలు విద్యార్థులను రెచ్చగొట్టి వారి భవిష్యత్తును ఆగం చేయాలని చూస్తున్నాయని మండిపడ్డారు. ఎంపీ బండి సంజయ్ కోర్టు నిర్ణయాన్ని గౌరవించాలన్నారు.

గ్రూప్–1 పరీక్షపై బండి సంజయ్‌కు అవగాహనలేదు



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 పరీక్షపై కేంద్రమంత్రి బండి సంజయ్‌కు అవగాహనలేదని, జీవో 29తో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నష్టంలేదని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ పేర్కొన్నారు. గాంధీభవన్‌లో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ... న్యాయ నిపుణుల ఆలోచనతోనే టీజీపీఎస్సీ ముందుకెళ్తుందని, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు నిరుద్యోగ యువత జీవితాల తో ఆడుకోవద్దని హితవు పలికారు. మూసీ ప్రక్షాళనపైనా బీజేపీ, బీఆర్ఎస్ లు ఒకటే వాదంతో ముందుకెళ్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్–1 రద్దు కావాలని కేటీఆర్ కోర్టులలో కేసులు వేయించారని, సుప్రీం కోర్టులో పిటిషన్ వెనుక కేటీఆర్ ఉన్నారని, నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేస్తుంటే ఓర్వలేక పోతున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీల కుట్రలను తెలంగాణ నిరుద్యోగ యువత తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.



రాళ్లపై బడిబాట

తుఫాను తాకిడికి నంద్యాల జిల్లా నందికొట్కూరులోని మండల ప్రజాపరిషత్ పాఠశాల వద్ద నీరు చేరింది. దీంతో విద్యార్థులు ఇలా రాళ్లు పేర్చి వాటిపై నడుస్తూ స్కూల్‌లోకి రాకపోకలు సాగిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీనివాసులు, కర్నూలు



అరుణవర్ణ శోభితం

కడపలో శనివారం సూర్యుడు నిప్పుల వాన కురిపిస్తాడా... అన్నంతగా ఆకాశం ఇలా అరుణ వర్ణంలోకి మారిపోయింది. సాయం సంధ్యవేళ కడప నగర ప్రజలకు కనువిందు చేసిన ఈ సుందర దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– ఎస్‌కే మహమ్మద్ రఫీ, సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్, కడప



అమరులకు సలాం!

ఈ నెల 21న నిర్వహించనున్న పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలోని బీచ్ రోడ్డు అమరవీరుల స్థూపం వద్ద రిహార్సల్స్ నిర్వహిస్తున్న పోలీసులు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నవాజ్, విశాఖపట్నం

కొండెక్కిన కొల్లేరు!

చంద్రబాబు ప్రభుత్వంలో కొల్లేరు పర్యాటకానికి తూట్లు

- రాష్ట్రంలో 4 ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధికి కేంద్రం రూ.400 కోట్లు
- ఇందులో చోటు దక్కని కొల్లేరు టూరిజం
- కొల్లేరును అద్భుతంగా తీర్చిదిద్దుతామని ఎన్నికల వేళ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ హామీ
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.187 కోట్లతో డీపీఆర్
- టెంపుల్, ఎకో టూరిజంపై కేంద్రానికి నివేదిక





సాక్షి ప్రతినిధి, ఏలూరు: ప్రకృతి రమణీయతతో పాటు పక్షుల కేరింతలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన కొల్లేరు టూరిజంపై కొత్త ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. ఫలితంగా కొల్లేరు టెంపుల్, ఎకో టూరిజం ప్రాజెక్ట్ తూర్పు గోదావరికి తరలిపోనుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొల్లేరు పర్యాటకాభివృద్ధికి రూ.187 కోట్లతో డీపీఆర్‌లను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది. కొద్ది రోజుల క్రితం కొత్త రాష్ట్ర ప్రభుత్వ సిఫార్సులతో కేంద్ర ప్రభుత్వం శ్రీశైలం, సూర్యలంక, రాజమహేంద్రవరం-అఖండ గోదావరి, సంగమేశ్వరం వంటి నాలుగు ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధికి రూ.400 కోట్లు కేటాయించింది. తెలుగు రాష్ట్రాల్లో ఏకైక చిత్తడి ప్రాంతమైన కొల్లేరు టూరిజానికి ఇందులో చోటు దక్కకపోవడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో 4 నియోజకవర్గాల పరిధిలో కొల్లేరు సరస్సు వ్యాపించి ఉంది. దక్షిణ కశ్మీరంగా దీనికి పేరు. జీవో నంబరు 120 ప్రకారం కొల్లేరు కాంటూరు-5 వరకు 77,138 ఎకరాల్లో కొల్లేరు అభయారణ్యం విస్తరించి ఉంది. మొత్తం 9 మండలాల్లో కొల్లేరు పరీవాహక గ్రామాలుగా 122 ఉన్నాయి. మొత్తం జనాభా 3.2 లక్షల మంది ఉండగా, 1,70,000 మంది ఓటర్లు ఉన్నారు. ప్రధాన వృత్తి చేపల సాగు. కొల్లేరు కాంటూరును 5 నుంచి 3కు కుదిస్తామని ప్రతి ఎన్నికల్లో టీడీపీ నాయకులు చెబుతున్నా అమలు కావడం లేదు.

అటకెక్కిన టెంపుల్ టూరిజం ప్రతిపాదనలు

కొల్లేరు విస్తరించిన ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో టెంపుల్ టూరిజం అభివృద్ధి చేసుకోవడానికి చక్కటి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. రాష్ట్రంలో అత్యధికం భక్తులు వచ్చే 100 ఆలయాల్లో ద్వారకాతిరుమల, మద్ది ఆంజనేయస్వామి, పంచారామ క్షేత్రాలైన భీమవరం ఉమామహేశ్వరస్వామి, పాలకొల్లు క్షీరారామలింగేశ్వస్వామి ఆలయాలు, భీమవరం మావుళ్లమ్మ దేవస్థానాలు ఉన్నాయి. కొల్లేరు ప్రాంతమైన కైకలూరులో నిర్వహించిన ఎన్నికల సభల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కొల్లేరు టూరిజాన్ని అభివృద్ధి చేసి స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

వైఎస్ జగన్ పాలనలో రూ.187 కోట్ల ప్రణాళిక

జిల్లాల పునర్విభజన తర్వాత కొల్లేరు ప్రాంతమంతా ఏలూరు జిల్లా పరిధిలోకి చేరింది. కొల్లేరు ఎకో టూరిజానికి రూ.187 కోట్ల ప్రణాళికతో ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించింది. కొల్లేరు పరీవాహక ప్రాంతాల్లో 20 ప్రదేశాలను గుర్తించి బోటు షికారు, సంప్రదాయ గేలాలతో చేపలు పట్టుకోవడం, పక్షుల వీక్షణ వంటివి ఏర్పాటు చేయాలని భావించారు. పర్యాటక శాఖ అధికారులు కొల్లేరులో 10 ప్రాంతాలను టూరిజానికి అనుకూలమైన ప్రాంతాలుగా గుర్తించారు. ఇప్పటికే కేంద్రం వద్ద డీపీఆర్‌లు ఉన్నప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోలేదు.

పక్షులపై కానరాని ప్రేమ

కొల్లేరు సరస్సుపై ఇటీవల జరిగిన ఏషియన్ వాటర్ బర్డ్స్ సెన్సస్‌లో మొత్తం 105 రకాల పక్షి జాతులకు సంబంధించి 81,495 పక్షులను గుర్తించారు. ప్రధానంగా రాష్ట్రంలో పక్షి ప్రేమికుల స్వర్గధామంగా ఏలూరు జిల్లా ఆటపాక పక్షుల కేంద్రం వాసికెక్కింది. ఇక్కడ అరుదైన పెలికాన్ పక్షులు రావడంతో పెలికాన్ ప్యారడైజ్‌గా నామకరణ చేశారు. అటవీ శాఖ 283 ఎకరాల్లో పక్షుల విహారానికి చెరువును ఏర్పాటు చేసింది. పక్షి నమూనా మ్యూజియం ఆకట్టుకుంటుంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన కేంద్రానికి నిధుల కొరత వేధిస్తోంది. ఆటపాక పక్షుల కేంద్రాన్ని మరింతగా అభివృద్ధి పరిస్తే పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది.



వలస పక్షుల సందడి షురూ

కొల్లేరు ప్రకృతి రమణీయతతో పాటు పక్షుల అందాలను తిలకించడానికి ప్రతి ఏటా అక్టోబర్ నుంచి మార్చి వరకు అనువైన కాలం. కొల్లేరు అభయారణ్యంలో 190 రకాల స్వదేశీ, విదేశీ పక్షులు సంచరిస్తుంటాయి. ప్రధానంగా కొల్లేరులో పెలికాన్ పక్షి ఆకర్షణీయంగా ఉంటుంది. అందుకే కైకలూరు మండలం ఆటపాక పక్షుల విహార కేంద్రాన్ని పెలికాన్ ప్యారడైజ్‌గా నామకరణ చేశారు. కొల్లేరు ఇటీవల వరదలు, వర్షాలకు నిండుకుండలా మారింది. ప్రతి ఏటా విదేశీ పక్షులు వలస వచ్చి సంతానోత్పత్తితో తిరిగి స్వస్థలాలకు వెళ్లడం ఇక్కడ ఆనవాయితీగా మారింది.



క్లుప్తంగా...

స్వర్ణాంధ్ర-2047 లక్ష్యం

'20 సూత్రాల' అమలు
చైర్మన్ దినకర్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేసేందుకు రూపొందిస్తున్న స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాల సాధన దిశగా అడుగులు వేస్తామని రాష్ట్ర 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు.

నేడు 'రైతు నేస్తం' ప్రదానం

సాక్షి, అమరావతి: 'రైతు నేస్తం' 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వ్యవసాయ, అనుబంధ రంగాల్లో విశేష ప్రతిభ కనపరచిన వారికి ఆదివారం ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, డాక్టర్ ఐ.వి.సుబ్బారావు పేరిట పురస్కారాలను అందజేయనున్నట్లు రైతు నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పద్మశ్రీ యడ్లపల్లి వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. ఏపీ, తెలంగాణలో ప్రకృతి వ్యవసాయం చేస్తూ అద్భుత విజయాలు సాధిస్తున్న 20 మంది రైతులను సత్కరించినున్నట్లు చెప్పారు. ఆదివారం కృష్ణా జిల్లా గన్నవరం మండలం ఆత్కూరులోని స్వర్ణభారతి ట్రస్ట్ ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అప్పులు ఎగ్గొట్టేందుకు మహిళ హైడ్రామా



బల్లికురవ: అప్పులు ఇచ్చిన వారు డబ్బులు తిరిగి ఇవ్వాలని నిలదీయడంతో ఓ మహిళ తాను ఆత్మహత్య చేసుకుంటానంటూ రాష్ట్రీయ రహదారిపై కూర్చుని బెదిరింపులకు దిగిన ఘటన బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొప్పెరపాడులో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సిమెంట్, ఇనుము వ్యాపారం చేసేవారు. వ్యాపార నిమిత్తం పలువురి వద్ద అప్పులు చేశారు. నాలుగేళ్ల క్రితం ఆయన చనిపోయారు. తరువాత ఆయన భార్య అప్పులు తాను తీరుస్తానని చెప్తూ వస్తున్నారు. ఎన్నేళ్లయినా అప్పులు తీర్చకపోవడంతో విసిగిన బాధితులు శనివారం ఆమెను దుకాణం వద్ద నిలదీశారు. దీంతో ఆమె కుమార్తె అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిపై కూర్చుని ఆత్మహత్య చేసుకుంటామంటూ బెదిరింపులకు దిగింది. దీంతో వారికి అప్పులు ఇచ్చిన వారు అవాక్కయ్యారు. మహిళ రోడ్డుకు అడ్డుగా బైఠాయించడంతో వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి. పోలీసులు ఘటనాస్థలికి వచ్చి వారిద్దరినీ పక్కకు తీసుకొచ్చి ట్రాఫిక్ పునరుద్ధరించారు.

మృతదేహాలతో.. వ్యాపారం ?

ఏలూరు జీజీహెచ్ మార్చురీలో దారుణం

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని మార్చురీ దారుణాలకు కేంద్ర బిందువుగా మారింది..అనాథ శవాలే అక్కడి కొందరు సిబ్బందికి ఆదాయ వనరులుగా మారాయి. ఏలూరు జీజీహెచ్‌లో గత కొంత కాలంగా గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న అవినీతి బాగోతం బహిర్గతమైంది. పదిరోజుల క్రితం జరిగిన ఓ ఘటనతో తీగ లాగితే.. డొంకంతా కదిలినట్లు..మార్చురీలో సాగుతున్న అక్రమ శవాల వ్యాపారం వెలుగులోకి వచ్చింది. ఈ ఆసుపత్రిలో అనాథ శవాలను భారీ రేటుకు విక్రయిస్తూ వ్యాపారం చేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏడాదిన్నరగా 8-10 అనాథ శవాలను ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలకు తరలించినట్టు తెలుస్తోంది. తమిళనాడు రాష్ట్రం చెన్నై, బెంగళూరులోని ప్రైవేటు మెడికల్ కాలేజీలకు శవాలను భారీ రేటుకు విక్రయిస్తున్నట్టు చెబుతున్నారు. ఒక్కో శవాన్ని రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు వరకూ విక్రయిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని అంబులెన్సుల ద్వారా అనాథ శవాలను తరలించేందుకు కేవలం అంబులెన్స్‌లకే రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు చెల్లిస్తున్నారని సమాచారం. దీనిపై ఏలూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్ విచారణ చేపట్టారు. ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశిధర్ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసేందుకు నిర్ణయించారు. ఏడాదిన్నర కాలంలో ఏలూరు జీజీహెచ్‌లోని మార్చురీకి ఎన్ని అనాథ శవాలు పోస్టుమార్టం నిమిత్తం వచ్చాయి ?అనాథ శవాలను ఎవరైనా బంధువులకు ఇచ్చారా ? శవాలను పూడ్చిపెట్టారా ? లేక దహనం సంస్కరాలు చేశారా... ఇలా పలు అంశాలపై విచారణ చేపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో స్పెషల్ పార్టీ పోలీస్ మృతి

- తలకు హెల్మెట్ పెట్టుకున్నప్పటికీ దక్కని ప్రాణం
- రోల్ కాల్ భయంతో ప్రాణాలు పోగొట్టుకున్న వైనం
- భార్య 9 నెలల గర్భిణి
- కుమారుడి మృతి వార్త విని తండ్రికి గుండెపోటు



సుభాని మృతదేహం

ఒంగోలు టౌన్: రోడ్డు ప్రమాదంలో స్పెషల్ పార్టీ పోలీస్ మృతి చెందిన ఘటన శనివారం రాత్రి ప్రకాశం జిల్లాలోని చీమకుర్తి – ఒంగోలు మధ్యలో చీమలమర్రి వద్ద ఒంగోలు-కర్నూలు రోడ్డుపై జరిగింది. ఒంగోలు పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో స్పెషల్ పార్టీలో పనిచేస్తున్న షేక్ సుభాని (28) బైకుపై వెళుతుండగా..ముందు వెళ్తున్న లారీని టచ్ చేయడంతో అదుపు తప్పింది. దీంతో సుభాని రోడ్డుపై పడిపోయాడు. అతని తల రోడ్డుకు బలంగా గుద్దుకోవడంతో హెల్మెట్ పెట్టుకున్నప్పటికీ ఊడిపడిపోయింది. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే అతను మృతి చెందాడు. చీమకుర్తి సీఐ ఎం.సుబ్బారావు ఘటనా స్థలిని పరిశీలించారు. మృతుడు సుభానికి భార్య, పిల్లలు ఉన్నారు. ఒంగోలు పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో స్పెషల్ పార్టీలో పనిచేస్తూ విధి నిర్వహణలో భాగంగా చీమకుర్తి వచ్చి తిరిగి ఒంగోలు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. రోల్ కాల్ భయంతో వేగంగా వాహనం నడపడంతోనే సుభాని ప్రాణాలు పోగొట్టుకున్నట్లు తెలుస్తోంది. సుభాని భార్య 9 నెలల గర్భిణి. ఆమెకు జనరల్ చెకప్ చేయించేందుకు అధికారుల పర్మిషన్ తీసుకున్న సుభాని శనివారం ఉదయం దొర్నాల వెళ్లాడు. ప్రతిరోజూ సాయంత్రం 8 గంటలకు ఒంగోలులోని స్పెషల్ పార్టీ కార్యాలయంలో రోల్ వేస్తారు. దీనికి 5 నిమిషాలు ఆలస్యమైనా ఆ రోజు ఆబ్సెంట్ కింద పరిగణిస్తారు. రోల్ కాల్ భయంతో త్వరగా ఒంగోలు చేరుకునేందుకు సుభాని బైకును వేగంగా నడిపినట్లు తెలుస్తోంది. కాగా, సుభాని మరణించిన విషయం తెలియగానే అతడి తండ్రి గుండెపోటుతో కుప్పకూలారు. ఆయన ఆరోగ్యం విషమంగా ఉంది. సుభాని మృతి విషయం తెలుసుకున్న ఎస్పీ ఏఆర్ దామోదర్ ఒంగోలు జీజీహెచ్‌కి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు.

సర్కారు చదువులు చట్టుబండలు!

జీవో 117 రద్దుతో విద్యార్థులకు నాణ్యమైన విద్య దూరం

- 3, 4, 5 తరగతులు తిరిగి ప్రాథమిక పాఠశాలల్లో విలీనం
- ఆ విద్యార్థులకు సబ్జెక్టు టీచర్ల బోధన రద్దు.. ఇప్పటికే సీబీఎస్‌ఈ స్కూళ్లను రద్దు చేసిన సర్కారు



సాక్షి, అమరావతి: సజావుగా సాగుతున్న పాఠశాల విద్యపై రాష్ట్ర ప్రభుత్వం కక్షగట్టింది. పేద పిల్లలకు అందుతున్న నాణ్యమైన విద్యను, అందులోనూ ప్రాథమిక దశ నుంచే సబ్జెక్టు టీచర్ బోధనను దూరం చేసేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకెళుతోంది. తాజాగా జాతీయ విద్యావిధానం-2020లో భాగంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యా సంస్కరణలను నిర్దయగా రద్దు చేస్తోంది. పిల్లల్లో విద్యా నాణ్యత పెంచేందుకు 3, 4, 5 తరగతుల విద్యార్థులకు నిపుణులైన సబ్జెక్టు టీచర్లతో బోధన అందించేందుకు తీసుకొచ్చిన జీవో 117ను రద్దు చేసి, వచ్చే ఏడాది నుంచి ఆ తరగతులను ప్రాథమిక పాఠశాల్లోకి మార్చాలని నిర్ణయించింది.

ఏపీ మోడల్‌ను ఇతర రాష్ట్రాలు అనుసరిస్తుంటే..

గత ప్రభుత్వంలో రాష్ట్రంలో అమలు చేసిన విద్యా సంస్కరణలను దేశంలోని ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి. 'ప్రభుత్వాలు మారడం సహజం. కానీ.. పాలన మాత్రం మారకూడదు. మంచి ఏ ప్రభుత్వంలో జరిగినా దాన్ని కొనసాగించాలి' అని ఇటీవల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. అంతేకాదు.. విద్యాశాఖ మంత్రిగా ఆయన ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి అక్కడి పరిస్థితులనూ పరిశీలించారు. గత ప్రభుత్వంలో విద్యా సంస్కరణలు బాగున్నాయని, వాటిని అలాగే కొనసాగిద్దామని ఉన్నతాధికారుల వద్ద కూడా పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రే బాగున్నాయని చెప్పిన సంస్కరణలను రద్దు చేయడం విస్మయం కలిగిస్తుంది.

జీవో 117 రద్దు చేస్తే విద్యార్థులకు అన్యాయం

పలు సర్వేల అనంతరం విద్యారంగంలో సంస్కరణల కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం(ఎన్‌ఈపీ)-2020 సంస్కరణలను తీసుకొచ్చింది. దీని ప్రకారం దేశంలోని విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందించాలని, జాతీయ స్థాయిలోను, రాష్ట్రాల్లోను ఒకేవిధమైన విధానాలు అనుసరించాలని, పిల్లలు నేర్చుకునే దానికి, వస్తున్న ఫలితాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాలని సూచించింది. ఇందుకోసం ఉపాధ్యాయ-విద్యార్థుల నిష్పత్తిని తగ్గించాలంది. ఎన్‌ఈపీ-2020 విద్యా బోధనను 5+3+3+4 విధానంలో పునర్నిర్మించాలని సూచించింది. ఎన్‌ఈపీ సంస్కరణల్లో భాగంగా గత ప్రభుత్వం 2022లో జీవో-117 జారీ చేసింది. దీనిప్రకారం గతేడాది ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగుతున్న 3, 4, 5 తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లోకి మార్చారు. ఇలా 4,900 ఎలిమెంటరీ స్కూళ్లలోని 2.43 లక్షల మంది విద్యార్థులను కి.మీ. లోపు దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో చేర్చారు. 8 వేల మంది అర్హులైన ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించి సబ్జెక్టు టీచర్ బోధన అందుబాటులోకి తెచ్చారు. అంతేగాక ఉపాధ్యాయులపై బోధనా ఒత్తిడి తగ్గించేందుకు ప్రాథమిక విద్యార్థుల బోధనను ఒక టీచర్‌కు 20 మంది విద్యార్థులు ఉండేలా చర్యలు తీసుకుంది. ఎంతో ఉన్నతమైన ఆశయంతో తీసుకొచ్చిన జీవో 117ను ఉపాధ్యాయులు సైతం మెచ్చుకున్నారు. కానీ.. ఇప్పుడు అదే చట్టాన్ని రద్దు చేయడమంటే పేదల పిల్లలకు నాణ్యమైన విద్యను దూరం చేయడమేనని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



శ్రీవారి దర్శనానికి 8 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 8 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 61,576 మంది స్వామివారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.54 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెన్లు ఉన్నవారికి సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 8 గంటల్లో, ఎస్‌ఈడీ టోకెన్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు

తిరుపతి కల్చరల్: కార్తీక మాసం సందర్భంగా నవంబర్ 4 నుంచి తిరుపతిలోని శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. 4, 11, 18, 25 తేదీల్లో స్వామివారికి విశేష అభిషేకం జరిపించనున్నారు. ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటలు, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులకు దర్శనం కల్పిస్తారు. డిసెంబర్ 1న చండీకేశ్వర స్వామివారికి అభిషేకం, త్రిశూల స్నానం నిర్వహించనున్నారు.

తిరుచ్చిపై శ్రీవారి చిద్విలాసం



చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. అనంతరం శ్రీవారికి అభిషేక సేవ నిర్వహించి వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు ఆగమోక్తంగా కల్యాణోత్సవం జరిపించారు.సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు.

శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణం



రాపూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. 6 గంటలకు పూలంగి సేవ చేశారు. 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణాన్ని చేపట్టారు. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు.

గోవింద స్మరణతో మార్మోగిన తిరునగరం

తిరుపతి కల్చరల్: గోవింద నామ స్మరణతో శనివారం తిరునగరం మార్మోగింది. తిరుపతిలో మరింత ఆధ్యాత్మిక శోభను పెంచడంతో పాటు భక్తిభావాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో స్థానిక భజన మండలి కళాకారులు ప్రతి శనివారం నగరంలో గోవింద నామ సంకీర్తనలను గానం చేస్తూ పురవీధుల్లో విహరిస్తారు. ఉదయం 5 గంటల నుంచి సుమారు 100 మంది భజన మండల కళాకారులు తిరునామాలు ధరించి సాంప్రదాయ వస్త్రాలతో మంగళ వాయిద్యాల నడుమ సాగుతూ గోవిందనామ సంకీర్తనలు ఆలపించారు.

విద్యార్థి దశ నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

బాపట్ల టౌన్: విద్యార్థి దశ నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి రవి తెలిపారు. మండలంలోని చెరువు జమ్ములపాలెంలో హాకీ అండర్-14, 17 బాలబాలికల పోటీలు శనివారం జరిగాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 200 మంది పాల్గొన్నారు. క్రీడలు ప్రారంభించిన అనంతరం ఎం. రవి మాట్లాడుతూ.. అండర్-17 విభాగంలో ఎంపికైన విద్యార్థులు నవంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు నెల్లూరులో, అండర్-14 కింద ఎంపికైన వారు 8 నుంచి 11 వరకు అనకాపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.



రేపటి నుంచి అంతర కళాశాలల క్రీడా పోటీలు

ఒంగోలు: ఈ నెల 21 నుంచి వేటపాలెంలో అంతర కళాశాలల ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఐ.దేవీ వరప్రసాద్ తెలిపారు.వర్సిటీ పరిధిలోని 224 కాలేజీల విద్యార్థులకు బ్యాడ్మింటన్ మెన్, షటిల్ మెన్, సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారన్నారు.

చిత్రలేఖన పోటీలు

ఆత్మకూరు: పోలీసు సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీ గంగాధర్ ఆధ్వర్యంలో పట్టణంలోని జెడ్పీ బాలికల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు శనివారం చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ నెల 31న విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని సీఐ తెలిపారు.

Gold Memories

చరిత్ర గాని, పురాణాలు గాని... వీటిలో మనకు ఏమాత్రం నచ్చని విషయాల్ని మనకు నచ్చిన విధంగా ఓ కల్పిత కథను తయారు చేసుకుని ప్రేక్షకుడ్ని ఆనందింప జేయడాన్ని ఆల్టర్నేటివ్ హిస్టరీ అని అంటారు. ఉదాహరణకు హిట్లర్ని ఓ థియేటర్లో బంధించి కాల్చి హతమార్చడం, మహాభారతంలో కౌరవుల కుతంత్రాలను బట్టబయలు చేసి వాళ్లని నవ్వులపాలు చేయడం వంటివి. ఇలాంటి ప్రత్యామ్నాయ చరిత్ర కలిగిన కథలు మన అహాన్ని సంతృప్తిపరుస్తాయి కాబట్టి స్వతహాగానే వాటివైపు ఆకర్షితులవుతాం. సరిగ్గా అలాంటి కోవకు చెందినదే 'మాయాబజార్' సినిమా. ఈ చిత్రం లక్ష్యం కూడా అదే.



వెండితెర అద్భుత దృశ్య కావ్యం... తొలి పాన్ ఇండియన్ చిత్రం మాయాబజార్

మాయాబజార్ అను శశిరేఖా పరిణయంగా...

వ్యాస భారతం ప్రకారం బలరాముడుకి శశిరేఖ అని పిలువ బడే కూతురే లేదు. మాయాబజార్ నిజానికి శశిరేఖా పరిణయం అనే పేరుతో మన దగ్గర ప్రసిద్ధిగాంచిన ఓ కల్పిత జానపద కథ. దీని ఆధారంగా 'మాయాబజార్'కి ముందు, తరువాత అనేక చిత్రాలు రూపొందినా కేవీ రెడ్డి రూపొందించిన ఈ ఒక్క సినిమా మాత్రమే అత్యంత ప్రజాదరణకు నోచుకుంది. 'మాయాబజార్'కు తొలుత చాలా పేర్లనే అనుకున్నారు. సినిమాలో ఘటోత్కచుడు పాత్రను ఎస్వీ రంగారావు చేశారు కాబట్టి ముందుగా ఈ సినిమా పేరును ఘటోత్కచుడు అని పెట్టాలని అనుకున్నారట. తర్వాత శశిరేఖా పరిణయం అని పేరు పెట్టారు. ఆ తర్వాత దానిని మాయాబజార్ అను శశిరేఖా పరిణయంగా మార్చారు. చివరికి విడుద లయ్యే సమయానికి అది 'మాయాబజార్'గా మిగిలింది. 'మాయాబజార్' కథకు ఉన్న లక్ష్యం కేవలం శశిరేఖకు, అభిమన్యుడికి పెళ్లి చెయ్యటం కాదు... కొన్ని కారణాల వల్ల వంచించబడ్డ శశిరేఖ తల్లిదండ్రుల మనసు మార్చటం, కౌరవులను నవ్వులపాలు చేసి, వాళ్లని దండించబడటం ఈ కథలోని అంతిమ లక్ష్యం. కృష్ణుడు బలరాముడికి హితబోధ చేసినా, అభిమన్యుడు లక్ష్మణ కుమారుడితో యుద్ధానికి దిగినా శశిరేఖా పరిణయం సాధ్యమయ్యేది.. కానీ కథకున్న అంతిమ లక్ష్యం సాధ్యపడేది కాదు.

చిన్న కథ... బలమైన స్క్రీన్‌ప్లే

నిజానికి 'మాయాబజార్' కథ చాలా చిన్నది. అయితే బలమైన స్క్రీన్‌ప్లేతో దీనిని రక్తి కట్టించారు దర్శకులు కేవీ రెడ్డి. ప్రథమార్ధం కేవలం నాటకీయత మాత్రమే ఉంటుంది. ఆ నాటకీయ పరిణామాలు ఇప్పటికీ సమకాలీన పరిస్థితుల్లానే అనిపిస్తాయి. అమ్మాయి–అబ్బాయి ప్రేమలో పడటం, ఆ ప్రేమకి తల్లిదండ్రులు అడ్డు చెప్పటం, తల్లి కూతుర్ని కొట్టడం, డబ్బు పోగానే ముఖం చాటేసే చుట్టాలు, తండ్రిని ప్రశ్నించే ధైర్యం లేని కూతురు... వంటివి ఇప్పటికీ ప్రతీ ఇంట్లో కనిపించేవే. ప్రేక్షకుడిని ఈ వాస్తవిక పరిస్థితులు ముందుగా కథతో కనెక్ట్ చేస్తాయి. ప్రథమార్ధమంతా లక్ష్యానికి పూర్తిగా దూరం చేసి, ఇక ఏ రకమైన ఆశ మిగలని స్థితికి తీసుకెళ్లి, ఘటోత్కచుడు ప్రవేశించడంతో వడివడిగా లక్ష్యాన్ని చేరుకునేలా చేస్తారు. పూర్తి విషాదం తర్వాత వచ్చే ఆనందానికి విలువ ఎక్కువ ఉంటుంది. కౌరవుల్ని ఏమీ చెయ్యలేం అనుకునే మానసిక స్థితికి ప్రేక్షకుడ్ని తీసుకొచ్చి, తర్వాత వాళ్లని వెర్రి వాళ్లని చేసి ఆడుకోవటం వల్ల వచ్చే కిక్కు మామూలుగా ఉండదు.



ఎస్వీఆర్ మీదే ప్రమోషన్!

66 ఏళ్ల క్రితం వచ్చిన ఈ సినిమాలోని సాంకేతికత గురించి ఇప్పటికీ చర్చించుకోవడానికి కారణం కెమెరామేన్ మార్కస్ బార్ట్ లీ. గ్రాఫిక్స్ లేని కాలంలో కెమెరా టెక్నిక్స్‌తో సృష్టించిన మాయాజాలానికి అప్పట్లో ప్రేక్షకులు నిశ్చేష్టులయ్యారు. నిజంగా మాయ జరుగుతున్నట్టుగానే భావించారట. ముఖ్యంగా వివాహ భోజనంబు పాటలో లడ్డూలన్నీ నోట్లోకి సరాసరి వెళ్ళిపోవడం, ఆహార పాత్రలన్నీ వాటికవే కదలడం.. వంటి సీన్లకు మంత్రముగ్ధులయ్యారు. ఈ సినిమాలోనే ఎన్టీఆర్ మొదటిసారిగా శ్రీకృష్ణుడిగా కనిపించారు. అంతకు ముందు 1954లో వచ్చిన 'ఇద్దరు పెళ్ళాలు', 1956లో వచ్చిన 'సొంత వూరు' సినిమాల్లో కృష్ణుడిగా కనిపించినప్పటికీ, అవి పూర్తి స్థాయి కృష్ణుడి పాత్రలు కావు. 'మాయాబజార్' టైమ్‌లో ఎన్టీఆర్, ఏఎన్నార్‌ల మార్కెట్ కన్నా ఎస్వీఆర్ మార్కెట్ ఎక్కువ. జనాల్లో పాపులారిటీ కూడా ఎక్కువే. అందుకే రిలీజ్‌కు ముందు ఈ సినిమా ప్రమోషన్లను ఎస్వీఆర్ పేరు మీదే చేశారట.







రెండు లక్షల బడ్జెట్‌తో...

'మాయాబజార్'ను సుమారు రెండు లక్షల బడ్జెట్‌తో నిర్మించారు. అప్పట్లో తెలుగులో వచ్చిన భారీ బడ్జెట్ సినిమా ఇదే. సాధారణంగా 30 వేల బడ్జెట్‌ను మించి సినిమాలు తీయడానికి అప్పట్లో నిర్మాతలు సాహసించేవారు కాదు. కానీ 'మాయాబజార్'ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న విజయా ప్రొడక్షన్స్ ఖర్చుకు వెనకాడలేదు. తెలుగు, తమిళంలో ఒకేసారి తెరకెక్కిన తొలి సినిమా కూడా ఇదే. ఆ తరువాత ఈ సినిమాను హిందీ, బెంగాలీ, కన్నడ భాషల్లో డబ్ చేశారు. విడుదలైన అన్నిచోట్లా విజయాన్ని అందుకుంది. అంటే ఒక విధంగా 'మాయాబజార్'ని తొలి పాన్ ఇండియన్ మూవీ అనొచ్చేమో. అందుకే నాటికైనా నేటికైనా మరెప్పటికైనా 'మాయాబజార్' అనేది ఓ గోల్డ్ మెమరీ.

- ఇంటూరు హరికృష్ణ



● ప్రభాస్

కాంబినేషన్ సెట్?



● ప్రశాంత్ వర్మ

హీరో ప్రభాస్, దర్శకుడు ప్రశాంత్ వర్మ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనుందా? అంటే అవుననే టాక్ వినిపిస్తోంది. వీరి కాంబినేషన్‌లో ఓ పవర్‌ఫుల్ సబ్జెక్ట్‌తో సినిమా రానుందని, ప్రస్తుతం ఈ సినిమా చర్చల దశలో ఉందని, ఈ చర్చలు ఓ కొలిక్కి వచ్చిన తర్వాత ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఫిల్మ్‌నగర్ భోగట్టా. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనుందట. అలాగే ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో ఈ చిత్రం భాగం కావొచ్చనే టాక్ కూడా వినిపిస్తోంది. మరి... ప్రభాస్ అండ్ ప్రశాంత్ వర్మ కాంబినేషన్ సెట్ అవుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ. మరోవైపు ప్రస్తుతం ప్రభాస్ 'రాజాసాబ్', 'ఫౌజి' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రాలతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది ప్రారంభంలో ప్రభాస్ 'స్పిరిట్' సినిమా చిత్రీకరణలో పాల్గొంటారని తెలిసింది. ఇక, 'రాజాసాబ్', 'ఫౌజి' వచ్చే ఏడాది విడుదలవుతాయి. సో... వచ్చే ఏడాది ప్రభాస్ రెండు చిత్రాలతో సందడి చేస్తారు.

ఇండియన్ స్క్రీన్స్‌కి 'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్'

- స్పిరిట్ మీడియా సంస్థ ద్వారా విడుదల చేయనున్న రానా



● రానా, పాయల్ కపాడియా

'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' చిత్రం ఇండియాలో విడుదలయ్యే సమయం ఆసన్నమైంది. కనికా కస్రుతి, దివ్య ప్రభ లీడ్ రోల్స్‌లో, ఛాయా కదం ఓ కీలక పాత్రలో నటించిన చిత్రం 'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్'. భారతీయ దర్శకురాలు పాయల్ కపాడియా ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఫ్రాన్స్, ఇండియా, నెదర్లాండ్స్, ఇటలీ, లక్సెంబర్గ్ దేశాల నిర్మాణ సంస్థలు ఈ సినిమాను నిర్మించాయి. ఈ చిత్రం ఈ ఏడాది మేలో జరిగిన 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమై, గ్రాండ్ ప్రీ అవార్డును గెలుచుకుంది. 97వ ఆస్కార్ అవార్డ్స్‌లోని ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పరిశీలించిన సినిమాల జాబితాలోనూ ఈ చిత్రానికి చోటు దక్కింది. తాజాగా ఈ సినిమా ఇండియన్ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. టాలీవుడ్ హీరో– నిర్మాత రానా స్పిరిట్ మీడియా సంస్థ 'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' చిత్రాన్ని రిలీజ్ చేయనుంది. నవంబరు 22న ఈ చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు రానా సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది. ఇక ఈ చిత్రకథ విషయానికి వస్తే... కేరళకు చెందిన ఇద్దరు నర్సులు ముంబైలో ఉద్యోగాలు చేస్తుంటారు. అయితే ఊహించని ఓ ఘటన వీరి జీవితాలను ఏ విధంగా ప్రభావితం చేసింది? అన్నదే ఈ చిత్రకథ.

● బిగ్ బాస్ ఆరవ వారం విశ్లేషణ

పులిహోర పార్టిసిపెంట్స్ ఉప్పు సత్యాగ్రహం



బిగ్ బాస్ చాలా కన్ఫ్యూజన్‌లో ఉన్నట్టున్నాడు. తన ప్రేక్షకులను తిమ్మిని బమ్మిని అయినా చేసి ఆకట్టుకునే తీవ్ర ప్రయత్నంలో ఉన్నాడు. ఇందులో భాగంగా హౌస్‌లోకి కొంతమందిని కొత్తవారిని తీసేసి పాత వారిని తీసుకువచ్చి కలగాపులగం చేశాడు. ఇంకా చెప్పాలంటే... ఓ పులిహోర లాంటి పార్టిసిపెంట్స్ ఇప్పుడు హౌస్‌లో ఉన్నారు. కొత్తవాళ్లు ఎంతలా ఆడినా, నామినేషన్స్ ప్రక్రియ నుండి టాస్కులు కాని, ఎలిమినేషన్ కాని అంతా రాయల్ క్లాన్స్‌దే పైచేయిగా ఉంది. గమనిక... ఇక్కడ పాతవాళ్లుగా హౌస్‌లోకి ఎంట్రీ ఇచ్చిన గ్రూప్‌కు రాయల్ క్లాన్స్ అనే పేరు పెట్టాడు బిగ్ బాస్. హౌస్‌లో కన్నడ పార్టిసిపెంట్స్, తెలుగు పార్టిసిపెంట్స్ మధ్య పోటీ అనిపిస్తుంది కాని హౌస్ మొత్తం ఒకే పార్టిసిపెంట్స్ అని అనిపించట్లేదు. బిగ్ బాస్ ఫాలో అవుతున్న సదరు ప్రేక్షకుడికి ఇట్టే అర్థమవుతుంది గేమ్ అంతా ఏకపక్షమైందని. ఇక ఈ వారం టాస్కుల పరంగా ఉప్పు గురించి ఓ టాస్కు పెట్టాడు బిగ్ బాస్. కాకపోతే అది చాలా సిల్లీగా అనిపించింది. దసరా పండగ స్పెషల్‌గా వారాంతం ఎపిసోడ్ కొన్ని మెరుపులతో కొన్ని పాత ఆటలతో మమ అనిపించాడు బిగ్ బాస్. బిగ్ బాస్ అన్ని సిరీస్‌లు ఫాలో అవుతున్న వారికి తెలుస్తుంది... బిగ్ బాస్ టాస్కులన్నీ పాత టాస్కులే అని. ఇక్కడ టాస్కులు పాతవైతే ఫర్వాలేదు ఆ పాత టాస్కులు ఆడేవారు కూడా పాతవారే. ఓ సారి ఆట ఆడినవారు మరోసారి జాగ్రత్తగా ఆడతారు కదా. అప్పుడు కొత్తవాళ్ళెప్పుడూ పాతవాళ్ల మీద గెలుస్తారు కదా. ఇంత చిన్న లాజిక్ బిగ్ బాస్ ఎందుకు గమనించలేదో ఏమో. కాని ఒక్క విషయంలో మాత్రం బిగ్ బాస్‌ను మెచ్చుకోవాలి. ఈ కాన్సెప్ట్ పరదేశానిదైనా మన దేశంలో చేస్తున్నప్పుడు మన సంస్కృతికి పెద్ద పీట వేసి మన పండగ శోభలను కార్యక్రమంలో పొందుపరచడం నిజంగా అభినందనీయం. ముఖ్యంగా వారాంతంలో ప్రసారమయిన ఎపిసోడ్‌లో ప్రముఖ గాయని మంగ్లీ హౌస్‌లోని పార్టిసిపెంట్స్ చేత బతుకమ్మ ఆడించడం ఆకర్షణగా నిలిచింది. ఏది ఏమైనప్పటికీ బిగ్ బాస్ ఈ సీజన్‌లో ముందు ముందు ఇంకెన్ని కష్టాలు పడి ప్రేక్షకుల కోసం ఇంకెంత పులిహోర కలుపుతాడో చూడాలి మరి.

అన్నా అనడంతో బాధపడ్డాను

- శివ కార్తికేయన్

"సాయిపల్లవి గొప్ప నటి. ఓ సారి తనకు ఫోన్ చేసినప్పుడు నన్ను అన్నా అని పిలిచింది. అప్పుడు చాలా బాధపడ్డాను" అని హీరో శివ కార్తికేయన్ చెప్పిన మాటలు వైరల్‌గా మారాయి. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో శివ కార్తికేయన్, సాయి పల్లవి నటించిన చిత్రం 'అమరన్'. ఆర్మీ మేజర్ ముకుంద్ వరదరాజన్ నిజ జీవిత కథతో ఈ సినిమా రూపొందింది. కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్, వివేక్ కృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రంలో మేజర్ ముకుంద్ వరదరాజన్ పాత్రలో శివ కార్తికేయన్ నటించారు. ఇదిలా ఉంటే... తాజాగా చెన్నైలో 'అమరన్' ఆడియో విడుదల వేడుకని ఘనంగా నిర్వహించారు. ఈ వేదికపై శివ కార్తికేయన్ మాట్లాడుతూ – "నేను గతంలో ఓ టీవీ ఛానల్‌లో యాంకర్‌గా చేస్తున్నప్పుడు సాయి పల్లవిని తొలిసారి కలిశాను. నేను హోస్ట్ చేసిన ఓ కార్యక్రమానికి ఆమె అతిథిగా హాజరయ్యారు. ఆ తర్వాత ఇండస్ట్రీలో ఆమె పేరే ఒక బ్రాండ్. 'ప్రేమమ్'లో తన నటన నాకు బాగా నచ్చింది. దీంతో ఫోన్ చేసి చెప్పాను. ఇందుకు తను వెంటనే థ్యాంక్యూ అన్నా అని చెప్పింది. నన్ను అలా అన్నా పిలిచినందుకు చాలా బాధపడ్డాను" అని సరదాగా చెప్పారు.





● సాయి పల్లవి

రుహీ బాబా వర్సెస్ మంజులిక

కార్తీక్ ఆర్యన్, త్రిప్తి దిమ్రీ హీరో హీరోయిన్లుగా, మాధురీ దీక్షిత్, విద్యా బాలన్ కీలక పాత్రల్లో నటించిన హారర్ కామెడీ చిత్రం 'భూల్ భూలయ్యా3'. అనీస్ బాజ్మీ దర్శకత్వంలో భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్, ముదార్ ఖేతని నిర్మించిన ఈ చిత్రం దీపావళి సందర్భంగా నవంబరు 1న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా 'భూల్ భూలయ్యా 3' యూనిట్ హైదారాబాద్‌లో ప్రమోషన్ కార్యక్రమాలను నిర్వహించింది. ఇందులో భాగంగా ఈ సినిమాలోని టైటిల్ ట్రాక్‌ను ప్రదర్శించారు. కార్తీక్ ఆర్యన్ తరహా డ్యాన్స్ తనకు రాదని, ఈ పాటలో కార్తీక్ బాగా డ్యాన్స్ చేశారని విద్యా బాలన్ అన్నారు. 'భూల్ భూలయ్యా 3' తెలుగు ప్రేక్షకులను కూడా మెప్పిస్తుందని తెలిపారు కార్తీక్ ఆర్యన్. ఈ చిత్రంలో రుహీ బాబాగా కార్తీక్ ఆర్యన్ కనిపిస్తారు. విద్యా బాలన్, మాధురీ దీక్షిత్‌లలో నిజమైన మంజులిక (సినిమాలో దెయ్యం పాత్ర) పాత్రలో ఎవరు కనిపిస్తారనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ చిత్రకథ రుహీ బాబా వర్సెస్ మంజులిక అన్నట్టుగా సాగుతుందని బాలీవుడ్ సమాచారం.



● కార్తీక్ ఆర్యన్, విద్యా బాలన్

సరికొత్త ప్రపంచంలోకి...

ఆది సాయికుమార్ హీరోగా నటిస్తున్న చిత్రం 'శంబాల'. యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఆనంది హీరోయిన్‌గా నటిస్తున్నారు. షైనింగ్ పిక్చర్స్‌పై రాజశేఖర్ అన్నభీమోజు, మహిధర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్‌ని 'శంబాల'గా ఫిక్స్ చేసి, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను లాంచ్ చేశారు మేకర్స్. పోస్టర్‌లో ఒక్క మనిషి కూడా లేని గ్రామం, ప్రళయానికి ముందు భీకరంగా ఉన్న ఆకాశం, మబ్బుల్లో ఓ రాక్షస ముఖం వంటివి ఉండటం సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. ''సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న సినిమా 'శంబాల'. ఈ మూవీలో జియో సైంటిస్ట్‌గా సవాల్‌తో కూడిన పాత్ర చేస్తున్నారు ఆది. ఇండియన్ స్క్రీన్‌మీద ఇంతవరకు టచ్ చేయని వైవిధ్యమైన కథను మా సినిమాలో చూపించబోతున్నాం. న్యూయార్క్ ఫిలిం అకాడమీలో ఫిలిం మేకింగ్‌లో శిక్షణ తీసుకున్న యుగంధర్ ఈ సినిమాను హాలీవుడ్ స్థాయిలో హై టెక్నికల్ స్టాండర్డ్స్‌తో, గ్రాండ్ విజువల్స్‌తో రూపొందిస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఎక్స్‌పీరియన్స్ చేయని ఓ డిఫరెంట్ వరల్డ్‌లోకి ఆడియన్స్‌ను తీసుకెళ్లనున్నాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి శ్రీరామ్ మద్దూరి సంగీతం అందిస్తున్నారు.



● ఆది



● ఆనంది

బిజినెస్ రీల్

రూ. 250 కోట్ల సమీకరణలో ముథూట్ ఫిన్‌కార్ప్

న్యూఢిల్లీ: ఆర్థిక సేవల సంస్థ ముథూట్ ఫిన్‌కార్ప్ రూ. 250 కోట్లు సమీకరించనుంది. ఇందుకోసం పదిహేడో విడత సిరీస్ టూ కింద నాన్-కన్వర్టబుల్ డిబెంచర్లను జారీ చేయనుంది. ఎన్‌సీడీల ముఖ విలువ రూ. 1,000గా ఉంటుంది. ఈ ఇష్యూ అక్టోబర్ 24 వరకు అందుబాటులో ఉంటుంది. 24 నుంచి 92 నెలల వరకు కాలవ్యవధి, వార్షికంగా 9 శాతం నుంచి 10.10 శతం వరకు ఈల్డ్ ఉంటుంది. ఎన్‌సీడీల జారీ ద్వారా సమీకరించే నిధులను తదుపరి రుణాలు ఇచ్చేందుకు, ఇతరత్రా కార్పొరేట్ అవసరాల కోసం వినియోగించుకోనున్నట్లు సంస్థ సీఈవో షాజీ వర్గీస్ తెలిపారు.

మాస్సే ఫెర్గూసన్ బ్రాండ్ వివాదంలో టఫేకు ఊరట

న్యూఢిల్లీ: మాస్సే ఫెర్గూసన్ బ్రాండ్ యాజమాన్య హక్కుల వివాదంలో వ్యవసాయ పరికరాల తయారీ సంస్థ టఫేకు మద్రాస్ హైకోర్టులో ఊరట లభించింది. వివాదం పెండింగ్‌లో ఉండగా, భారత్‌లో బ్రాండ్ పేరును తాము వినియోగించుకోవడంలో ఏజీసీవో కార్పొరేషన్ అనుబంధ సంస్థ మాస్సే ఫెర్గూసన్ కార్పొరేషన్ జోక్యం చేసుకోకుండా ఆదేశాలివ్వాలని కోరిన టఫేకు అనుకూలంగా న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. భారత్ సహా వివిధ దేశాల్లో టఫేతో ఉన్న మాస్సే ఫెర్గూసన్ బ్రాండ్ లైసెన్సులు సహా పలు ఒప్పందాలను ఏజీసీవో హఠాత్తుగా రద్దు చేసుకుంది. దీనిపైనే టఫే న్యాయస్థానాన్ని ఆశ్రయించగా తాజా ఆదేశాలు వచ్చాయి.

టెల్కోల ఆదాయం రూ. 5 లక్షల కోట్లు

రెండేళ్లలో అంచనాలు

న్యూఢిల్లీ: వ్యాపారాల నిర్వహణను సులభతరం చేసేందుకు గత రెండు-మూడేళ్లుగా కేంద్రం పలు చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో టెలికం సంస్థల ఆదాయాలు గణనీయంగా పెరగనున్నాయి. వచ్చే రెండేళ్లలో రూ. 5 లక్షల కోట్ల స్థాయికి చేరతాయనే అంచనాలు నెలకొన్నాయి. టెలికం శాఖకు సంబంధించిన డిజిటల్ కమ్యూనికేషన్ కమిషన్ సభ్యుడు మనీష్ సిన్హా ఈ విషయాలు తెలిపారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2024 ఆర్థిక సంవత్సరంలో టెల్కోల స్థూల ఆదాయం రూ. 3.36 లక్షల కోట్లుగా ఉండగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఇది రూ. 4 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. టెలికం రంగంలో పరిస్థితులు శరవేగంగా మారిపోతున్న నేపథ్యంలో స్పెక్ట్రం కేటాయింపుల విధానంలో మార్పులు రావాల్సిన అవసరం ఉందని సిన్హా చెప్పారు. స్పెక్ట్రంను వినియోగం సమర్థంగా ఉండేలా చూసేందుకు, దాని పూర్తి ఆర్థిక విలువను వెలికితీసేందుకు సుదీర్ఘంగా 10-20 ఏళ్ల పాటు కేటాయించడం కాకుండా తక్కువ వ్యవధికి కేటాయించాలని పేర్కొన్నారు.

ఓడరేవుల్లో 414 ఎంఎంటీ సరుకు రవాణా

సెప్టెంబర్ నెలలో నమోదు

న్యూఢిల్లీ: దేశంలోని 12 ప్రముఖ పోర్టుల (ఓడరేవు) నుంచి సెప్టెంబర్ నెలలో 413.74 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఎంఎంటీ) సరుకు రవాణా నమోదైంది. ఇది 5శాతం వృద్ధికి సమానం. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్ట్ మధ్య జాతీయ జలరవాణా మార్గాల ద్వారా సరుకు రవాణా 5 శాతం వృద్ధితో 56.57 ఎంఎంటీలకు చేరిందని పోర్టులు, షిప్పింగ్ శాఖ గణాంకాలు విడుదల చేసింది. గత నెలలో జరిగిన 20వ మ్యారిటైమ్ స్టేట్స్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎంఎస్‌డీసీ)లో రాష్ట్రాలకు, పోర్టులకు ర్యాంకుల విధానంపై చర్చ జరిగినట్టు షిప్పింగ్ శాఖ తెలిపింది. దేశవ్యాప్తంగా సముద్ర రవాణా పరంగా రాష్ట్రాలు, పోర్టుల మధ్య ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహించడంపై చర్చినట్టు పేర్కొంది. ఆ సమయంలో రాష్ట్రాలు 100కు పైగా అంశాలు లెవనెత్తగా, వాటిని పరిష్కరించినట్టు తెలిపింది.

25 స్టార్టప్‌లకు ఎస్‌టీపీఐ నిధుల సాయం

న్యూఢిల్లీ: టైర్-2, 3 పట్టణాలకు చెందిన 25 స్టార్టప్‌లకు సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) లీప్ అహెడ్ 2.0 ఎడిషన్ కింద నిధుల సహకారం అందించనుంది. పలు ఇన్వెస్టర్లతో అవగాహన ఒప్పందాలు చేసుకున్నట్టు ఎస్‌టీపీఐ డైరెక్టర్ జనరల్ అరవింద్ కుమార్ తెలిపారు. ఒక్కో స్టార్టప్‌కు రూ.కోటి వరకు నిధుల సాయం అందుతుందని, అందులో ఎస్‌టీపీఐ రెండు విడతలుగా రూ.25లక్షల చొప్పు సమకూరుస్తుందని ప్రకటించారు. దీనికి అదనంగా స్టార్టప్‌లు పలు రకాలుగా సాయం అందుకుంటాయన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-10-2024	
విశాఖ	505-00
చిత్తూరు	538-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510-00
విజయవాడ	510-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	495-00
వరంగల్	497-00
రిటైల్ ధర	5.55

అదరగొట్టిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు

- క్యూ2 నికర లాభం రూ.16,821 కోట్లు
- మొత్తం ఆదాయం రూ .85,500 కోట్లు



ముంబై: ప్రైవేటురంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు త్రైమాసిక ఫలితాల్లో అదరగొట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) జులై-సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.16,821 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసిక లాభం రూ.15,976 కోట్లతో పోలిస్తే ఇది 5% అధికం. మొత్తం ఆదాయం రూ.78,406 కోట్ల నుంచి రూ.85,500 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం సైతం రూ.67,698 కోట్ల నుంచి రూ.74,017 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం 10% వృద్ధి చెంది రూ.27,390 కోట్ల నుంచి రూ.30,110 కోట్లుకు చేరింది. బ్యాంకు స్థూల ఎన్‌పీఏలు స్వల్పంగా 1.34% నుంచి రూ.1.36 శాతానికి పెరగ్గా.., నికర ఎన్‌పీఏలు 0.35% నుంచి 0.41 శాతానికి చేరాయి. నికర వడ్డీ మార్జిన్(ఎన్ఐఎం) మొత్తం ఆస్తులపై 3.46%, వడ్డీ ఆర్జించే వాటిపై 3.65 శాతంగా ఉంది. గత త్రైమాసికంలో ఇవి వరుసగా 3.47%, 3.66 శాతంగా ఉన్నాయి.

సమీక్షా త్రైమాసికంలో..,

- మొత్తం డిపాజిట్లు 15.1% వృద్ధితో రూ.25 లక్షల కోట్లకు చేరాయి. కరెంట్, సేవింగ్స్ ఖాతా (కాసా) డిపాజిట్లు 8.1% పెరిగాయి. సేవింగ్స్ అకౌంట్ డిపాజిట్లు రూ.6.08 లక్షల కోట్లకు, కరంట్ ఖాతా డిపాజిట్లు రూ.2.75 లక్షల కోట్లకు చేరుకున్నాయి. మొత్తం బ్యాలెన్స్ షీట్ పరిమాణం రూ.34.16 లక్షల కోట్ల నుంచి రూ.36.88 లక్షల కోట్లకు చేరింది.
- బ్యాంక్ స్థూల అడ్వాన్సులు 7% పెరిగి రూ.25.19 లక్షల కోట్లకు చేరుకున్నాయి. రిటైల్ రుణాలు 11.3%, వాణిజ్య, గ్రామీణ రుణాలు 17.4% పెరిగాయి. కార్పొరేట్ ఇతర టోకు రుణాలు 12% తగ్గాయి. మొత్తం అడ్వాన్స్ లలో ఓవర్సీస్ అడ్వాన్సులు 1.7% ఉన్నాయి.
- ప్రొవిజన్స్, కంటింజెన్సీలు రూ.2,900 కోట్లకు నుంచి రూ.రూ.2,700 కోట్లకు తగ్గాయి. మొత్తం రుణ వ్యయ నిష్పత్తి 0.43% నుంచి 0.49 శాతానికి దిగివచ్చింది. నిర్వహణ వ్యయాలు రూ.15,400 కోట్ల నుంచి 9.7% పెరిగి రూ.16,890 కోట్లకు చేరుకున్నాయి.

వేదాంత రూ.1 లక్ష కోట్ల పెట్టుబడి



న్యూఢిల్లీ: విభిన్న రంగాల్లో ఉన్న వేదాంత గ్రూప్ రాజస్తాన్‌లో రూ.1 లక్ష కోట్లు పెట్టుబడి చేయనున్నట్టు ప్రకటించింది. యూకేలో జరిగిన రైజింగ్ రాజస్తాన్ రోడ్‌షోలో రాజస్తాన్ సీఎం భజన్ లాల్ శర్మతో వేదాంత చైర్మన్ అనిల్ అగర్వాల్ భేటీ అయి తాజాగా పెట్టుబడి ప్రతిపాదనలు చేశారు. వేదాంత కంపెనీ అయిన హిందుస్తాన్ జింక్ రూ.30,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. జింక్ ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న 1.2 మిలియన్ టన్నుల నుంచి 2 మిలియన్ టన్నులకు, వెండి ఉత్పత్తిని 800 నుంచి 2,000 టన్నులకు చేరుస్తారు. ఒక మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం గల ఫెర్టిలైజర్ ప్లాంటు నెలకొల్పుతారు. రోజుకు 3 లక్షల బ్యారెల్స్‌కు సామర్థ్యం పెంచేందుకు కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్ రూ.35,000 కోట్లు పెట్టుబడి చేయనుంది. 10,000 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన వనరులను అభివృద్ధి చేసేందుకు సెరెంటికా రెన్యూవబుల్స్ రూ.50,000 కోట్లు ఖర్చు చేయనుంది. ఉదయ్‌పూర్ సమీపంలో లాభాపేక్ష లేకుండా ఇండస్ట్రియల్ పార్క్ నెలకొల్పనున్నట్టు వేదాంత గ్రూప్ ప్రకటించింది. తాజా పెట్టుబడులు కార్యరూపం దాలిస్తే కొత్తగా రెండు లక్షల మందికిపైగా ఉపాధి లభిస్తుందని సంస్థ వెల్లడించింది. ఇప్పటికే రాజస్తాన్‌లో వేదాంత గ్రూప్ కంపెనీలు రూ.1.5 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు చేయడం విశేషం. దేశంలో ఉత్పత్తి అవుతున్న ముడి చమురులో కెయిర్న్ వాటా 25% ఉంది. హిందుస్తాన్ జింక్, కెయిర్న్ ప్రధాన కార్యకలాపాలకు రాజస్తాన్ కేంద్రంగా ఉంది. కాగా ఒడిశాలో రూ. 1 లక్ష కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు కంపెనీ శుక్రవారం తెలిపింది.

రూ.1,500 కోట్లతో హ్యుండై విస్తరణ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీలో ఉన్న దక్షిణ కొరియా సంస్థ హ్యుండై అనుబంధ కంపెనీ హ్యుండై మోటార్ ఇండియా తమిళనాడు ప్లాంటును విస్తరించాలని నిర్ణయించింది. ప్రీ-ఫీజిబిలిటీ రిపోర్ట్‌ను ఈ మేరకు దాఖలు చేసింది. దీని ప్రకారం కాంచీపురం జిల్లాలోని ఈ కేంద్రంలో రూ.1,500 కోట్లతో ఆధునీకరణ పనులు చేపడతారు. విస్తరణ పూర్తి అయితే 5.4 లక్షల చదరపు మీటర్లున్న ప్లాంటు స్థలం 7.21 లక్షల చదరపు మీటర్లకు పెరుగుతుంది. కొత్తగా 155 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఆధునీకరణ పనులకు కొత్తగా స్థలం కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని కంపెనీ తెలిపింది. మొత్తం 538 ఎకరాల్లో ఈ కేంద్రం నెలకొని ఉంది. ప్లాంటు వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 8.5 లక్షల యూనిట్లు. అయిదేళ్లలో విస్తరణ పనులు పూర్తి అవుతాయని సంస్థ భావిస్తోంది. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో ప్రయాణికుల వాహనాలకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి ఈ పెట్టుబడి కీలకమని హ్యుండై వెల్లడించింది.

ఔషధ ఎగుమతులు @10 బిలియన్ డాలర్లు

- ఏప్రిల్-ఆగస్ట్ మధ్య నమోదు
- కీలక మార్కెట్లుగా యూరప్, యూఎస్
- ఫార్ములేషన్లు, బయోలాజికల్స్‌కు డిమాండ్
- కలిసొస్తున్న అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు



న్యూఢిల్లీ: భారత్ నుంచి ఔషధ ఎగుమతులకు యూఎస్, యూరప్ కీలక మార్కెట్లుగా నిలుస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఐదు నెలల్లో (ఏప్రిల్-ఆగస్ట్) ఫార్ములేషన్స్, బయోలాజికల్స్ ఎగుమతులు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 10.8% పెరిగి 9.42 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. సర్జికల్ ఉత్పత్తుల ఎగుమతులు 3.3% వృద్ధితో 0.29 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఈ గణాంకాలను కేంద్ర వాణిజ్య శాఖ విడుదల చేసింది. ఫార్మా మార్కెట్లో విశ్వసనీయమైన సరఫరాదారుగా భారత్‌కు ప్రాముఖ్యత పెరుగుతున్నట్టు ఈ డేటా స్పష్టం చేస్తోంది. ''ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్స్, బయోలాజికల్ ఉత్పత్తుల్లో అంతర్జాతీయంగా భారత్ స్థానం పటిష్టమవుతోంది. అంతర్జాతీయంగా జనరిక్స్, వినూత్నమైన చికిత్సలకు డిమాండ్ పెరగడంతోపాటు, భారత్‌లో అత్యున్నత ప్రమాణాలతో కూడిన తయారీ ఇందుకు మద్దతుగా నిలుస్తోంది''అని వివరించింది.

వివిధ దేశాలకు ఎగుమతులు ఇలా..

- భారత్ నుంచి ఫార్ములేషన్లు, బయోలాజికల్స్ ఉత్పత్తుల ఎగుమతుల్లో 39% అమెరికాకు వెళ్లాయి. ఏప్రిల్ నుంచి ఆగస్ట్ వరకు 3.69 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను భారత కంపెనీలు అమెరికాకు షిప్ చేశాయి. అమెరికాలో జనరిక్స్, ప్రాణాలను రక్షించే ఔషధాలకు డిమాండ్ పెరుగుతుండడం కలిసొస్తోంది.
- అమెరికా తర్వాత యూకేకు అత్యధికంగా 316.2 మిలియన్ డాలర్ల విలువైన ఫార్ములేషన్లు, బయోలాజికల్స్ ఎగుమతులు నమోదయ్యాయి. యూకే వాటా 3.4 శాతంగా ఉంది. దక్షిణాఫ్రికాకు 268 మిలియన్ డాలర్లు (2.8 శాతం), ఫ్రాన్స్‌కు 243 మిలియన్ డాలర్లు (2.6 శాతం), కెనడాకు 197 మిలియన్ డాలర్లు (2.1 శాతం) విలువ చేసే ఔషధ ఫార్ములేషన్లు, బయోలాజికల్స్ ఎగుమతయ్యాయి.
- మధ్యప్రాచ్యంలో ఇరాక్‌కు 86.5 మిలియన్ డాలర్ల విలువ చేసే ఉత్పత్తులను భారత ఫార్మా సంస్థలు ఎగుమతి చేశాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో ఎగుమతులు 43.5 మిలియన్ డాలర్లతో పోల్చితే రెట్టింపయ్యాయి.
- నాణ్యతా ప్రమాణాలతో కూడిన భారత సర్జికల్ ఉత్పత్తులకు సైతం అంతర్జాతీ య మార్కెట్లో ఆదరణ అధికమవుతోంది. గడిచిన ఐదేళ్ల నుంచి ఎగుమతులు స్థిరంగా పెరుగుతున్నాయి. 2019-20లో 0.45 బిలియన్ డా లర్ల ఎగుమతులు నమోదు కాగా, 2023 -24లో ఇవి 0.70 బిలియన్ డాలర్లకు పెరిగాయి.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలల్లో భారత్ నుంచి ఎగుమతి అయిన సర్జికల్ ఉత్పత్తుల్లో 53 మిలియన్ డాలర్లు (18.1 శాతం) యూఎస్‌కే వెళ్లాయి. జర్మనీకి 13.5 మిలియన్ డాలర్లు (4.6 శాతం), బ్రిటన్‌కు 13.4 మిలియన్ డాలర్ల చొప్పున సర్జికల్ ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి.

కోటక్ మహీంద్రా లాభం రూ.3,344 కోట్లు



న్యూఢిల్లీ: ప్రముఖ ప్రైవేట్‌రంగ కోటక్ మహీంద్రా బ్యాంక్ సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.3,344 కోట్ల స్టాండలోన్ నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌తో పోలిస్తే లాభం 5% పెరిగింది. అప్పటి నికర లాభం రూ.3,191 కోట్లు. మొత్తం ఆదాయం రూ.13,507 కోట్ల నుంచి రూ.15,900 కోట్లకు చేరింది. బ్యాంక్ వడ్డీ ఆదాయం రూ.11,193 కోట్ల నుంచి రూ.13,216 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం(ఎన్ఐఐ) రూ.7,020 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే క్వార్టర్‌లో నమోదైన రూ.6,297 కోట్లతో పోలిస్తే ఇది 11% అధికంగా ఉంది. నికర వడ్డీ మార్జిన్(ఎన్ఐఎం) 5.22% నుంచి 4.91శాతానికి దిగివచ్చింది. స్థూల ఎన్‌పీఏలు(మొండి బకాయిలు) 1.72% నుంచి 1.49 శాతం తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 0.37% నుంచి 0.43 శాతం పెరిగాయి. కాగా ఏకీకృత ప్రాతిపదికన బ్యాంకు 13% వృద్ధితో రూ.5,044 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. బ్యాంకు ఆస్తులపై ఆదాయం స్వల్పంగా 2.68% నుంచి 2.53 శాతం తగ్గింది.

టెక్ మహీంద్రా నికర లాభం రెట్టింపు

క్యూ2లో ఆదాయం రూ.13,313 కోట్లు



ముంబై: ఐటీ సర్వీసుల సంస్థ టెక్ మహీంద్రా సెప్టెంబర్ త్రైమాసిక నికర లాభం రూ.1,250 కోట్లుగా నమోదైంది. కిందటేడాది ఇదే క్వార్టర్‌లో ఆర్జించిన రూ.493.9 కోట్లతో పోలిస్తే లాభం రెట్టింపునకు పైగా పెరగడం విశేషం. ఆస్తుల విక్రయం ద్వారా వచ్చిన ప్రత్యేక ఆదాయంతో నికర లాభం 153.1% వృద్ధి చెందినట్లు కంపెనీ తెలిపింది. సమీక్షా కాలంలో కంపెనీ ఆదాయం 3.49% పుంజుకొని రూ.12,863.9 కోట్ల నుంచి రూ.13,313.2 కోట్లకు చేరుకుంది. ఈబిటా మార్జిన్ 110 బేసిస్ పాయింట్లు పెరిగి 8.5% నుంచి 9.06 శాతానికి చేరుకుంది. మొత్తం కాంట్రాక్టుల విలువ 534 మిలియన్ డాలర్ల నుంచి 603 మిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఆస్తుల విక్రయం ద్వారా రూ.4,502 కోట్ల ఇతర ఆదాయం లభించింది. సెప్టెంబర్ త్రైమాసికంలో కొత్తగా 6,653 మంది ఉద్యోగులు జతకలవడంతో కంపెనీలో మొత్తం 1,54,273 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.

మధ్యంతర డివిడెండ్ రూ.15

సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాల ప్రకటన సందర్భంగా కంపెనీ మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. అర్హత కలిగిన షేర్ హోల్డర్లకు ఒక్కో ఈక్విటీ షేరు రూ.15 చొప్పున డివిడెండ్ చెల్లిస్తామని కంపెనీ సీఎఫ్ఓ రోహిత్ ఆనంద్ తెలిపారు. రికార్డు తేది నవంబర్ 1 అని, నవంబర్ 9 నాటికి డివిడెండ్ అందజేస్తామన్నారు.

ఆఫ్కాన్స్ రూ.5,430 కోట్ల ఐపీవో



న్యూఢిల్లీ: షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ కంపెనీ ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఐపీవో అక్టోబర్ 25న ప్రారంభం అవుతోంది. ఇష్యూ ద్వారా కంపెనీ రూ.5,430 కోట్లు సమీకరించనుంది. ఇందులో ఫ్రెష్ ఇష్యూ రూ.1,250 కోట్లు కాగా ఆఫర్ ఫర్ సేల్ రూ.4,180 కోట్లు ఉంది. ప్రమోటర్ గ్రూప్ కంపెనీ గోస్వామీ ఇన్‌ఫ్రాటెక్ ఆఫర్ ఫర్ సేల్ ద్వారా వాటాలను విక్రయిస్తోంది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా వచ్చిన మొత్తంలో రూ.80 కోట్లను నిర్మాణ యంత్రాల కొనుగోలుకు వెచ్చిస్తారు. దీర్ఘకాలిక మూలధన అవసరాలకు రూ.320 కోట్లు ఖర్చు చేస్తారు. సుమారు రూ.600 కోట్లు రుణాల చెల్లింపులకు వినియోగిస్తారు. ఇన్‌ఫ్రా, ఇంజనీరింగ్, కన్‌స్ట్రక్షన్ రంగంలో ఉన్న ఆఫ్కాన్స్‌కు ఆరు దశాబ్దాలకుపైగా చరిత్ర ఉంది. చమురు, సహజవాయువు, మెరైన్, ఇండస్ట్రియల్, లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ ట్యాంక్స్, మెటీరియల్ హ్యాండ్లింగ్ సిస్టమ్స్, హైవేస్, మెట్రో వర్క్స్, టన్నెల్స్ తదితర విభాగాల్లో భారత్ తోపాటు 17 దేశాల్లో రూ.56,305 కోట్ల విలువైన ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేసింది. జూన్ 30 నాటికి రూ.31,747 కోట్ల విలువైన 65 ప్రాజెక్టులు పలు నిర్మాణ దశల్లో ఉన్నాయి.

రెండేళ్లలో తగ్గనున్న లాజిస్టిక్స్ వ్యయాలు

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి



న్యూఢిల్లీ: జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలను పెద్ద ఎత్తున నిర్మిస్తున్న నేపథ్యంలో రెండేళ్లలో స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీ) లాజిస్టిక్స్ వ్యయాల వాటా 9%కి తగ్గుతుందని కేంద్ర రహదారి రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ప్రస్తుతం దేశీయంగా ఇది 14% ఉన్నట్లు చెప్పారు. అమెరికాతో పాటు యూరప్‌లోని పలు పెద్ద దేశాల్లో ఈ వ్యయాలు 12% ఉండగా చైనాలో 8 శాతంగా ఉన్నట్లు నీతి ఆయోగ్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా వివరించారు. 2022-23 ఎకనమిక్ సర్వే ప్రకారం దేశ జీడీపీలో లాజిస్టిక్స్ వ్యయాలు 14-18%గా ఉన్నాయి. అంతర్జాతీయ సగటు 8% తో పోలిస్తే ఇది చాలా ఎక్కువ కావడం గమనార్హం. ప్రత్యామ్నాయ ఇంధనాలను ఎగుమతి చేసేందుకు భారత్‌కు భారీగా అవకాశాలు ఉన్నాయని గడ్కరీ చెప్పారు. తక్కువ నాణ్యత గల బొగ్గును మిథనాల్ తయారీకి ఉపయోగించవచ్చన్నారు. జీవ ఇంధనాల విభాగంలో దేశం గణనీయంగా పురోగమిస్తోందని పేర్కొన్నారు. రహదార్ల నిర్మాణంలో రీసైకిలింగ్ చేసిన టైర్ పొడరు, ప్లాస్టిక్ మొదలైన మెటీరియల్స్‌ను వినియోగించడం వల్ల బిటుమిన్ దిగుమతులు తగ్గగలవని మంత్రి వివరించారు. మరోవైపు, దేశీ ఆటోమొబైల్ పరిశ్రమను ప్రపంచంలోనే అగ్రస్థానానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. గతేడాదే జపాన్‌ను దాటేసి అమెరికా, చైనా తర్వాత మూడో అతి పెద్ద ఆటోమొబైల్ మార్కెట్‌గా భారత్ ఆవిర్భవించిందని గడ్కరీ చెప్పారు. 2014లో రూ. 7.5 లక్షల కోట్లుగా ఉన్న దేశీ మార్కెట్ 2024 నాటికి రూ. 18 లక్షల కోట్లకు పెరిగిందని వివరించారు.

ఆన్‌లైన్ రుణం.. యస్ బాస్

- రుణంతో కన్స్యూమర్ డ్యూరబుల్స్
- స్మార్ట్‌ఫోన్లు, గృహ నవీకరణకూ ఇదే మార్గం
- యాప్ బ్యాంకింగ్, ఈఎంఐ కార్డులకు మొగ్గు
- వినియోగ ధోరణులపై హోమ్ క్రెడిట్ ఇండియా సర్వే



హైదరాబాద్: తక్కువ, మధ్యాదాయ వర్గాల వారు సాధారణంగా తక్షణ జీవన అవసరాల కోసమే రుణం తీసుకుంటారని అనుకుంటాం. ఇది ఒకప్పుడు. కానీ, నేడు తమ ఆకాంక్షల కోసం, వ్యాపారవేత్తగా ఎదిగేందుకు, దీర్ఘకాల పెట్టుబడుల కోసం రుణాలను వినియోగించుకునే దిశగా వారిలో మార్పు కనిపిస్తోంది. వినియోగదారులు తమ జీవన నాణ్యతను పెంచుకోవడానికి ప్రాధాన్యమిస్తున్నారు. యాప్ ఆధారిత డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులోకి రావడం, ఈఎంఐ తదితర రూపాల్లో డిజిటల్ రుణ లభ్యత మార్గాలు పెరగడం ఇందుకు మద్దతునిస్తోంది. హోమ్ క్రెడిట్ ఇండియా నిర్వహించిన వార్షిక కన్స్యూమర్ సర్వే 'హౌ ఇండియా బారోస్'లో ఈ ఆసక్తికర విషయాలు తెలిశాయి. ఈ మేరకు ఒక నివేదికను హోమ్ క్రెడిట్ ఇండియా విడుదల చేసింది.

వేటి కోసం రుణాలు..

కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఉత్పత్తుల కొనుగోలుకే ఎక్కువగా రుణాలు తీసుకుంటున్నారు. ఆ తర్వాత వ్యాపారాలు, గృహ నవీకరణ కోసం తీసుకుంటున్నారు. స్మార్ట్‌ఫోన్, గృహోపకరణాలకు తీసుకునే రుణాలు 2020లో ఒక శాతంగా ఉంటే, 2024కు వచ్చే సరికి 37 శాతానికి చేరాయి. స్టార్టప్‌లు, వ్యాపార విస్తరణ కోసం తీసుకుంటున్న రుణాలు 2020లో మొత్తం రుణాల్లో 5 శాతంగా ఉంటే, 2024 నాటికి 21 శాతానికి చేరాయి. వ్యాపారవేత్తలుగా అవతరించేందుకు, కొత్త ఆదాయ వనరులు, అవకాశాల కోసం యువత అన్వేషిస్తుందన్న దానికి ఇది నిదర్శనమని ఈ నివేదిక పేర్కొంది. కరోనా తర్వాత మారిన పరిస్థితులు, ఎంఎస్ఎంఈలకు ప్రభుత్వం నుంచి మద్దతు సానుకూల అంశాలని తెలిపింది. గృహ నవీకరణ, నిర్మాణం కోసం తీసుకునే రుణాలు 2022లో 9%గా ఉంటే, 2024 నాటికి 15 శాతానికి పెరిగాయి. అంటే మెరుగైన నివాస వసతులకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు, దీర్ఘకాల ఆస్తులపై పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నట్టు తెలుస్తోంది. ఇక విద్యా రుణాల్లో పెద్దగా మార్పు లేదు. 2020లో మాదిరే 2024లోనూ 4%వద్దే ఉన్నాయి. వివాహాల కోసం రుణాలు తీసుకోవడం 2021లో ఉన్న 3% నుంచి 2024 నాటికి 4 శాతానికి పెరిగింది. ఇక వైద్య అత్యవసరాల కోసం తీసుకునే రుణాల్లో స్పష్టమైన తగ్గుదల కనిపించింది. 2020 లో 7%గా ఉంటే, 2024లో 3 శాతానికి తగ్గింది. నాడు కరోనా విపత్తుతో వైద్యం కోసం భారీగా ఖ ర్చు చేయాల్సి రావడం తెలిసిందే. ఆ తర్వాత నుంచి హెల్త్ ఇన్సూరెన్స్‌కు ప్రాధాన్యం పెరిగింది. ఇది కూడా వ్యయాలను తగ్గించడంలో సాయపడింది.

వాట్సాప్, చాట్‌బాట్ పాత్ర

27 శాతం మధ్య తరగతి రుణ గ్రహీతలకు చాట్‌బాట్ సేవలపై అవగాహన ఉంది. ఇది గతేడాది 4 శాతంగానే ఉంది. జెనరేషన్ జెడ్‌లో ఇది 30 శాతం ఉండడం గమనార్హం. కస్టమర్ సేవల కోసం చాట్‌బాట్‌లు సులభంగా ఉంటున్నాయని 38 శాతం రుణగ్రహీతలు భావిస్తున్నారు. ఇక వాట్సాప్ కీలక వారధిగా పనిచేస్తోంది. 59 శాతం రుణ గ్రహీతలు వాట్సాప్ ద్వారా రుణ ఆఫర్లను అందుకుంటున్నారు. ఈఎంఐ కార్డుల వినియోగం సైతం పెరుగుతోంది. అలాగే ఎంబెడెడ్ ఫైనాన్స్ (డిజిటల్ రూపాల్లో రుణ సదుపాయాలు) పట్ల 50 శాతం ఆసక్తి చూపిస్తున్నారు. దీని ద్వారా వేగంగా రుణాలు పొందొచ్చని, ఈ కామర్స్ షాపింగ్ సులభంగా ఉంటుందని భావిస్తున్నారు. 64 శాతం మంది అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో తదితర ఈ కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల పట్ల సానుకూలంగా ఉంటే, 21 శాతం ట్రావెల్ బుకింగ్ యాప్‌లు మేక్‌మైట్రిప్, క్లియర్‌ట్రిప్, 23 శాతం ఫుడ్ డెలివరీ యాప్‌లు జొమాటో, స్విగ్గీ సేవలను వినియోగించుకుంటున్నారు.

పెరుగుతున్న డిజిటల్ లావాదేవీలు..



వినియోగదారులు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల సేవల వైపు మొగ్గు చూపిస్తుండడం కనిపిస్తోంది. 65 శాతం మంది యాప్ ఆధారిత బ్యాంకింగ్ సేవలకు ఆసక్తి చూపిస్తున్నారు. బ్రౌజర్ ఆధారిత బ్యాంకింగ్‌కు 44 శాతం మందే సానుకూలత చూపిస్తున్నారు. మిలీనియల్స్‌లో 69 శాతం మంది యాప్ ఆధారిత బ్యాంకింగ్‌కు మొగ్గు చూపిస్తుండగా, జెనరేషన్ జెడ్‌లో 65 శాతం మంది, జెన్ ఎక్స్‌లో 58 శాతం చొప్పున వినియోగించుకుంటున్నారు. మరీ ముఖ్యంగా మెట్రోల్లో వీటిని వినియోగించుకునే వారు 71 శాతంగా ఉంటే, ద్వితీయ శ్రేణి పట్టణాల్లో 69 శాతంగా ఉన్నారు. ఆన్‌లైన్‌లో షాపింగ్ సాధారణ స్థాయికి చేరింది. కరోనా అనంతర లాక్‌డౌన్‌లతో 2021లో ఆన్‌లైన్ షాపింగ్ 69 శాతానికి పెరగ్గా, 2023లో 48 శాతానికి దిగొచ్చింది. 2024లో మరింత తగ్గి 53 శాతంగా ఉంది. హైదరాబాద్‌లో 64 శాతం మంది ఆన్‌లైన్ షాపింగ్‌కు మొగ్గు చూపిస్తున్నారు. కోల్‌కతాలో ఇది 71 శాతంగా ఉంది.



ఫైనల్లో హుమేరా జోడీ

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ15 టోర్నీలో తెలంగాణ అమ్మాయి హుమేరా బహార్మస్ డబుల్స్ విభాగంలో ఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం బెంగళూరులో జరిగిన మహిళల డబుల్స్ సెమీఫైనల్లో హుమేరా–పూజా ఇంగాలె (భారత్) ద్వయం 7–6 (7/2), 6–4తో దివ భాటియా–సాయి సంహిత చామర్తి (భారత్) పై విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన తొలి పోరులో పోరాడి గెలిచిన హుమేరా బహార్మస్ జంట... రెండో సెట్‌లో సంపూర్ణ ఆధిపత్యం కనబరుస్తూ చెలరేగింది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్స్‌లో ఆకాంక్ష దిలీప్, తనీషా కశ్యప్ విజయాలు సాధించి తుది పోరుకు అర్హత సాధించారు. ఆకాంక్ష 7–5, 3–6, 6–2తో వైష్ణవి అడ్కర్ (భారత్)పైనే విజయం సాధించగా... తనీషా 6–1, 7–5తో కరోలాన్ డెలానూ (న్యూ కాలెడోనియా) పై గెలిచింది. ఆదివారం జరగనున్న టైటిల్ పోరులో ఆకాంక్షతో తనీషా అమీతుమీ తేల్చుకోనుంది.

భారత్ 'ఎ' శుభారంభం

- పాకిస్తాన్ షహీన్స్‌పై 7 పరుగులతో విజయం
- ఎమర్జింగ్ కప్ ఆసియా టి20 టోర్నమెంట్


వికెట్ తీసిన ఆనందంలో భారత 'ఎ' జట్టు ఆటగాళ్లు

అల్ అమ్రత్: ఎమర్జింగ్ కప్ ఆసియా టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో భారత 'ఎ' జట్టు శుభారంభం చేసింది. ఒమన్ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో దాయాది పాకిస్తాన్‌పై భారత్ విజయాన్ని అందుకుంది. గ్రూప్ 'బి'లో భాగంగా శనివారం జరిగిన పోరులో 'ఎ'జట్టు 7 పరుగుల తేడాతో పాకిస్తాన్ షహీన్స్ జట్టుపై గెలుపొందింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసింది. యువ భారత జట్టుకు సారథిగా వ్యవహరిస్తున్న హైదరాబాద్ క్రికెటర్ తిలక్ వర్మ (35 బంతుల్లో 44; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్ కాగా... ఓపెనర్లు అభిషేక్ శర్మ (22 బంతుల్లో 35; 5 ఫోర్లు, 2 సిక్సర్లు), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (19 బంతుల్లో 36; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించారు. ఓపెనర్లు ఆకట్టుకోవడంతో పవర్‌ప్లే ముగిసేసరికి భారత జట్టు వికెట్ నష్టపోకుండా 68 పరుగులు చేసింది. ఆ తర్వాత ప్రత్యర్థి బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో పరుగుల రాక మందగించినా... చివర్లో తిలక్ వర్మ ధాటిగా ఆడి జట్టుకు మంచి స్కోరు అందించాడు. నేహల్ వధేరా (25; 2 ఫోర్లు, ఒక సిక్సర్) ఫర్వాలేదనిపించాడు. పాకిస్తాన్ షహీన్స్ బౌలర్లలో సూఫియన్ ముఖీమ్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన పాకిస్తాన్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. అరాఫత్ మిన్హాస్ (29 బంతుల్లో 41; 5 ఫోర్లు, ఒక సిక్సర్), యాసిర్ ఖాన్ (22 బంతుల్లో 33; ఒక ఫోర్, 3 సిక్సర్లు) పోరాడినా ఫలితం లేకపోయింది. ఖాసిమ్ అక్రమ్ (27), అబ్దుల్ సమద్ (25; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) మెరుపులు మెరిపించారు. విజయానికి చివరి రెండు ఓవర్లలో 24 పరుగులు అవసరమైన దశలో పాకిస్తాన్ షహీన్స్ జట్టు 16 పరుగులకే పరిమితమై పరాజయం వైపు నిలిచింది. భారత బౌలర్లలో అన్షుల్ కంబోజ్ మూడు వికెట్లు పడగొట్టగా... రసిఖ్ సలామ్, నిషాంత్ సలామ్ చెరో రెండు వికెట్లు తీశారు. అన్షుల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. శనివారమే జరిగిన మరో మ్యాచ్‌లో యూఏఈ జట్టు 4 వికెట్ల తేడాతో ఒమన్‌పై గెలిచింది. మొత్తం ఎనిమిది జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీ తదుపరి మ్యాచ్‌లో భారత్ 'ఎ'జట్టు సోమవారం యూఏఈతో తలపడనుంది.

సంక్షిప్త స్కోర్లు

భారత్ 'ఎ'ఇన్నింగ్స్: 183/8 (తిలక్ వర్మ 44, ప్రభ్‌సిమ్రన్ సింగ్ 36, అభిషేక్ శర్మ 35; సూఫియాన్ ముఖీమ్ 2/28),

పాకిస్తాన్ షహీన్స్ ఇన్నింగ్స్: 176/7 (అరాఫత్ మిన్హాస్ 41, యాసిర్ ఖాన్ 33; అన్షుల్ కంబోజ్ 3/33, నిషాంత్ సింధు 2/15).

జూనియర్ల జయభేరి



- జపాన్‌పై భారత్ ఘన విజయం
- సుల్తాన్ జొహర్ కప్ హాకీ టోర్నీ

జొహర్ (మలేసియా): సుల్తాన్ జొహర్ కప్ హాకీ టోర్నమెంట్‌లో యువ భారత జట్టు శుభారంభం చేసింది. మలేసియాలో జరుగుతున్న ఈ టోర్నీలో శనివారం భారత్ 4–2తో జపాన్‌ను చిత్తు చేసింది. హాకీ దిగ్గజం పీఆర్ శ్రీజేశ్ జాతీయ జూనియర్ జట్టు కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆడిన తొలి మ్యాచ్‌లో యంగ్ ఇండియా అదరగొట్టింది. భారత్ తరఫున అమీర్ అలీ (12వ నిమిషంలో), గుర్‌జోత్ సింగ్ (36వ నిమిషంలో), ఆనంద్ సౌరభ్ (44వ నిమిషంలో), అంకిత్ పాల్ (47వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. జపాన్ తరఫున సుబాస తనాకా (26వ ని.లో), రకుసై యమనకా (57వ ని.లో) ఒక్కో గోల్ నమోదు చేశారు. మ్యాచ్ ఆరంభం నుంచే భారత జట్టు అటాకింగ్ గేమ్ కొనసాగించింది. ఒలింపిక్స్‌లో భారత జట్టు రెండు కాంస్య పతకాలు సాధించడంలో కీలక పాత్ర పోషించి... పారిస్ విశ్వక్రీడల తర్వాత కెరీర్‌కు వీడ్కోలు పలికిన గోల్ కీపర్ శ్రీజేశ్ మార్గనిర్దేశనంలో కుర్రాళ్లు సత్తా చాటారు. తొలి క్వార్టర్‌లో జపాన్ రక్షణ వలయాన్ని ఛేదించుకుంటూ ముందుకు వెళ్లిన అమీర్ అలీ తొలి గోల్ అందించి జట్టుకు ఆధిక్యం అదించాడు. అంతర్జాతీయ స్థాయిలో సుదీర్ఘ కాలం పట్టు కొనసాగించాలంటే మ్యాచ్‌లో ఎక్కువ శాతం ఫీల్డ్ గోల్స్ కొట్టాలని పదే పదే చెప్పే శ్రీజేశ్... కోచ్‌గా తొలి మ్యాచ్‌లోనే కుర్రాళ్లతో ఆ పని చేసి చూయించాడు. అయితే కాసేపటికే సుబాస తనాకా గోల్ కొట్టడంతో జపాన్ స్కోరు సమం చేయగలిగింది. మూడో క్వార్టర్‌లో భారత్ రెండు గోల్స్ కొట్టి ఆధిక్యం కనబర్చగా... చివరి క్వార్టర్‌లో అంకిత్ పాల్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి యంగ్ ఇండియా ఆధిక్యం మరింత పెంచగా... మరో మూడు నిమిషాల్లో ఆట ముగుస్తుందనగా... జపాన్ ఓ గోల్ చేసింది. నేడు గ్రేట్ బ్రిటన్‌తో భారత జట్టు తలపడనుంది.


శ్రీకర్ భరత్

శ్రీకర్ భరత్ పోరాటం

- ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ 137/5
- గుజరాత్ 367 ఆలౌట్
- రంజీ ట్రోఫీ

అహ్మదాబాద్: సహచరులు విఫలమైన చోట వికెట్ కీపర్ కోన శ్రీకర్ భరత్ (72 బంతుల్లో 78 బ్యాటింగ్; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) ఆకట్టుకున్నాడు. ఫలితంగా గుజరాత్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో తేరుకోగలిగింది. గ్రూప్ 'బి'లో భాగంగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో శనివారం ఆట ముగిసే సమయానికి ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 32 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. శ్రీకర్ భరత్‌తో పాటు... ఇటీవల బంగ్లాదేశ్‌తో టి20 సిరీస్‌లో మెరుపులు మెరిపించిన నితీశ్ కుమార్ రెడ్డి (34; 6 ఫోర్లు) సత్తా చాటాడు. కెప్టెన్ రికీ భుయ్ (9), హనుమ విహారి (0), షేక్ రషీద్ (1), మహీప్ కుమార్ (0), అభిషేక్ రెడ్డి (15) విఫలమయ్యారు. దీంతో ఒక దశలో ఆంధ్ర జట్టు 29 పరుగులకే సగం వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఒకవైపు గుజరాత్ బౌలర్లు విజృంభిస్తుంటే... ఆంధ్ర బ్యాటర్లు పెవిలియన్‌కు వరుస కట్టారు. ఈ దశలో ఆత్మరక్షణ ధోరణి వీడిన శ్రీకర్ భరత్ ఎదురుదాడికి దిగి ఫలితం రాబట్టాడు. అతడికి నితీశ్ కుమార్ రెడ్డి కూడా తోడవడంతో ఆంధ్ర జట్టు కోలుకోగలిగింది. ఈ జంట అబేధ్యమైన ఆరో వికెట్‌కు 107 పరుగులు జోడించింది. గుజరాత్ బౌలర్లలో చింతన్ గాజా 3 వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 289/8తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన గుజరాత్ చివరకు 106 ఓవర్లలో 367 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ చింతన్ గాజా (152 బంతుల్లో 92; 8 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీ చేజార్చుకోగా... అర్జాన్ నాగ్‌వస్వల్లా (82 నాటౌట్; 11 ఫోర్లు, ఒక సిక్సర్) అజేయంగా నిలిచాడు. ఆంధ్ర బౌలర్లలో సత్యనారాయణ రాజు, లలిత్ మోహన్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. ప్రస్తుతం చేతిలో ఐదు వికెట్లు ఉన్న ఆంధ్ర జట్టు... ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 230 పరుగులు వెనుకబడి ఉంది. శ్రీకర్ భరత్, నితీశ్ కుమార్ రెడ్డి క్రీజులో ఉన్నారు.

స్కోరు వివరాలు

గుజరాత్ తొలి ఇన్నింగ్స్: 367;

ఆంధ్ర తొలి ఇన్నింగ్స్: అభిషేక్ రెడ్డి (సి) మనన్ హింగ్రాజియా (బి) జడేజా 15; మహీప్ కుమార్ (సి) ఉర్విల్ పటేల్ (బి) అర్జాన్ 0; షేక్ రషీద్ (సి) మనన్ హింగ్రాజియా (బి) చింతన్ గాజా 1; హనుమ విహారి (బి) చింతన్ గాజా 0; రికీ భుయ్ (సి) ఉర్విల్ పటేల్ (బి) చింతన్ గాజా 9; శ్రీకర్ భరత్ (నాటౌట్) 78; నితీశ్ కుమార్ రెడ్డి (నాటౌట్) 34; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం (32 ఓవర్లలో 5 వికెట్లకు) 137. వికెట్ల పతనం:** 1–4, 2–5, 3–5, 4–25, 5–29, **బౌలింగ్:** చింతన్ గాజా 9–1–40–3; అర్జాన్ 7–1–22–1; ప్రియాజిత్ సింగ్ జడేజా 3.5–0–25–1; సిద్ధార్థ్ దేశాయ్ 8–1–27–0; జయ్‌మీత్ పటేల్ 0.1–0–0–0, రవి బిష్ణోయ్ 4–0–23–0

తెలుగు టైటాన్స్ పరాజయం



- తమిళ్ తలైవాస్ చేతిలో ఓటమి
- హరియాణాపై పుణేరి గెలుపు
- ప్రొ కబడ్డీ లీగ్

సాక్షి, హైదరాబాద్: సొంతగడ్డపై జరుగుతున్న ప్రొ కబడ్డీ లీగ్ రెండో మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ జట్టు పరాజయం పాలైంది. తొలి పోరులో చక్కటి ప్రదర్శన కనబర్చిన టైటాన్స్... దాన్ని కొనసాగించడంలో విఫలమైంది. శనివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన పోరులో తెలుగు టైటాన్స్ 29–44 పాయింట్ల తేడాతో తమిళ్ తలైవాస్ చేతిలో పరాజయం పాలైంది. హైదరాబాద్ కెప్టెన్ పవన్ సెహ్రావత్ 10 పాయింట్లతో పోరాడిన ఫలితం లేకపోయింది. తమిళ్ తలైవాస్ తరఫున నరేందర్ కండోలా, సచిన్ చెరో పది పాయింట్లతో సత్తాచాటారు. సాహిల్ గులియా 5 పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. మ్యాచ్ ఆరంభమైన తొలి నిమిషంలోనే సూపర్ రైడ్‌తో మూడు పాయింట్లు కొల్లగొట్టిన పవన్ సెహ్రావత్.. కాసేపట్లో మరో మూడు పాయింట్లు సాధించి జట్టుకు మంచి ఆరంభం ఇచ్చాడు. అయితే ఎక్కువసేపు ఆధిక్యాన్ని సాగనివ్వని తలైవాస్ జట్టు... చెలరేగి ఆడి టైటాన్స్‌ను ఆలౌట్ చేసింది. తొలి అర్ధభాగం వరకు ఇరు జట్ల మధ్య హోరాహోరీ కొనసాగడంతో నువ్వా నేనా అన్నట్లు మ్యాచ్ రసవత్తరంగా కనిపించింది. నాలుగు పాయింట్ల ఆధిక్యంతో ఫస్ట్ హాఫ్‌ను ముగించిన తలైవాస్... ద్వితీయార్ధంలో తెలుగు టైటాన్స్‌కు ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా వరుస పాయింట్లు కొల్లగొడుతూ ఆధిక్యాన్ని అంతకంతకూ పెంచుకుంటూ పోయింది. పవన్ సెహ్రావత్‌తో పాటు టైటాన్స్ తరఫున విజయ్ మాలిక్ 9 పాయింట్లు సాధించినా లాభం లేకపోయింది. మరో మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 35–25 పాయింట్ల తేడాతో హరియానా స్టీలర్స్‌పై విజయం సాధించింది. పుణేరి పల్టన్ తరఫున గౌరవ్ ఖత్రి 7 పాయింట్లు, కెప్టెన్ అస్లాం ఇనామ్‌దార్ 5 పాయింట్లు సాధించారు. హర్యానా స్టీలర్స్ తరఫున శివమ్ పతారె, సంస్కార్ మిశ్రా చెరో ఐదు పాయింట్లు సాధించారు. నేడు జరగనున్న మ్యాచ్‌ల్లో బెంగాల్ వారియర్స్ తో జైపూర్ పింక్ పాంథర్స్ (రాత్రి 8:00 గంటల నుంచి), గుజరాత్ టైటాన్స్‌తో బెంగళూరు బుల్స్(రాత్రి 9:00 గంటల నుంచి) తలపడతాయి.

భారత్‌లో ఆసియా హ్యాండ్‌బాల్ టోర్నీ

ఈ ఏడాది డిసెంబర్ 1 నుంచి 10 వరకు పోటీలు

HAI HANDBALL ASSOCIATION INDIA

న్యూఢిల్లీ: ఆసియా మహిళల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌కు భారత్ తొలిసారి ఆతిథ్యమివ్వనుంది. ఈ ఏడాది డిసెంబర్ 1 నుంచి 10 వరకు దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో ఈ మెగా టోర్నీ జరగనుంది. షెడ్యూల్ ప్రకారం ఈ టోర్నీకి కజకస్తాన్‌లోని అల్మాటీ ఆతిథ్యమివ్వాల్సి ఉండగా... మధ్య ఆసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న నేపథ్యంలో వేదికను తరలించారు. చాంపియన్‌షిప్‌లో భారత్‌తో పాటు ఇరాన్, దక్షిణ కొరియా, చైనా, జపాన్, కజకిస్తాన్, హాంకాంగ్, సింగపూర్ జట్లు కూడా పాల్గొననున్నాయి. '20వ ఆసియా మహిళల హ్యాండ్‌బాల్ చాంపియన్‌సిప్‌నకు భారత్ ఆతిథ్యమివ్వనుంది. తక్కువ సమయంలో ఇందుకు అంగీకరించినందుకు ఆనందంగా ఉంది. ఈ టోర్నీ నిర్వహణతో హ్యాండ్‌బాల్‌లో భారత్ శక్తివంతమైన క్రీడా దేశంగా ఎదిగిందనేది ప్రతిబింబిస్తుంది. తక్కువ సమయంలో ముందుకొచ్చిన భారత్... తమ ఆతిథ్యంతోనూ ఆకట్టుకుంటుందనే నమ్మకముంది' అని ఆసియా హ్యాండ్‌బాల్ సమాఖ్య ప్రతినిధి అబ్దుల్లా అల్ తయ్యబ్ అన్నారు. భారత మహిళల జట్టు ఈ టోర్నీలో పాల్గొననుండటం ఇది ఎనిమిదోసారి కాగా... ఇందులో అత్యుత్తమంగా మన జట్టు 2022, 2000లో ఆరో స్థానంలో నిలిచింది.

తమిళనాడు 674/6 డిక్లేర్డ్

- వాషింగ్టన్ సుందర్ భారీ సెంచరీ
- ఢిల్లీతో రంజీ మ్యాచ్


సుందర్

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీలో భాగంగా ఢిల్లీతో జరుగుతున్న మ్యాచ్‌లో తమిళనాడు భారీ స్కోరు చేసింది. గ్రూప్ 'డి'లో భాగంగా జరిగిన పోరులో తమిళనాడు 674/6 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. టీమిండియా ప్లేయర్ వాషింగ్టన్ సుందర్ (269 బంతుల్లో 152; 19 ఫోర్లు, ఒక సిక్సర్) భారీ సెంచరీతో కదం తొక్కగా... ప్రదోష్ రంజన్ పాల్ (117; 13 ఫోర్లు) శతకం చేశాడు. అంతకుముందు ఓపెనర్ సాయి సుదర్శన్ (213; 25 ఫోర్లు, ఒక సిక్సర్) కూడా ద్విశతకం నమోదు చేసుకోవడంతో తమిళనాడు భారీ స్కోరు చేయగలిగింది. నారాయన్ జగదీశన్ (65), సిద్ధార్థ్ (66 నాటౌట్) అర్ధసెంచరీలతో రాణించారు. ఢిల్లీ బౌలర్లలో నవ్‌దీప్ సైనీ, హిమాన్షు చౌహాన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఓవర్‌నైట్ స్కోరు 379/1తో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన తమిళనాడు జట్టు ఆడుతూ పాడుతూ పరుగులు రాబట్టింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఢిల్లీ... రెండో రోజు ఆట ముగిసే సమయానికి 16 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 43 పరుగులు చేసింది. సనత్ సాంగ్వాన్ (23 బ్యాటింగ్), హర్ష్ త్యాగి (15 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. చేతిలో 10 వికెట్లు ఉన్న ఢిల్లీ... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 631 పరుగులు వెనుకబడి ఉంది.

ముంబై బోణీ

గోవాపై 2-1తో గెలుపు

ఇండియన్ సూపర్ లీగ్


ముంబై, గోవా జట్ల మధ్య మ్యాచ్‌లో ఓ దృశ్యం

మార్‌గావ్: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో ముంబై సిటీ ఫుట్‌బాల్ క్లబ్ తొలి విజయం నమోదు చేసుకుంది. శనివారం జరిగిన పోరులో ముంబై జట్టు 2–1 తేడాతో గోవా ఫుట్‌బాల్ క్లబ్‌పై విజయం సాధించింది. గోవాపై ముంబైకిది వరుసగా 13వ విజయం కావడం విశేషం. ముంబై జట్టు తరఫున నికోస్ కరెలిస్ (21వ నిమిషంలో), యోల్ వ్యాన్ నిఫ్ (40వ నిమిషంలో) ఒక్కో గోల్ చేయగా... గోవా జట్టు తరఫున ఆర్మాండో సాడికు (55వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించాడు. తొలి అర్ధభాగంలోనే రెండు గోల్స్‌తో అదరగొట్టిన ముంబై సిటీ జట్టు ఆధిక్యంలోకి దూసుకెళ్లగా... గోవా జట్టు వెనుకబడిపోయింది. ద్వితీయార్ధంలో పుంజుకొని పోరాడే ప్రయత్నం చేసినా ఒక గోల్‌తోనే సరిపెట్టుకుంది. తాజా సీజన్‌లో ముంబై సిటీ జట్టు ఇప్పటి వరకు నాలుగు మ్యాచ్‌లు ఆడగా... ఇదే తొలి విజయం ఒక ఓటమి, రెండు 'డ్రా'లతో మొత్తంగా 5 పాయింట్లు ఖాతాలో వేసుకున్న ముంబై జట్టు పట్టికలో ఏడో స్థానంలో ఉంది. మరోవైపు ఐదు మ్యాచ్‌లు ఆడిన గోవా ఫుట్‌బాల్ క్లబ్ ఒక విజయం రెండు పరాజయాలు, రెండు 'డ్రా'లతో 5 పాయింట్లతో ముంబై తర్వాతి స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో మోహన్ బగాన్ సూపర్ జెయింట్ జట్టు 2–0తో ఈస్ట్ బెంగాల్ ఫుట్‌బాల్ క్లబ్‌పై విజయం సాధించింది. మోహన్ బగాన్ తరఫున జెమీ మెక్‌లారెన్ (41వ నిమిషంలో), దిమిత్రీ పెట్రాటోస్ (89వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. ఈ విజయంతో మోహన్ బగాన్ జట్టు మూడో గెలుపు నమోదు చేసుకొని పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి దూసుకెళ్లింది. మరోవైపు ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ ఓడిన ఈస్ట్ బెంగాల్ జట్టు పట్టిక అట్టడుగున ఉంది. లీగ్‌లో భాగంగా ఆదివారం మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్‌తో కేరళ బ్లాస్టర్స్ ఫుట్‌బాల్ క్లబ్ తలపడనుంది.

రాణించిన రాహుల్ రాధేశ్, హిమతేజ

- హైదరాబాద్ 244/5
- ఉత్తరాఖండ్ 325
- రంజీ మ్యాచ్


రాహుల్ రాధేశ్

డెహ్రాడూన్: మిడిలార్డర్ రాణించడంతో ఉత్తరాఖండ్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ పోరాడుతోంది. గ్రూప్ 'బి'లో భాగంగా జరుగుతున్న ఈ పోరులో రెండో రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 78 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 244 పరుగులు చేసింది. వికెట్ కీపర్ రాహుల్ రాధేశ్ (174 బంతుల్లో 82 బ్యాటింగ్; 9 ఫోర్లు), కొడిమేల హిమతేజ (147 బంతుల్లో 78; 8 ఫోర్లు, ఒక సిక్సర్) అర్ధ శతకాలతో రాణించారు. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (30; 4 ఫోర్లు), కెప్టెన్ రాహుల్ సింగ్ (21; 2 ఫోర్లు, ఒక సిక్సర్) ఫర్వాలేదనిపించగా... అభిరత్ రెడ్డి (0), రోహిత్ రాయుడు (7) విఫలమయ్యారు. ఉత్తరాఖండ్ బౌలర్లు రాణించడంతో తొలి ఓవర్‌లోనే హైదరాబాద్ వికెట్ కోల్పోయింది. ఇన్నింగ్స్ మూడో బంతికే అభిరత్ రెడ్డి వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి ఔట్ అయ్యాడు. ఆ తర్వాత కూడా వరుసగా వికెట్లు పడటంతో ఒక దశలో హైదరాబాద్ 64 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో హిమతేజ, రాహుల్ రాధేశ్ జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ ఆచితూచి ఆడుతూనే వీలు చిక్కినప్పుడల్లా భారీ షాట్లతో స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. ఈ జంట ఐదో వికెట్‌కు 142 పరుగులు జోడించడంతో హైదరాబాద్ జట్టు కోలుకోగలిగింది. ఉత్తరాఖండ్ బౌలర్లలో దేవేంద్రసింగ్ బోరా రెండు వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 313/8తో శనివారం తొల ఇన్నింగ్స్ కొనసాగించిన ఉత్తరాఖండ్ చివరకు 325 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ బౌలర్లలో తనయ్ త్యాగరాజన్ 4 వికెట్లు పడగొట్టగా... మిలింద్, రోహిత్ రాయుడు చెరో రెండు వికెట్లు తీశారు. రెండో ఇన్నింగ్స్‌లో మెరుగైన ప్రదర్శనే చేస్తున్న హైదరాబాద్ జట్టు... ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 81 పరుగులు వెనుకబడి ఉంది. రాహుల్ రాధేశ్‌తో పాటు తనయ్ త్యాగరాజన్ (17 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

స్కోరు వివరాలు

ఉత్తరాఖండ్ తొలి ఇన్నింగ్స్: 325;

హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్: తన్మయ్ అగర్వాల్ (బి) దేవేంద్రసింగ్ బోరా 30; అభిరత్ రెడ్డి (సి) ఆదిత్య (బి) దీపక్ ధాపోలా 0; రాహుల్ సింగ్ (సి) వైభవ్ భట్ (బి) అభయ్ నేగీ 21; రోహిత్ రాయుడు (ఎల్బీడబ్ల్యూ) ఆకాశ్ మధ్వాల్ 7; హిమతేజ (సి) అవనీశ్ సుధ (బి) దేవేంద్రసింగ్ బోరా 78; రాహుల్ రాధేశ్ (నాటౌట్) 82; తనయ్ త్యాగరాజన్ (నాటౌట్) 17; ఎక్స్‌ట్రాలు 9, **మొత్తం (78 ఓవర్లలో 5 వికెట్లకు) 244. వికెట్ల పతనం:** 1–1, 2–39, 3–53, 4–64, 5–206, **బౌలింగ్:** దీపక్ ధాపోలా 13–2–31–1; ఆకాశ్ మధ్వాల్ 10–0–41–1; అభయ్ నేగీ 16–2–40–1; దేవేంద్ర సింగ్ బోరా 15–1–51–2; అవనీశ్ సుధ 10–2–21–0; స్వప్నిల్ సింగ్ 13–3–46–0; రవికుమార్ సమర్థ్1–0–6–0.

అలాస్కాలో అమెరికా
చివరి ఓటరు

టండ్రా ద్వీపంలో చిట్టచివరి పోలింగ్‌కేంద్రం

రాత్రి ఒంటిగంటకు ఓటేయనున్న స్థానికులు

ఎటు చూసినా మంచు. గడ్డి తప్పించి నిలబడటానికి ఒక్క చెట్టు కూడా పెరగడానికి అనుకూలంగాకాని మైదాన ప్రాంతాలు. ఎవరికీ పట్టని అమెరికా చిట్టచివరి ప్రాంతంగా మిగిలిపోయిన అలాస్కా గురించి మళ్లీ వార్తలు మొదలయ్యాయి. గత 12 సంవత్సరాల ప్రజాస్వామ్య సంప్రదాయానికి మళ్లీ అక్కడి ఓటర్లు సిద్ధమవడమే ఇందుకు కారణం. అమెరికా పశ్చిమ దిశలో చిట్టచివరి పోలింగ్ కేంద్రం ఈ టండ్రా ద్వీపంలోనే ఉంది. అడాక్ ద్వీప ప్రజలు గతంలో మెయిల్ ద్వారా ఓటు పంపించే వారు. 2012 అమెరికా ఎన్నికలప్పుడు మేం కూడా అందరిలా స్వయంగా పోలింగ్‌కేంద్రానికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకుంటామని ఉత్సాహం చూపారు. దాంతో అమెరికా ప్రభుత్వం ఇక్కడ తొలిసారిగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేసింది. అప్పటి నుంచి ప్రధాన ఓటర్ల జాబితాలో ఇక్కడి వాళ్లంతా చేరిపోయారు. ''మా నగర వాసులం చిట్టచివర్లో ఓటేస్తాం. ఓటింగ్ సరళిని బట్టి ఆలోపే దాదాపు విజేత ఎవరో తెల్సేవీలుంది. అయినాసరే చివర్లో ఓటేస్తున్నామన్న ఉత్సాహం మాలో రెట్టిస్తుంది. ఆ రోజు మాకందరికీ ప్రత్యేకమైన రోజు. మేం ఓటేసేటప్పటికి అర్ధరాత్రి దాటి సమయం ఒంటిగంట అవుతుంది''అని సిటీ మేనేజర్ లేటన్ లాకెట్ చెప్పారు. – యాంకరేజ్(అమెరికా)



33 వృక్షాల జాతీయవనం !

అలాస్కాలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు భారీ వృక్షాల ఎదుగుదలకు సరిపడవు. దీంతో ఇక్కడ గడ్డి, చిన్న మొక్కలు తప్పితే వృక్షాలు ఎదగవు. ఇక్కడ చెట్లు పెంచి అడవిని సృష్టించాలని అమెరికా ప్రభుత్వం 1943–45కాలంలో ఒక ప్రయత్నం చేసింది. చివరికి చేసేదిలేక చేతులెత్తేసింది. అప్పటి ప్రయత్నానికి గుర్తుగా 1960లలో అక్కడి 33 చెట్ల ముందు ఒక బోర్డ్ తగిలించింది. ''మీరిప్పుడు అడాక్ జాతీయ వనంలోకి వచ్చి వెళ్తున్నారు'అని దానిపై రాసింది. నేవీ బేస్ ఉన్నంతకాలం 6,000 మందిదాకా జనం ఉండేవారు. తర్వాత ఇక్కడ ఉండలేక చాలా మంది వలస వెళ్లారు. 2020 జనాభా లెక్కల ప్రకారం ఇక్కడ కేవలం 171 మంది ఉంటున్నారు. 2024 అనధికార గణాంకాల ప్రకారం ఇక్కడ స్థిరనివాసం ఏర్పర్చుకున్నది కేవలం 50 మంది మాత్రమే. కనీసం పది మంది విద్యార్థులయినా వస్తే స్కూలు నడుపుదామని నిర్ణయించుకున్నారు. ఎలాగోలా గత ఏడాది ఆరుగురు విద్యార్థులతో స్కూలు మొదలుపెట్టారు. తీరా గత ఏడాది నవంబర్‌కు వచ్చేసరికి ఐదుగురు మానేశారు. ఇప్పుడు అక్కడ ఒకే విద్యార్థి ఉన్నారని అలేటియన్ రీజియన్ స్కూల్ డిస్ట్రిక్ సూపరింటెండెంట్ మైక్ హన్లీ చెప్పారు. ''జనం వెళ్లిపోతున్నారు. చివరికి ఎవరు మిగులుతారో. ఈసారి చివరి ఓటు ఎవరేస్తారో చూడాలి'అని అడాక్ సిటీ క్లర్క్ జీన్ లికనాఫ్ చెప్పారు.

అమెరికా చిట్టచివరి భూభాగం

అలాస్కా ప్రాంతం అగ్రరాజ్యానికి ప్రత్యేకమైనది. గతంలో రష్యా అధీనంలో ఉండేది. ఎందుకు పనికిరాని భూభాగంగా భావించి చాన్నాళ్ల క్రితం అమెరికాకు అమ్మేసింది. ఇటీవలికాలంలో ఇక్కడ చమురు నిక్షేపాలు బయటపడటంతో ఈ ప్రాంతమంతా ఇప్పుడు బంగారంతో సమానం. అత్యంత విలువైన సహజవనరులతో అలరారుతోంది. చిట్టచివరి పోలింగ్ కేంద్రాలున్న అడాక్ ద్వీపం నిజానికి అలేటియన్ ద్వీపాల సముదాయంలో ఒకటి. పసిఫిక్ మహాసముద్రంలో భాగమైన బేరింగ్ నది ఈ ద్వీపసముదాయాలకు ఉత్తరదిశలో ఉంటుంది. దక్షిణ దిశలో పసిఫిక్ మహాసముద్ర ఉత్తరప్రాంతం ఉంటుంది. అమెరికా ఈ ద్వీపాన్ని రెండో ప్రపంచ యుద్ధంలో స్థావరంలా ఉపయోగించుకుంది. తర్వాత నేవీ స్థావరంగా అభివృద్ధి చేసింది. ''ఇక్కడ చివరిగా ఓటేసింది నేనే. 2012లో మిట్ రోమ్నీపై బరాక్ ఒబామా బరిలోకి దిగి గెలిచిన విషయం మాకు మరుసటి రోజు ఉదయంగానీ తెలీలేదు'అని 73 ఏళ్ల మేరీ నెల్సన్ చెప్పారు. గతంలో అక్కడ పోలింగ్ సిబ్బందిగా పనిచేసిన ఆమె ప్రస్తుతం వాషింగ్టన్ రాష్ట్రానికి మారారు. అలాస్కా ఆవల ఉన్న గ్వామ్, మేరియానా ద్వీపాలు, అమెరికన్ సమోవా వంటి ద్వీపాల్లో ప్రజలు ఉన్నా వారిని ఓటర్లుగా గుర్తించట్లేరు. దీంతో చివరి ఓటర్లుగా అలాస్కా ఓటర్లు చరిత్రలో నిలిచిపోయారు.

రెండో ప్రపంచయుద్ధ స్థావరం

ఎక్కువ రోజులు మంచును చవిచూసే అలాస్కా గతంలో యుద్ధాన్ని చవిచూసింది. రెండో ప్రపంచయుద్ధకాలంలో జపాన్ అధీనంలోని అటూ ద్వీపాన్ని ఆక్రమించేందుకు అమెరికా తన సేనలను ఇక్కడికి పంపింది. 1942 ఆగస్ట్‌లో సేనలు ఇక్కడికొచ్చి సైనిక శిబిరాల నిర్మాణం మొదలెట్టాయి. దీంతో శత్రుదేశ విమానాలు ఇక్కడ 9 భారీ బాంబులను జారవిడిచాయి. 1943 మేలో 27,000 మంది అమెరికా సైనికులు ఇక్కడికి చేరుకున్నారు. మెషీన్ గన్లమోతలతో ఈ ప్రాంతం దద్దరిల్లింది. ఈ ప్రాంతంపై మక్కువతో రచయితలు డాషిల్ హామెట్, గోరే విడల్ కొన్నాళ్లు ఇక్కడే ఉన్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్, బాక్సింగ్ ఛాంపియన్ జో లెవీస్, పలువురు హాలీవుడ్ తారలు తరచూ ఇక్కడికి వచ్చిపోతుంటారు.

30కి పైగా విమానాలకు
బాంబు బెదిరింపులు

సాక్షి, న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా, విస్తారా, ఆకాశ, ఇండిగో, స్పైస్‌జెట్, స్టార్ ఎయిర్, అలయెన్స్ ఎయిర్ సంస్థలకు చెందిన 30కి పైగా విమానాలకు శనివారం బాంబు బెదిరింపులు అందాయి. దీంతో, వారం వ్యవధిలోనే కనీసం 70 దేశీయ విమానయాన సంస్థల విమానాలకు బాంబు బెదిరింపులు అందినట్లయిందని అధికారులు తెలిపారు. అయితే, ఇవన్నీ ఉత్తుత్తివేనని తేలిందన్నారు. శనివారం ఉదయం మొదలుకొని దేశీయ, అంతర్జాతీయ ప్రయాణ విమానాల్లో బాంబులు పెట్టామంటూ సామాజిక మాధ్యమాల ద్వారా హెచ్చరికలు వచ్చాయి. ఉదయ్‌పూర్–ముంబై విమానం మరుగుదొడ్డిలో బాంబు పెట్టామంటూ బెదిరింపు లేఖ ఉందని అధికారులు వివరించారు. విస్తారా సంస్థకు చెందిన సింగపూర్–ముంబై, ముంబై–ఫ్రాంక్‌ఫర్ట్, ముంబై–సింగపూర్, ఢిల్లీ–బ్యాంకాక్, ముంబై–కొలంబో సర్వీసులకు, ఇండిగోకు చెందిన ముంబై–ఇస్తాంబుల్, ఢిల్లీ–ఇస్తాంబుల్, జోధ్‌పూర్–ఢిల్లీ, హైదరాబాద్–ఛండీగఢ్ సర్వీసులకు బెదిరింపులు సోషల్ మీడియా ద్వారా వచ్చాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన అధికారులు విమానాలను ఐసోలేషన్ బేలకు తరలించి క్షుణ్నంగా తనిఖీలు చేశారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు, పేలుడు పదార్థాలు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. బెదిరింపులు ఉత్తవేనని తేలడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ఇటువంటి ఘటనలతో అదనంగా ఇంధన ఖర్చు, షెడ్యూల్ చేయని ల్యాండింగ్ ఛార్జీలు, ప్రయాణికుల వసతి, విమానం గ్రౌండింగ్, సిబ్బందిని మార్చడం వంటి వాటికి అదనంగా వందల కోట్ల భారం పడుతోందని విమానయాన సంస్థలు ఆందోళన చెందుతున్నాయి.

ఎన్నికల వేళ ఈసీ ఆదేశాలు..
జార్ఖండ్ తాత్కాలిక డీజీపీ తొలగింపు

రాంచీ: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. తాత్కాలిక డీజీపీ అనురాగ్ గుప్తాను తక్షణమే తొలగించాలని ఎన్నికల కమిషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. గత ఎన్నికల సమయంలో ఆయనపై పలు ఫిర్యాదులు వచ్చాయని తెలిపింది. ఆయన స్థానంలో అదే కేడర్‌లోని అత్యంత సీనియర్ డీజీపీ స్థాయి అధికారిని నియమించాలని సూచించింది. అర్హులైన అధికారుల పేర్లను ఈ నెల 21వ తేదీలోగా తమకు పంపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. అనురాగ్ గుప్తాపై వచ్చిన ఆరోపణలపై విచారణకు ఈసీ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కాగా, నవంబర్ 13, 20వ తేదీల్లో రెండు దశల్లో జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

ఆప్ పథకాలను ఆపడమే
బీజేపీ లక్ష్యం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: తమ ప్రభుత్వం తీసుకువచ్చిన ఉచిత విద్యుత్, విద్య, ఆరోగ్యం వంటి పథకాలను ఆపడం కోసమే బీజేపీ ఢిల్లీలో ఎలాగైన అధికారంలోకి రావాలనుకుంటోందే తప్ప, ప్రజాసేవ చేసేందుకు మాత్రం కాదని ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ఆరోపించారు. 'ఆప్‌కు మళ్లీ అధికారం దక్కినా లేకున్నా నాకు ఎలాంటి దిగుల్లేదు. నా ఆందోళనంతా..బీజేపీ అధికారంలోకి వస్తే ప్రభుత్వ పాఠశాలలకు పట్టే గతి గురించి, విద్యుత్ చార్జీలు భారంగా మారడం గురించే'అని అన్నారు. శనివారం పీతంపురలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలో ఉన్న 22 రాష్ట్రాల్లో ప్రజలు ఉచిత విద్యుత్, విద్య, వైద్యం కావాలని డిమాండ్ చేస్తున్నారు. అందుకే, బీజేపీ ఢిల్లీలో అధికారంలోకి రావాలనే పట్టుదలతో ఉంది. ఇక్కడ అధికారం దక్కితే ఉచితాలన్నిటినీ రద్దు చేస్తుంది'అని కేజ్రీవాల్ చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మొత్తం 70 సీట్లలోనూ ఆప్ పోటీ చేస్తుందన్నారు.

వయనాడ్‌లో 22 నుంచి
ప్రియాంకా గాంధీ ప్రచారం

సాక్షి, న్యూఢిల్లీ: కేరళలోని వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలకు గాను కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ 22 నుంచి ప్రచారంలో పాల్గొననున్నారు. 22న నియోజకవర్గంలోని కల్పేటకు చేరుకుంటారని, అదే రోజున లేక ఆ మరునాడు 23న యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తం 10 రోజుల పాటు అక్కడే ఉండి ప్రచార కార్యక్రమాలు, సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. ప్రియాంక తరఫున ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రచార కార్యక్రమాలను దగ్గరుండి సమన్వయం చేస్తున్నారు. శనివారం ఆయన నియోజకవర్గ పరిధిలోని యూడీఎఫ్ నేతలతో సమావేశమయ్యారు. ఇలా ఉండగా, వామపక్ష (ఎల్డీఎఫ్) అభ్యర్థి సత్యన్ మొకేరి శనివారం ప్రచారాన్ని ప్రారంభించారు. ప్రారంభ ప్రచార సభలోనే ప్రియాంక లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. 'వయనాడ్ నుంచి గెలిస్తే ఆమె నియోజకవర్గంలోనే ఉంటారా? రాహుల్ గాంధీ ఏం చేశారో చూడండి. వయనాడ్‌లో గెలిచారు. వెళ్లిపోయారు. ఎన్ని రోజులు ఇక్కడ ఉన్నారు? ఇలాంటి వారు ప్రజల సమస్యలను పరిష్కరించలేరు. అభివృద్ధి చేయలేరు'అని సత్యన్ పేర్కొన్నారు.

2028లోపు నేనే మళ్లీ సీఎం: కుమారస్వామి

మాండ్య(కర్ణాటక): 2028కి లోపే కర్నాటక ముఖ్యమంత్రిగా తాను మరోసారి పగ్గాలు చేపడతానని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి జోస్యం చెప్పారు. సిద్ధరామయ్య కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్గత విభేదాలతో పడిపోతుందన్నారు. 'మరోసారి ప్రజలు నాకు అవకాశమిస్తారనే విశ్వాసం ఉంది. కచ్చితంగా మళ్లీ సీఎంనవుతా'అని శనివారం మాండ్యలో అన్నారు. ''కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ కాలం కొనసాగదు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో అసంతృప్తి పెరుగుతోంది. ఈ బుడగ ఎప్పుడు పేలుతుందో ఎవరికీ తెలియదు. వేచి చూద్దాం'' అన్నారు.

3 నిమిషాలు మించి
హత్తుకోకండి

- ఎక్కువసేపు హత్తుకోవాలంటే కార్ పార్కింగ్‌ను వాడుకోండి
- ఎయిర్‌పోర్ట్‌లో వీడ్కోలు ప్రాంతం వినియోగంపై ప్రయాణికులు, బంధువులకు కొత్త నిబంధనావళి
- న్యూజిలాండ్‌లో డ్యునెడిన్ విమానాశ్రయంలో అమల్లోకి కొత్త రూల్స్

వెల్లింగ్టన్: తమను విడిచి విదేశాలకు వెళ్లే వారికి ఎయిర్‌పోర్టుల్లో కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు గుంపులుగా వచ్చి వీడ్కోలు చెబుతుండటం మనం చూసే ఉంటాం. ఇలా ఒక్కో ప్రయాణికుడికి వీడ్కోలు చెప్పే వారి సంఖ్య పెరుగుతుండటం, వచ్చీపోయే ద్వారాల వద్ద రద్దీ ఎక్కువవడంతో న్యూజిలాండ్‌లోని డ్యునెడిన్ ఎయిర్‌పోర్ట్ నిర్వాహకులు కొత్త నిబంధనను అమల్లోకి తెచ్చారు. ''మీ ఆప్తులకు హత్తుకుని వీడ్కోలు పలకాలంటే గరిష్టంగా మూడు నిమిషాలే హగ్ చేసుకోండి. ఇంకా ఎక్కువ సమయం మనసారా వీడ్కోలు పలకాలంటే కారు పార్కింగ్ స్థలాన్ని వినియోగించుకోండి'అని ఒక పెద్ద బోర్డ్ తగిలించింది. తమ నిర్ణయాన్ని ఎయిర్‌పోర్ట్ సీఈఓ డేనియల్ బోనో సమర్థించుకున్నారు. ''విరహవేదన కావొచ్చు ఇంకేమైనా కావొచ్చు. ఆప్తులు దూరమవుతుంటే కౌగిలించుకుంటే ఆ బాధ కాస్తయినా తీరుతుంది. అందుకే కౌగిలించుకుంటే కేవలం 20 సెకన్లలోనే ప్రేమ హార్మోన్ 'ఆక్సిటాసిన్'విడుదలవుతుంది. బాధ తగ్గుతుంది. అంతమాత్రాన దారిలో అడ్డుగా ఉండి అదేపనిగా హత్తుకుంటే ఇతర ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. డ్రాప్ జోన్‌ల వద్ద అడ్డుగా ఉండటం సబబు కాదు'అని ఆయన వాదించారు. దీనిపై ప్రపంచవ్యాప్తంగా చర్చ మొదలైంది. తమ వారికి ప్రశాంతంగా కాస్తంత ఎక్కువ సమయం వీడ్కోలు చెప్పడం కూడా ఇతర ప్రయాణికులను ఇబ్బంది పెడుతుందా? అని కొందరు విమర్శలకు దిగారు. ఎయిర్‌పోర్ట్ నిర్ణయాన్ని కొందరు సమర్థించారు. ''మిగతా దేశాల్లో కారులో లగేజీ దింపి హత్తుకుని, ఏడ్చి సాగనంపితే ఆ కొద్ది సమయానికే 'కిస్ అండ్ ఫ్లై'చార్జీల కింద చాలా నగదు వసూలుచేస్తారు. ఈ ఎయిర్‌పోర్ట్ యాజమాన్యం ఎంతో మంచిది. తొలి 15 నిమిషాలు పార్కింగ్ ఉచితం''అని ఒక ప్రయాణికుడు మెచ్చుకున్నాడు. ప్రయాణికుల వెంట వచ్చే వారిని తగ్గించేందుకు చాలా దేశాల ఎయిర్‌పోర్ట్‌లు ఆ కొద్దిసేపు కారు ఆపినందుకు కూడా చార్జీలు వసూలుచేస్తుండం గమనార్హం. బ్రిటన్‌లోని ఎస్సెక్స్ ఎయిర్‌పోర్ట్ యాజమాన్యం ఇందుకు 15 నిమిషాలకు దాదాపు రూ.768 వసూలుచేస్తోంది.

ఉద్యోగానికి సరిగ్గా సరిపోతారు..
అందుకే రిజెక్ట్!

సంస్థ నుంచి ఊహించని సమాధానం

- దాంతో అవాక్కైన ఆశావహురాలు
- స్క్రీన్‌షాట్ తీసి షేర్ చేసిన వైనం

కొత్త ఉద్యోగానికి సరిపడా అర్హతలు లేక చాలా మంది తిరస్కరణను ఎదుర్కొంటారు. తనకు అన్ని అర్హతలు ఉండి, సదరు కొత్త జాబ్‌ను చేయగల సమర్థత ఉన్నాసరే ఉద్యోగాన్ని పొందలేకపోవడంతో ఒక అమ్మాయి ఆశ్చర్యపోయింది. ఉద్యోగం ఇవ్వలేకపోవడానికి గల కారణాన్ని చూసి అవాక్కయింది. తర్వాత ఆ తిరస్కరణ తాలూకు వివరాలను సామాజిక మాధ్యమం 'ఎక్స్'వేదికగా అందరితో పంచుకుంది. – న్యూఢిల్లీ

గూగుల్‌లో ఉద్యోగం చేస్తూ..

అనూ శర్మ అనే ఈ అమ్మాయి ప్రతిష్టాత్మక గూగుల్ సంస్థలో ఢిల్లీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. మెరుగైన ఉపాధి అవకాశాలు, జీతం, కొత్త సవాళ్లను ఎదుర్కోవాలనే ఉద్దేశంతో వేరే సంస్థలో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో రెజ్యూమ్, వివరాలు పంపారు. ఉద్యోగం తప్పకుండా వస్తుందనుకుంటే 'తిరస్కరిస్తున్నాం'అన్న సందేశం వచ్చింది. ఉద్యోగంలోకి తీసుకోకపోవడానికి గల కారణాలను సంస్థ వివరించింది. ''మీ రెజ్యూమ్‌ను క్షుణ్ణంగా పరిశీలించాం. ఇక్కడ తేలిందేమంటే సదరు ఉద్యోగానికి కావాల్సిన అర్హతలన్నీ మీలో ఉన్నాయి. వాస్తవం చెప్పాలంటే ఇంకాస్త ఎక్కువే ఉన్నాయి. ఇంతటి ప్రతిభావంతురాలు మాకు వద్దు. ఎందుకంటే ఎక్కువ ప్రతిభ ఉండి తక్కువ స్థాయి ఉద్యోగం చేసే వాళ్లలో సాధారణంగా ఒక రకమైన అసంతృప్తి ఉంటుంది. మరింత మెరుగైన ఉద్యోగాన్ని వీలైనంత త్వరగా వెతుక్కుని పాత ఉద్యోగాన్ని వదిలేస్తారు''అని వివరణ ఇచ్చింది. ఇలాంటి కారణాలకు కూడా తిరస్కరిస్తారా? అని ఆమె ఆలోచనలో పడింది. ''అర్హతలున్నా ఉద్యోగం ఎందుకు రాదో మీకు తెలుసా?'అంటూ అనూ శర్మ సంబంధిత సంస్థ రిప్లై స్క్రీన్‌షాట్‌ను 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు.

స్పందనల వెల్లువ

అనూ శర్మ పెట్టిన పోస్ట్‌కు స్పందనల వరద మొదలైంది. ''అతి అర్హతలతో బాధపడుతున్నారా?'అని ఒక నెటిజన్ సరదాగా వ్యాఖ్యానించారు. ''ఇదొక మంచి పరిణామానికి సంకేతం. ఒకరి దగ్గర పనిచేయడం మానేసి మీరే సొంతంగా కంపెనీ పెట్టి ఉద్యోగాలివ్వండి'అని మరొకరు ఉచిత సలహా ఇచ్చారు. ''ఉద్యోగం చేసే స్థాయి మీకున్నా, ఇచ్చేస్థాయి మాకు లేదు అని కంపెనీయే ఒప్పుకుంది''అని మరొకరు ట్వీట్ చేశారు. సంస్థనూ మెచ్చుకున్న వాళ్లు కోకొల్లలు ఉన్నారు. ''కంపెనీ మంచిపనే చేసింది. అర్హత కాస్తంత తక్కువ ఉంటే ఉద్యోగం ఇచ్చి, పని బాగా చేయించి రాటుదేలాలా చేస్తారు. ఈమెలాగే అప్పటికే మంచి ప్రతిభ ఉంటే మధ్యలోనే మానేస్తారు. అప్పుడు మళ్లీ నోటిఫికేషన్, రిక్రూట్‌మెంట్, శిక్షణ అంటూ సంస్థ ఉద్యోగ వేట మళ్లీ మొదలవుతుంది''అని ఇంకో నెటిజన్ అభిప్రాయపడ్డారు. ''కనీసం రెజ్యూమ్ చదవకుండా, ఏవేవో పిచ్చి కారణాలు చెప్పకుండా నిజాయతీగా రిప్లై ఇచ్చిన సంస్థను మెచ్చుకోవాల్సిందే'అని ఇంకొకరు ట్వీట్‌చేశారు. దీంతో సరిగ్గా సరిపోయే అర్హతలున్న వారికి ఉద్యోగం ఇవ్వాలా? లేదంటే కాస్తంత తక్కువ అర్హత ఉన్న వారికి ఉద్యోగం ఇచ్చి తమకు తగ్గట్లు తీర్చిదిద్దుకోవాలా? అన్న చర్చ మొదలైంది.

ఈ ఏడాదిలోకెల్లా అతి పెద్ద, ప్రకాశవంతమైన సూపర్ మూన్. దీన్ని హంటర్స్ మూన్‌గా పిలుస్తారు. అమెరికాలోని కొలరాడో స్ప్రింగ్స్‌లో రాత్రివేళ వినువీధిలో ఇలా కనువిందు చేసింది.



బీజేపీ నియంత్రణలో ఈసీ, సీబీఐ, ఈడీ: రాహుల్

రాంచీ: జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బీజేపీపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శలు పెంచారు. శనివారం రాంచీలో సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్ సభలో ప్రసంగించారు. ''ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా నుంచి సహా అన్ని వైపుల నుంచి రాజ్యాంగంపై ముప్పేట దాడులను ఎదుర్కొంటోంది. వీళ్ల దాడి నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకుందాం. కేంద్ర ఎన్నికల సంఘం, సీబీఐ, ఈడీ, ఆదాయపన్ను శాఖ, పాలనాయంత్రాంగం, న్యాయపాలికసహా అన్ని వ్యవస్థలను అధికారంలోని బీజేపీ గుప్పిటపట్టింది. నిధులు, సంస్థలనూ నియంత్రణలోకి తెచ్చుకుంది. ఖాతాల స్తంభన కారణంగా నగదులేకపోయినా కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో పోరాడింది. కులగణనకు సామాజిక ఎక్స్‌రే తప్పనిసరి. వీటికి మోదీ అడ్డుతగులుతున్నారు. మీడియా, న్యాయవ్యవస్థ నుంచి మద్దతు లేకపోయినా సరే మేం అధికారంలోకి వచ్చాక కులగణన చేపడతాం. రిజర్వేషన్లలో 50 శాతం పరిమితిని ఎత్తేస్తాం''అని రాహుల్ అన్నారు.

మిగిలిన దౌత్యాధికారులపైనా
నిఘా పెట్టాం

- కెనడాలో శాంతిభద్రతలకు భంగం వాటిల్లితే ఊరుకోం
- ఆ దేశ విదేశాంగ మంత్రి మెలానీ జోలీ వ్యాఖ్య

ఒట్టావా: దౌత్యాధికారుల పరస్పర బహిష్కరణలతో క్షీణించిన కెనడా, భారత్ దౌత్య సంబంధాలను మరింతగా దిగజార్చేలా కెనడా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. బహిష్కరణ తర్వాత కెనడాలో మిగిలిన ఇతర దౌత్యాధికారుల వ్యవహార్శైలి మీద నిఘా పెట్టామని కెనడా విదేశాంగ శాఖ మహిళా మంత్రి మెలానీ జోలీ ప్రకటించారు. అంతర్జాతీయ నియమనిబంధనలను గాలికొదిలేసి దౌత్యాధికారులపైన నిఘా పెట్టామని బహిరంగంగా ప్రకటించడం గమనార్హం. శుక్రవారం మాంట్రియెల్‌లో ఆమెమీడియాతో మాట్లాడారు. ''ఇలాంటి ఘటనలు కెనడా చరిత్రలో ఏనాడూ జరగలేదు. కెనడా సొంత గడ్డపై విదేశీ శక్తుల అతి ప్రమేయం గతంలో ఎప్పుడూ ఈ స్థాయిలో లేదు. యూరప్‌లో ఇలాంటివి మనం చూశాం. జర్మనీ, బ్రిటన్‌లో రష్యా ఇలాంటి ఆగడాలకే పాల్పడింది. ఈ సమస్యపై కెనడా గట్టిగా ప్రతిఘటిస్తుంది''అని అన్నారు. మిగిలి ఉన్న భారతీయ దౌత్యాధికారులనూ బహిష్కరిస్తారా ? అని మీడియా ప్రశ్నించగా.. ''వాళ్ల మీదా నిఘా పెట్టాం. ఇప్పటికే ఒట్టావాలో భారత హైకమిషనర్‌సహా ఆరుగురిని బహిష్కరించాం. ప్రస్తుతం కొందరు టొరంటో, వాంకోవర్‌లో పనిచేస్తున్నారు. వియన్నా ఒడంబడికకు తూట్లు పొడుస్తూ, కెనడియన్ల జీవితాలను ప్రమాదంలో పడేసే దౌత్యాధికారుల చర్యలను కెనడా చూస్తూ ఊరుకోదు''అని మెలానీ అన్నారు. కెనడాలో ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యోదంతంలో భారతీయ ఏజెంట్ల పాత్ర ఉందని గతేడాది ట్రూడో భారత్‌పై ఆరోపణలు గుప్పించిన నాటి నుంచి రెండు దేశాల సంబంధాలు దెబ్బతిన్నాయి. ట్రూడో మాటలను భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. అయినాసరే ట్రూడో తన ఆరోపణలను కొనసాగించారు. కెనడియన్లకు సంబంధించిన సమాచారాన్ని భారత దౌత్యవేత్తలు సేకరించారని, వాటిని లారెన్స్ బిష్ణోయ్ ముఠాకు ఇచ్చారని రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసులూ ఆరోపించారు. భారత్‌పై ఆరోపణలకు మూలం కేవలం నిఘా సమాచారం మాత్రమేనని, బలమైన ఆధారాలు తమ వద్ద లేవు అని ట్రూడో ఇటీవల అంగీకరించిన సంగతి తెలిసిందే.

వికాస్ యాదవ్ కథలో
కొత్త మలుపు

ఢిల్లీ వ్యాపారవేత్త కిడ్నాప్ కేసులో గతేడాది అరెస్టు

- ఈ ఏడాది ఏప్రిల్ 22న రెగ్యులర్ బెయిల్
- అతడు ప్రభుత్వ అధికారి కాదంటున్న భారత్

న్యూఢిల్లీ: భారత నిఘా విభాగం 'రా'మాజీ అధికారి అని అమెరికా ఆరోపిస్తున్న వికాస్ యాదవ్(39) వ్యవహారం కొత్త మలుపులు తిరుగుతోంది. ఖలిస్తాన్ ఉగ్రవాది గురు పత్వంత్‌సింగ్ పన్నూను అమెరికా గడ్డపై హత్య చేయడానికి జరిగిన కుట్రలో వికాస్ యాదవ్‌పై అమెరికా దర్యాప్తు అధికారులు అభియోగాలు మోపిన సంగతి తెలిసిందే. ఈ కేసులో వికాస్‌ను సహ కుట్రదారుడిగా చేర్చారు. అయితే, ఢిల్లీలో ఓ వ్యాపారవేత్తను కిడ్నాప్ చేసిన కేసులో గత ఏడాది డిసెంబర్ 18న వికాస్ యాదవ్‌ను ఢిల్లీ పోలీసు స్పెషల్ సెల్ అరెస్టు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో అతడికి బెయిల్ లభించిందని వెల్లడించాయి. ఢిల్లీ రోహిణి ప్రాంతంలో ఓ వ్యాపారిని అపహరించి, డబ్బులు ఇవ్వాలని గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ పేరిట వికాస్ బెదిరించాడని వివరించాయి. స్పెషల్ సెల్ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ప్రకారం... ఢిల్లీలో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) కార్యాలయం సమీపంలో 2023 డిసెంబర్ 11న తనను కలవాలని వ్యాపారవేత్తకు వికాస్ సూచించాడు. కలవకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించాడు. దాంతో బాధితుడు తన మిత్రుడితో కలిసి వికాస్ వద్దకు చేరుకున్నాడు. ఆ సమయంలో వికాస్ వెంట అబ్దుల్లా అనే వ్యక్తి కూడా ఉన్నాడు. వికాస్, అబ్దుల్లా కలిసి వ్యాపారవేత్తను ఓ కారులోకి బలవంతంగా ఎక్కించారు. డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాము బిష్ణోయ్ గ్యాంగ్ మనుషులమని చెప్పారు. ఖాళీ చెక్కుపై సంతకం చేయించుకున్నారు. తర్వాత వదిలేశారు. ఈ విషయం బయట చెబితే ప్రాణాలు దక్కవని హెచ్చరించారు. తన కార్యాలయంలో ఉంచిన రూ.50 వేల నగదును వికాస్, అబ్దుల్లా తీసుకున్నట్లు బాధితుడు గుర్తించాడు. సీసీటీవీ రికార్డింగ్‌లు సైతం తొలగించినట్లు గమనించాడు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాంతో వికాస్ యాదవ్, అబ్దుల్లాపై పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ ఏడాది మార్చి 13న వికాస్‌పై చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు అతడికి మార్చి 22న మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఏప్రిల్ 22న రెగ్యులర్ బెయిల్ ఇచ్చింది. వికాస్ యాదవ్ మాజీ ప్రభుత్వ అధికారి అని బెయిల్ ఆర్డర్‌లో కోర్టు పేర్కొంది. అయితే, అమెరికా దర్యాప్తు అధికారులు తమ అభియోగాల్లో వికాస్‌ను భారత ప్రభుత్వ కేబినెట్ సెక్రెటేరియట్‌లో పనిచేసే అధికారిగా ప్రస్తావించారు. వికాస్ పరారీలో ఉన్నట్లుగా పేర్కొన్నారు. కానీ, అతడు ప్రభుత్వ అధికారి కాదని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ స్పష్టంచేశారు.

ఖలిస్తాన్ ఉద్యమం ఆగదు: పన్నూ

వికాస్ యాదవ్‌పై అమెరికా అధికారులు అభియోగాలు మోపడంపై గురు పత్వంత్‌సింగ్ పన్నూ తాజాగా 'ఎక్స్'వేదికగా స్పందించాడు. అమెరికా పౌరుడి జీవితాన్ని, స్వాతంత్ర్యాన్ని, భావప్రకటనా స్వేచ్ఛ హక్కును కాపాడాలన్న ప్రాథమిక రాజ్యాంగ విధిని నిర్వర్తించడంలో అమెరికా ప్రభుత్వం మరోసారి అంకితభావం చూపిందని ప్రశంసించాడు. స్వదేశంలో గానీ, విదేశాల్లో గానీ అమెరికా పౌరుడి ప్రాణాలను అమెరికా ప్రభుత్వం కాపాడుతుందని చెప్పాడు. వికాస్ యాదవ్ ఒక మధ్యశ్రేణి సైనికుడు అని వెల్లడించాడు. పన్నూను హత్య చేయాలంటూ భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తోపాటు 'రా'చీఫ్ సామంత్ గోయెల్ నుంచి వికాస్ యాదవ్‌కు ఆదేశాలు అందాయని ఆరోపించాడు. ఖలిస్తాన్ రెఫరెండమ్ ఉద్యమాన్ని హింసాత్మకంగా అణచివేసేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆగ్రహం వ్యక్తం చేశాడు. అందులో భాగంగానే తనను అంతం చేయాలని కుట్ర పన్నారని విమర్శించాడు. తనపై ఎన్ని హత్యాయత్నాలు జరిగినా ఖలిస్తాన్ ఉద్యమం ఆగదని తేల్చిచెప్పాడు. భారత్‌లో ప్రత్యేక సిక్కు దేశం కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రజల మద్దతు కూడగడతానని, ఇందులో భాగంగా నవంబర్ 17న న్యూజిలాండ్‌లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టబోతున్నట్లు వెల్లడించాడు.

భారత్‌కు ఇబ్బందులేనా?

ఖలిస్తాన్ ఉగ్రవాది హరిదీప్ సింగ్ నిజ్జర్ హత్య విషయంలో ఇప్పటికే కెనడా, భారత్ మధ్య దూరం పెరుగుతోంది. తమ దేశ పౌరుడైన నిజ్జర్‌ను ఇండియా ఏజెంట్లు హత్య చేశారని కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో ఆరోపిస్తున్నారు. మరో ఉగ్రవాది పన్నూ హత్యకు జరిగిన కుట్ర కేసులో భారతీయుడైన వికాస్ యాదవ్‌పై అమెరికాలో అభియోగాలు నమోదయ్యాయి. ఈ వ్యవహారం మున్ముందు భారత ప్రభుత్వానికి మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, వికాస్ యాదవ్‌ను తమకు అప్పగించాలని అమెరికా అధికారులు ఇంకా భారత్‌ను కోరలేదు. తమ భూభాగంలో తమ పౌరుడిని(పన్నూ) హత్య చేయడానికి కుట్ర చేసిన వారిని వదిలిపెట్టబోమని అమెరికా అత్యున్నత స్థాయి అధికారులు ఇప్పటికే హెచ్చరించారు.

బుద్ధుడి బోధనలను చివరిసారిగా విన్నవారెవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

బౌద్ధమత ఆవిర్భావం

క్రీ.పూ. 6వ శతాబ్దంలో పలు మత ఉద్యమాలు చోటుచేసుకున్నాయి. వైదిక మతంపై తిరుగుబాటు ఉద్యమంగా బౌద్ధమతం ఆవిర్భవించింది. ఈ మత స్థాపకుడు సిద్ధార్థుడు లేదా గౌతముడు. సిద్ధార్థుడు క్రీ.పూ. 563లో ప్రస్తుత నేపాల్‌లోని లుంబినీ వనంలో జన్మించాడు. ఇతని తండ్రి కపిలవస్తును పాలించే శాక్య క్షత్రియ రాజు శుద్ధోధనుడు. ఈ వంశంలో జన్మించిన వాడు కాబట్టి బుద్ధుడిని శాక్యముని అని కూడా పిలుస్తారు. ఇతడి తల్లిపేరు మహామాయ. బుద్ధుడు జన్మించిన వెంటనే ఆమె మరణించడంతో సవతి తల్లి గౌతమి ప్రజాపతి ఆయనను పెంచింది. అందుకే సిద్ధార్థుడిని గౌతముడిగానూ పిలుస్తారు. అతడు చిన్న వయసులోనే యశోధరను వివాహం చేసుకొన్నాడు. వీరి కుమారుడు రాహులుడు. సిద్ధార్థుని సవతి తల్లి కుమారుడు దేవదత్తుడు. సిద్ధార్థుని జీవితంలో సంభవించిన నాలుగు సంఘటనలు అతనికి ప్రాపంచిక సుఖాల పట్ల విరక్తిని కలిగించాయి.

మొదటి సంఘటనలో ఒక ముసలి వాడిని, రెండో సంఘటనలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఒక రోగిని, మూడో సంఘటనలో ఒక శవాన్ని, నాలుగో సంఘటనలో ఒక సర్వసంగ పరిత్యాగైన సన్యాసిని చూశాడు. అనంతరం ఈ బాధల నుంచి మానవులకు విముక్తిని ప్రసాదించే మార్గం అన్వేషించేందుకు తన 29వ ఏట 'చెన్న' అనే సేవకుడి సహాయంతో 'కంటక' అనే గుర్రంపై సిద్ధార్థుడు తన అంతఃపురాన్ని వదిలి సత్యాన్వేషణకు బయలుదేరాడు. ఈ సంఘటననే మహాభినిష్క్రమణం అంటారు.

ఆ తర్వాత దాదాపు ఏడేళ్లు బుద్ధుడు సన్యాసిగా జ్ఞానార్జనకు ప్రయత్నించాడు. ఈ సమయంలో అతడు మొదటగా వైశాలిలోని 'అలారకలామ' అనే గురువు వద్ద, తర్వాత రాజగృహంలోని ఉద్దకుడు లేదా రామపుత్రుడు అనే గురువు వద్ద శిష్యరికం చేశాడు. చివరికి 35 ఏళ్ల వయసులో బీహార్‌లోని గయ వద్ద నిరంజన్ నది ఒడ్డున, రావిచెట్టు కింద జ్ఞానోదయం పొందాడు. దీన్నే సంబోధి అంటారు. అప్పటి నుంచి సిద్ధార్థుడు బుద్ధుడిగా, గౌతమబుద్ధుడి గా, తథాగతుడిగా పేరొందాడు. జ్ఞానోదయం పొందిననాటి నుంచి మరణించే వరకు (45 ఏళ్ల పాటు) బుద్ధుడు తన సిద్ధాంతాలను ప్రచారం చేశాడు. అయితే తన ప్రవచనాలను తొలిసారి ఐదు గురు వ్యక్తులకు సార్‌నాథ్ వద్ద జింక వనంలో బోధించాడు. దీన్నే ధర్మచక్ర ప్రవర్తనం అం టారు. ఇక్కడి నుంచే బౌద్ధ మతం ప్రారంభమైంది. బుద్ధుడు క్రీ.పూ.483లో 80 ఏళ్ల వయసులో కుశినగరంలోని సాల చెట్టుకింద తనువు చాలించాడు. దీన్నే మహాపరినిర్యాణం అంటారు.

బౌద్ధమత సిద్ధాంతాలు

నాటి వైదిక మత సిద్ధాంతాలను బౌద్ధమతం తీవ్రంగా వ్యతిరేకించింది. కొన్ని వర్గాలకే పరిమితమైన మోక్షాన్ని లింగ, కుల, వర్గ విభేదాలకు అతీతంగా అందరికీ అందుబాటు లోకి తెచ్చింది. సర్వకాల సర్వావస్థల్లో ప్రతి ఒక్కరూ సులువుగా ఆచరించేలా బౌద్ధమత సిద్ధాంతాలు రూపొందాయి. బుద్ధుడు దేవుడి ఉనికిని గుర్తించలేదు. కులవ్యవస్థను, పురోహిత వర్గ (బ్రాహ్మణ) ఆధిపత్యాన్ని ప్రశ్నించాడు.

చత్వారి ఆర్య సత్యాలు

- ప్రపంచమంతా దుఃఖమయం
- దుఃఖానికి కారణం కోరికలు
- కోరికలను జయించడం ద్వారా దుఃఖాన్ని తొలగించొచ్చు.
- దీన్ని సాధించేందుకు ఏకైక మార్గమే అష్టాంగమార్గం.

అష్టాంగ మార్గం

- సరైన దృక్పథం/ దృష్టి
- సరైన లక్ష్యం
- సరైన వాక్కు
- సరైన క్రియ
- సరైన జీవనోపాధి
- సరైన కృషి/ప్రయత్నం
- సరైన చైతన్యం / అవగాహన
- సరైన ధ్యానం

అష్టాంగమార్గం ఒక హేతుబద్ధ సిద్ధాంతం. దీన్ని ఒక నైతిక ప్రవర్తనా నియమావళిగా భావించొచ్చు. ఇది అందరికీ అనుసరణీయం. దీని ద్వారా



అతి సులువుగా మోక్షాన్ని పొందవచ్చు. బౌద్ధమతంలో మోక్షం అంటే జరామరణాల నుంచి విముక్తి. ఐతే బుద్ధుడు కర్మసిద్ధాంతాన్ని అంగీకరించాడు. కర్మ, పునర్జన్మకు సంబంధించిన బౌద్ధమత సిద్ధాంతాన్ని ప్రతిత్య సముప్పాద అని అంటారు. ఇందులో ప్రతిచర్యకు ఒక కారణముంటుందని చెప్పారు.

పంచ వ్రతాలు (పంచశీల)

జైనమతంలో ఉన్నట్లుగానే బౌద్ధంలోనూ పంచశీల సిద్ధాంతాలున్నాయి.

- అహింసను పాటించాలి.
- ఇతరుల ఆస్తిని ఆశించొద్దు.
- మత్తు పదార్థాలను సేవించొద్దు.
- అసత్యమాడరాదు.
- లంచగొండి పనులు చేయొద్దు.

బౌద్ధ సంఘం

బౌద్ధమతంలో భిక్షువులు, ఉపాసకులనే రెండు వర్గాల భక్తులున్నారు. భిక్షువులతో ఏర్ప డినవే బౌద్ధ సంఘాలు. ఇవి బుద్ధుని కాలంలోనే ప్రారంభమయ్యాయి. వీటిలో సభ్యత్వం కోసం బౌద్ధ త్రిరత్నాలపై ప్రమాణం చేయాలి. అవి బుద్ధం, ధమ్మం, సంఘం. బౌద్ధ సంఘంలో సభ్యత్వం పొందిన మొదటి స్త్రీ బుద్ధుడి సవతి తల్లి గౌతమి.

పదిహేనేళ్లు దాటని వారికి, నేరస్తులకు దివాలా తీసిన వారికి, అంటువ్యాధిగ్రస్తులకు ఈ సంఘాల్లో ప్రవేశం నిషిద్ధం.

బౌద్ధమత సంగీతులు:బౌద్ధమతంలో వివిధ కాలాల్లో నాలుగు సమావేశాలు (సంగీతులు) జరిగాయి.

మొదటి బౌద్ధ సంగీతి

బుద్ధుడు మరణించిన వెంటనే క్రీ.పూ. 483లో రాజగృహ సమీపంలోని సాతపన్ని గుహల్లో ఈ సమావేశం జరిగింది. బుద్ధుడి ప్రముఖ అనుచరుడైన మహాకశ్యపుడు దీనికి అధ్యక్షత వహించాడు. ఈ సంగీతి అజాతశత్రు పాలనా కాలంలో జరిగింది. దీని ప్రధాన ఉద్దేశం బుద్ధుని బోధనలను క్రోడీకరించడం. ఈ సమావేశం ఫలితంగా బుద్ధుడి శిష్యులైన ఆనందుని కృషితో సుత్తపీటకం, ఉపాలి కృషితో వినయ పీటకాలు క్రోడీకరించారు.

రెండో బౌద్ధ సంగీతి

బుద్ధుడు మరణించిన వందేళ్లకు అంటే క్రీ.పూ. 383లో కాలాశోకుని పాలనా కాలంలో వైశాలిలో ఈ బౌద్ధ సంగీతిని నిర్వహించారు. ప్రవర్తనా నియమావళికి సంబంధించి వజ్జీ సన్యాసులకు, ఇతర సన్యాసులకు మధ్య ఉత్పన్నమైన విభేదాలను పరిష్కరించడం దీని ప్రధాన ఉద్దేశం. ఈ సంగీతికి సబకామి అధ్యక్షత వహించాడు. ఈ సమావేశం ఫలితంగా స్థవిరవాదులు (థేరవాదులు), మహాసాంఘికులు అనే రెండు వర్గాలుగా బౌద్ధసంఘం చీలిపోయింది.

మూడో బౌద్ధ సంగీతి

అశోకుని పాలనా కాలంలో క్రీ.పూ. 250లో పాటలీపుత్రంలో ఈ సమావేశం జరిగింది. బౌద్ధ సన్యాసి మొగలిపుత్త తిస్స దీనికి అధ్యక్షత వహించారు. ఈ సమావేశపు ప్రధాన ఉద్దేశం రెండో సంగీతిలో ఏర్పడిన రెండు వర్గాల మధ్య సయోధ్యను సాధించడం . బౌద్ధమత సిద్ధాంత గ్రంథాలపై చర్చించడం. ఈ సమావేశ ఫలితంగా అభిదమ్మ పీటికను రూపొందించారు. దీంతో బుద్ధుని బోధనలున్న త్రిపీటకాలకు రూపకల్పన జరిగింది.

నాలుగో బౌద్ధ సంగీతి

ఇది క్రీ.శ 1వ శతాబ్దిలో కుషాణరాజు కనిష్కుని పాలనా కాలంలో కాశ్మీర్‌లోని కుందల వనంలో జరిగింది. దీనికి అధ్యక్షుడు వసుమిత్రుడు... ఉపాధ్యక్షుడు అశ్వఘోషుడు.

బౌద్ధమతంలోని 18 శాఖల మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించడం ఈ సమావేశ ప్రధాన ఉద్దేశం. కానీ ఈ సంగీతిలోనే బౌద్ధమతం మహాయాన, హీనయాన శాఖలుగా విడిపోయింది

మాదిరి ప్రశ్నలు

1. బౌద్ధమతంలో తొలి చీలిక ఏ సమా వేశంలో సంభవించింది?
   ఎ) మొదటి బి) రెండవ
   సి) మూడవ డి) నాల్గవ
2. శ్రీలంకలో బౌద్ధమతాన్ని ప్రవేశపెట్టిన వారు?
   ఎ) మహేంద్ర, సంఘమిత్ర
   బి) చారుమతి, మహాదేవ
   సి) అతిష దీపాంకర, పద్మసంభవ
   డి) సంతరక్షిత, కమలశీల
3. బౌద్ధ తర్క సిద్ధాంత స్థాపకుడు?
   ఎ) అసంగుడు బి) వసుబంధుడు
   సి) దిగ్నాగుడు డి) బుద్ధఘోషుడు
4. భారతదేశంలో తొలిసారిగా విగ్రహారాధనను ప్రారంభించినవారు?
   ఎ) హీనయానులు బి) మహాయానులు
   సి) వజ్రయానులు డి) హిందువులు
5. బార్హుత్ శిల్పాల్లో కిందివారిలో ఏ రాజు బుద్ధుడితో సమావేశమైన దృశ్యం కనిపిస్తుంది?
   ఎ) అజాతశత్రు బి) బింబిసార
   సి) బిందుసార డి) అశోకుడు
6. మత ప్రచారకులను పంపే సంప్రదాయం ఏ బౌద్ధమత సమావేశంతో మొదలైంది?
   ఎ) మొదటి బి) రెండవ
   సి) మూడవ డి) నాల్గవ
7. బుద్ధచరిత్రను రచించిన బౌద్ధమత సన్యాసి?
   ఎ) వసు మిత్రుడు బి) అశ్వఘోషుడు
   సి) నాగార్జునుడు డి) ధర్మకీర్తి
8. శ్రీలంకలో బౌద్ధసంగీతిని నిర్వహించిన ఆ దేశ రాజు?
   ఎ) తిస్స బి) వత్తగమని అభయ
   సి) దుత్తగమని డి) విజయబాహు
9. బుద్ధుని తల్లి ఏ మహాజనపదానికి చెందిన రాకుమార్తె?
   ఎ) కోసల బి) అవంతి
   సి) వజ్జీ డి) మగధ
10. బుద్ధుని బోధనలు తొలుత విన్న ఐదుగురు శిష్యుల్లో లేనివారు?
    ఎ) కొండన బి) వాప
    సి) అస్సాగి డి) కశ్యప
11. కింది వాటిలో బుద్ధుని జీవితంలోని ఐదు ప్రధాన సంఘటనలతో సరిపోని చిహ్నం ఏది?
    ఎ) జననం - వృషభం/ కమలం
    బి) మహాభినిష్క్రమణం - అశ్వం
    సి) నిర్వాణం - రావిచెట్టు
    డి) ధర్మచక్ర ప్రవర్తనం - ధర్మచక్రం
    ఇ) పరినిర్యాణం - చైత్యం
12. మధ్యేమార్గాన్ని బోధించిన వారు?
    ఎ) బుద్ధుడు బి) మహావీరుడు
    సి) భాగవత కృష్ణుడు డి) అజీవికుడు
13. ఏ బౌద్ధమత సమావేశంలో పాళి భాషకు బదులు సంస్కృతంలో చర్చలు జరిపారు?
    ఎ) మొదటి బి) రెండవ
    సి) మూడవ డి) నాల్గవ
14. బౌద్ధ సంఘంలో ఎవరికి సభ్యత్వం నిరాకరించారు?
    ఎ) శూద్రులు బి) అస్పృశ్యులు
    సి) స్త్రీలు డి) బానిసలు
15. బౌద్ధమత జన్మస్థలం ఏది?
    ఎ) లుంబిని బి) బుద్ధగయ
    సి) ఇసిపట్టణం (సార్‌నాథ్) డి) శ్రావస్తి
16. బుద్ధడి జీవితంలో వైశాఖ పూర్ణిమ రోజున సంభవించని సంఘటన ఏది?
    ఎ) జననం బి) సంబోధి
    సి) మహాపరినిర్యాణం
    డి) ధర్మచక్ర ప్రవర్తనం
17. కింది బౌద్ధమత శాఖల్లో ఆంధ్రకులుగా దేన్ని పిలుస్తారు?
    ఎ) థేరవాదులు బి) సర్వస్తివాదులు
    సి) మహాసాంఘికులు డి) లోకోత్తర వాదులు
18. ఉపనిషత్తుల్లోని సిద్ధాంతాలతో పోలిక కలిగి ఉన్న బౌద్ధమత శాఖ?
    ఎ) మహాయాన బి) హీనయాన
    సి) వజ్రయాన డి) ఏదీకాదు
19. బుద్ధుడి బోధనలను చివరిసారిగా విన్నవారు?
    ఎ) ఆనంద,ఉపాలి బి) ఉపాలి, కొండన
    సి) కొండన, భదీయ డి) ఆనంద, సుభద్ర
20. బుద్ధుడి ప్రవచనాలు ప్రముఖంగా దేనికి సంబంధించినవి?
    ఎ) భగవంతునిపై నమ్మకం
    బి) క్రతువులు చేయడం
    సి) ఆలోచన, ప్రవర్తనల్లో స్వచ్ఛత
    డి) విగ్రహారాధన
21. బుద్ధుని ప్రభావంతో బౌద్ధమతంలోకి మారిన వేశ్య?
    ఎ) సుజాత బి) విశాఖ
    సి) ఖేమ డి) ఆమ్రపాలి

సమాధానాలు

1) బి	2) ఎ	3) సి	4) బి	5) ఎ
6) సి	7) బి	8) బి	9) ఎ	10) డి
11) ఇ	12) ఎ	13) డి	14) డి	15) సి
16) డి	17) సి	18) ఎ	19) డి	20) సి
21) డి				

ప్రశంసనీయత అనే లక్ష్యం ఏ రంగానికి చెందింది?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ - మెథడ్స్ (ఎస్ఏ)

లక్ష్యాలు - స్పష్టీకరణాలు

భావావేశ రంగం

స్పష్టీకరణాల గురించి వివరించినవారు డేవిడ్. ఆర్. క్రాత్‌హోల్.

A. శాస్త్రీయ వైఖరి:
- నిజాయతీ అలవడుతుంది.
- శాస్త్రీయ ఆధారాలతో కూడిన అభిప్రాయాలు ఏర్పర్చుకుంటారు.
- నమ్మకంతో ఉండటం. (శాస్త్రజ్ఞులు కనుగొన్న విషయాలను నమ్మడం)
- విజ్ఞానశాస్త్ర పనుల్లో పట్టుదల, ఆసక్తి లేదా కుతూహలాన్ని ప్రదర్శించడం.

B. అభిరుచి:
- ప్రదేశాల సందర్శన (క్షేత్ర పర్యటనకు వెళ్లడం)
- వివిధ రకాల మొక్కలను సేకరించడానికి ఆసక్తి చూపడం.
- జ్ఞానాన్వేషణకు ఆసక్తి చూపడం (పుస్తకాలు చదవడం ద్వారా)
- విజ్ఞాన శాస్త్ర కార్యక్రమాల్లో పాల్గొనడం (సైన్స్ క్విజ్, వ్యాస రచన పోటీలు)
- సైన్స్ పరికరాల తయారీలో అభిరుచి

C. అభినందన:
- జీవశాస్త్ర సేవలు
- శాస్త్రవేత్తల సిద్ధాంతాలు
- ప్రపంచంలోని వింతలు
- కొత్త ఆవిష్కరణలు
- శాస్త్రవేత్తల అన్వేషణలను, కృషిని, ప్రకృతిని ప్రశంసిస్తారు.

భావావేశ రంగంలోని సోపానాలు

1. **గ్రహించడం:** విద్యార్థి తనకు నచ్చిన విషయాన్ని మనసులో నిలుపుకుంటాడు. దీనినే గ్రహించడం అంటారు.
2. **ప్రతిస్పందించడం:** మనసులో నిలిచిన అంశానికి ప్రతిస్పందిస్తాడు. అంటే ఇది చర్యకు (గ్రహించడం) సమానమైన ప్రతిచర్య.
3. **విలువ కట్టడం:** తాను గ్రహించిన లేదా ప్రతిస్పందించిన విషయాల్లో మంచిని గుర్తించి, దానికి విలువను ఇస్తాడు.
4. **వ్యవస్థాపన:** మంచిగా విలువకట్టిన అనుభవాన్ని పదే పదే పొందడం వల్ల వ్యవస్థీకరణ జరుగుతుంది.
5. **శీలస్థాపన:** మనసులో వ్యవస్థీకరించిన విషయమే అలవాటుగా మారుతుంది. దీన్నే శీలస్థాపన అంటారు. **ఉదా:** గాంధీజీ చిన్నతనంలో సత్యహరిశ్చంద్రుని కథ విన్నారు. ఆ తర్వాత హరిశ్చంద్రుడి లాంటివారు ఇంకెవరైనా ఉన్నారా అని అన్వేషించారు. సత్యం పలకడం గొప్ప విషయం అని తెలుసుకున్నారు. తాను కూడా ఎల్లప్పుడూ సత్యాన్నే పలికారు.ఫలితంగా నిజం చెప్పడం, మాట్లాడటం గాంధీజీకి అలవాటైంది.



మానసిక చలనాత్మక రంగం

మానసిక చలనాత్మక రంగం అనేది నైపుణ్యాలు లేదా క్రియలకు సంబంధించింది. అందువల్ల దీన్ని H- Handతో సూచిస్తారు.
- **అనుకరణ:** అనుకరణ అనేది మొదట కష్టంగా ఉన్నా కృషి లేదా సాధన వల్ల సాధ్యమౌతుంది.
- **హస్తలాఘవం:** విద్యార్థి పనులను తనకు ఇష్టమైన రీతిలో చేస్తాడు. ఉదాహరణ: ప్రయోగాలు.

సునిశితత్వం:
- పనిని సరిగా లేదా కచ్చితంగా చేయడం.
- ఫలితాలు కచ్చితంగా ఉండేలా చేయడం

సమన్వయం:
- మాటకు, అవయవ ప్రదర్శనకు సమన్వయాన్ని ఏర్పర్చుకోవడం.
- చర్యకు, చర్యకు మధ్య సమన్వయం.
- కంఠస్తం కాకుండా పనులు చేయడం.

సహజీకరణ (స్వభావం మారడం):
- పై చర్యలన్నీ సులభంగా చేయడం.
- అనాలోచితంగా అతి తక్కువ సమయంలో పనులు చేయడం.

మానసిక చలనాత్మక రంగం స్పష్టీకరణాలు

A. చిత్రలేఖన నైపుణ్యం:(లక్ష్యం)స్పష్టీకరణాలు

చిత్రీకరణ: ఉన్నది ఉన్నట్లుగా గీయడం.

భాగాలు గుర్తించడం: అన్ని భాగాలను స్పష్టంగా గుర్తించడం.

తగిన వేగం: తగిన వేగంతో బొమ్మ గీసి భాగాలు గుర్తించడం.

అసంపూర్తి చిత్రాలు: అసంపూర్తిగా ఉన్న చిత్రాలను గీయడం.

హస్తలాఘవం: ప్రయోగశాలలో ప్రయోగాలు చేయడం.

B. స్పష్టీకరణాలు:
- పరికరాల శుభ్రత
- తగిన పరికరాల ఎంపిక
- కచ్చితంగా కొలవడం
- వేగంగా ప్రయోగాలు చేయడం
- ప్రత్యామ్నాయ పరికరాలు

C. సేకరించడం/ భద్రపరచడంలో నైపుణ్యం:
- నిలువ చేసే పద్ధతులు తెలుసుకోవడం
- భద్రపరిచే రసాయనాలను సేకరించడం
- జీవి ఆవాసాలను తెలుసుకొని సేకరించడం

D. పరిశీలన నైపుణ్యం: నమూనాలు, నిర్మాణాలు, దృగ్విషయాలను పరిశీలించడం.

E. నివేదన నైపుణ్యం: ప్రయోగాలు,ఛేదనాలు చేసినప్పుడు తెలుసుకున్న విషయాలను ఒక క్రమ పద్ధతిలో రాతపూర్వకంగా చెప్ప గలగడం.

స్పష్టీకరణాలు:
- సాంకేతిక పదజాలం ఉపయోగిస్తాడు.
- వరుస క్రమంలో రాస్తాడు. ఏవి ముఖ్యమో వాటిని ముందుగా రాసి ప్రాధాన్యతా క్రమాన్ని అమలు పరుస్తాడు.
- తార్కిక క్రమంలో విషయాలను అమర్చుతాడు.
- సాక్ష్యాల ఆధారంగా సూక్ష్మీకరిస్తాడు.
- సరళమైన, అర్థవంతమైన భాషానైపుణ్యాలు ఉపయోగిస్తారు.

F. అభివ్యంజన నైపుణ్యం:
- శాస్త్రీయ పదజాలాన్ని ఉపయోగిస్తాడు.
- సరళమైన అర్థవంతమైన భాషను వినియోగిస్తాడు.
- తార్కిక క్రమంలో తెలియజేస్తాడు.
- ప్రాధాన్యతా క్రమంలో అంశాలను వివరిస్తాడు.

మాదిరి ప్రశ్నలు

1. **ఉన్నత పాఠశాలలో వన్యమృగాల గురించి బోధించడానికి జీవశాస్త్ర ఉపాధ్యాయుడు జంతు ప్రదర్శనశాలకు విద్యార్థులను తీసుకెళ్లాడు. మరొక ఉపాధ్యాయుడు దయారమా ఉపయోగించి బోధించాడు. వీరు కలిగించిన అనుభవాలు వరుసగా?**
   1) ప్రతినిధిత్వ-ప్రత్యక్ష
   2) ప్రత్యక్ష- ప్రతినిధిత్వ
   3) పరోక్ష- ప్రతినిధిత్వ
   4) ప్రత్యక్ష-పరోక్ష
2. **భావావేశ రంగ సోపానాలు ఏ క్రమంలో ఉంటాయి?**
   1) గ్రహించడం-శీలస్థాపనం-ప్రతిస్పందించడం-వ్యవస్థీకరణ-విలువకట్టడం
   2) విలువ కట్టడం- ప్రతిస్పందించడం-గ్రహించడం-వ్యవస్థాపన- శీలస్థాపన
   3) గ్రహించడం-ప్రతిస్పందించడం - విలువ కట్టడం - వ్యవస్థాపన - శీలస్థాపన
   4) శీలస్థాపన-వ్యవస్థాపన-ప్రతిస్పందించడం-గ్రహించడం- విలువ కట్టడం
3. **భావావేశ రంగంలో ఒక విషయానికి సంబంధించి వ్యక్తి మంచి, చెడులను నిర్ణయించుకునే సోపానం?**
   1) ప్రతిస్పందన 2) శీలస్థాపన
   3) వ్యవస్థీకరణ 4) విలువ కట్టడం
4. **ద్విదళ బీజవేరు అడ్డుకోత ఛేదనాన్ని జీవశాస్త్ర ఉపాధ్యాయుడు సూక్ష్మదర్శిని ద్వారా విద్యార్థులకు చూపిస్తూ బోధిం చారు. ఆయన విద్యార్థులకు అందించిన అనుభవం?**
   1) ప్రత్యక్ష అనుభవం
   2) ప్రతినిధిత్వ అనుభవం
   3) పరోక్ష అనుభవం
   4) ఫలవంతమైన అనుభవం
5. **ప్రశంసనీయత అనే లక్ష్యం ఏ రంగానికి చెందింది?**
   1) భావావేశ 2) మానసిక చలనాత్మక
   3) జ్ఞానాత్మక 4) ఆధ్యాత్మిక
6. **అరకులోయ అందాలను చూసి ఆహా! అన్న అంకిత అనే విద్యార్థినిలో నెరవేరిన లక్ష్యం?**
   1) అభిరుచి 2) శాస్త్రీయ దృక్పథం
   3) అభినందన 4) వ్యవస్థీకరణ
7. **శ్రావణమాసంలో వివాహం చేసుకుంటే శుభం కలుగుతుంది అని నమ్మే జీవశాస్త్ర పట్టభద్రుడిలో లేని లక్షణం?**
   1) అభిరుచి 2) అభినందన
   3) శాస్త్రీయ దృక్పథం
   4) మూఢనమ్మకాలను నమ్మడం
8. **ఆత్మలున్నాయి అని నమ్మే విద్యార్థిలో ఏ రంగానికి, లక్ష్యానికి సంబంధించిన అంశం సాధించనట్లు?**
   1) మానసిక చలనాత్మక- పరిశీలన
   2) భావావేశ- అభిరుచి
   3) మానసిక చలనాత్మక- ప్రయోగ నైపుణ్యం
   4) భావావేశ - శాస్త్రీయ దృక్పథం
9. **బ్లూమ్స్ విద్యాలక్ష్యాల వర్గీకరణలో ఆయా రంగాలను సూచించే అవయవాలకు సం బంధించి సరైంది?**
   1) జ్ఞానాత్మక రంగం- హృదయం
   2) మానసిక చలనాత్మక రంగం-మెదడు
   3) భావావేశ రంగం- హృదయం
   4) భావావేశ రంగం- చేయి

సమాధానాలు

1) 2;	2) 3;	3) 4;	4) 2;
5) 3;	6) 3;	7) 3;	8) 4;
9) 3.			

గతంలో అడిగిన ప్రశ్నలు

1. **ఒక ఉపాధ్యాయుడు అక్వేరియంలో చేపలు, ఏనుగు చార్టు, పులి వీడియో చూపిస్తూ 'జంతువుల్లో వైవిధ్యం' అనే పాఠాన్ని బోధించారు. వీటిద్వారా విద్యార్థి పొందిన అనుభవాలు?**
   1) అక్వేరియం ప్రత్యక్ష- పులి వీడియో, ఏనుగు చార్టు పరోక్ష
   2) అక్వేరియం, ఏనుగు చార్టు ప్రత్యక్ష- పులి వీడియో పరోక్ష
   3) ఏనుగు చార్టు ప్రత్యక్ష- అక్వేరియం, పులి వీడియో పరోక్ష
   4) పులివీడియో ప్రత్యక్ష- అక్వేరియం, ఏనుగు చార్టు పరోక్ష
2. **శాస్త్రీయ వైఖరి ఉన్న వ్యక్తిలో లేని లక్షణం?**
   1) సత్యం మార్పునకు లోనవుతుంది అని విశ్వసించడం.
   2) కార్యాకారణాలకు సంబంధం ఉందని విశ్వసించడం.
   3) పరిశీలనలో, చింతనలో విమర్శనాత్మక వైఖరి కలిగి ఉండటం.
   4) విశాల భావాలు కలిగి ఉండటం
3. **జీవశాస్త్ర ఉపాధ్యాయుడు విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరిని అభివృద్ధి చేయడానికి ఏ టెక్నిక్‌ను ఉపయోగించరాదు?**
   1) విజ్ఞానశాస్త్ర సహ పాఠ్యకృత్యాలు
   2) ప్రణాళికాబద్ధమైన అభ్యాసాలను ఉపయోగించడం
   3) ప్రయోగశాల పీరియడ్‌ను తగినట్లుగా ఉపయోగించడం
   4) ఉపాధ్యాయుని అపరిమితమైన పఠనా అలవాటు
4. **బ్లూమ్స్ విద్యాలక్ష్యాల వర్గీకరణ ప్రకారం మానసిక చలనాత్మక రంగానికి సంబం ధించింది?**
   1) వ్యవస్థీకరణ 2) నియంత్రణ
   3) ప్రతిస్పందన 4) అన్వయం
5. **అభ్యసనానుభవాలకు సాధనాలుగా, మూల్యాంకానికి కేంద్రాలుగా ఉండేవి?**
   1) బోధన లక్ష్యాలు 2) ప్రవర్తనలు
   3) బోధన పద్ధతులు 4) మార్పులు
6. **ఒక విద్యార్థి 'విందాం- నేర్చుకుందాం' అనే రేడియో కార్యక్రమంలో 'గాలి- ధర్మాలు' పాఠం విన్నాడు. అతనికి కలిగిన అనుభవం?**
   1) ఆరోపిత అనుభవం
   2) స్వీయ అనుభవం
   3) పరోక్ష అనుభవం
   4) ప్రత్యక్ష అనుభవం
7. **బోధన స్థాయిని పెంచడానికి విద్యా లక్ష్యాలను ఆధారంగా చేసుకొని బోధన పటిమలను వివరించినవారు?**
   1) నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్
   2) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్
   3) నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్
   4) బయలాజికల్ సైన్స్ కరికులమ్ స్టడీ
8. **కింది స్పష్టీకరణ ఏ భావావేశ రంగానికి చెందింది?**
   1) వివరించడం 2) జ్ఞప్తికి తెచ్చుకోవడం
   3) శాస్త్ర విషయాలు తెలుసుకోవడంలో ఆసక్తి చూపడం
   4) వ్యాఖ్యానించడం
9. **విద్యార్థి జీవ శాస్త్ర సంబంధమైన పదాలు, భావనలు, సిద్ధాంతాలను పోల్చి చూస్తాడు అనే స్పష్టీకరణకు లక్ష్యం?**
   1) జ్ఞానం 2) అవగాహన
   3) అన్వయం 4) అభిరుచి
10. **విద్యార్థిలో సరైన అభ్యసనను కలిగించి, దాన్ని శాశ్వతం చేయడంలో సాయపడే ఉత్తమ అనుభవాలు?**
    1) ప్రతినిధిత్వ అనుభవాలు
    2) పరోక్ష అనుభవాలు
    3) ప్రత్యక్ష అనుభవాలు
    4) ఉపాధ్యాయుని అనుభవాలు
11. **విద్యార్థి సరైన సాక్ష్యాలు లేనప్పుడు తన నిర్ణయాన్ని నిలిపివేస్తాడు అనే స్పష్టీకరణ లక్ష్యం?**
    1) అభిరుచి 2) శాస్త్రీయ వైఖరి
    3) అవగాహన 4) నైపుణ్యం
12. **తప్పులను నియంత్రిస్తూ, పొరపాట్లను తొలగిస్తూ, నిర్దిష్టంగా, కచ్చితంగా నైపుణ్యాన్ని ప్రదర్శించడం దేనికి సంబంధించింది?**
    1) సహజీకరణ 2) సమన్వయం
    3) సునిశితత్వం 4) హస్తలాఘవం

సమాధానాలు

1) 1;	2) 1;	3) 4;	4) 2;
5) 1;	6) 3;	7) 3;	8) 3;
9) 2;	10) 3;	11) 2;	12) 3.

థైరాక్సిన్ ఏర్పడటానికి అవసరమయ్యే ఖనిజం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ



మానవ శరీర ధర్మశాస్త్రం

శరీరంలోని వివిధ భాగాల మధ్య అర్థవంతమైన సమన్వయం చాలా అవసరం. మానవునిలో దీనికోసం నాడీ వ్యవస్థ, అంతస్రావిక వ్యవస్థలు ఉన్నాయి. నాడీ వ్యవస్థలో నాడీ ప్రచోదనం అనే నాడీ సమాచార ప్రసారం ద్వారా వేగవంతమైన సమన్వయం సాధ్యమవుతుంది. అంతస్రావిక వ్యవస్థలోని అంతస్రావిక గ్రంథుల నుంచి విడుదలయ్యే హార్మోన్లు కూడా కీలకమైన సమన్వయాన్ని నిర్వహిస్తాయి.

నాడీకణం

నాడీ వ్యవస్థలోని ప్రతి భాగం నాడీకణాలతో నిర్మితమై ఉంటుంది. నాడీ కణాలకు కణవిభజన శక్తి ఉండదు. నాడీ కణాల సంఖ్య స్థిరంగా ఉంటుంది. మిగతా శరీర కణాల కంటే నాడీ కణాలు పొడవుగా ఉంటాయి. నాడీ కణం లో రెండు ప్రధాన భాగాలు ఉంటాయి. అవి: వెడల్పాటి కణదేహం, పొడవైన ఏక్సాన్. కణదేహం (Cyton)లో కేంద్రకం ఉంటుంది. కేంద్రకం చుట్టూ నిస్సల్స్ కణికలు ఉంటాయి. కణదేహం అంతా డెండ్రైట్స్ అనే విభజనలు ఉంటాయి. ఏక్సాన్ తంతువు చివరన టెలిడెండ్రైట్స్ ఉంటాయి. ఏక్సాన్ చుట్టూ మైలిన్‌పొర విద్యుత్ బంధకంగా వ్యవహరిస్తుంది. దీని చుట్టూ న్యూరిలెమ్మా ఉంటుంది. న్యూరిలెమ్మా, మైలిన్ పొరల మధ్య ప్రత్యేకంగా ష్వాన్ కణాలు ఉంటాయి.

నాడీ ప్రచోదనం

నాడీ వ్యవస్థలోని ప్రతి భాగం నాడీ కణాలతో నిర్మితమై ఉంటుంది. మెదడు, వెన్నుపాము నాడులన్నీ నాడీ కణాలతోనే నిర్మితమై ఉంటాయి. అనేక నాడీకణాలు ఒక దాని వెనుక మరొకటి చేరి ఒక సమూహంగా ఏర్పడితే, దాన్ని 'నాడు' అంటారు. ఒక నాడులోని నాడీకణాల ద్వారా సాగే నాడీ సమాచారం ప్రసారమే నాడీ ప్రచోదనం. ఇది విద్యుత్ రూపంలో ప్రసారమవుతుంది. నాడీ ప్రచోదనం రెండు నాడీ కణాల మధ్య రసాయన మాధ్యమంతో ముందుకు సాగుతుంది. నాడీ ప్రచోదనంలో ఉపయోగపడే ఈ రసాయనాలను న్యూరోట్రాన్స్‌మీటర్లు అంటారు.

నాడీ వ్యవస్థ భాగాలు

నాడీ వ్యవస్థను మూడు భాగాలుగా విభజించవచ్చు. అవి: కేంద్ర, పరధీయ, స్వయంచోదిత నాడీ మండలాలు. మెదడు, వెన్నుపాములను కలిపి కేంద్ర నాడీ మండలం అంటారు. ఈ రెండూ అతి సున్నితమైన భాగాలు. వీటి చుట్టూ మూడు రక్షణ పొరలు, మెనింజిస్ ఉంటాయి. కపాలం అనే అస్థిపంజర నిర్మాణంలో మెదడు, వెన్నెముకలోని వెన్నుపాము సురక్షితంగా ఉంటాయి. మెదడులో అతిపెద్ద భాగం మస్తిష్కం. ఇది రెండు మస్తిష్క గోళార్ధాల రూపంలో ఉంటుంది. మస్తిష్కం తెలివితేటలు, ఆలోచన, జ్ఞాపకశక్తి, విచక్షణా శక్తి, సమస్యా పరిష్కారం లాంటి గుణాలను, అనేక భావాలను నియంత్రిస్తుంది. మస్తిష్కం తర్వాత మెదడులోని పెద్ద భాగం అనుమస్తిష్కం. ఇది శరీర చలనాన్ని, సమన్వయాన్ని, కండర సంకోచాలను నియంత్రిస్తుంది. బ్రెయిన్‌స్టెంలో పాన్స్ అనే భాగం మెదడు వెన్నుపాముల మధ్య సమాచార మార్పిడికి ఒక రిలే కేంద్రంగా వ్యవహరిస్తుంది. పాన్స్ కింద మజ్జాముఖం ఉంటుంది. ఇది ప్రధానంగా శ్వాసను నియంత్రిస్తుంది. మస్తిష్కం కింద ఉండే అథాపర్యంకం(Hypothalamus) శరీర ఉష్ణోగ్రత, ఆకలి, దప్పిక, నిద్ర, లైంగిక వాంఛలను నియంత్రిస్తుంది. మెదడు, కింది భాగం వెన్నుపాముగా కొనసాగుతుంది. వెన్నుపాము ఒక సెంటీ మీటర్ మందంలో ఉంటుంది. ఇది అసంకల్పిత ప్రతీకార చర్యలను నియంత్రిస్తుంది. మెదడు, వెన్నుపాముల నుంచి సాగే నాడులన్నీ కలిసి పరధీయ నాడీ మండలం ఏర్పడుతుంది. మెదడు నుంచి సాగే నాడులను 'మస్తిష్క/ కపాల నాడులు' అంటారు. ఇవి 12 జతలు. వెన్నుపాము నుంచి సాగే నాడులను 'వెన్నునాడులు' అంటారు. ఇవి 31 జతలు. కేంద్ర నాడీ మండలానికి సంబంధం లేకుండా వ్యవహరించే నాడీ కేంద్రాల వల లాంటి నిర్మాణం, స్వయంచోదిత నాడీ మండలం సహానుభూత, పరసహానుభూత వ్యవస్థలు అనే రెండు రకాలుగా స్వయంచోదిత నాడీ వ్యవస్థ విభజన చెంది ఉంటుంది.

అంతస్రావిక వ్యవస్థ

అంతస్రావిక వ్యవస్థలో అంతస్రావిక గ్రంథులు, వాటి నుంచి హార్మోన్లు అనే రసాయన విభాగాలు ఉంటాయి. అంతస్రావిక గ్రంథులు వాటి స్రావితాలను, ఏ నాళం సాయం లేకుండా నేరుగా రక్తంలోకి విడుదల చేస్తాయి. వీటిని వినాళ గ్రంథులు అంటారు. ఇవి శరీరంలోని వివిధ భాగాల్లో ఉంటాయి. ఒక అంతస్రావిక గ్రంథి ద్వారా రక్తంలోకి విడుదలై, రక్తం ద్వారా ఇతర భాగాలకు చేరి, క్రియాశీల చర్యలను నియంత్రించే రసాయనాలను హార్మోన్లు అంటారు.

మెదడు కింది భాగంలో పీయూష గ్రంథి ఉంటుంది. దీనిలో పూర్వ, మధ్యస్థ, పర లంబికలు ఉంటాయి. పూర్వలంబిక నుంచి ట్రాపిన్స్ అనే హార్మోన్లు విడుదలవుతాయి. ఇవి కొన్ని ఇతర అంతస్రావిక గ్రంథులను ప్రేరేపిస్తాయి. పూర్వలంబిక నుంచి విడుదలయ్యే పెరుగుదల హార్మోన్ శారీరక పెరుగుదలను ప్రేరేపిస్తుంది. దీని అల్పస్రావం ద్వారా పిల్లల్లో మరుగుజ్జుత నం వస్తుంది. అధిక స్రావం వల్ల జెగాంటిజం (అతిదీర్ఘకాయం)వస్తుంది. మధ్యస్థలంబిక నుంచి మెలనోసైట్ స్టిమ్యులేటింగ్ హార్మోన్ (MSH) విడుదలవుతుంది. పరలంబిక నుంచి విడుదలయ్యే ఆక్సిటోసిన్ శిశు జననానికి తోడ్పడుతుంది. వాసోప్రెసిన్ అతిమూత్రాన్ని నిరోధిస్తుంది. మెడలో వాయునాళానికి ముందుగా స్వరపేటిక దిగువన అవటు గ్రంథి ఉంటుంది. దీని నుంచి థైరాక్సిన్ అనే హార్మోన్ విడుదలవుతుంది. ఇది జీవక్రియారేటును నియంత్రిస్తుం ది. థైరాక్సిన్ లోపం వల్ల క్రెటినిజం అనే మానసిక, శారీరక మాంద్యంతో శిశువు పుట్టే ప్రమాదముంది. పెద్దల్లో థైరాక్సిన్ అల్పస్రావం ద్వారా మిక్సోడియ/ గల్స్ వ్యాధి అధిక స్రావం ద్వారా గ్రేవ్స్ వ్యాధి/ ఎక్సాఫ్తాల్మిక్ గాయిటర్ వస్తాయి.

అవటుకు దగ్గరగా నాలుగు చిన్న పార్శ్వ అవటు గ్రంథులుంటాయి. వీటి నుంచి పారాథార్మోన్ విడుదలవుతుంది. అవటు నుంచి విడుదలయ్యే కాల్సిటోనిన్ అనే హార్మోన్‌తో కలిసి పారాథార్మోన్ రక్తంలో కాల్షియం శాతాన్ని నియంత్రిస్తుంది.

క్లోమం

క్లోమం జీర్ణాశయం కింది భాగాన, చిన్న పేగులోకి తెరుచుకొని ఉంటుంది. ఇది ఒక మిశ్రమ గ్రంథి. దీనిలోని అంతస్రావిక భాగం లాంగర్‌హాన్స్ పుటికలు. క్లోమంలోని ఆల్ఫా కణాలు గ్లూకగాన్ హార్మోన్‌ను, బీటా కణాలు ఇన్సులిన్‌ను విడుదల చేస్తాయి. ఈ రెండు హార్మోన్లు కలిసి రక్తంలో చక్కెర శాతాన్ని నియంత్రిస్తాయి.గ్లూకగాన్ రక్తంలో చక్కెర శాతాన్ని పెంచుతుంది. ఇన్సులిన్ తగ్గిస్తుంది. రక్తంలో చక్కెర శాతం పెరిగి, శరీర అవయవాల పనితీరు దెబ్బతినే రుగ్మతను 'మధుమేహం' (Diabetes mellitus) అంటారు. ఇది రెండు రకాలు. పూర్తిగా ఇన్సులిన్ ఏర్పడక పోవడం ద్వారా సంభవించేది టైప్-1 మధుమేహం. ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గడం లేదా సరిగా పనిచేయకపోవడం ద్వారా సంభవించేది రెండో రకం మధుమేహం. రక్తంలో చక్కెర శాతం పెరిగే కొద్దీ రక్త సరఫరాకు అవరోధం ఏర్పడి, వివిధ అవయవాల పనితీరు దెబ్బతింటుంది. గాయాలు తొందరగా మానవు. పాదాల్లో అల్సర్లు ఏర్పడతాయి. మూత్రపిండాల పనితీరు దెబ్బతింటుంది. పురుషుల్లో లైంగిక సామర్థ్యం తగ్గుతుంది. కంటి చూపు మందగిస్తుంది (డయాబెటిక్ రెటినోపతి). చివరకు గుండె పనితీరు దెబ్బతిని, వ్యక్తి కోమా స్థితిలోకి చేరి మరణిస్తాడు.

అధివృక్క గంథ్రి

అధివృక్క గ్రంథులు మూత్రపిండాలపై టోపీలా కనిపిస్తాయి. వీటి నిర్మాణంలో రెండు భాగాలుంటాయి. వెలుపలి వల్కలం (Cortex), లోపలి దవ్వ (Medulla) వల్కలం నుంచి విడుదలయ్యే కార్టికాయిడ్స్ మూడు రకాలు. గ్లూకో, ఖనిజ, లైంగిక కార్టికాయిడ్స్ దవ్వ నుంచి ఎపినెఫ్రిన్ (అడ్రినలిన్) నార్ ఎపినెఫ్రిన్ (నార్ అడ్రినలిన్) అనే హార్మోన్లు విడుదలవుతాయి. ఈ రెండూ ఎమర్జెన్సీ లేదా పోరాట పలాయన హార్మోన్లు.

బీజకోశాలు

పురుష బీజ కోశాలైన ముష్కాలు, స్త్రీ బీజ కోశాలైన అండాశయాలు లైంగిక హార్మోన్లను విడుదల చేస్తాయి. పురుష లైంగిక హార్మోన్లు ఆండ్రోజెన్స్. వీటిలో ప్రధానమైంది టెస్టోస్టిరాన్. స్త్రీ లైంగిక హార్మోన్లు ఈస్ట్రోజెన్స్. వీటిలో ప్రధానమైంది బీటా-ఈస్ట్రడయోల్. ఈ లైంగిక హార్మోన్లు స్త్రీ, పురుషుల్లో ద్వితీయ లైంగిక లక్షణాల అభివృద్ధిని ప్రేరేపిస్తాయి. అదనంగా జీర్ణకోశం నుంచి కొన్ని హార్మోన్లు, మెదడులో ఉండే పీనియల్ గ్రంథి నుంచి మెలటోనిన్ అనే హార్మోన్, యుక్తవయసు వరకు మాత్రమే ఉండే బాలగ్రంథి (థైమస్) నుంచి థైమోసిన్ అనే హార్మోన్లు విడుదలవుతాయి.


మాదిరి ప్రశ్నలు

1. మెదడులో థర్మోస్టాట్‌గా పనిచేసే భాగం?
   1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
   3) అథాపర్యంకం 4) మజ్జాముఖం
2. ప్రపంచ అల్జీమర్స్ దినం?
   1) ఏప్రిల్ 2 2) మే 14
   3) జూన్ 23 4) సెప్టెంబరు 21
3. జపనీస్ ఎన్సెఫలైటిస్ కారక వైరస్ ఏది?
   1) ఫ్లేమి వైరస్ 2) టోగా
   3) ఆల్ఫా 4) పాక్స్
4. ఏ న్యూరో ట్రాన్స్‌మీటర్ లోపం ద్వారా పార్కిన్‌సన్స్ వ్యాధి వస్తుంది?
   1) అసిటైల్ కొలిన్ 2) డోపమైన్
   3) సెరటోనిన్ 4) గ్లైసిన్
5. మనిషి మెదడు సగటు బరువు ఎంత?
   1) 1350 గ్రాములు 2) 1800 గ్రాములు
   3) 2000 గ్రాములు 4) 1000 గ్రాములు
6. మెదడులోని ఏ భాగానికి గాయమైతే, శ్వాస ఆగిపోయి వ్యక్తి మరణించే ప్రమాదం ఉంటుంది?
   1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
   3) మజ్జాముఖం 4) అథాపర్యంకం
7. మెదడులో ఏర్పడే అసాధారణ పరిస్థితులను తెలుసుకోవడానికి వినియోగించే నిర్ధారణ పరీక్ష ఏది?
   1) ఎక్స్‌రే 2) అల్ట్రాసౌండ్ స్కానింగ్
   3) మ్యాగ్నెటిక్ రెసొనెన్స్ ఇమేజింగ్
   4) ఎండోస్కోపి
8. హార్మోన్ అనే పదాన్ని ప్రతిపాదించింది?
   1) బ్యాంటింగ్, బెస్ట్
   2) యంగ్‌వల్, పర్ల్‌మన్
   3) అలెక్ జెఫ్రీస్ 4) బేలిస్, స్టార్లింగ్
9. మధుమేహ రోగులు అధికంగా ఉన్న దేశం ఏది?
   1) భారత్ 2) చైనా
   3) అమెరికా 4) బ్రెజిల్
10. పుట్టుకతోనే శరీరంలోని ఏ భాగంలోనూ మెలనిన్ ఏర్పడని జన్యు వ్యాధి?
   1) విటిలిగో 2) ల్యూకోడెర్మ
   3) పైబాల్డ్ 4) ఆల్బినిజం
11. థైరాక్సిన్ ఏర్పడటానికి అవసరమయ్యే ఖనిజం ఏది?
   1) అయోడిన్ 2) ఇనుము
   3) కాల్షియం 4) మాంగనీస్
12. ఆహారంలో తగినంత అయోడిన్ లోపిస్తే, అవటు గ్రంథి?
   1) క్షీణిస్తుంది
   2) బంతిలా వాచిపోతుంది
   3) పూర్తిగా అదృశ్యం అవుతుంది
   4) ఏ మార్పూ ఉండదు

సమాధానాలు

1) 3; 2) 4; 3) 1; 4) 2; 5) 1; 6) 3; 7) 3; 8) 4; 9) 2; 10) 4; 11) 1; 12) 2

Choose the Appropriate Answer..



CODED INEQUALITIES

Directions (Q.No. 1 – 5): In the following questions, the symbols @, ©, $, * and % are used with the following meaning as illustrated below.

P © Q means 'P is smaller than Q'
P @ Q means 'P is greater than Q'
P * Q means 'P is either smaller than or equal to Q'
P % Q means 'P is either greater than or equal to Q'
P $ Q means 'P is neither smaller than nor greater than Q'

Now in each of the following questions assuming the given statements to be true, find which of the two conclusions I and II given below them is/ are definitely true.

Give answer **(1)** if only conclusion I is true
Give answer **(2)** if only conclusion II is true
Give answer **(3)** if either conclusion I or II is true
Give answer **(4)** if neither conclusion I nor II is true
Give answer **(5)** if both conclusions I and II are true

1. **Statements:**
   L @ V, V © F, F % T
   Conclusions:
   I) T © V II) F @ L
2. **Statements:**
   Y $ O, O @ D, D © M
   Conclusions:
   I) D © Y II) M @ Y
3. **Statements:**
   T * D, D © F, F $ H
   Conclusions:
   I) H @ D II) F @ T
4. **Statements:**
   J © M, M * P, P @ R
   Conclusions:
   I) R © M II) M @ J
5. **Statements:**
   O @ V, V % T, T * M
   Conclusions:
   I) M * V II) O @ T

Sol: (*Q.No. 1 – 5*): Meaning of the given symbols.
© → <; @ → >; * → ≤;
% → ≥; $ → =

1. **Statements:** L > V < F ≥ T
   Conclusions:
   I) V < F ≥ T (False)
   II) L > V < F (False)
   Neither I nor II is true, so correct answer is 4. **Ans: 4**
2. **Statements:** Y = O > D < M
   Conclusions:
   I) Y = O > D
   Y > D ⇒ D < Y
   D © Y (True)
   II) Y = O > D < M
   Y > D < M (False)
   Only conclusion I is true
   Ans: 1
3. **Statements:** T ≤ D < F = H
   Conclusions:
   I) D < F = H
   D < H ⇒ H > D
   H @ D (True)
   II) T ≤ D < F
   T < F ⇒ F > T
   F @ T (True)
   Both conclusion I and II are true
   Ans: 5
4. **Statements:** J < M ≤ P > R
   Conclusions:
   I) M ≤ P > R (False)
   II) J < M ⇒ M > J
   ⇒ M @ J (True)
   Only conclusion II is true
   Ans: 2
5. **Statements:** O > V ≥ T ≤ M
   Conclusions:
   I) V ≥ T ≤ M (False)
   II) O > V ≥ T
   O > T ⇒ O @ T (True)
   Ans: 2

Directions (Q. No. 6 – 10): Study the information carefully and answer the following questions.

M × N means 'M is neither smaller than nor equal to N'
M % N means 'M is not smaller than N'
M $ N means 'M is not greater than N'
M = N means 'M is neither smaller than nor greater than N'
M @ N means 'M is neither greater than nor equal to N'

In each of the following questi-ons assuming the given statements to be true, find out which of the three conclusions I, II and III given below them is/ are definitely true.

6. **Statements:** J = K, K × S, S $ P
   Conclusions: I) P × K
   II) P × J III) S @ J
   1) None of the above is true
   2) Only III is true
   3) Only II is true
   4) Only I is true
   5) I and II are true

Sol: Meaning of the given symbols:
× → >; % → ≥;
$ → ≤; = → =; @ → <
Statements: J = K > S ≤ P
Conclusions:
I) K > S ≤ P (False)
II) J = K > S ≤ P (False)
III) J = K > S
J > S ⇒ S < J (True)
Only III is true
Ans: 2

7. **Statements:**
   A % H, H = L, L × B
   Conclusions: I) L = A
   II) L @ A III) A × B
   1) Either I or II is true
   2) Either I or III is true
   3) Either I or II and III are true
   4) Only III is true
   5) None of these

Sol: Statements: A ≥ H = L > B
From conclusion I & II,
A ≥ H = L
A ≥ L ⇒ L ≤ A
L = A (or) L < A
Either I or II is true
From III, A ≥ H = L > B
A ≥ L > B
A > B ⇒ A × B (True)
So, either I or II and III are true
Ans: 3

8. **Statements:**
   D @ E, E % U, U × V
   Conclusions: I) V @ E
   II) D @ U III) V $ D
   1) None is true
   2) Only III is true
   3) Only II is true
   4) Only I is true
   5) Only I and II are true

Sol: Statements: D < E ≥ U > V
Conclusions:
I) E ≥ U > V
E > V ⇒ V < E (True)
II) D < E ≥ U (False)
III) D < E ≥ U > V (False)
Only I is true
Ans: 4

9. **Statements:** H % R @ F $ Q
   Conclusions: I) F % H
   II) Q × R III) Q × H
   1) None is true
   2) Only III is true
   3) Only II is true
   4) Only I is true
   5) Only II and III are true

Sol: Statements: H ≥ R < F ≤ Q
Conclusions:
I) H ≥ R< F (False)
II) R < F ≤ Q
R < Q ⇒ Q > R (True)
III) H ≥ R < F ≤ Q (False)
Only II is true
Ans: 3

10. **Statements:**
    D $ Y, Y × W, W @ G
    Conclusions: I) G × Y
    II) D @ W III) Y × G
    1) None of the above is true
    2) Only I is true
    3) Only II is true
    4) Only III is true
    5) Only II and III are true

Sol: Statements: D ≤ Y > W < G
I) Y > W < G (False)
II) D ≤ Y > W (False)
III) Y > W < G (False)
None is true
Ans: 1

Directions (Q. No. 11– 15): These are some relationship among the va-rious elements have been shown in the statements in the given questio-ns. After the statements conclusions are given. Read the conclusions in reference to the given statements and choose the appropriate answer.

11. **Statements:** T ≥ U < N < E = S
    Conclusions:
    I) S > U II) T ≥ E
    1) Only I is true
    2) Neither I nor II is true
    3) Either I or II is true
    4) Only II is true
    5) Both I and II are true

Sol: I) U < N < E = S
U < N < S
U < S ⇒ S > U (True)
II) T ≥ U < N < E
T ≥ U < E (False)
Only I is true
Ans: 1

12. **Statements:** S = U < G ≥ A < R
    Conclusions:
    I) A ≤ S II) R > S
    1) Neither I nor II is true
    2) Only I is true
    3) Only II is true
    4) Either I or II is true
    5) None of these

Sol: I) S = U < G ≥ A
S < G ≥ A (False)
II) S = U < G ≥ A < R
S < G ≥ A < R (False)
Neither I nor II is true
Ans: 1

13. **Statements:** P ≤ L = A ≥ E > G
    Conclusions:
    I) E < P II) L > G
    1) Only II is true
    2) Either I or II is true
    3) Only I is true
    4) Neither I nor II is true
    5) Both I and II are true

Sol: Statements: P ≤ L = A ≥ E > G
Conclusions:
I) P ≤ L = A ≥ E
P ≤ A ≥ E (False)
II) L = A ≥ E > G
L ≥ E > G ⇒ L > G (True)
Only II is true
Ans: 1

14. **Statements:** T = E > A ≤ R < S
    Conclusions:
    I) S > A II) A < T
    1) Only I is true
    2) Either I or II is true
    3) Only II is true
    4) Neither I nor II is true
    5) Both I and II are true

Sol: Conclusions:
I) A ≤ R < S
A < S ⇒ S > A (True)
II) T = E > A
T > A ⇒ A < T (True)
Both I and II are true
Ans: 5

15. **Statements:** P > X ≤ V = L < F
    Conclusions:
    I) F ≥ X II) L > P
    1) Either I or II is true
    2) Neither I nor II is true
    3) Both I and III are true
    4) Only I is true
    5) Only II is true

Sol: I) X ≤ V = L < F
X ≤ V < F
X < F ⇒ F > X (False)
II) P > X ≤ V = L
P > X ≤ L (False)
Neither I nor II is true
Ans: 2

Directions (Q.No.16 – 20): Study the information carefully and answer the questions given below.

Give answer **(1)** if only conclusion I follows
Give answer **(2)** if only conclusion II follows
Give answer **(3)** if either conclusion I or II follows
Give answer **(4)** if neither conclusion I nor II follows
Give answer **(5)** if both conclusions I and II follow

16. **Statements:**
    V > T > M = U, T ≥ P = R
    Conclusions:
    I) V > R II) T = U

Sol: I) V > T, T ≥ P = R
V > T ≥ P = R
V > T ≥ R ⇒ V > R (True)
II) T > M = U ⇒ T > U (False)
Only conclusion I follows
Ans: 1

17. **Statements:**
    L ≥ H = K, Q > Z > P < M = K
    Conclusions:
    I) L ≥ M II) Q > P

Sol: I) L ≥ H = K = M
L ≥ H = M
L ≥ M (True)
II) Q > Z > P ⇒ Q > P (True)
Both conclusion I and II follow
Ans: 5

18. **Statements:**
    L ≥ H = K, Q > Z > P < M = K
    Conclusion:
    I) L = K II) L > K

Sol: From I and II
L ≥ H = K
L ≥ K ⇒ L = K (or) L > K
Either conclusion I or II follows
Ans: 3

19. **Statements:**
    U ≤ W > X = V > N > H
    Conclusions:
    I) W > N II) X < U

Sol: W > X = V > N
W > V > N
W > N (True)
U ≤ W > X (False)
Only conclusion I follows
Ans: 1

20. **Statements:** A < B < C ≤ D = E
    Conclusions:
    I) B ≤ E II) B < E

Sol: I) B < C ≤ D = E
B < C < E ⇒ B < E (False)
II) B < E (True)
Only conclusion II follows
Ans: 2